


ఉప వేదాంగాలు
దర్శన, భాష్య, బ్రహ్మ సూత్రాలు
న్యాయ దర్శనము



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి.

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ప రి చ య ము

మానవుఁ డాలోచనాశీలుడు. ఈ యాలోచనాశక్తియే మానవునికి తక్కిన ప్రాణివర్గమునుండి యౌన్నత్యము నాపాదించును. కనుక నీ యాలోచన లేని మానవుడు మానవుడే కాదన్నను అట్టే అబ్బురం పడనక్కఱయుండదు.

ఈ యాలోచనల కంతులేదు. ఇవి యాతని మనఃపాటవమునుబట్టియు, సంస్కార విశేషమునుబట్టియు, నితర పరిస్థితులనుబట్టియు నెన్నియో విధములుగ, ఎన్నియో మార్గములుగ సంచరించుచుండును. అయినను ఈ రీతులన్నియు క్రమబద్ధములనియు, క్రమవికాసములనియు ననజాలము.

కాని యివి యన్నియు నొక క్రమమార్గమును బట్టినప్పుడే మానవుఁ డొక యథార్థమును - నిశ్చితసిద్ధాంతమును దెలిసికొనగల్గును. లేనిచో నాత డాతత్త్వమును దెలిసికొనగల్గుట కలలోని వార్త.

మహర్షులగు మన పూర్వులు ఈ యాలోచనాప్రవాహము నటు నిటు పోనీయక సూటిగా బ్రవహించుటకై కొన్ని కట్టుదిట్టము లేర్పరచిరి. వీని ననుగమించినచో సామాన్యులును చక్కని బాటలలో సంచరింపగలరు. ఈ ప్రణాళికలనే దర్శనము లందుము. ఈ దర్శనములవలన మానవుడు పదార్థ యథార్థస్వరూపము నెరుగగలడు. కనుకనే యివి దర్శనము (దృశ్యతే అనేన ఇతి దర్శనమ్) లయ్యెను.

భారతీయదర్శనములు ముందు శాఖోపశాఖలుగా చీలి ప్రచారమునందినట్లే పాశ్చాత్యదేశములందును ఇవి చిలవలు పలవలుగా జీలి యిప్పుడిప్పుడు క్రమవికాసము నందుచున్నవి.

శాస్త్రములు వికాసముపొందుట కీవిధాన మత్యుత్తమమైనది. ఆ యా శాస్త్రముల ప్రధానప్రయోజనమును సూక్ష్మముగ నిర్వచించుటలో భిన్నాభిప్రాయము లుండుట వింత కాదు. అయినను అనేకపండితుల అభిప్రాయసారమును ఇందు సంగ్రహింతును. చూడుడు వారి విభాగవిధానము.

మెటఫిజిక్సు (తత్త్వశాస్త్రము) : ఇది 'సత్' పదార్థమును వివేచించును. ప్రకృతిలో నెన్నియో 'సత్పదార్థములు' 'సదాభాసములు' నున్నవి. ఈశాస్త్రము ఆ 'సత్తు'ను, 'ఆభాసము'ను వేరుచేసి సత్తును సత్తుగాను, ఆభాసమును ఆభాసముగాను ప్రత్యేకప్రత్యేకముగా చూపుచుండును. ఈ సత్పదార్థములు రెండువిధములుగా నుండును. ఒకటి వృక్షపర్వతాది భౌతికపదార్థములు, రెండు సుఖదుఃఖాది మానసికస్థితులు.

ఈ రెండు పదార్థముల తారతమ్యమునుబట్టి యీ శాస్త్రము రెండువిధము లగుచున్నది.

ఈ సత్పదార్థములలో భౌతికపదార్థములకుమాత్రము స్వతంత్రమగు సత్తా కలదనియు, మానసికదశలు ఆ భౌతిక పదార్థముల సత్యత కాభాసమాత్రము లనియు కొందర తలంపు. వీరిని (మెటీరియలిస్టులు) భౌతికవాదులు అందురు.

మరికొందరు సుఖదుఃఖాది మానసికదశలను - అనగా మనస్సునుమాత్రము స్వతంత్రసత్తా యనియు, వృక్ష పర్వతాది భౌతిక పదార్థములు మానససత్తాకు ప్రతీతిమాత్రము లనియు ననుచుందురు. వీరిని (ఐడియలిస్టులు) భావవాదులు అనుచుందురు.

మఱికొందఱు శాస్త్రజ్ఞులు ఈ భౌతికజగత్తును, మానస జగత్తును రెంటెని నిరపేక్షములుగ-సత్యములుగనే భావించు చుందురు. వీరిని (డ్యుయలిస్టులు) ద్వైతవాదు లందురు.

పైన జెప్పిన భావవాదులకు విరుద్ధమగు సిద్ధాంతమును (రియలిజమ్) యథార్థవాదము అనుచుందురు. వీరి భావము ననుసరించి జగత్తులోని పదార్థములు మన కేరూపమున గాన బడుచున్నవో యా రూపమున సత్యములు. ఈ యథార్థ వాదము భావవాదముకంటె నధిక విజ్ఞాన శాస్త్రసమ్మతము నియు, విషయప్రధాన మనియు ననేక విద్వాంసుల యభి ప్రాయము.

(ఎపిస్టమాలజీ) ప్రమాణమీమాంస. అనగా జ్ఞాన వివేచన. జ్ఞానస్వరూప మేమి ? జ్ఞానమున కవధి యేది? జ్ఞాన ప్రామాణ్య మెట్లు ? దాని సత్యాసత్యములు, వాని నిర్ణ యము మున్నగు గొప్పగొప్ప విషయము లనేకము లీశాస్త్ర మున వివేచింపబడుచుండును. ఇందు జ్ఞానసీమతో బాటు జ్ఞాన గమ్యత్వమును, జ్ఞానాతీతత్వమును గూడ జేరుచుండును. కొన్ని పదార్థములు అనుభవ మూలమున తెలియనగుచుం డును. మఱికొన్ని యనుభవమున కతీతములు. ఈ ద్వివిధ పదార్థములను దేనికది వేరుచేయుట యత్యావశ్యకము. వీని నీ శాస్త్రము చక్కగ సమీక్షించుచుండును.

(లాజిక్) తర్కశాస్త్రము. జ్ఞానవిషయ చర్చయందు వ్యావహారిక ప్రక్రియలో నీ శాస్త్ర ముపయోగించుచుండును. ఈ తర్కము సత్యముగా-ప్రామాణికముగా నుండవలయునన్న

శాస్త్రములు వికాసముపొందుట కీవిధాన మత్యుత్తమమైనది. ఆ యా శాస్త్రముల ప్రధానప్రయోజనమును సూక్ష్మముగ నిర్వచించుటలో భిన్నాభిప్రాయము లుండుట వింత కాదు. అయినను అనేకపండితుల అభిప్రాయసారమును ఇందు సంగ్రహింతును. చూడుడు వారి విభాగవిధానము.

మెటఫిజిక్సు (తత్త్వశాస్త్రము) : ఇది 'సత్' పదార్థమును వివేచించును. ప్రకృతిలో నెన్నియో 'సత్పదార్థములు' 'సదాభాసములు' నున్నవి. ఈశాస్త్రము ఆ 'సత్తు'ను, 'ఆభాసము'ను వేరుచేసి సత్తును సత్తుగాను, ఆభాసమును ఆభాసముగాను ప్రత్యేకప్రత్యేకముగా చూపుచుండును. ఈ సత్పదార్థములు రెండువిధములుగా నుండును. ఒకటి వృక్షపర్వతాది భౌతికపదార్థములు, రెండు సుఖదుఃఖాది మానసికస్థితులు.

ఈ రెండు పదార్థముల తారతమ్యమునుబట్టి యీ శాస్త్రము రెండువిధము లగుచున్నది.

ఈ సత్పదార్థములలో భౌతికపదార్థములకుమాత్రము స్వతంత్రమగు సత్తా కలదనియు, మానసికదశలు ఆ భౌతిక పదార్థముల సత్యత కాభాసమాత్రము లనియు కొందర తలంపు. వీరిని (మెటీరియలిస్టులు) భౌతికవాదులు అందురు.

మరికొందరు సుఖదుఃఖాది మానసికదశలను - అనగా మనస్సునుమాత్రము స్వతంత్రసత్తా యనియు, వృక్ష పర్వతాది భౌతిక పదార్థములు మానససత్తాకు ప్రతీతిమాత్రము లనియు ననుచుందురు. వీరిని (ఐడియలిస్టులు) భావవాదులు అనుచుందురు.

మఱికొందఱు శాస్త్రజ్ఞులు ఈ భౌతికజగత్తును, మానస జగత్తును రెంటిని నిరపేక్షములుగ-సత్యములుగనే భావించు చుందురు. వీరిని (డ్యుయలిస్టులు) ద్వైతవాదు లందురు.

పైన జెప్పిన భావవాదులకు విరుద్ధమగు సిద్ధాంతమును (రియలిజమ్) యథార్థవాదము అనుచుందురు. వీరి భావము ననుసరించి జగత్తులోని పదార్థములు మన కేరూపమున గాన బడుచున్నవో యా రూపమున సత్యములు. ఈ యథార్థ వాదము భావవాదముకంటె నధిక విజ్ఞాన శాస్త్రసమ్మతము నియు, విషయప్రధాన మనియు ననేక విద్వాంసుల యభి ప్రాయము.

(ఎపిస్టమాలజీ) ప్రమాణమీమాంస. అనగా జ్ఞాన వివేచన. జ్ఞానస్వరూప మేమి ? జ్ఞానమున కవధి యేది? జ్ఞాన ప్రామాణ్య మెట్లు ? దాని సత్యాసత్యములు, వాని నిర్ణ యము మున్నగు గొప్పగొప్ప విషయము లనేకము లీశాస్త్ర మున వివేచింపబడుచుండును. ఇందు జ్ఞానసీమతోబాటు జ్ఞాన గమ్యత్వమును, జ్ఞానాతీతత్వమును గూడ జేరుచుండును. కొన్ని పదార్థములు అనుభవ మూలమున తెలియనగుచుం డును. మఱికొన్ని యనుభవమున కతీతములు. ఈ ద్వివిధ పదార్థములను దేనికది వేరుచేయుట యత్యావశ్యకము. వీని నీ శాస్త్రము చక్కగ సమీక్షించుచుండును.

(లాజిక్) తర్కశాస్త్రము. జ్ఞానవిషయ చర్చయందు వ్యావహారికప్రక్రియలో నీ శాస్త్ర ముపయోగించుచుండును. ఈ తర్కము సత్యముగా-ప్రామాణికముగా నుండవలయునన్న

కొన్నికొన్ని నియమము లావశ్యకములు. ఈ నియమముల యథార్థస్వరూపము ఈశాస్త్రమున వర్ణింపబడును.

ఈ శాస్త్రమునందు రెండు భాగములు గలవు.

(అ) (డడక్టివ్) నిగమనము సామాన్యము ద్వారా విశేషము నన్వేషించుట.

(ఆ) (ఇన్‌డక్టివ్) ఆగమనము: విశిష్టదృష్టాంతములను బరిశీలించి తన్మూలమున సామాన్యసిద్ధాంతమును గుర్తించుట.

(ఎథిక్స్): నీతిశాస్త్రము అనగా కర్తవ్యశాస్త్రము. మన జీవితము కష్టమెరుగకుండ గడపుటకేనా? లేక యేదైన లక్ష్యమును సంపాదించుటకా? కర్తవ్యమనగా నేమి? అద యెన్నివిధములు? ఇది కర్తవ్యమనియు, నది యకర్తవ్యమనియు, దేనినిబట్టి నిర్ణయింపనగును? మనుష్యునికి సుఖము స్వాభావికమా? లేక ఆగంతుకమా? మన జీవితమున బహుళముగా నున్న దుఃఖము సత్యమా? అనగా శాశ్వతమా? లేక యశాశ్వతమా? ఇత్యాదివిశేషముల నిది వివేచించును.

దుఃఖము శాశ్వతము. దానిని తొలగించుకొనుట తలకు మీరిన పని. కనుక మనము దుఃఖముతో గ్రుంగవలసినదే యని కొందరందురు. వీరు నిరాశావాదులు. మరికొందరందురుగదా! సుఖము మనకు స్వాభావికము. దుఃఖము అస్వాభావికము. అయినను మనము సరియగు మార్గములందు సంచరింపక అజ్ఞానవశులమై దుఃఖములను కొనితెచ్చుకొనుచుందుము. వీని నివృత్తి మన ప్రయత్నముమీద, ప్రవర్తనము మీద నాధారపడియుండును. కనుక మన మట్టి సుఖసాధన మార్గముల సంచరింపవలయును అని. ఇట్టివా రాశావాదులు.

(సైకాలజీ)- మనోవిజ్ఞానము : ఇందు మన స్సనగా నేమో, దాని స్వరూప స్వభావములేమో, మనోవృత్తులేమో మొదలగు విషయములు వివేచింపబడును. నేడు మానసికస్థితులు-దశలు ప్రయోగశాలలందు కూడ పరిశీలింపబడుచున్నవి. అందువలన పెక్కు-విషయములు అసందిగ్ధములుగ నిర్ధారితము లగుచున్నవి. ఇందు ఎప్పటికప్పుడు నూత్నాంశముల నావిష్కరించుచున్నారు. కాగా మన దేశమునమో! సంప్రదాయసిద్ధముగ నున్న యిట్టిశాస్త్రములను క్రొంగ్రొత్త విషయములతో పెంపొందింపకపోవుటయేగాక ఉన్న వానిని సయితము చదివి సూక్ష్మాతిసూక్ష్మవిషయముల నూహించి శాస్త్రములుగా సంగ్రథించిన పూర్వ మహర్షుల ప్రతిభా విశేషములను సయితము ప్రశంసింపలేకున్నాము. ఇది దేశ దౌర్భాగ్యము.

పాశ్చాత్య దర్శనశాస్త్ర మార్గమునకును, భారతీయ దర్శనశాస్త్రమార్గమునకును నొక ప్రధానభేదమున్నది. ఆభేదము నొక దార్శనిక పండితు డిట్లు వర్ణించియున్నాడు.

'గంతవ్యస్థానమును నిర్ణయించుకొనక మహాసముద్ర మధ్యమున పైనముచేయ లంగరెత్తిన నావికులు పాశ్చాత్య దర్శనకారులు. వీరి కొక లక్ష్యము లేదు. వారు విడిచిన నావ యొక యొడ్డునకు చేరవచ్చును. లేదా! యొక ప్రవాహమున బడి కొట్టుకొని పోవనువచ్చును. ఎట్లైనను వారికి దిగులు లేదు. వారి లక్ష్యము ప్రయాణము చేయుటయే.

ఇక భారతీయ దర్శనకర్తల యుద్దేశ మదిగాదు. వీరి కొక యాదర్శమున్నది. వీరి గంతవ్యస్థానము దుఃఖనివృత్తి.

వారు దానినే లక్ష్య మొనరించుకొని తమ యాలోచనా నావను నడపుకొనిపోయినారు. కనుక పాశ్చాత్యదర్శనశాస్త్ర నౌకలలో పైనము చేయువారి కేగతి గల్గునో తెలియదు గాని భారతీయనౌక నారోహించినవారు దుఃఖసాగరము దూరమగు నొక నిర్మలస్థానమునకు జేరగలరనుట నిశ్చయము.

భారతీయములగు ఆస్తికదర్శనము లారింటిలో న్యాయదర్శనమున కొక ప్రత్యేక స్థానము గలదు. న్యాయమనగా వాత్స్యాయనుడు చెప్పినట్లు (ప్రమాణైరర్థపరీక్షణం న్యాయం) నభిన్న ప్రమాణముల మూలమున వస్తుతత్త్వమును పరీక్షించుట. దీనినే ఆన్వీక్షికి యందురు. అన్వీక్ష యనగా నేమో న్యాయభాష్యమున నిట్లు వివరింపబడియున్నది. "ప్రత్యక్షాగమాశ్రితమ్ అనుమానమ్ సా అన్వీక్షా" ప్రత్యక్షమును, ఆగమమును అనుసరించిన యనుమానమే యన్వీక్ష. "అథవా ప్రత్యక్షాగమాభ్యాం ఈక్షితస్య అన్వీక్షణం అన్వీక్షా తయా ప్రవర్తతే ఇతి ఆన్వీక్షికీ న్యాయవిద్యా" ప్రత్యక్షాగమముల సహాయముతో తెలిసిన విషయమును సాధక బాధక యుక్తులతో నిశ్చయించుట.

ఇట్టి నిశ్చయమునకు గావలసిన సాధనసామగ్రి యంతయు నీ శాస్త్రమునం దీయబడినది గనుక నిది యాన్వీక్షికి యయినది.

ఈ మన న్యాయశాస్త్రమునకు కర్త గోతమమహర్షి. ఇతనినే గౌతము డనియు ననుచుందురు. ఈ పేరుగలవారు జైనమతానుయాయులలో నొకరున్నారు. కాని యాతడు వేదప్రామాణికుడు కాకుండుటచే నీ యాస్తికదర్శనకర్త కాజాల

డనుట నిక్కువము. మఱి బుద్ధుడయి బౌద్ధమతస్థాపకు డయిన సిద్ధార్థుని వంశ మూలపురుషులలో నెక గౌతము డున్నాడు. అందువలననే బుద్ధుడు గౌతమబుద్ధుడయినాడు. కాని యీ గౌతముడును మహర్షి కాడు. కనుక నితడును మన ప్రస్తుత దర్శనశాస్త్రకర్త కాజాలడనుటలో సంశయముండదు. కాగా మహర్షి యగు గోతమనాముడు రామాయణ కర్త యగు వాల్మీకిమహర్షి సమకాలికు డొకడు గలడు. ఇతడే యీ దర్శనకర్త కావచ్చునని యూహింప ననువగుచున్నది. ఈతని ప్రశంస వాల్మీకిమహర్షి తన రామాయణకావ్యమున బాల కాండమున జేసియున్నాడు.

ఈ గోతముని భార్యయే రామాయణమున బ్రసిద్ధి నొందిన యహల్యాదేవి. జనకమహారాజు పురోహితుడగు శతానందు డీమహర్షి కుమారుడే యని రామాయణమువలన మనకు స్పష్టమగుచుండును. ఇతని యాశ్రమము మిథిలాపుర ప్రాంతమున నున్నది.

ఇతడును జనకరాజుల పురోహితుడనియు, రహూగణ మహర్షి పుత్రుడనియు శతపథబ్రాహ్మణమునుబట్టి స్పష్టమగు చున్నది.

ఈ గోతమ యనునది కాలక్రమమున వంశనామముగా మాఱిపోయినది. కాని యీ వంశమునకు మూలపురుషుడగు గౌతము డెవ్వడో !

మఱికొందఱి యభిప్రాయములో బుద్ధుని మూల పురుషుడగు గౌతముడును, ఈ గోతమవంశమునకు మూల పురుషుడగు గౌతముడును నొక్కరే యనియు, ఆ యేక

వంశమే క్రమక్రమమున నీ రెండు వంశములుగా జీలినదనియు దలచుచున్నారు. ఎట్లైనను ఇది పరిశోధనార్హము.

మన న్యాయశాస్త్రకర్త యగు గోతమునికి అక్షపాదుడను నామము గలదు. ఈ పేరు వచ్చుటకు గల కారణములను గూడ వివిధవిధములుగా జెప్పుచుందురు.

(౧) ఈయన యొకనా డేదియో యాలోచించుకొనుచు త్రోవను బోవుచుండెనట! పోవుచుండగా నతని కాలు ఒక పల్లములోబడి యత డొఱిగి ముందునకు బడిపోయెనట! పడి 'కాళ్ళకుగూడ గన్నులున్నచో నీ యవస్థ గల్గెడిదికాదు గదా!' అని తలచెనట! అందువలన నప్పటినుండియు నితనిని 'అక్షపాదుడు' అనుచు వచ్చిరట.

(౨) గోతమునియొద్ద పెక్కురు శిష్యులు విద్య నభ్యసించుచుండువారట! ఒకమా రొక శిష్యుడు ఏదో యపచారము చేయగా మహర్షి యాతని గోపించి 'యీ కన్నులతో నీ మొగము చూడను' అని శపించెనట! శిష్యుడు తన పశ్చాత్తాపమును బ్రకటించి తన్ననుగ్రహింపుమని మఱి మఱి వేడుకొనెనట! చివరకు మహర్షిచిత్తము మెత్తపడగా శిష్యు ననుగ్రహించి తనమాట వ్యర్థము కాకుండునట్లు తన పాదముల కక్షులు గల్పించుకొని పాదాక్షులతో నా శిష్యుని వీక్షించెనట! అందువలన నా మహర్షి యక్షపాదు డయ్యెనట!

(3) ఈ మహర్షి యెప్పుడు నేదియో యొకవిషయము నాలోచించుచునే యుండువాడట! ఎచ్చటికి వెళ్లుచున్నను నీతడు తల యెత్తికొని కాక తల వంచుకొని యాలోచించు

చునే వెళ్లువాడట ! కనుక నితని దృష్టి యెప్పుడును పాద ములవైపే యుండెడిదట! కనుక నితని నక్షపాదు డనిరట!

ఇందేది సత్యమో నిర్ణయింపబూనుట మాపని గాదు.

న్యాయసిద్ధాంతములు కొన్ని మన వేదఉపనిషద్వాఙ్మయములగూడ గానబడుచున్నవి. 'కథ మసత స్స జ్జాయేత' మొదలగు వాక్యము లిట్టివి. ఇక భగవద్గీతాదులలో నిట్టివి యుండుటలో వింతలేదు. 'నాసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః' ఇత్యాదులు.

కాలక్రమమున ని వాఙ్మయమును పోషించి యభివృద్ధి చేసినవారు పెక్కురున్నారు. వారిలో వాత్స్యాయను డొకడు. ఇతడు క్రీ. పూ. ౧-౨ శతాబ్దములలోనివా డనుచున్నారు. ఇతని భాష్యము న్యాయవాఙ్మయమున నత్యున్నతస్థానమున నలరారుచుండును. ఇత డుదాహరించిన కొన్ని కొన్ని వాక్యములనుబట్టి యింతకుపూర్వము న్యాయదర్శనమునకు ఒకటి రెండు వ్యాఖ్య లుండినట్లు తెలియుచున్నది. కాని యవి మన కలభ్యములు.

ఉద్యోతకరుడు :— (క్రీ. ౬ శతము) వేదానుకూలమగు నీ న్యాయదర్శన భాష్యాదులపై దండెత్తిన సుప్రసిద్ధ బౌద్ధమత ప్రచారకుడగు దిఙ్నాగాచార్యుని సిద్ధాంతమును ఖండించుచు 'న్యాయవార్తికము'ను రచియించినాడు. ఇతని బౌద్ధదర్శన పాండిత్యమును, స్వరచిత వార్తికప్రౌఢత్వమును ప్రశంసార్హములు.

వాచస్పతిమిశ్రుడు :— (క్రీ. ౯ శత) ఉద్యోతకరుని 'న్యాయవార్తికము'నకు 'తాత్పర్యటీక'ను రచించినాడు. ఇతడు

మిథిలానివాసి. తన యఖండ పాండిత్యమువలన సర్వతంత్ర స్వతంత్రు డను బిరుదమును పొందినవాడు. షడ్దర్శనములలో నొక్క వైశేషికమునకు దక్క మిగిలినవానికి చక్కని టీకలు రచియించినాడు. ఇవన్నియు ప్రామాణికములుగా భావింప బడుచున్నవి.

జయంతభట్టు:—(క్రీ. ౯ శ.) 'న్యాయమంజరి'ని రచించి నాడు. ఇది గోతమ న్యాయసూత్రములలో కొన్నికొన్నింటి నేరి వానికి వృత్తి వ్రాయుచు చార్వాక, బౌద్ధ, మీమాంసా వేదాంత సిద్ధాంతములను అమోఘ యుక్తులతో ఖండించి నాడు.

భాసర్వజ్ఞుడు:- (క్రీ. ౧౦ శ.) ఇతని 'న్యాయసారము' కొన్నియెడల నపూర్వయుక్తులతో శోభిల్లుచుండును.

ఉదయనాచార్యుడు :- (క్రీ. ౧౦ శ.) ఇతడు వాచ స్పతిమిశ్రుని తాత్పర్యటీకకు 'తాత్పర్యపరిశుద్ధి' యను పేరితో అమూల్యమగు వ్యాఖ్య రచించినాడు. ఇతని 'న్యాయకుసు మాంజలి' అద్వితీయమని పేరు వడసినది.

గంగేశోపాధ్యాయుడు:-(౧౩ శ.) మిథిలానివాసి. ఉదయ నాచార్యు ననంతర మింతటి యుద్దండపండితు డాప్రాంతమున లేడు. పూర్వన్యాయమార్గము నీతడు మార్చి నవ్యన్యాయ మార్గమునకు నాంది యైనాడు. ఇతని 'తత్త్వచింతామణి'యే తర్కశాస్త్రము నందలి అవచ్ఛేదకావచ్ఛేద్యములు, నిరూప్య నిరూపకాది పదములను ప్రారంభించినది. ఈ గంగేశోపా ధ్యాయుడు ౧౨ వ శతాబ్దిలోని శ్రీహర్షుని 'ఖండనఖండ ఖాద్యము'ను ఖండించినాడు. ఇతని తత్త్వచింతామణిమీద

౧౩ వ శతాబ్దపు చివర నున్న జయదేవుడు 'ఆలోక' మను నొక టీకను రచియించియున్నాడు.

ఈతని కుమారుడగు వర్ధమానోపాధ్యాయుడును తండ్రి వలె నఖండవిద్వాంసుడు. ఇతడు ఉదయనాచార్యుని గ్రంథములమీదను, తన తండ్రిగారి 'తత్త్వచింతామణి'మీదను, వల్లభాచార్యుని 'న్యాయలీలావతి' మీదను చక్కని వ్యాఖ్యానములను రచించినాడు.

ఆ కాలమునందున్న జయదేవపండితు నెదుర్కొనగలవా డప్పటి పండితమండలిలో నొక్కడు లేడట. ఇతడు తన పక్షమును సమర్థించుకొనుచు పక్షములెన్నియైనను ప్రతిపక్షులతో డీకొనువాడట. అందువలన నితడు 'పక్షధరమిశ్రు'డని ప్రఖ్యాతినొందినాడు. ఇతని శిష్యుడగు రుచిదత్తమిశ్రుడే వర్ధమానుని కుసుమాంజలిప్రకాశముమీద 'మకరందము', చింతామణిమీద 'ప్రకాశము'నను టీకాగ్రంథములు రచించినాడు.

ఇంతవఱకు న్యాయవిద్యకు కేంద్రము మిథిలాప్రాంతము. ౧౫వ శతాబ్దమునుండియు నా కేంద్రము వంగదేశమునందలి నవద్వీపమునకు మాఱినది. అందీ న్యాయవిద్యలో పెక్కురు ప్రవీణులైనారు. వారిలో వాసుదేవసార్వభౌముడు ప్రథమగణ్యుడు. ఇతని సేవాశుశ్రూషామహిమచే ననేకులు దిగ్దంతులు బయలుదేఱినారు.

రఘునాథశిరోమణిః- (౧౬ శ.) వంగదేశపు నైయాయికులలో నితనికి దుల్యుడు మఱియొకరు లేరని పేరు పొందినాడు. విద్వన్మండలిలో 'శిరోమణి' యని బిరుదు సంపాదించు

కొన్నాడు. ఇతని పుస్తకములలో నుత్తమమైనది 'దీధితి'. ఇది గంగేశోపాధ్యాయుని 'తత్త్వచింతామణి'కి విపులమగు వ్యాఖ్యానగ్రంథము. మూలమువలెనే యిదియును పాండిత్య ప్రకర్షకు ప్రమాణమయినది. ఇది గ్రంథకర్తయొక్క ఉన్నత భావములకు, మనోహర కల్పనలకు, అఖండ యుక్తి ప్రతియుక్తులకు నిధానము.

మథురానాథుడు:-'శిరోమణి' శిష్యులలో నగ్రగణ్యుడు. ఇతడు 'ఆలోకము' 'చింతామణి' 'దీధితి' మున్నగు గ్రంథముల గూఢార్థములను ప్రకాశింపజేయు 'రహస్యము' లను టీకలను రచించినాడు.

జగదీశభట్టాచార్యుడు :- (౧౭ శ.) మథురానాథుని తర్వాత నితడు నవద్వీపములో గొప్ప పండితుడు. ఇతడును 'దీధితి'మీద ఒక విస్తృతవ్యాఖ్యను రచించినాడు. మఱియు శబ్దశక్తినిగూర్చి 'శబ్దశక్తి ప్రకాశిక' యను నుత్కృష్టగ్రంథమీతని సర్వస్వమందురు.

గంగాధర భట్టాచార్యుడు:- (౧౭ శ.) వంగదేశము నందలి నైయాయిక రత్నత్రయములో నితడు మూడవవాడు. (మథురానాథుడు, జగదీశుడు, గంగాధరుడు). ఇతని ప్రధాన రచన 'దీధితి'మీది మహావ్యాఖ్య. దీనిని 'గాదాధరి' యందురు. ఇట్టి మఱికొన్ని వ్యాఖ్యా గ్రంథములును, ఏబదికి మీఱిన స్వతంత్రగ్రంథములును రచించి కీర్తి నార్జించినాడు.

ఈరీతిగా న్యాయము మిథిలాప్రాంతమున నంకురించి నవ్యన్యాయరూపముగా విస్తృతిజెంది నవద్వీపమున మహావృక్షమై విలసిల్లినది.

కాని న్యాయశాస్త్ర మన లేలపుట్టినదో యాయుద్దేశము రానురాను మరుగుపడిపోయినది. సనాతన న్యాయము సులభభాషలో అమూల్యవిషయములను దెలుప బ్రయత్నింపగా నవ్యన్యాయము దానికి బ్రతిపక్షముగ విషయమును టెంకాయ పిచ్చికొంకఁచేసి మాటల భేషజముతో......వలె పరుల నెమరొక్కొనుటకు తయ్యారుచేసినది. విషయగౌరవము నెరిగినవారు ఈ వెఱ్ఱితలలను విచారపడక మానరు.

ఈవిషయము లెస్సగ దెలిసికొన్న మిత్రులు పం. గోపదేవ్‌గారు ప్రాచీనశాస్త్రము లభిమానముతో ప్రచారము చేయు దలంపున నీ శాస్త్రము నీ రూపమున రచియించుట ప్రశంసాపాత్రము.

వీరు నైష్ఠికబ్రహ్మచారులు, కాశ్యాది విద్యాపీఠములలో పెక్కువర్షములు పండితులను సేవించి సంస్కృతాది భాషలలో సాహిత్యసంపదను సంపాదించుటయేగాక సమర్థులగు నాచార్యులయొద్ద షడ్దర్శనములను సమగ్రముగ నభ్యసించినవారు. పాతంజలి మార్గమున మంచు గొండలలో బెక్కేండ్లు అష్టాంగయోగము నభ్యసించియు వైదికధర్మమును బ్రచారముచేయు తలంపున తమ పురిటిగడ్డ యగు నాంధ్రదేశమున కరుదెంచినవారు. ఈ శాస్త్రమున కాంధ్రభాష యింతవరకు నోచుకోలేదనుట యాంధ్రాభిమానమున కాఘాతము. ఆంధ్రులు దీనిని ఎల్లవిధముల బ్రోత్సహించి నిజమగు విజ్ఞానము నాంధ్రదేశమున బ్రచారము గావింప నవకాశము గల్పింతురుగాక !

వినీతుడు,

వడ్లమూడి వెంకటరత్నం.

ద్రవ్యదాతృ పరిచయము

(రు ౧౫౦౦)

శ్రీయుత బెలిదె జగదీశ్వరయ్యగారు సికిందరాబాదు నివాసులు. లక్ష్మీశపుత్రులు. సీతమ్మ రామన్నలు వీరి జననీజనకులు. వీరి సతి 'మణి' నామాంకిత. కుమారుడు చంద్రమౌళి (M. A. B. L). తనయ ఈశ్వరి. కుమారస్వామి వీరికి అనుగుతమ్ముఁడు. మనుమలతోను, మనుమరాండ్రతోను, వీరి కుటుంబము నిత్యకల్యాణము-పచ్చతోరణము.

వీరు ఆగర్భశ్రీమంతులై తండ్రి యడుగుజాడలలో జీవితము నడుపుచు పరంపరాగతప్రతిష్ఠను పెంపు చేయుటలో సదా తత్పరులు.

పూర్వాచారపరాయణులయ్యు సమయానుకూలముగ సంఘ సంస్కరణకు తోడ్పడుటలో వెనుకంజ వేయనివారు. సనాతనధర్మరక్షకుల మను నామధారి పండితుల నెదుర్కొని వారి మాయాజాలమునుండి సంఘమును రక్షించుటకు నడుము కట్టుదురు.

వీరికి గల యాంధ్రభాషాభిమానము నిరుపమానము. గ్రంథములను చేకూర్చుటలోను, చదువుటలోను వీరికి ఆసక్తి మెండు. వీరు సహృదయులు, సరసులు. మిత్రుల యాదరణకు పాత్రులు. యాచకులు, బీదసాదలు కొంచెమో గొప్పయో వీరినుండి సహాయము పొందకపోరు.

దేశసేవ నొనర్చుటకై యేర్పడిన సంస్థలకు వీరు సదా సహాయకులు. దేశమున ధనికు లెందరో గలరు; కాని ద్రవ్యమును సద్వినియోగముచేయువా రరుదు.

శ్రీ పండిత గోపదేవ్‌గారు న్యాయదర్శనమును రచించి రెండు సంవత్సరము లైనది. అయినను వారి యపరిగ్రహావృత్తి కారణముగా నీగ్రంథము ప్రకటనకు రాకుండుట చూచి నేను శ్రీ జగదీశ్వరయ్యగారి కీవిషయమును చెప్పుటయే తడవుగా వారు గ్రంథముద్రణావశ్యకతను గుర్తించి ద్రవ్యసహాయము చేసిరి. ద్రవ్యమును సద్వినియోగము చేయుటలో వీరికిగల యాసక్తి నీ ప్రసంగము రుజువు చేయగలదు. ఇట్లే వీరు ముందును ఉత్తమ గ్రంథ ప్రకాశమునకు తోడ్పడుచు తమ వంశ ప్రతిష్ఠను ఆంధ్రదేశమున నాచంద్రార్కము స్థిర మొనర్ప గలరని యాశించుచున్నాను.

ఇట్లు,

సికిందరాబాద్,
౧౫-౫-౫౦

డి. వి. స్వామి,
సమాజ సేవక్.

ఆత్మ నివేదనము

భారతీయ దర్శనములు తెలుగుపాఠకుల కందజేయ దలచి ప్రథమమున వైశేషికదర్శనము రచించితిని. ఈన్యాయ దర్శనము రెండవది. శాస్త్రవిషయములను సరిగా తెలిసికొన గలవారి సంఖ్య తెలుగున నతి స్వల్పమగుటచే వ్యయప్రయాసములకు వలయు ఫల ముండబోదని నిరుత్సాహము కలిగినది; కాని, మిత్రుల బలిమికి లోనై గ్రంథ రచన పూర్తి జేసితిని. రెండు సంవత్సరములకు తదుపరి నా మిత్రుడు శ్రీ డి. వి. స్వామిగారిద్వారా యీవిషయము తెలియుటయే తడవుగా శ్రీ బెలిదె జగదీశ్వరయ్య శ్రేష్ఠిగారు (సికిందరాబాదు) ఉదారబుద్ధితో గ్రంథ ముద్రణ కగు వ్యయము నిచ్చుట కంగీకరించిరి. వీ రాగర్భశ్రీమంతులు. పాత్ర మెరిగి ద్రవ్య మిచ్చువారు. భాషాభిమానులు. వీరికై నాతోబాటు ఆంధ్రలోకము సదా కృతజ్ఞమై యుండును. సుకృతులను సుఖము లొడగూర్చు పరదైవము వీరికి పరమసుఖము నిచ్చుగాత.

శ్రీ పండిత వెంకటరత్నంగారు ఆంధ్ర విపశ్చిన్మణులలో నన్యతములు. భాషాసేవకులు ప్రతిష్ఠా నిరపేక్షులు. వీరు దయతో నా యీ గ్రంథమునకు తగిన పీఠికను రచించి దీనిని రూపొందించుటలో చేసిన సాహాయ్యము మిక్కిలి. వీరి ఋణము తీర్చుకొనజాలను.

నా తొందరలకోర్చి సరసముగా గ్రంథమును ముద్రించి దీని వ్యాప్తికి తోడ్పడిన 'భారతీ ప్రెస్' మహాజనులకు హార్దిక ధన్యవాదములు.

కూచిపూడి,
౧౫-౬-౫౦

విద్వదనుచరుడు,
గోపదేవ్

విషయ సూచిక

ప్రథమాధ్యాయము

ఆద్యాహ్నికము

ద్వితీయాహ్నికము

ద్వితీయాధ్యాయము

ఆద్యాహ్నికము

ద్వితీయాహ్నికము

తృతీయాధ్యాయము

ఆద్యాహ్నికము

ద్వితీయాహ్నికము

చతుర్థాధ్యాయము

ఆద్యాహ్నికము

ద్వితీయాహ్నికము

పంచమాధ్యాయము

ఆద్యాహ్నికము

ద్వితీయాహ్నికము

ఓమ్

న్యాయదర్శనము

ప్రథమాధ్యాయము

(ఆద్యాహ్నికము)

మోక్షప్రాప్తికి కారణభూతమైన పదార్థ తత్త్వజ్ఞానమును వివరముగా నుపదేశింపదలచి కరుణానిలయుఁడయిన గోతమ మహర్షి న్యాయశాస్త్రము నారంభించుచు మొదటి సూత్రమును రచించుచున్నాడు

"ప్రమాణ, ప్రమేయ, సంశయ, ప్రయోజన, దృష్టాంత సిద్ధాం తావయవ, తర్క, నిర్ణయ, వాద, జల్ప, వితండా, హేత్వాభాస, చ్ఛల, జాతి నిగ్రహ స్థానానాం, తత్వజ్ఞానా న్నిఃశ్రేయసాధిగమః." ౧.౧.౧.

(ఈ సూత్రమున నిర్దేశింపబడిన పదములన్నియు సర్వ పదార్థ ప్రధానముగు ఇతరేతరయోగ ద్వంద్వ సమాస ఘటితములు. విగ్రహము యథావచనము చేయవలయును.)

ప్రమాణాని (చ)=ప్రమాణములు, ప్రమేయమ్ (చ) =ప్రమేయము, సంశయః (చ)=సంశయము, ప్రయోజనం (చ)=ప్రయోజనము, దృష్టాంతః (చ)=దృష్టాంతము, సిద్ధాంతః (చ)=సిద్ధాంతము, అవయవాః (చ)=అవయవములు, తర్కః (చ)=తర్కము, నిర్ణయః (చ)=నిర్ణయము, వాదః (చ)=వాదము, జల్పః (చ)=జల్పము, వితండా (చ)=వితండ, హేత్వాభాసాః(చ)=హేత్వాభాసములు, ఛలం (చ)=ఛలము, జాతయః (చ)=జాతులు, నిగ్రహస్థానాని(చ)=నిగ్రహస్థానములు, నను నీ పదు

నారు పదార్థముల, తత్త్వజ్ఞానాత్=యథార్థజ్ఞానమువలన, నిఃశ్రేయసాధిగమః=మోక్షప్రాప్తియగును.

ప్రమాణాది షోడశపదార్థముల తత్త్వమును సాక్షాత్కరింపజేసికొనుటవలన నిఃశ్రేయసము సిద్ధించునని సూత్రాభిప్రాయము. సూత్రమున వర్ణింపబడిన ప్రమాణాది పదార్థములు క్రమముగా ముందు గ్రంథమున వర్ణింపబడును.

"య ఇత్తద్విదుస్తేఽమృతత్వమానశుః" (ఋ. ౨-౩. ౧౯. ౨౩)

"తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి, నాన్యః పన్థా విద్యతేఽయనాయ" (యజు. ౩౧, ౧౮)

"తమేవ విద్వాన్నబిభాయ మృత్యోః" (అథర్వ ౧౦. ౫. ౪౪)

"యస్మిన్ ద్యౌః పృథివీ చాంతరిక్షమోతం మనః సహ ప్రాణైశ్చ సర్వైః తమేవైకం జానథ ఆత్మాన మన్యో వాచో విముంచథామృతస్యైష సేతుః" (ముం. ౨ ౨. ౫)

ఇట్టి శ్రుత్యుపనిషద్వాక్యములవలన నీశ్వర తత్త్వజ్ఞానము మోక్షమున కసాధారణ కారణమైనట్లు బోధపడుచున్నది. ఇదియే వైదిక సిద్ధాంతము. కాని, ఆ యీశ్వర తత్త్వజ్ఞానము కలుగుటకు జీవాది ఇతర పదార్థముల తత్త్వజ్ఞాన మత్యంతావశ్యకము. ఆ జీవాది పదార్థజ్ఞానము శాస్త్రమువలన లభించును. శాస్త్రాది శ్రవణమువలన కలుగు పదార్థజ్ఞానము జటిలము, కుటిలము నగు యుక్తులద్వారా సంశయగ్రస్తమగునేని మోక్షసాధనము కాజాలదు. అట్టి సంశయాదులను బోనాడి దృఢమైన జ్ఞానము కలుగజేసి ముముక్షువులకు తోడ్పడునదియే న్యాయవిద్య=ఆన్వీక్షికి...(ఈక్షితస్య

అన్వీక్షణం అన్వీక్షా) శాస్త్రాత్ ఈక్షితస్య = శాస్త్ర శ్రవణము ద్వారా విన్న విషయమును అన్వీక్షణం = సాధక బాధక యుక్తులతో నిశ్చయించుట అన్వీక్ష యనబడును. ఆ యన్వీక్షతో ప్రవర్తించు విద్య ఆన్వీక్షికి యనబడును. దీనినే వేదాంతవిదులు మననమందురు. వేదాది శాస్త్రముల ద్వారా ప్రతిపాదింపబడిన విషయములు వాదులచే ప్రయోగింపబడు కుటిలయుక్తులచే దూషితము లయినప్పుడు వానిని నిర్దుష్టమొనర్చి ప్రమాణీకరింప తోడ్పడునట్టి దీ న్యాయ విద్యయే – న్యాయశాస్త్రమే. దీనికి ప్రతిపాద్య విషయము ప్రమాణాది షోడశపదార్థములు. అందు ప్రమాణము నిఖిలపదార్థవ్యవస్థాపకమగుటచే ప్రప్రథమమున నుదాహరింపబడినది. ప్రమాణముల ద్వారా తెలియబడునది ప్రమేయము గనుక దానితరువాత లెక్కింపబడినది. మిగిలిన సంశయాది పదార్థము లన్నియు ప్రమాణముననో, ప్రమేయముననో చేరిపోవును. కాబట్టి వానిని వేరుగా నుపదేశింపవలసిన యగత్యము లేదు అయినను సంశయము కలుగకున్న తర్కాదులకు ప్రవృత్తి కలుగదు గనుక సంశయాదుల నిట ప్రత్యేకముగా నిర్దేశింపవలసివచ్చెను. ఇట్లు ప్రమాణాది సర్వ పదార్థముల తత్వజ్ఞానము నిఃశ్రేయసమునకు సమానసాధనము గాకున్నను కొన్నిటి జ్ఞానము సాక్షాత్తుగాను, కొన్నింటిజ్ఞానము పరంపరగాను సాధనమే యగుటవలన, మొత్తమున నిఃశ్రేయసప్రాప్తికి సాధనముగా మహర్షి యీ సూత్రమున ప్రతిజ్ఞ చేసియున్నాడు.

తత్వజ్ఞానమువలన నెట్లు నిఃశ్రేయసము సిద్ధించుననఁ

"దుఃఖ, జన్మ, ప్రవృత్తి, దోష, మిథ్యాజ్ఞానానా
ముత్తరోత్తరాపాయే, తదనంతరాపాయా దపవర్గః"
౧. ౧. ౨.

అధర్మమువలన కలిగి, అనుభవమున కింపుగాని గుణము దుఃఖమనబడును. అపూర్వములైన శరీరేంద్రియ మనోవేదనలతో నాత్మ కేర్పడు సంబంధమునకు జన్మ యని పేరు.

ప్రవృత్తిసాధనముగాగల ధర్మాధర్మము లీ సూత్రమున ప్రవృత్తి శబ్దముచే వ్యవహరింపబడినవి. రాగద్వేషములు దోషమనబడును. మిథ్యాజ్ఞానము, అవివేకము, భ్రాంతి, అవిద్య ఇవి పర్యాయపదములు. ఇట్లు దుఃఖము, జన్మము, ధర్మాధర్మములు, దోషము, మిథ్యాజ్ఞానము నను నీ యైదింటిలో

ఉత్తరోత్తరాపాయే = మొదట మిథ్యాజ్ఞానము, తరువాత దోషము, అటుపై ధర్మాధర్మములు, అనంతరమున జన్మము పిమ్మట దుఃఖము తొలగిపోయిన, తదనంతరాపాయాత్ = దానికి సమీపముననున్న దోషము మున్నగునవి తొలగిపోయి, అపవర్గః = మోక్షము సిద్ధించును.

(అతస్మిన్ తద్ జ్ఞానమ్, మిథ్యాజ్ఞానమ్) ఒక వస్తువును మరియొక వస్తువుగా నెఱుగుట మిథ్యాజ్ఞాన మనబడును. ఆత్మ మొదలుకొని యపవర్గము వరకుగల నిఖిల ప్రమేయములందును మిథ్యాజ్ఞాన మనేకవిధముల కలుగును. అయినను,

ముఖ్యము గా అనిత్యమున నిత్య బుద్ధిని, అశుచియందు శుచి జ్ఞానమును, దుఃఖమున సుఖమతిని, శరీరాద్యనాత్మపదార్థము లందాత్మబుద్ధిని కలిగించి మిథ్యాజ్ఞానము జన్మ మరణ పరంపరాయుతమగు సంసారమునకు కారణమగుచున్నది. యోగశాస్త్రమున నిట్లే వర్ణింపబడినది.

> "అనిత్యాశుచి దుఃఖానాత్మసు, నిత్య శుచి సుఖాత్మ ఖ్యాతి రవిద్యా" (యో. సూ ౨. ౫)

ఈ యవిద్యామూలకములే రాగద్వేషములు. తత్త్వము నెఱింగిన వ్యక్తి యెన్నడు దేనియందును రక్తుడు గాడు - దేనిని ద్వేషింపడు. కాబట్టి రాగద్వేషములకు మూలము మిథ్యాజ్ఞానమే రాగద్వేషగ్రస్తబుద్ధులే లోకమున ధర్మాధర్మములందు ప్రవర్తింతురు. అందువల్లనే వైశేషిక దర్శనకారుడగు కణాద మహర్షియు తన గ్రంథమున ("ఇచ్ఛాద్వేషపూర్వికా ధర్మాధర్మ ప్రవృత్తిః" వై. ౬. ౨. ౧౪) ధర్మాధర్మ ప్రవృత్తి ఇచ్ఛాద్వేషమూలకమని వర్ణించియున్నాడు. ఇట్టి ధర్మాధర్మ ప్రవృత్తిమూలకమైనదే జన్మము. వీతరాగులకు జన్మముండనేరదని యీ శాస్త్రముననే ముందు బోధింపబడును. (వీతరాగ జన్మాదర్శనాత్ 3. ౧. ౧౪) ప్రపంచమున కలుగు దుఃఖము లన్నియు జన్మమూలకము లనుట నిస్సంశయము. శరీరమే లేకున్న తన్మూలమున ననుభవించు దుఃఖములకు స్థానమెద్ది? కాబట్టియే (అత్రో వై సశరీరః ప్రియాప్రియాభ్యామ్ ఛాం. ౮. ౧౨. ౧) సశరీరుడే ప్రియాప్రియముల ననుభవించునని

ఛాందోగ్యమున జెప్పబడినది. ఇట్లు దుఃఖములకు మూలము మిథ్యాజ్ఞానమని బోధపడినది. అవిద్య యున్నంతకాలము దుఃఖమనువర్తించును కారణ ముండగా కార్యము నివృత్తి నొందనేరదు. కారణనాశమున కార్యము నశింపగలదు. కాబట్టి నిఃశ్రేయస కాములు ప్రయత్నపరులై మిథ్యాజ్ఞానమును తొలగింపవలయును. అటుపై క్రమముగా దోషాదులుపోయి త్రివిధదుఃఖములు నశించి మోక్షము ననుభవింపగలరు.

ప్రమాణములను విభజించి ప్రమాణ సామాన్య లక్షణమును నిరూపించుచున్నాడు.

"ప్రత్యక్షానుమానోపమాన శబ్దాః ప్రమాణాని"
౧. ౧. ౩.

(ప్రమీయతే అనేనేతి ప్రమాణమ్) దేనిచే నొక విషయము తెలియదగునో అది ప్రమాణము. ప్రమ యన జ్ఞానము. ప్రమాకరణము ప్రమాణము. అనగా జ్ఞాన సాధనము ప్రమాణమని తాత్పర్యము. ఇదియే ప్రమాణ సామాన్య లక్షణము. ఆ ప్రమాణము ప్రత్యక్షానుమానోపమాన శబ్దాః=ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము నని నాలుగువిధములు. ఈ ప్రమాణములలో ప్రత్యక్షము ప్రధానమగుటచే ప్రథమమున నిర్దేశింపబడినది. అనుమానము ప్రత్యక్షపూర్వక మగుటచే, తదనంతరము లెక్కింపబడినది. ఉపమానము అనుమానప్రమాణతుల్యమగుటచే మూడవదిగా గణింపబడినది. ప్రత్యక్షానుమాన ప్రమాణపూర్వక ప్రవృత్తి కలదగుటచే శబ్దము చివర నిర్దేశింపబడినది.

ఉద్దేశము, లక్షణము, పరీక్షయని యీ శాస్త్రము ముప్పిధముల ప్రవర్తించును. నామములతో పదార్థములను పేరొకొనుట యుద్దేశము. ఉద్దిష్టపదార్థముయొక్క యసాధారణ ధర్మమును లక్షణము. ఆ లక్షణము లక్షితపదార్థమున కలదా, లేదా యని ప్రమాణములతో నిర్ణయించుట పరీక్ష యనబడును. వేరు వేరు పేర్లతో వేరువేరు పదార్థములను చెప్పుట విభాగ మనబడును. ఇదియు నుద్దేశముననే చేరగలదు. అందువలన శాస్త్రప్రవృత్తి త్రివిధమే యనుట యసత్యము కానేరదు.

ప్రత్యక్షప్రమాణ లక్షణము:—

'ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నం జ్ఞాన, మవ్యపదేశ్య, మవ్యభిచారి, వ్యవసాయాత్మకం ప్రత్యక్షమ్.''

౧.౧.౪.

(యతః=దేనివలన) ఇంద్రియార్థ* సన్నికర్షోత్పన్నం=ఘ్రాణా

* సన్నికర్ష మారు విధములు: (౧) సంయోగము (౨) సంయుక్త సమవాయము, (౩) సంయుక్త సమవేత సమవాయము, (౪) సమవాయము, (౫) సమవేత సమవాయము, (౬) విశేషణ విశేష్య భావము: సంయోగము ద్రవ్య ప్రత్యక్షమునందును, సంయుక్త సమవాయము ద్రవ్యగత రూపాదిగుణ ప్రత్యక్షమునందును, సంయుక్త,సమవేత సమవాయము ద్రవ్య సమవేత రూపాది సమవేత రూపత్వాది సామాన్య ప్రత్యక్షమునందును, సమవాయము శబ్దప్రత్యక్షమునందును, సమవేత సమవాయము శబ్దగత శబ్దత్వాది సామాన్య ప్రత్యక్షమునందును, విశేషణ విశేష్య భావము ఆ భావముల ప్రత్యక్షమునందును కారణమగునని వివేకము

దీంద్రియములకు గంధాది పదార్థములతో సంబంధము కలుగుటచే (నే) జ్ఞానము కలుగుచున్నదో, ప్రత్యక్షమ్=(అది) ప్రత్యక్ష ప్రమాణమనబడు చున్నది ఆ కలుగు జ్ఞానము, అవ్యపదేశ్యం=గంధజ్ఞానము, రసజ్ఞానము అని విషయనామములచే పేర్కొనబడనిదిగాను, అవ్యభిచారి = స్వార్థమును విడువనిదిగాను వ్యవసాయాత్మకం = నిశ్చయాత్మకముగాను నుండ వలయును.

ఇంద్రియార్థముల సన్నికర్షమువలన నుత్పన్నమై, స్వార్థమును విడువనిదై, సంజ్ఞచే చెప్పబడనిదై నిశ్చయాత్మక మైన జ్ఞానము దేనివలన కలుగునో అది ప్రత్యక్ష ప్రమాణ మని యీ సూత్రాభిప్రాయము.

ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్న జ్ఞానమే ప్రత్యక్షము అని లక్షణము చెప్పినచో, ఇది జలము, ఇది మామిడిపండు అని యీ యీ వాచకపదములచే నేర్పడు జ్ఞానము సైతము ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నమే యగుటవలన నందు లక్ష ణము అతి వ్యాప్తమగును. దానిని వారించుటకు అవ్యపదేశ్య మను విశేషణము (లక్షణమున) చేర్పబడినది. వ్యపదేశ మనగా సంజ్ఞాపదము—నామవాచకము. వ్యపదేశమువలన నేర్పడు జ్ఞానము వ్యపదేశ్యము—అది కానిది అవ్యపదేశ్యము.

ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నమై యవ్యపదేశ్యమయిన జ్ఞానము ప్రత్యక్షమని లక్షణము చేయబడినను, అల్పప్రకాశ మున త్రాటిని చూచినపుడు కలుగు సర్పభ్రాంతియందును, ఎండమావులలో కలుగు జలభ్రాంతియందును అతివ్యాప్తి తప్పదు. కారణమేమన, భ్రాంతి జ్ఞానము ఇంద్రియార్థ సన్ని కర్షమువలననే కలుగును. కాని యది వ్యపదేశ్యము కాదు.

కాబట్టి యీదోషమును వారించుటకు లక్షణమున అవ్యభిచారి = స్వార్థమును విడువనిదై యుండవలయునను విశేషణము చేర్పబడినది.

ఇట్లు రెండు విశేషణములు చేర్పబడినప్పటికి దూరము నుండి యొక వస్తువును చూచునపుడు కలుగు — ధూమమా లేక ధూళియా, స్థాణువా లేక పురుషుడా యను సంశయ జ్ఞానమున నతివ్యాప్తి తప్పదు. కారణమేమనగ? సంశయ జ్ఞానమును ఇంద్రియార్థ సన్నికర్షజన్యమే; అవ్యపదేశ్యమే; మఱియు భ్రమయును కాదు. కాబట్టి యిటదోషమును వారించుటకు లక్షణమున నిశ్చయాత్మకమై యుండవలయునను విశేషణము చేర్చబడినది. సంశయజ్ఞానము నిశ్చయాత్మకము కాకపోవుటచే నిప్పుడు దోషము వాటిల్లదు.

లోకమున ప్రమాణ వ్యవహారమువలన వస్తుజ్ఞానము కలుగును. అటుపై యావస్తువును గ్రహించుటో, విడుచుటో లేక యుపేక్షించుటయో కలుగును. కాబట్టి యింద్రియము ప్రమాణమైనపుడు వస్తుజ్ఞానము ఫలమగును. వస్తుజ్ఞానము ప్రమాణమైనపుడు గ్రహణ త్యాగోపేక్షా బుద్ధులు ఫలమగును.

తరువాత అనుమాన ప్రమాణము:—

"తత్పూర్వకం త్రివిధ మనుమానం; పూర్వవత్
శేషవత్ సామాన్యతోదృష్టంచ" ౧. ౧. ౫.

ఈ సూత్రమున పూర్వ సూత్రమునుండి 'జ్ఞానమ్' అను శబ్దము అనువర్తించును.

తత్ పూర్వకం = తత్ అనగా ప్రత్యక్షము. ఇట్టి అనుమానమునకు కారణభూతమగు లింగదర్శనము, లింగ లింగి సంబంధ దర్శనము గ్రహింపబడును. కాబట్టి లింగ ప్రత్యక్షము, లింగ లింగి సంబంధ ప్రత్యక్షము కారణముగా గల లింగిజ్ఞానము అనుమానమ్ = అనుమానమనబడును. త్రివిధమ్=ఆ యనుమానము ముివ్విధములు. పూర్వవత్, శేషవత్, సామాన్యతో దృష్టంచ=పూర్వవత్తు, శేషవత్తు, సామాన్యతో దృష్టము అని.

పూర్వవత్ =పూర్వవత్తు. పూర్వమన కారణము. కారణజ్ఞానము ద్వారా కార్యజ్ఞానము కలిగిన నది పూర్వ వత్తనబడును. ఉదాహరణము: – మేఘోన్నతిని జూచి వర్షించునని తెలిసికొనుట. లేక పూర్వవత్ అను నీ పదమున మతుప్ప్రత్యయము నెంచక 'వత్' ప్రత్యయముగా గ్రహించిన పూర్వవత్ =పూర్వమన కారణము. పూర్వవత్ = ఏ కార్యకారణములకు గల వ్యాప్తి పూర్వము గ్రహింపబడినదో—అనగా ప్రత్యక్షజ్ఞానము కలిగినదో అట్టి కారణ జ్ఞానమువలన నటువంటి కార్యము—సాధ్యము తెలియబడిన నది పూర్వవత్తు అనబడును. ఉదాహరణము:- ధూమమును జూచి వహ్ని నెఱుంగుట.

సాధారణముగా మనము మహానసమున (వంటయింట) ధూమమును, అగ్నిని, వాని సంబంధమును జూతుము. తరువాత

నెటనేని ధూమము కానవచ్చిన ధూమాగ్నులకు గల సంబంధము స్మరణకు వచ్చును. అటుపై ధూమమున్నచోట వహ్నియుండునని తెలిసికొందుము ఇది యనుమాన ప్రకారము.

శేషవత్ = శేషము అనగా కార్యము. కార్యజ్ఞానము వలన కారణజ్ఞానము కలిగిన నది శేషవదనుమాన మన బడును. ఉదా:- నదియందు క్రొత్తగావచ్చిన మలిన జలముతో కూడిన వేగవంతమగు ప్రవాహమును జూచి యెటనో వర్షించియుండునని తెలిసికొనుట.

శేషవత్ = పరిశేషము పరిశేషమన, (ప్రసక్తప్రతిషేధే అన్యత్రాప్రసంగాత్ శిష్యమాణే సంప్రత్యయః పరిశేషః) ప్రసక్తిగలచోట నిషేధింపబడి మఱి యితరత్ర - ప్రసక్తిలేక మిగిలి యున్నదానియందు ప్రసక్తమగుట - సంబద్ధమగుట. ఉదాహరణము:- శబ్దము పృథివ్యాద్యష్టద్రవ్యము లందనాశ్రితమై, ద్రవ్యాశ్రితమగుటచే శిష్టద్రవ్యమగు నాకాశము ఆశ్రయముగా గలదని తెలిసికొనుట. దీనికి పరిశేషానుమానమనియు పేరు గలదు.

సామాన్యతోదృష్టం = లింగ లింగి సంబంధము ప్రత్యక్షము కానిచోట్ల ఒకానొకవస్తువునందు లింగ సాదృశ్యముండుటవలన తద్ద్వారా లింగి తెలియబడును. అనగా అప్రత్యక్ష వస్తువెందు తెలియబడును. లింగ సాదృశ్యము వలన నెఱుగుట యని భావము. ఉదా:- ఇచ్ఛ, ద్వేషము,

రాగము మున్నగు గుణములద్వారా ఆత్మ తెలియబడుట. ఇచ్ఛా-రాగ-ద్వేషాదులు రూప రస గంధాదులవలె గుణములు. అవి యొకానొక ద్రవ్యము నాశ్రయించి యుండును. ఈ యిచ్ఛాదుల కాశ్రయమగు పదార్థము ఆత్మ.

లింగము, సాధనము, హేతువు, కారణము నను పదము లిట హేతుపర్యాయములుగా వాడబడును. కార్యము, సాధ్యము, లింగి యను పదములు సాధ్యసమానార్థకములు. సాధన సాధ్య సాహచర్యము, లేక లింగముతో లింగికిగల నియత సంబంధము వ్యాప్తి యనబడును. వ్యాప్తిబోధ కలుగని పక్షమున ననుమితి కలుగనేరదు. ధూమ మున్నచోట అగ్ని తప్పక యుండునన్న జ్ఞానము లేనివానికి ధూమము కనిపించినను అట నగ్ని యుండునని వాడు తెలిసికొనజాలడు.

ఈ వ్యాప్తియు మూడు రకములు. విశేషవ్యాప్తి. సామాన్యవ్యాప్తి. వ్యతిరేక వ్యాప్తి. ధూమహేతుక వహ్ని సాధ్యమైనపుడు 'ఎట ధూమమో అట వహ్ని' యను ధూమాగ్నుల సంబంధము విశేషవ్యాప్తి. శబ్దహేతుక గగనము సాధ్యమైనపుడు-'ఏది గుణమో అది ద్రవ్యాశ్రితము (యో గుణః స ద్రవ్యాశ్రయః) అను గుణత్వ ద్రవ్యత్వములనెడు సామాన్యముల సంబంధము సామాన్య వ్యాప్తి- గంధవత్వహేతుక పృథివీతర భేదము సాధ్యమైనపుడు- 'ఎక్కడ ఇతరభేదము లేదో అక్కడ గంధవత్వాభావము' అను అభావమూలక సంబంధము వ్యతిరేక వ్యాప్తి (అనబడును.)

ఇట్లు పూర్వవత్తు, శేషవత్తు, సామాన్యతోదృష్టము నను నీ ముత్త్రివిధము లయిన యనుమానములకు క్రమముగా విశేషవ్యాప్తి – సామాన్యవ్యాప్తి – వ్యతిరేకవ్యాప్తి యను మూడు వ్యాప్తులు మూలములు–జనకములు అని భావము.

అటుపై నుపమానము:—

"ప్రసిద్ధ సాధర్మ్యాత్ సాధ్య సాధన ముపమానమ్"

౧. ౧. ౬.

ప్రసిద్ధసాధర్మ్యాత్ =పూర్వము బాగుగా నెఱిగిన గోవు మున్నగు వస్తువుల సాదృశ్యమువలన సాధ్య సాధనమ్=సాధ్యమగు గవయ పద వాచ్యపదార్థమును సాధించుట– తెలిసికొనుట ఉపమానమ్=ఉపమాన మనబడును

ఒక పురవాసి గోవు అన నేమో యెఱిగినవాడై యరణ్యమున నందు గవయ నామక జంతువు నెఱుగగోరి గవయ మెట్లుండునని యొక యాటవికుని నడుగు ననుకొనుడు. ఆ యాటవికుడు 'గవయము గోవువలెనుండు' నని చెప్పె ననుకొనుడు. అనంతర మొకప్పు డా నాగరికుడు అరణ్యము నకు వెళ్ళి యట నకస్మాత్తుగా ఎదుటబడిన గవయమును చూచి, గవయము గోవువలె నుండునను ఆటవికుని వాక్యము స్మరించును. వెంటనే తన యెదుట ప్రత్యక్షమయిన జంతువు గవయపద వాచ్యమని యెఱుగును. ఇట్లు 'గవయము' అను సంజ్ఞకు, గవయపదార్థమునకు(సంజ్ఞికి) గల సంబంధజ్ఞానము దేనివలన కలుగునో అదియే యుపమాన ప్రమాణమని సూత్ర తాత్పర్యము.

సంజ్ఞా సంజ్ఞి సంబంధజ్ఞాన ముపమానమని భావము.
అనంతరము శబ్ద ప్రమాణము:—

"ఆప్తోపదేశః శబ్దః" ౧. ౧. ౭.

ఆప్తోపదేశః=ఆప్త వాక్యము శబ్దః = శబ్దప్రమాణము. ఆప్తః= యథార్థవక్త - లేక - ఆప్తిః=అర్థావ్యభిచారిత్వము దానితో ప్రవర్తించు నవి ఆప్తను ఉపదేశము=వాక్యము, కాబట్టి ఆప్తోపదేశమనగా అర్థ మును వీడని వాక్యమని భావము.

ఆ శబ్దప్రమాణ విభాగము:—

"స ద్వివిధో దృష్టాదృష్టార్థ త్వాత్" ౧.౧.౮.

సః=ఆ శబ్దప్రమాణము ద్వివిధః=రెండు విధములు. దృష్టా దృష్టార్థత్వాత్ =దృష్టార్థము, అదృష్టార్థము అని. ప్రవక్త - (వాక్య ప్రయోక్త) ద్వారా చూడబడిన అర్థము (విషయము — ప్రయోజనము) గలది దృష్టార్థము. ఏ ప్రయోజనము ప్రవక్తకు ప్రత్యక్షమువలన గాక శబ్దము వలనగానీ, అనుమానమువలనగానీ తెలియనగునో యది యదృ ష్టార్థము.

సర్వద్రష్టయగు నీశ్వరుని ప్రోక్తము దృష్టార్థము. ఋషి ముని ప్రోక్తము అదృష్టార్థము.

ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము; అథర్వ వేదము నను నాలుగు వేదములు నీశ్వరప్రోక్తములు. స్వతః ప్రమాణములు.

ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వ వేదము, అర్థవేదము నను నాలుగు ఉపవేదములు, ఐతరేయ శతపథ

గోపథ తాండ్య బ్రాహ్మణములు, ఐతరేయ తైత్తిరీయా రణ్యకములు, కేనాదిదశోపనిషత్తులు, శిక్ష, కల్పము, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము నను షడంగములు, వైశేషికము, న్యాయము, సాంఖ్య యోగములు, పూర్వోత్తర మీమాంసలు నను ఉపాంగములు, మన్వాది ధర్మశాస్త్రములు, రామాయణము, మహాభారతాది జీవన చరితేతిహాసములు ఋషి ముని ప్రణీతములు. ఇవి పరతఃప్రమాణములు. వేదానుకూలము గాని వప్రమాణములని భావము. వేద ప్రతిపాదిత విషయములకు విరుద్ధములయిన తావులందు వీని ప్రామాణ్యము విజ్ఞులచే నంగీకరింప బడదు. ఇట్టి శాస్త్రములందు పలుతావుల వర్ణింపబడినది.

దృష్టాదృష్టార్థమన ఇహమున జూడబడిన యర్థము గలది దృష్టార్థమనియు, పరమున జూడబడిన యర్థము గలది యదృష్టార్థ మనియు కొందఱు వ్యాఖ్యానము చేయుదురు.

పై ప్రమాణములచే తెలియదగిన ప్రమేయము. తద్విభాగము:—

"ఆత్మ శరీ రేంద్రి యార్థ బుద్ధి మనః ప్రవృత్తి దోష ప్రేత్యభావ ఫల దుఃఖాపవర్గాస్తు ప్రమేయమ్"

౧.౧.౯.

ఆత్మ, శరీరము, ఇంద్రియములు, అర్థములు, బుద్ధి, మనస్సు, ప్రవృత్తి, దోషములు, ప్రేత్యభావము, ఫలము, దుఃఖము, అపవర్గము నను నీ పండ్రెండును ప్రమేయ పదముచే వ్యవహరింపబడును.

ప్రమేయమన ప్రమాణ విషయమని సామాన్యముగా తెలియనగును. కాని సూత్రమునందలి 'తు' శబ్ద ప్రయోగమువలన ఆత్మాది పదార్థములు కేవలము ప్రమాణ విషయరూపముననే గ్రహింపబడక వీని సమ్యక్ జ్ఞానమువలన మోక్ష ప్రాప్తియు కలుగగలదని గ్రహింపనగును.

ఆత్మ=సుఖ దుఃఖముల భోగించు జీవుడు, శరీరము= భోగాయతనము—సుఖ దుఃఖానుభవమునకు నిలయము, ఇంద్రియములు=భోగసాధనములు, అర్థములు=భుజింపదగు— అనుభవింపదగు విషయములు, బుద్ధి=భోగము, మనస్సు= సర్వమును గ్రహింప యోగ్యతగల అంతఃకరణము, ప్రవృత్తి= ధర్మాధర్మములు, దోషములు=ప్రవృత్తి, రాగద్వేషములును, ప్రేత్యభావము=పునర్జన్మము, ఫలము=సాధన సహిత సుఖదుఃఖముల ఉపభోగము, దుఃఖము=అనుభవించుట కనుకూలముగాక కష్టము గలిగించునది, అపవర్గము=దుఃఖ నివృత్తిపూర్వకమగు నానందోపభోగము. ఆత్మాది పదముల కీ యర్థముననే యీ శాస్త్రమున గ్రహింపవలయునని వివేకము. ఉపర్యుక్త పదార్థముల తత్వజ్ఞానమువలన మోక్షము, మిథ్యాజ్ఞానమువలన సంసారము నేర్పడునని భావము.

ప్రమేయమున ప్రథమోద్దిష్ట ఆత్మ స్వరూప నిరూపణః—

"ఇచ్ఛా ద్వేష ప్రయత్న సుఖ దుఃఖ జ్ఞానా
న్యాత్మనో లింగమ్" ౧.౧.౧౦.

ఇచ్ఛాద్వేషప్రయత్న సుఖదుఃఖజ్ఞానాని=ఇచ్ఛ (కోరిక), ద్వేషము, ప్రయత్నము, సుఖము, దుఃఖము, జ్ఞానము నను నీ యారును ఆత్మనః= ఆత్మయున్నదనుటకు, లింగమ్=ప్రమాణము – హేతువు.

ఇచ్ఛాదిగుణములు ఆత్మయునికికి ప్రమాణము. ఆత్మ ప్రత్యక్షప్రమాణములగు నింద్రియములచే గ్రహింపబడ కున్నను, ఇచ్ఛాదిగుణముల కాశ్రయరూపమున, ననుమాన విషయము కాగలదని సూత్రాభిప్రాయము.

ఇచ్ఛ, సుఖము, దుఃఖము మున్నగునవి గుణములు. అవి యొకానొక ద్రవ్యము నాశ్రయించి యుండును. పృథివ్యాది పదార్థములు గంధాది గుణముల కాశ్రయములుగాని సుఖాదులకు కావు. సుఖాదుల కాశ్రయమగు ద్రవ్యము ఆత్మ యని యూహింపనగును.

తనకొఱకుగానీ, పరులకొఱకు గానీ యొకానొక పదార్థము కావలయునని కోరుట ఇచ్ఛ యనబడును. ఏ వస్తువు లభించుటవలన నాత్మ సుఖము ననుభవించునో యట్టి వస్తువును మరల నభిలషించుట లోకవిదితము. ఈ యభిలాష–ఇచ్ఛ శరీరమునకు భిన్నముగా ఆత్మ యను నొక పదార్థ ముండినప్పుడే కలుగగలదు. పూర్వ మొకప్పుడు తా ననుభవించిన పదార్థమువంటి పదార్థము తనకు లభించినపు డా వస్తువు పూర్వవస్తు సదృశమగుటచే నిదియు తనకు సుఖము గలిగింపగలదను జ్ఞానము ఆత్మ లేకున్న కలుగనేరబోదని భావము. ఇట్లే ద్వేష ప్రయత్నాదులు నాత్మ సాధకము లని యెఱుగునది.

పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము నను నైదును భూతపద వాచ్యములు.

బాహ్యేంద్రియముచే గ్రహింపదగు విశేషగుణము నకు సమవాయి యై యుండుటయే భూతలక్షణము.

"గంధ రస రూప స్పర్శ శబ్దాః పృథివ్యాది గుణాః తదర్థాః" ౧.౧.౧౪.

పృథివ్యాది గుణాః = పృథివి మున్నగు భూతముల విశేషగుణ ములు గంధ రస రూప స్పర్శ శబ్దములని చెప్పబడును. తదర్థాః =(ఇట తచ్ఛబ్దమున కర్థము బాహ్యేంద్రియములని గ్రహింపవలయును) కాబట్టి ఆ బాహ్యేంద్రియములకు అర్థములు, అనగా విషయములగు పదార్థములు అర్థములని చెప్పబడును.

వైశేషిక దర్శనమున 'అర్థ' పదము ద్రవ్యగుణ కర్మ లకు వాచకముగా నెంచబడినది (అర్థ ఇతి ద్రవ్యగుణ కర్మసు ౮. ౨. 3 వై). అట్లుగాక యీ న్యాయశాస్త్రమున అర్థ పదము విషయపదపర్యాయమని గ్రహింపవలయును.

అనంతరము బుద్ధి లక్షణము:—

"బుద్ధి రుపలబ్ధిర్ జ్ఞాన మిత్యనర్థాంతరమ్" ౧.౧.౧౫.

బుద్ధిః (బోధ), ఉపలబ్ధిః (ఉపలంభము), జ్ఞానమ్ (జ్ఞప్తి, జ్ఞానము) ఇత్యనర్థాంతరమ్=ఈ మూడు పదములు నీ శాస్త్రమున పర్యాయ పద ములుగా నెంచబడును.

శాస్త్రాంతరమున బుద్ధి వృత్తిని జ్ఞానమనియు, ఆత్మ వృత్తిని ఉపలబ్ధి యనియు వాడుదురు. ఆ వ్యవహారమిా

శాస్త్రమున కనభిమతమని సూచించుటకు బుద్ధి, ఉపలబ్ధి, జ్ఞానము పర్యాయములని వర్ణింపబడినది.

మనోలక్షణమును వర్ణించుటకు ముందు తన్నిరూపక హేతు వర్ణనః—

"యుగపత్ జ్ఞానా నుత్పత్తిర్మనసోలింగమ్" ౧.౧.౧౬.

యుగపత్ జ్ఞానానుత్పత్తిః=ఆత్మ, ఇంద్రియములు, అర్థములు పరస్పర మొకదానితో నొకటి సంబద్ధములైయున్నను ఆయా వస్తువుల జ్ఞాన మొక్కసారిగా కలుగకపోవుట, మనసః=మనస్సు కలదనుటకు లింగమ్=హేతువు–ప్రమాణమని సూత్రార్థము.

బాహ్యవస్తువులతో నింద్రియములకు, నాయింద్రియములతో నాత్మకు సంబంధము కలిగినను ఒక్కమాటుగా రూప రస స్పర్శాదిజ్ఞానములు కలుగవు. క్రమముగా కలుగును. ఒక వ్యక్తి అగ్నిజ్వాలకు సమీపమున కూర్చుండి జిలేబి తినుచున్నాడనుకొనుడు. ఆవ్యక్తియాత్మతో చక్షు. రసన త్వగింద్రియములకు సంసర్గమున్నదికదా! అతని యింద్రియములలో–సమీపమున నున్న అగ్నిజ్వాల యందలి యుష్ణతతో త్వగింద్రియమునకును, జిలేబి తినుచున్నాడు కనుక జిలేబిలోని మెఱుపు రంగుతో చక్షువునకును, తద్గత రసముతో రసనేంద్రియమునకును సంసర్గము కలదు. అట్టి యెడ ఒకే క్షణమున రంగు, రుచి, ఉష్ణత వీని జ్ఞాన మొక్కసారి కలుగవలయును. లోకానుభవమున నట్లు కలుగక ఒకక్షణమున రూపజ్ఞానము, మరియొక క్షణమున రసజ్ఞానము, వేరొక క్షణమున నుష్ణజ్ఞానము కలుగుచుండుట

మన మెఱుఁగుదుము. దీనినిబట్టి ఆత్మేంద్రియములకు మధ్య ఒక క్షణమున నొకేయింద్రియముతో సంసర్గమును కల్పించి యొకే జ్ఞానము కలుగునట్లు చేయు మఱియొక సాధనముండవలయు నని తెలుపుచున్నది. ఆ సాధనమునే మనస్సందురు.

ప్రవృత్తి లక్షణము:—

“ప్రవృత్తి ర్వాగ్బుద్ధి శరీరారంభ ఇతి” ౧. ౧. ౧౭.

వాక్ బుద్ధి శరీరారంభః=వాక్కు, మనస్సు, శరీరము వీని వ్యాపారము, ప్రవృత్తిః=ప్రవృత్తి యనబడును.

ఈ సూత్రమున బుద్ధిపదము మనస్సునకును, ఆరంభము, వ్యాపారము—చేష్టకును బోధకములు.

వాఙ్మనః శరీరములద్వారా ప్రతివ్యక్తియు ప్రవర్తించును. ఈ ప్రవృత్తి ద్వివిధమని శాస్త్రముల వర్ణింపబడినది. ఇది పుణ్యపాప శబ్దములచే పేర్కొనబడును.

శరీరముద్వారా, పరిత్రాణము (రక్షణ), పరిచరణము (సేవ), దానము చేయబడును. వాగింద్రియముద్వారా సత్యము, హితము, ప్రియము, స్వాధ్యాయము నొనర్పబడును. మనస్సుద్వారా దయ, అస్పృహ, శ్రద్ధయు నను ప్రవృత్తి కలుగుచు. ఈ దశవిధప్రవృత్తి పుణ్య శబ్దమున పేర్కొనబడును.

శరీరముద్వారా హింస, స్తేయము (చౌర్యము), ప్రతిషిద్ధమైథునము (వ్యభిచారము), వాణిద్వారా అనృ

తము, పరుషము, సూచన (చాడీలు చెప్పుట), అసంబద్ధముల నాడుట, మనస్సు ద్వారా పరద్రోహము, పరద్రవ్యాభీప్స, నాస్తిక్యము నను దశవిధములగు ప్రవృత్తి కలుగును. దీనిని పాప ప్రవృత్తి యందురు.

ఇట్లు కాయిక, వాచిక, మానసిక పుణ్యపాపాత్మక కర్మ ప్రవృత్తి యనబడునని సూత్రాభిప్రాయము.

దోషలక్షణము:—

"ప్రవర్తనా లక్షణా దోషాః" ౧. ౧. ౧౮.

ప్రవర్తనా లక్షణాః=ప్రవర్తన—పురుషుని ధర్మాధర్మ కర్మలందు ప్రవర్తింపజేయు లక్షణము—గలవి, దోషాః=దోషము లనబడును. ఆ దోషము లెవ్వియన, రాగ ద్వేష మోహములు.

రాగము, ద్వేషము ననునవి మోహమువలన జనించును. మోహసమన్వితము లయిన రాగద్వేషములచే ప్రేరితుడై మనుజుడు పుణ్యపాప కర్మలందు ప్రవర్తించును.

ప్రేత్యభావ లక్షణము:—

"పునరుత్పత్తిః ప్రేత్యభావః" ౧. ౧. ౧౯.

పునరుత్పత్తిః=మరణించి—పూర్వ శరీరమును విడిచి మరల జనించుట—మరియొక శరీరమును పొందుట, ప్రేత్యభావః = ప్రేత్యభావ మనబడును.

ప్రేత్య = మరణించి, భావః = జనించుట, పూర్వము సంబద్ధమైన దేహేంద్రియాది సంఘాతమును విడిచి మఱియొక దేహేంద్రియాది సంఘాతముతో సంబద్ధమగుటకు

ప్రేత్యభావమని పేరు. ఈ సూత్రమున 'పునరుత్పత్తి' యని పునఃశబ్దప్రయోగముచే సూత్రకారుడు సంసార మనాది యని సూచించియున్నాడు. జీవునకు శరీరాది సంబంధ మనాది, యపవర్గాంత మని శాస్త్రకారుల దృష్టి.

ఫల లక్షణము:—

"ప్రవృత్తి దోషజనితోఽర్థః ఫలమ్" ౧ ౧. ౨౦.

ప్రవృత్తి దోష జనితః=పూర్వ సూత్రముల వర్ణింపబడిన ప్రవృత్తి దోషములవలన కలిగిన, అర్థః=అర్థము, ఫలమ్=ఫలమనబడును

సుఖదుఃఖోప భోగము ఫలమనబడును. పైన వర్ణింప బడిన ప్రవృత్తి - కర్మ సుఖదుఃఖ ఫలమును కలిగించును. ఇట్టి సుఖ దుఃఖములు దేహేంద్రియాదులద్వారా అనుభవింప వీల గును. దేహమే లేకున్న సుఖముగానీ, దుఃఖముగానీ జీవు డనుభవింప జాలడు.

సుఖ దుఃఖరూప ఫలము ప్రవృత్తి జనితమై యుండ సూత్రమున దోషపదమును గ్రహించి సూత్రకారుడు దోష ములుకూడ ఫలమునకు హేతువులని సూచించి యున్నాడు.

("సతి మూలే జాత్యాయు ర్భోగాః" ౨. ౧౩.) అని యోగ దర్శనమున జన్మ, ఆయువు, భోగము కర్మఫల ములుగా వర్ణింప బడినవి.

దుఃఖ లక్షణము:—

"బాధనా లక్షణం దుఃఖ మితి" ౧. ౧. ౨౧.

బాధనాలక్షణం = బాధ (తాపము–పీడ) లక్షణముగా గలది, దుఃఖమ్ = దుఃఖమని సూత్రార్థము.

అనుభవించుటకేది యనుకూలముగానుండదో, అనగా పీడ కలిగించునో అదిదుఃఖము. శరీరాదులు పీడాయుక్తము లగుటచే నవియు దుఃఖపదవాచ్యములే యగును. ఇట్లు ప్రపంచ మున బహుభాగము దుఃఖభూయిష్ఠముగా జూచి దుఃఖమును విడువనెంచు జనుడు జన్మయే దుఃఖ కారణమని యెంచి నిర్విణ్ణుడగును. ఆ నిర్వేదము విరక్తికి కారణమగును. క్రమ ముగా నతడు దుఃఖమునుండి ముక్తుడగును.

అపవర్గ లక్షణము:-

"తదత్యన్తవిమోక్షోఽపవర్గః" ౧. ౧. ౨౨.

నిఃశ్రేయసము, కైవల్యము, ముక్తి, అపవర్గము ఇవి పర్యాయ పదములు. తదత్యన్త విమోక్షః = జీవున కుపర్యుక్త జన్మరూప దుఃఖము నుండి పూర్ణవిముక్తి, అపవర్గః = అపవర్గమనబడును.

పూర్వసూత్రమున వర్ణింపబడిన జన్మాదిరూప దుఃఖమునుండి జీవునకు కలుగు అన్తరహిత విముక్తి - వియోగము అపవర్గమని సూత్రాభిప్రాయము.

దేహమే యాత్మగా భావించి యతిరిక్తాత్మ నంగీక రింపని చార్వాకాదులు మృత్యువే మోక్షమందురు. బౌద్ధు లలో శూన్యవాదులయిన మాధ్యమికులు ఆత్మోచ్ఛేదమే మోక్షమందురు. యోగాచారప్రభృతులు భావనా బలము వలన దుఃఖవాసనలు - దుఃఖజనక సంస్కారములు నశింపగా

విశుద్ధ విజ్ఞాన సంతతి యుదయించుటయే మోక్షమందురు. జైనులు ఆవరణము తొలగుటయే మోక్షమందురు. 'అహం బ్రహ్మాస్మి' 'అయమాత్మా బ్రహ్మ' ఇత్యాది మహావాక్య విచారణమున అఖండవృత్తి యేర్పడుననియు, దానివలన నవిద్య తొలగుననియు, అటుపై జీవునకు సచ్చిదానం దాత్మక స్వస్వరూపాధిగమము కలుగుననియు, నదియే మోక్షమనియు, మాయావాదులగు శాంకరులు నుడువు దురు. జగత్కర్తృత్వము తప్ప మిగిలిన సర్వజ్ఞత్వాది సమస్త కల్యాణగుణప్రాప్తి పూర్వకమగు వాసుదేవ యూధాత్మ్యాను భవము మోక్షమని రామానుజీయులలో విశిష్టాద్వైతులు వాదిం తురు. జగత్కర్తృత్వము, లక్ష్మీపతిత్వము, శ్రీవత్సము మొ దలగు భగవంతుని జ్ఞానాయత్త దుఃఖరహిత పూర్ణసుఖము మోక్షమని మాధ్వులు పలుకుదురు. ద్విభుజధారియగు కృష్ణునితోకూడి గోలోకమున తదంశభూతులగు జీవుల లీలానుభవము మోక్షమని శుద్ధాద్వైత వాదులగు వల్లభీ యుల మతము. ఇంద్రియాదుల నియంత్రణద్వారా గౌణ దుఃఖమును, ఆత్మాది పదార్థతత్వజ్ఞానముద్వారా జన్మాది రూప ముఖ్యదుఃఖమును బోనాడి చిత్స్వరూపమగు స్వాత్మతో బ్రహ్మానందము ననుభవించుటయే మోక్షమని వేదవాదులగు గోతమ ప్రభృతి మహర్షుల దర్శనము.

పైసూత్రమున సూత్రకారుడు దుఃఖాత్యంత నివృత్తి మోక్షమని సూత్రించినను, దుఃఖనివృత్తిపూర్వక బ్రహ్మా నందానుభవమే మోక్షమని మహర్షి యభిప్రాయము. వైది

కులు తత్త్వజ్ఞానము ద్వారా దుఃఖనివృత్తి నొనరించి బ్రహ్మానందము నుపభోగించుటయే మోక్షమని యంగీకరించిరి. బ్రహ్మానందానుభవము దుఃఖనివృత్తి యనంతరమే కలుగును దుఃఖనివృత్తి యత్నసాధ్యము. తదనంతరమున బ్రహ్మానందప్రాప్తి అయత్న సిద్ధమగుటచే సూత్రమున దుఃఖనివృత్తినె ప్రధానముగ సూత్రకారుడు నిర్దేశించి యున్నాడని వివేకము.

ఇట్లు ప్రమేయ లక్షణ మొనరించి యనంతర ప్రాప్త సంశయ లక్షణమును సూత్రించుచున్నాడు.

"సమానానేక ధర్మోపపత్తే ర్విప్రతిపత్తే రుపలబ్ధ్యనుప
లబ్ధ్యవ్యవస్థాతశ్చ విశేషాపేక్షో విమర్శః సంశయః"
౧. ౧. ౨౩.

సమానానేకధర్మోపపత్తేః=(సమాన ధర్మమనగా సాధారణ ధర్మము అనేకధర్మమన అసాధారణ ధర్మము) ఇట్లు సాధారణాసాధారణ ధర్మములు లభించుటవలన అనగా సాధారణాసాధారణ ధర్మములతో కూడిన యొకానొక వ్యక్తి ప్రత్యక్షమగుటవలన, విప్రతిపత్తేః= విరుద్ధకోటిద్వయజ్ఞానముపస్థితమగుటచే, ఉపలబ్ధ్యనుపలబ్ధ్యవ్యవస్థాతః= ఏకతరకోటిని నిశ్చయింపగల విశేషధర్మ మొకట లభించి మరియొకట లభింపకుండుటచే కలుగు నవ్యవస్థవలన, విశేషాపేక్షః = సామాన్య విశేషస్మృతిపూర్వకమగు, విమర్శః=ఒకే వ్యక్తియందు విరుద్ధ నానా ధర్మములను బోధించునట్టి యీవస్తువేమగునా యను జ్ఞానము సంశయః= సంశయ మనబడును.

ఈ సూత్రమున, విమర్శః సంశయః = విమర్శము సంశయము అనునది సంశయ సామాన్య లక్షణము. అందు

సంశయము లక్ష్యము; విమర్శము లక్షణము. ఒక వస్తువు నందు విరుద్ధ నానాధర్మములను తెలియజేయు జ్ఞానము విమర్శ మనబడును.

సూత్రమున మిగిలిన పదములు మూడును విశేష లక్షణములను దెలియజేయునని వార్తికకారుల మతము.

(౧) 'సమాన ధర్మోపపత్తేరుపలబ్ధ్యనుపలబ్ధ్యో వ్యవస్థాతో విశేషాపేక్షో విమర్శః సంశయః' అనునదొక లక్షణము.

(౨) 'అనేక ధర్మోపపత్తే రుపలబ్ధ్యనుపలబ్ధ్యో వ్యవస్థాతో విశేషాపేక్షో విమర్శః సంశయః' అనునది రెండవ లక్షణము.

(3) 'విప్రతిపత్తేరుపలబ్ధ్యనుపలబ్ధ్యో ర్వ్యవస్థాతో విశేషాపేక్షో విమర్శః సంశయః' అనునది మూడవ లక్షణము.

(౧) సమాన ధర్మోపపత్తేః = స్థాణువా పురుషుడా యను రెండు కోటులందు నుండు సమానధర్మమగు నున్నతత్వాది గుణములు లభించుట వలన, అనగా నెదుట కనిపించు నొకపదార్థమునందు నున్నతత్వము గోచరమయి (కనబడి), ఉపలబ్ధ్యనుపలబ్ధ్యవ్యవస్థాతః = వక్రకోటరాది విశేషధర్మము స్థాణువు నందుపలబ్ధమై పురుషునందుపలబ్ధము కాకుండుట వలన, ఇట్లే శిరఃపాణ్యాది విశేషధర్మము పురుషునందు కనపడి స్థాణువు నందు కనపడకపోవుట వలన, విశేషాపేక్షః = స్థాణుత్వ పురుషత్వరూప జాతి విశేషము నభిలషించు, విమర్శః = స్థాణువా? పురుషుడా? అను జ్ఞానము, సంశయః = సంశయ మనబడును.

(౨) అనేక ధర్మోపపత్తేః = (అనేక ధర్మమనగా నసాధారణ ధర్మము - విశేష ధర్మము) శ్రావణత్వాది విశేష ధర్మయుక్తమగు శబ్ద

ప్రత్యక్షమువలన, ఉపలబ్ధ్యనుపలబ్ధ్యవ్యవస్థాతః = విభాగజన్య విశేష ధర్మము శబ్దమునందుండి ద్రవ్యమునందు లేకుండుటచే, విశేషాపేక్షః = గుణత్వ, ద్రవ్యత్వాది సామాన్య విశేషము నపేక్షించు, విమర్శః = శబ్దముగుణమా, ద్రవ్యమా లేక కర్మయా యనుజ్ఞానము, సంశయః = సంశయ మనబడును.

(౩) విప్రతిపత్తేః = ఆత్మ కలదని కొందరు, ఆత్మ లేదని కొందరు పలుకుట వలన కలుగు విరుద్ధ జ్ఞానమువలన, ఉపలబ్ధ్యనుపలబ్ధ్యవ్యవస్థాతః = ఆత్మాస్తిత్వ, నాస్తిత్వముల నిశ్చయించు ప్రామాణికత - అప్రామాణికతల, వ్యవస్థ యేర్పడ కుండుటచే, విశేషాపేక్షః = అస్తిత్వ నాస్తిత్వరూప సామాన్య విశేషస్మృతి పూర్వకమగు విమర్శః = ఆత్మ (అస్తి - నాస్తి) కలదాలేదా యనువిరుద్ధ నానా కోటిక జ్ఞానము, సంశయః = సంశయ మనబడును.

భాష్యకారుడు (వాత్స్యాయనుడు) మాత్రము సంశయమునకు కారణ మైదువిధములని వర్ణించియున్నాడు. అది యెట్లన. (౧) సమానధర్మోపపత్తి, (౨) విశేష ధర్మోపపత్తి, (౩) విప్రతిపత్తి (౪) ఉపలబ్ధ్యవ్యవస్థ, (౫) అనుపలబ్ధ్యవ్యవస్థ. ఇందు సమాన ధర్మోపపత్తి, విశేష ధర్మోపపత్తి, విప్రతిపత్తి యను మూటికి నుదాహరణములు పైన వర్ణింపబడినవి. మిగిలిన రెంటికి నుదాహరణము లిట్లు భావింపవలయును.

(౧) ఉపలబ్ధ్యవ్యవస్థః—ఉపలబ్ధి యనగా జ్ఞానము. దాని యవ్యవస్థ. ఒక పదార్థమునకు సంబంధించిన జ్ఞానము రెండు విధముల కలుగును. ఆ పదార్థ మున్నను జ్ఞానము కలుగును. లేకున్నను కలుగును. అది యెట్లన, చెఱువునం దుదక ముండును. దానిని చూచినపుడు చెఱువున జలమున్న

దని జ్ఞానము కలుగును. ఎండమావులలో జలము లేకున్నను అట జలము కలదను జ్ఞానము కలుగును. ఇట్లొక వస్తు వుండియు లేకుండియు జ్ఞానము కలుగుటచే, వస్తువున్నపుడే జ్ఞానము కలుగును; లేకున్న కలుగదను వ్యవస్థ లేకుండుట వలన (ఉపలబ్ధ్యవ్యవస్థవలన) ఒకానొక జ్ఞాన విషయమున నా జ్ఞానము వస్తువుండుటచే కలుగుచున్నదా? లేక వస్తువు లేకుండుటచే కలుగుచున్నదా? యను సంశయము కలుగును.

(౨) అనుపలబ్ధ్యవ్యవస్థః— అనుపలబ్ధి యన జ్ఞానాభావము. దాని యవ్యవస్థ. ఇదియు రెండు విధముల కలుగును. వస్తువున్నప్పుడు; లేకున్నపుడు. తరుమూలముల జలముండియు తెలియబడదు. వస్తువు లేకున్న తెలియబడకుండుట సహజమే. ఇట్లొకచో జ్ఞాన మొక వస్తువు విషయమున కలుగకున్న నట వస్తువుండి జ్ఞానము కలుగదా? లేక కలుగదా? యని సంశయము వొడమును.

ఇట్లు భాష్యకారుడు సంశయ కారణ మైదువిధములుగా భాష్యమున వర్ణించియున్నాడు.

ప్రయోజన లక్షణము:—

"యమర్థమధికృత్య ప్రవర్తతే తత్ప్రయోజనమ్"

౧. ౧. ౨౪.

యమ్ అర్థమ్ = ఏయే విషయమును, అధికృత్య = ఉద్దేశించి, ప్రవర్తతే = వ్యక్తి ప్రవర్తించునో, తత్ = ఆ సర్వమును, ప్రయోజనమ్ = ప్రయోజనమని చెప్పబడును.

పురుషుడు ప్రేరితుడై దేనికొఱకు యత్నించునో యది ప్రయోజనమని సూత్రాభిప్రాయము.

సూత్రమునగల 'అర్థ' పదము, ద్రవ్యగుణ కర్మాది వస్తువులను తెలుపదు. అర్థమన అర్థింపబడునది–కోరబడునది–ప్రవృత్తికి హేతువు (ప్రయుజ్యతే అనేన) పురుషుడు దేనిచే ప్రయోగింపబడునో అది ప్రయోజనమని వివేకము.

దృష్టాంత లక్షణము:—

"లౌకిక పరీక్షకాణాం యస్మిన్నర్థే బుద్ధి సామ్యం సదృష్టాంతః" ౧. ౧ ౨౫.

లౌకిక పరీక్షకాణామ్ = సహజముగాగాని, విద్యాభ్యాసము ద్వారాగాని విశేషబుద్ధిని సంపాదింపనివారు లౌకికులు. సంపాదించిన వారు పరీక్షకులు. వీరిరువురికి అనగా వాది ప్రతివాదులకు, యస్మిన్నర్థే = ఏవిషయమున, బుద్ధిసామ్యం = (లౌకికుల జ్ఞానమునకు) భిన్నముగాని జ్ఞానము అనగా సమానజ్ఞానము కలుగునో సదృష్టాంతః = అది దృష్టాంత మనబడును.

వాది ప్రతివాదులు (లౌకికులు, పరీక్షకులు లేక పండిత పామరులు) ఎందు విరోధింపరో అది దృష్టాంత మనబడును.

సిద్ధాంత లక్షణము:—

"తంత్రాధికరణాభ్యుపగమ సంస్థితిః సిద్ధాంతః"

౧. ౧. ౨౬.

తంత్రాధి......సంస్థితిః = తంత్రమనగా శాస్త్రము, అధికరణము = ఆధారము–ఆశ్రయము, అభ్యుపగమః = స్వీకారము సంస్థితిః = సంశయ రహితస్థితి, ఇట్లు ప్రమాణభూతమగు శాస్త్రాధా

రముచే చేయుస్వీకార (ము యొక్క) నిశ్చితస్థితి, సిద్ధాంతః = సిద్ధాంత మనబడును. సంక్షేపమున శాస్త్రార్థసంస్థితి సిద్ధాంత మనబడును. ప్రామాణికముగా నంగీకరింప బడినది సిద్ధాంతమని తాత్పర్యము.

సిద్ధాంత విభాగము:— శాస్త్రభేదమువలన సిద్ధాంతము చతుర్విధము.

"సర్వతంత్ర ప్రతితంత్రాధికరణాభ్యుపగమ సంస్థిత్యర్థాంతర భావాత్" ౧. ౧. ౨౭.

శాస్త్రములు భిన్నము లగుటచే వాని సంస్థితియు భిన్నమగును. వాది ప్రతివాదుల సంస్థితి యొకేవిధము కానేరదు గదా! అందువలన సిద్ధాంతము సైతము సర్వతంత్ర సిద్ధాంతము, ప్రతితంత్రసిద్ధాంతము, అధికరణసిద్ధాంతము, అభ్యుపగమసిద్ధాంతము నని నాలుగు విధములు.

వానిలో సర్వతంత్రము:—

"సర్వతంత్రావిరుద్ధః తంత్రేఽధికృతోఽర్థః సర్వతంత్రసిద్ధాంతః" ౧. ౧. ౨౮.

అర్థః = ఏవిషయము, తంత్రే = స్వశాస్త్రమున, అధికృతః = ఉపదేశింపబడి, సర్వతంత్రావిరుద్ధః = ఇతర శాస్త్రములచే విరోధింపబడదో, ఆవిషయము, సర్వతంత్రసిద్ధాంతః =సర్వతంత్రసిద్ధాంతమనబడును.

వాది ప్రతివాదు లేవిషయమున విప్రతిపన్నులు కారో, యే విషయమును ప్రామాణికముగా నుభయులు నంగీకరింతురో అది సర్వతంత్ర సిద్ధాంతమని సూత్రాభిప్రాయము.

ఘ్రాణాదు లింద్రియములనుట సర్వతంత్రసిద్ధాంతము. ఇట్లే గంధాదులు విషయములు (ఇంద్రియార్థములు) అనుట. ప్రమాణములచేతనే అర్థజ్ఞానము కలుగుననుటయు.

ప్రతితంత్ర సిద్ధాంతము:—

"సమానతంత్రసిద్ధః పరతంత్రాసిద్ధః ప్రతితంత్ర సిద్ధాంతః" ౧. ౧. ౨౯.

సమాన తంత్రసిద్ధః = తనశాస్త్రమున సిద్ధమై, పరతంత్రాసిద్ధః = ఇతర శాస్త్రమున సిద్ధముకానిది, ప్రతితంత్రసిద్ధాంతః = ప్రతితంత్ర సిద్ధాంత మనబడును

ఒకానొక విషయమొక శాస్త్రమున నంగీకరింపబడి తదితర శాస్త్రము లందంగీకరింప బడకున్న ప్రతితంత్ర సిద్ధాంత మనబడునని సూత్రాశయము.

ఉదాహరణము:— బౌద్ధుల క్షణభంగవాదము వైదికుల జీవేశ్వర ప్రకృతి వాదము.

అధికరణ సిద్ధాంతము:—

"యత్సిద్ధా వన్యప్రకరణసిద్ధిః సోఽధికరణ సిద్ధాంతః" ౧. ౧. ౩౦.

యత్సిద్ధౌ = ప్రమాణముద్వారా కొండొక ప్రకృతార్థము సిద్ధింపగా, అన్యప్రకరణ సిద్ధిః = అనుషంగముగా - అంతర్భాగములుగా - నితర విషయములు సిద్ధించునెడల, సః = అప్రధానార్థము, అధికరణ సిద్ధాంతః = అధికరణ సిద్ధాంత మనబడును.

ఏయర్థము సిద్ధించుటచే కొన్ని యితరార్థములు తదంతర్భావరూపమునసిద్ధించునో ఆయర్థముఅధికరణసిద్ధాంతము.

ములే యని బౌద్ధులు, సాంఖ్యులు, యోగులు, పూర్వోత్తర మీమాంసకులు ప్రతిజ్ఞాహేతూదాహరణములు మూడే యవ యవములని యంగీకరింతురు. గౌతమ వైశేషికులుమాత్రము ప్రతిజ్ఞాది పంచావయవముల నంగీకరింతురు.

ప్రయోక్త తనకొఱకనుమానమునుప్రయోగించినచో ప్రతిజ్ఞాది అవయవత్రయమే చాలును. అనుమాన ప్రమాణ మున తా దెలిసిన యర్థము నితరులకు బోధించునెడల ప్రతి జ్ఞాది అవయవపంచకము నావశ్యకమగును.

పర్వతముపై కనబడు ధూమమునుజూచి, ఆపర్వత మున నగ్నియున్నది. అని యొకడు ప్రతిజ్ఞచేసిన, ప్రతిపత్త (వినువ్యక్తి) హేతువు నపేక్షించును. అపుడు ప్రయోక్త పర్వతముపై ధూమము కనపడుచుండుటవలన—అని హేతువు ప్రయోగించును. ధూమమున్నంతమాత్రమున నటనగ్నియున్న దనుటకు ప్రమాణమేమని ప్రతిపత్త ప్రమాణము నపేక్షిం చిన, ధూమ మున్నయెడల వహ్ని (అగ్ని) యున్నదనుటకు మహానసము (వంటయిల్లు) ప్రమాణమని దృష్టాంతము చెప్పును. ఇట్లుదాహరణమును జెప్పి హేతువును సమన్వ యించుటకు, మహానసమున ధూమమున్నచో వహ్ని యున్నట్లు పర్వతమునను వహ్నియుండునని యుపనయించును. కాబట్టి యెదుటనున్న ధూమయుక్తపర్వతము కూడ వహ్నిమంతమని నిగమనము చేయుట యవసరమగును.*

---

* కొండయం దగ్ని గలదు; పొగయుండుటవలన; వంట యింట నెట్లో; నట్లే నిదియు; కావున నీ కొండయందగ్నిగలదు.

సంస్కృతమున (అయం పర్వతో వహ్నిమాన్, ధూమాత్, యథామహానసః, తథా చాయమ్, తస్మాత్తథా యం పర్వతోవహ్నిమాన్,) అని అనుమాన వాక్య ప్రయోగము.

కొందఱీగ్రైదుగాక, జిజ్ఞాస, సంశయము, శక్యప్రాప్తి, ప్రయోజనము, సంశయవ్యుదాసము నని మఱియు నైదు కలిపి పది యవయవము లందురు. వీనిని అర్థసిద్ధికి సాధనములు కావని భాష్యకారుడు నిరాకరించియున్నాడు. నిరాకరణ క్రమమిట గ్రంథ విస్తరభీతితో వర్ణింపనైతి.

ప్రతిజ్ఞా లక్షణము:—

"సాధ్యనిర్దేశః ప్రతిజ్ఞా" ౧. ౧. 33.

సాధ్యనిర్దేశః = సాధింపదగిన ధర్మయుక్త ధర్మి – సాధ్యమనబడును. దాని నిర్దేశము = అభిధాయకశబ్దము, ప్రతిజ్ఞా = ప్రతిజ్ఞ యనబడును.

సాధనీయ ధర్మయుక్తధర్మిని బోధించు శబ్దసమూహము ప్రతిజ్ఞ యనబడునని సూత్రాభిప్రాయము.

నవీన నైయాయికులు "సాధ్యతావచ్ఛేద కావచ్ఛిన్న సాధ్యప్రకారక, పక్షతావచ్ఛేదకావచ్ఛిన్న పక్షవిశేష్యక బోధజనకః శబ్దః ప్రతిజ్ఞా" అని వాక్రుత్తురు.

ఉదా:— (౧) పర్వతము వహ్నిమంతము. (౨) శబ్దము అనిత్యము. ఇందు ప్రథమోదాహరణమున వహ్ని సాధనీయధర్మము. తద్యుక్తపర్వతము ధర్మి. ద్వితీయమున అనిత్యత్వము సాధనీయధర్మము. తద్యుక్త ధర్మి శబ్దము.

నవీనుల లక్షణ సమన్వయము:— సాధ్యతావచ్ఛేదకము వహ్నిత్వము· తదవచ్ఛిన్నసాధ్యము వహ్ని· తత్ప్రకారకము అనగా అదివిశేషణముగా గలిగి, పక్షతావచ్ఛేదకము పర్వతత్వము· తదవచ్ఛిన్నపక్షము పర్వతము· తద్విశేష్యకము – అనగా పర్వతము విశేష్యముగాగల బోధ = జ్ఞానము – పర్వతము వహ్నిమంతమను జ్ఞానము – తజ్జనకశబ్దః = ఆజ్ఞానమును గలిగించు 'పర్వతమువహ్నిమంతము' అనుశబ్దము - ప్రతిజ్ఞయని లక్షణ సమన్వయము - ఇట్లే ద్వితీయము నెఱుగునది.

హేతు లక్షణము:—

"ఉదాహరణసాధర్మ్యాత్ సాధ్యసాధనం హేతుః"
౧. ౧. 3౪.

ఉదాహరణము = దృష్టాంతము, సాధర్మ్యము = సమానధర్మము. ఉదాహరణసాధర్మ్యాత్ = దృష్టాంత సామ్యమువలన, సాధ్య సాధనమ్ = సాధనీయ ధర్మవిశిష్ట ధర్మి దేనివలన సిద్ధించునో దానిని బోధించు శబ్దము, హేతుః = హేతువనబడును.

సందిగ్ధ సాధ్యము (సాధనీయ వస్తువు) నకు అధికరణము = ఆధారము (సాధ్యమెందు సాధింప బడునో అది) పక్షమనబడును. సాధ్యమెట నిశ్చితముగా తెలియబడునో అది సపక్ష మనబడును. సపక్షము, ఉదాహరణము ఇవి సమానార్థకములు. ఉదాహరణమున సాధ్య సాధనములకుగల నియత సంబంధము (వ్యాప్తి) గృహీతమై యుండును. పూర్వమే గ్రహింపబడియుండునని భావము.

ఉదాహరణసామ్యముచే పురస్కరించుకొని పక్షమున సాధ్యమును సాధించునది హేతువు.

ఉదాహరణము:— (౧) ధూమము కలదగుట వలన (౨) ఉత్పత్తిధర్మము కలదగుట వలన.

మహానసమున, ధూమవహ్నులకు గల నిత్యసంబంధము ఎల్లరచే గ్రహింపబడును. ధూమమున్నచోట వహ్ని తప్పక ఉండుననను (యత్రధూమః తత్రవహ్నిః) నది వాని సంబంధము. ఇదియే అన్వయవ్యాప్తి యనబడును. మహానసమున ధూమము ధర్మముగా గ్రహింపబడి (మహానసము ధూమవంతము) పర్వతమున తత్సామ్యముచే సాధ్యమగు వహ్నిని సాధించును. ఇట్లే ద్వితీయహేతువును గ్రహించునది.

హేతువులు రెండువిధములు. అన్వయి హేతువు. వ్యతిరేకి హేతువు. పైసూత్రమున అన్వయి హేతువును వర్ణించి యిందు వ్యతిరేకి హేతు లక్షణము వర్ణించుచున్నాడు.

"తథా వైధర్మ్యాత్" ౧. ౧. 3౫.

తథా = ఉదాహరణసామ్యమువలన సాధ్యసాధనము హేతువైనట్లు, వైధర్మ్యాత్ = ఉదాహరణవైధర్మ్యము వలన సాధ్య సాధనము వ్యతిరేకి హేతువు అని సూత్రార్థము.

ఉదాహరణము:—శబ్దము అనిత్యము; ఉత్పత్తిధర్మము కలదగుట వలన; అనుత్పత్తి ధర్మవంతమగు ఆత్మాది పదార్థము నిత్యమగుటచే, ఉత్పత్తిధర్మము దానికి విరుద్ధమగుట వలన శబ్దము అనిత్యమని తేలుచున్నది.

ఉదాహరణ స్థలమున వ్యతిరేకవ్యాప్తి గ్రహింపబడి పక్షమున సాధ్యమును సాధించునది వ్యతిరేకి హేతువని సూత్రాభిప్రాయము.

సాధారణముగ హేతువు పంచమ్యంతమో లేక తృతీయాంతమో వాడబడును.

ఉదాహరణ లక్షణములు:—

"సాధ్య సాధర్మ్యాత్తద్ధర్మ భావీ దృష్టాంతః ఉదాహరణమ్." ౧. ౧. ౩౬.

సాధ్య సాధర్మ్యాత్ = సాధనీయధర్మ విశిష్టధర్మి సాధ్యము (పక్షము) అనబడును. సాధర్మ్యము = సమాన ధర్మత, సాధ్యధర్మమగు హేతురూపధర్మము కలదగుటవలన, తద్ధర్మభావీ = హేతువుకంటె భిన్నమగు సాధ్యరూప ధర్మమును భావింపజేయునట్టి - దృష్టాంతః = దృష్టాంతము, ఉదాహరణమ్ = ఉదాహరణ మనబడును.

ఏ దృష్టాంతమున హేతురూప ధర్మముండుట వలన, సాధ్యరూప ధర్మము నుండునో ఆదృష్టాంతమును బోధించు శబ్దము ఉదాహరణ మనబడును.

ఉదాహరణము :— పర్వతము వహ్నిమంతము; ధూమము కలదగుట వలన; మహానసమువలె. అనుస్థలమున, పర్వతము సాధ్యము (పక్షము) దాని ధర్మము వహ్నియు ధూమమును. అట్టి వహ్నిధూమ రూపధర్మములు మహానసమునను గలవు. అందువలన పర్వతమునకు మహానసము సమానధర్మి. కాబట్టి అది పక్షమున సాధ్యరూప =

వహ్నిరూప ధర్మమును బోధింప (భావింప) జేయగలదు. ఇట్లు మహానసము ఉదాహరణము.

ధూమమున్నతావున వహ్ని తప్పక యుండుననువ్యాప్తిని గ్రహింపజేయుచు ధూమవంతము వహ్నిమంత మే; మహానసమువలె—నను బోధను కల్పించి మహానసము ఉదాహరణముగా వ్యవహరింపబడునని సూత్రాభిప్రాయము.

మఱియొక ఉదాహరణ లక్షణము:—

"తద్విపర్యయా ద్వా విపరీతమ్." ౧. ౧. ౩౭.

తద్విపర్యయాత్ వా = సాధ్యవైధర్మ్యమువలన, పక్షమునగల సాధ్యరూప ధర్మమునకు విరుద్ధమగు సాధ్యాభావరూప ధర్మాశ్రయమగుటవలన, విపరీతమ్ = హేతురూప ధర్మముకంటె భిన్నమగు సాధ్యరూప ధర్మమును బోధింపక దానియభావమును భావింపజేయు దృష్టాంతము సైతము ఉదాహరణ మనబడును. దీనిని వ్యతిరేక ఉదాహరణ మనియు నందురు.

ఉదాహరణము :— శబ్దము అనిత్యము; ఉత్పత్తి ధర్మము కలదగుటవలన. అను నీ స్థలమున ఘటము అన్వయ దృష్టాంతము. ఆత్మాదులు వ్యతిరేకి దృష్టాంతములు.

ఉత్పత్తిధర్మమునకు వ్యతిరేకము అనుత్పత్తిధర్మము. అనుత్పత్తి ధర్మకము నిత్యము; ఆత్మవలె. శబ్దము ఆత్మవలె అనుత్పత్తి ధర్మము కలది కాకుండుటవలన నిత్యమును కాదు—అని సూత్రాభిప్రాయము.

ఉపనయము:—

"ఉదాహరణాపేక్ష స్తథేత్యుపసంహారో న తథేతివా సాధ్యస్యోపనయః." ౧. ౧. ౩౮.

ఉదాహరణాపేక్షః = దృష్టాంత బలముచే, తథా ఇతి నతథేతి వా సాధ్యస్య ఉపసంహారః = అట్లేయనిగానీ, లేక, అట్లుకాదు అనిగానీ సాధ్యము నుపసంహరించుట-సాధ్యమును సిద్ధింపజేసి ముగించుట- ఉపనయః = ఉపనయ మనబడును.

ఉదాహరణము:— శబ్దము అనిత్యము; ఉత్పత్తి ధర్మము కలదగుటవలన; ఘటమువలె; ఆత్మాదివలె కాక పోవుటచే; అట్లే శబ్దము. ఘటమును దృష్టాంతముగా గొని దాని సామ్యమువలన ఉత్పత్తిధర్మకమగుటచే శబ్ద మనిత్యము, ఘటమువలె, అనియు, ఆత్మాదిని దృష్టాంతముగా తీసికొని ఆత్మాదివలె అనుత్పత్తి ధర్మకము కాకుండుటచే ఆత్మాది వలె నిత్యముగాక యనిత్యమనియు చెప్పుట యుపనయ మన బడునని భావము.

నిగమన లక్షణము:—

"హేత్వపదేశాత్ ప్రతిజ్ఞాయాః పునర్వచనం నిగ మనమ్." ౧. ౧. ౩౯,

హేత్వపదేశాత్ = హేతువ్యపదేశము వలన, ప్రతిజ్ఞాయాః = ప్రతిజ్ఞా విషయమగు నర్థమును, పునర్వచనమ్ = కాబట్టి యిదియునట్లే యని మరల చెప్పుట, నిగమనమ్ = నిగమన మనబడును.

ఉదాహరణబలమున హేతువునందు వ్యాప్తి జ్ఞానము కలిగించి యట్టి హేతువునకు పక్షముతో సంబంధమును జూపి, వ్యాప్తి విశిష్టపక్షధర్మము కలదగుటవలన ప్రతిజ్ఞాత సాధ్యమును అట్లే యని చెప్పుట నిగమన మనబడును.

ఉదాహరణములు:—

సాధర్మ్యహేతువు:— (ప్ర) శబ్దము అనిత్యము. (హే) ఉత్పత్తిధర్మము కలదగుటవలన. (ఉదా) ఉత్పత్తి ధర్మక ఘట పటాదులు అనిత్యములు. (ఉపనయము) అట్లే (ఘటపటాదులవలె) శబ్దము అనిత్య ధర్మకము. (నిగమనము) కాబట్టి (ఉత్పత్తిధర్మము కలదగుటవలన) శబ్దమనిత్యము.

వైధర్మ్యహేతువు:—(ప్ర) శబ్దము అనిత్యము. (హే) ఉత్పత్తిధర్మక మగుటవలన. (ఉ) అనుత్పత్తి ధర్మకమగు ఆత్మాది నిత్యము. (ఉప) అట్లు (ఆత్మాదివలె) శబ్దమనుత్పత్తి ధర్మకము కాదు. (ని) కాబట్టి (ఉత్పత్తి ధర్మము కలదగుట వలన) శబ్దము అనిత్యము.

తర్కలక్షణము:—

"అవిజ్ఞాత తత్త్వేఽర్థే కారణోపపత్తిత స్తత్త్వజ్ఞానార్థమూహ స్తర్కః" ౧. ౧. ౪౦

అవిజ్ఞాత తత్త్వే = తెలియబడని తత్త్వము (స్వరూపము) గల, అర్థే = పదార్థవిషయమున, కారణోపపత్తితః = తత్త్వమును తెలుపు సాధనము లభించుట వలన, తత్త్వజ్ఞానార్థమ్ = తత్త్వజ్ఞానము కొఱకు చేయబడు, ఊహః = ఈ కారణమున నిదియిట్లే కావలసి యుండుననుకల్పన (జ్ఞానవిశేషము) తర్కః = తర్కమనబడును

ఏ పదార్థము (తత్త్వతః) సరిగా నెఱుగబడదో దానిని తెలిసికొన కోరిక (జిజ్ఞాస) కలుగును. ఇట్లు తా తెలిసికొన గోరినవస్తువు విషయమున, ఈ వస్తు వెట్టిది? ఇది యిట్లా లేక

అట్లా? యని విమర్శించును. విమర్శించి యెట్టిదని నిర్ణయించుటకు కారణము (ప్రమాణము) లభించునో అట్టిదిగా నిర్ణయించును.

ఉదాహరణము:— జ్ఞాతవ్య విషయము నెఱుగ గోరునట్టి యీ జ్ఞాత (పురుషుడు) ఉత్పత్తి ధర్మియా లేక అనుత్పత్తిధర్మియా? అనునది విమర్శ. ఇట్లు విమర్శింపబడుచు తాత్వికముగా తెలియబడని విషయమున, నేధర్మము నుపపాదింప కారణము లభించునో దాని నంగీకరించును. ఆత్మ నిత్యమా? అనిత్యమా? యని సంశయించి నిత్యమని నిరూపించు ప్రమాణము లభించిన నట్లంగీకరించునని భావము. ఆత్మ యనుత్పత్తి ధర్మకము - నిత్యమగునేని స్వకృత కర్మ ఫలము ననుభవించును. దుఃఖ జన్మ ప్రవృత్తిదోష మిథ్యాజ్ఞానముల ప్రవృత్తివలన సంసారము, నివృత్తివలన నపవర్గము కలుగును. ఆత్మయుత్పత్తి ధర్మకము - అనిత్యము అగునెడల నీ సంసారాపవర్గములు సంభవింపవు. కారణమేమన: ఆత్మ యనిత్యమైన నుత్పన్న సమయమున దేహేంద్రియాదులతో సంబద్ధమగును. ఈ సంబంధము స్వకృత కర్మఫలము కానేరదు. ఉత్పన్న వస్తువు నశించును. కాబట్టి స్వకృత కర్మఫల భోగమును సిద్ధింపదు. ఇట్లు విమర్శించి సకారణ పక్షము నంగీకరించును. ఇట్టి యూహాకే తర్కమని నామము.

నిర్ణయ లక్షణము:—

"విమృశ్య పక్షప్రతిపక్షాభ్యామర్థావధారణం
నిర్ణయః" ౧. ౧. ౪౧.

విమృశ్య=సందేహించి, పక్షప్రతిపక్షాభ్యామ్ =సాధనోపాలంభముల ద్వారా, అర్థావధారణం=వస్తువిషయక నిశ్చయజ్ఞానము, నిర్ణయః= నిర్ణయ మనబడును

ఇట 'పక్ష ప్రతిపక్ష' శబ్దములు ఒకేయధికరణము (వస్తువు) న నుండు రెండు పరస్పర విరుద్ధ ధర్మములను తెలుపును. పక్షశబ్దము సాధనబోధకము. ప్రతిపక్ష శబ్దము ఉపాలంభబోధకము. ఉపాలంభము = పరపక్షదూషణ.

ఎదుట కనబడు నొకవస్తువును గురించి యిది పురుషుడా? లేక స్థాణువా యని సందేహించి, పురుషుడైన పక్షమున పురుషత్వ సాధక హస్తపాదాదులును, లేక స్థాణువైన స్థాణుత్వ బోధక వక్రకోటరాదులు నుండవలయునని ఏకతర పక్షసాధనము, అన్యతర పక్షప్రతిషేధము నొనరించి స్థాణువనియో, లేక పురుషుడనియో నిర్ణయము జరుగును.

(ప్రథమాధ్యాయమున ఆద్యాహ్నికము.)

న్యాయదర్శనము

ప్రథమాధ్యాయము

(ద్వితీయాహ్నికము)

వాదలక్షణము:—

"ప్రమాణతర్క-సాధనోపాలంభః, సిద్ధాంతావిరుద్ధః, పంచావయవోపపన్నః పక్ష ప్రతిపక్షపరిగ్రహో వాదః" ౧. ౨. ౧.

ప్రమాణతర్కసాధనోపాలంభః = ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా, వానికనుకూలించు తర్కములద్వారాను, తనపక్షమును సాధించుచు పరపక్షమును నిషేధించు నట్టిదియు, సిద్ధాంతావిరుద్ధః = సిద్ధాంత పదార్థమును విరోధింప నట్టిదియు, పంచావయవోపపన్నః = ప్రతిజ్ఞాది పంచావయవముల ప్రయోగములు గలదియు, పక్షప్రతిపక్ష పరిగ్రహః = వాది ప్రతివాదులచే "ఆత్మకలదు - ఆత్మలేదు" అనునిట్టి పక్ష ప్రతిపక్షములు కలదియునగు కథావిశేషము (చర్చ) వాదః = వాదమనబడును.

అనేకు లొకచోఁగూడి విషయమును విచారించుచు జేయు వాక్యరచన 'కథ' యనబడును. ఆకథయు వాదము, జల్పము, వితండ, యని ముప్విధములు. అందు, స్వపక్ష సాధనము పరపక్షప్రతిషేధము ననునీరెండును ప్రత్యక్షాది ప్రమాణములతోను వాని కనుకూలించు తర్కములతోను చేయబడుచు, ఆ తర్కములు తామంగీకరించిన శాస్త్రమునకు విరుద్ధములు కానివైయుండి, అవసరమని తోఁచినయెడల ప్రయోగించు న్యాయవాక్యములు ప్రతిజ్ఞాదిపంచావయవములతో కూడియున్న పక్షమున నట్టి కథకు వాదమనిపేరు.

అనధిగత తత్త్వావబోధము (తనకింత వరకు తెలియని యొకానొక తత్త్వము నెఱుంగుట), సంశయ నివృత్తి, అధ్యవసితాభ్యనుజ్ఞానము (నిశ్చితార్థము నంగీకరించుట) యను నీ మూడుఫలముల నభిలషించు నొక శిష్యుడు తనగురువుతో గానీ, తోడి బ్రహ్మచారులతోగానీ చేయుచర్చ (కథావిశేషము) - వార్తాలాపము, తత్త్వనిర్ణయమే ఫలముగా గలదైన పక్షమున వాద మనబడును ఇందొకరినొకరు జయించుట కానీ, ఓడించుటకానీ యుండ నేరదు.

జల్ప లక్షణము:—

"యథోక్తోపపన్నశ్ఛలజాతినిగ్రహస్థానసాధనోపాలంభో జల్పః" ౧. ౨. ౨.

యథోక్తోపపన్నః = పూర్వము చెప్పిన వాదలక్షణముతో కూడినదై, ఛల......సాధనోపాలంభః = ఛలము, జాతి, నిగ్రహస్థానము వీని ద్వారా స్వపక్షమును స్థాపించుటయు, పరపక్షమును నిషేధించుటయు గల కథావిశేషము - వార్తాలాపము, జల్పః = జల్పమనబడును.

ఇందు వాది ప్రతివాదులు తమతమ పక్షమును సాధింతురు. ఇతరుల పక్షమును ఖండింతురు - ప్రతిషేధింతురు. తమపక్షమును సాధించుటలోను ఇతర పక్షమును ఖండించుట లోను వీలైనట్లు ప్రత్యక్షాది ప్రమాణములు, తర్కములు, ఛలము, జాతి, నిగ్రహస్థానములు వీనినన్నిటిని ప్రయోగింతురు. ఇట్టి వాక్య సమూహమే జల్ప మనబడును. ఈ జల్పమున వాదమునందు ప్రయోగింపనట్టి ఛలము, జాతి, నిగ్రహస్థానములు ప్రయోగింపబడును.

ఛలజాతి నిగ్రహస్థానము లననేమో ముందుజెప్ప బడును.

వితండాలక్షణము:—

"స ప్రతిపక్షస్థాపనాహీనో వితండా." ౧. ౨. 3.

ప్రతిపక్షస్థాపనాహీనః=ప్రతివాదిచేస్వీకరింప బడిన పక్షము ప్రతి పక్ష మనబడును దానిని ప్రమాణాదుల ద్వారా సాధించుట స్థాపనయన బడును అట్టిసాధన రహితమైన, సః = ఆ జల్పము, వితండా = వితండ యనబడును.

పూర్వసూత్రమున వర్ణింపబడిన జల్పలక్షణమే ప్రతి పక్షస్థాపన లేనిదైవాదిని జయించు బుద్ధితో నడుపబడిన వార్తాలాపము గలదగుచో వితండ యనబడును. ప్రతివాది తన సిద్ధాంతమును స్థాపింపక వాదిసిద్ధాంతమును ప్రమాణ తర్క ఛల జాతి నిగ్రహస్థానముల ద్వారా ఖండింప నెంచిన వితండ యనబడునని సూత్రాభిప్రాయము. మఱియుసంక్షేప ముగ జెప్పిన, స్వపక్షమును స్థాపింపక పరపక్షమునుఖండించు టయే ఫలముగాగల వార్తాలాపము(కథావిశేషము) వితండ యనబడును.

హేత్వాభాసములు:—

"సవ్యభిచార విరుద్ధ ప్రకరణసమ సాధ్యసమ
కాలాతీతాః హేత్వాభాసాః" ౧. ౨. ౪.

హేత్వాభాసాః=హేతులక్షణము లేకుండి హేతువులవలె తోచు నవి. పక్షసత్వము, సపక్షసత్వము, విపక్షాసత్వము, అబాధితత్వము, అసత్ ప్రతిపక్షితత్వము నను నైదును హేతులక్షణము. ఇట్టి లక్షణము

లేక పంచమ్యంతాది సామాన్యలక్షణము కలిగియుండుటచే హేతువు వలె తోచునవి హేత్వాభాసములనబడును.

ఆహేత్వాభాసములు సవ్యభిచారము, విరుద్ధము, ప్రకరణసమము, సాధ్యసమము, కాలాతీతము నని యైదు విధములు.

ఇందు ప్రకరణసమమునకు సత్ప్రతిపక్షమనియు, సాధ్యసమమునకు అసిద్ధమనియు, కాలాతీతమునకు బాధిత మనియు నామాంతరములు గలవు.

వానిలో సవ్యభిచారము:—

"అనైకాంతికః సవ్యభిచారః" ౧ ౨. ౫.

అనైకాంతికః = (ఒకచో నియతముగా నుండునది ఏకాంతికము. దానికి విపరీతముగానుండునది అనైకాంతికము.) అనియతముగా నుండు నది, సవ్యభిచారః = సవ్యభిచార మనబడును.

ఏవస్తువు (సాధ్యము) సాధింపబడుచున్నదో అదియొక యంతము. దానియభావము రెండవయంతము. ఇట్లు సాధ్య ముండుచోటు నొకయంతముగను, సాధ్యము లేనిచోటు నొక యంతముగను మనమూహింపవచ్చును. దీనినే సంస్కృత మున సాధ్యవంతము సాధ్యాభావవంతము నని చెప్పవచ్చును. ఇట్టి రెంటిలో నొకదానియందు నియతముగా నుండని హేతువు అనైకాంతికము-సవ్యభిచార మనబడును.

ఏ హేతువు సాధ్యమున్నచోట (సాధ్యవతి) నుండి సాధ్యాభావమున్నచోటను (సాధ్యాభావవతి) నుండునో

ఆహేతువు సవ్యభిచార హేత్వాభాస మనబడునని సూత్రాభి ప్రాయము.

ఒకచోట వ్యవస్థితము కాకుండుట వ్యభిచార మన బడును. వ్యభిచారముతో కూడినది సవ్యభిచారమనబడును.

ఉదాహరణము:—శబ్దము నిత్యము స్పర్శము లేనిదగుట వలన. స్పర్శముగల ఘటపటాదులు అనిత్యములుగా చూడ బడుచున్నవి. స్పర్శము లేకుండుటవలన శబ్దము నిత్యమని సాధింపనెంచి, 'స్పర్శము లేనిదగుటవలన' అను హేతువు నిట గ్రహించిన నదిహేతువుగాక సవ్యభిచార హేత్వాభాస మగును. కారణ మేమన: శబ్దము నిత్యముఅను తావున నిత్య త్వము సాధ్యము; అనిత్యత్వము సాధ్యాభావము. స్పర్శము లేని దగుట వలన నను నీహేతువు సాధ్యాభావముగల - అని త్యమయిన బుద్ధి యందును గలదు. కాబట్టి యిది యహేతువు - హేత్వాభాసము.

విరుద్ధ హేత్వాభాసము:

"సిద్ధాంత మభ్యుపేత్య తద్విరోధీ విరుద్ధః" ౧. ౨. ౬.

సిద్ధాంత మభ్యుపేత్య = సాధనీయధర్మము - సాధ్యము సిద్ధాంత మన బడును. దానినంగీకరించి, తద్విరోధీ = దానిని విరోధించు స్వభావము గల - సాధ్యాభావ స్థలమున నుండుహేతువు, విరుద్ధః = విరుద్ధహేత్వాభాసమనబడును.

ఉదాహరణము:—ఈహ్రదము (మడుగు) వహ్నిమం తము, హ్రదత్వము కలదగుట వలన. ఇకట వహ్ని సాధ్యము. హ్రదత్వము హేతువు. హ్రదత్వము హ్రదమున

నుండును. అక్కడ వహ్ని యుండనేరదు. కాబట్టి యీ హ్రదత్వము సాధ్యాభావ స్థలముననుండి విరుద్ధ హేత్వాభాస మనబడును.

ప్రకరణ సమము:—

"యస్మాత్ప్రకరణ చింతా స నిర్ణయార్థ మపదిష్టః ప్రకరణ సమః" ౧. ౨. ౭.

యస్మాత్ = సమాన బలముగల మరియొక హేతువుచే నిరోధింపబడిన సామర్థ్యముగల యే హేతువు వలన, ప్రకరణచింతా=(సాధ్యాశ్రయమగు పక్షము ప్రకరణ మనబడును. ఆప్రకరణకు సంబంధించినచింత) పక్షము (ప్రకరణము) సాధ్యమున కాశ్రయమా లేక అనాశ్రయమా? యనుజిజ్ఞాస కలుగునో, సః = ఆహేతువు, నిర్ణయార్థమ్ = పక్షము సాధ్యాశ్రయమేయని నిర్ణయించుటకు, అపదిష్టః = ప్రయోగింపబడినచో, ప్రకరణసమః = ప్రకరణసమము - సత్ప్రతిపక్ష హేత్వాభాసమనబడును.

విమర్శ నధికరించు పక్షప్రతిపక్షములు ప్రకరణమని భాష్యకారులు (వాత్స్యాయనుడు).

పక్షమున (సాధ్యవంతమున) సాధ్యనిర్ణయార్థమై ప్రయోగింపబడిన హేతువునకు ప్రతికక్షిగా మఱియొక హేతువున్న పక్షమున ప్రథమ హేతువు సత్ప్రతిపక్ష - ప్రకరణసమ హేత్వాభాస మనబడును.

సాధ్యాభావమును సాధించు హేతువు ప్రతికక్షిగా నే హేతువునకుండునో ఆ హేతువు ప్రకరణసమ హేత్వాభాసము.

ఉదాహరణము :—శబ్దమనిత్యము; నిత్యధర్మము లభింపకుండుటవలన. శబ్దము నిత్యము; అనిత్యధర్మములభింపకుండుటవలన.

ఇందునిత్యధర్మముకానీ, అనిత్యధర్మముకానీ లభింప నందున శబ్దము నిత్యమా? అనిత్యమా ?అనుసంశయముకలుగు చున్నది. నిత్యమో అనిత్యమో నిర్ణయింప జాలనందున నీహేతువులు ప్రకరణ సమము లనబడును.

సాధ్యసమ హేత్వాభాసము:—

"సాధ్యావిశిష్టస్సాధ్యత్వా త్సాధ్యసమః" ౧.౨.౮.

సాధ్యత్వాత్ = సిద్ధముకాకుండుట వలన నేహేతువు, సాధ్యా విశిష్టః= సాధ్యముతో తుల్యమో అది, సాధ్యసమః =సాధ్య సమహేత్వాభాస మనబడును.

ఏ హేతువు (స్వరూపతః)సిద్ధముకాదో అది సాధ్యము వలెనే సిద్ధముచేయదగినదగుటచే సాధ్యసమ మనబడును. దీనినే అసిద్ధహేత్వాభాసమనియు నందురు.

ఉదాహరణము:—తమస్సు(అంధకారము)ద్రవ్యము; గతి గలదగుటవలన. ఇందు గతిగలదగుటవలన అను హేతువు సాధ్యసమము. కారణమేమన, అంధకారము ద్రవ్యమనుట సాధింపదగినవిషయమెట్లో అట్లే అంధకారమున గతి — గమ నము—చలనము నున్నదనుట సాధింపదగినవిషయమే. ఉభయ పక్షమువారును, అంధకారము చలించుననువిషయము సిద్ధమని యంగీకరింపరని భావము.

కాలాతీతము:—

"కాలాత్యయాపదిష్టః కాలాతీతః" ౧.౨.౯.

కాలాత్యయాపదిష్టః = హేతువును ప్రయోగించుకాలము కాల మనబడును. దాని నతిక్రమించి ప్రయోగింపబడు హేతువు, కాలాతీతః= కాలాతీత మనబడును.

ఉదాహరణము:— వహ్ని అనుష్ణము; ద్రవ్యమగుట వలన. శబ్దము నిత్యము; సంయోగవ్యంగ్యమగుటవలన.

ఇట భేరీదండ సంయోగమువలన శబ్దము వ్యంగ్యమగును. సంయోగమువలనకలుగు నీశబ్దము మనము గ్రహించు వేళ సంయోగముండదు. ఆ సంయోగ మంతకుపూర్వమే కలుగును. సంయోగసమయమున మనము శబ్దము గ్రహింపము. అనంతరమున గ్రహింతుము. వ్యంగ్య వ్యంజకములు రెండు నొక్క కాలమున గ్రహింపబడవు.

ఆలోకసంయోగము రూపవ్యంజకము. ఆలోకరూపములు రెండు నొకేసమయమున జూడబడును. శబ్దమట్లు కాదు. కాబట్టి యీ హేతువు కాలాతీతమగును. దీనిని బాధిత హేత్వాభాసమనియు నందురు. అనగా నీహేతువు ప్రత్యక్షాదిప్రమాణముల చే బాధింపబడును. ఇక్కడ జూపబడిన యుదాహరణములలో మొదటి యుదాహరణమున ద్రవ్యమగుటవలన వహ్ని యనుష్ణమనుట ప్రత్యక్ష ప్రమాణ బాధితము.

ఛల లక్షణము:—

"వచనవిఘాతోఽర్థ వికల్పోపపత్త్యా ఛలమ్"

౧. ౨. ౧౦.

అర్థవికల్పోపపత్త్యా = వాదికిష్టమైన (అభిప్రేతమైన) యర్థమునకు విరుద్ధమైన యర్థమును కల్పించుటయే లక్షణముగాగల యుక్తితో, వచన విఘాతః = వాదిచే ప్రయోగింపబడిన వాక్యమును దుష్టమొనర్చుట, ఛలమ్ = ఛలమనబడును.

వాది యే యభిప్రాయమును మనమున నిడుకొని యొక వాక్యమును ప్రయోగించునో ఆ యభిప్రాయమునకు విరుద్ధమైన యర్థము నా వాక్యమునకు కల్పించి యా వాక్యమును వ్యర్థమొనర్చుట ఛలమనబడునని సూత్రాభిప్రాయము.

ఛల విభాగము:—

“తత్ త్రివిధం వాక్ఛలం సామాన్యచ్ఛల ముపచార చ్ఛలంచ” ౧ ౨.౧౧.

తత్ = పైజెప్పిన ఛలము వాక్ఛలము, సామాన్యచ్ఛలము, ఉపచార చ్ఛలము నని మూడు విధములు.

అందు వాక్ఛలము:—

“అవిశేషాభిహితేఽర్థే వక్తురభిప్రాయాదర్థాంతర కల్పనా వాక్ఛలమ్” ౧.౨.౧౨.

అవిశేషాభిహితే = శబ్దశక్తివలన ననేకార్థములనిచ్చు శబ్దము అవిశేష మనబడును. అట్టి శబ్దముచే చెప్పబడిన అర్థే = అర్థమునందు, వక్తుః = వాదికి, అభిప్రాయాత్ =ఇష్టమైన దానికంటె, అర్థాంతర కల్పనా = భిన్నమైన మఱియొక యర్థమును కల్పించుట, వాక్ఛలమ్ = వాక్ఛల మనబడును.

అనేకార్థకమగు నొక శబ్దమును కొండొక యర్థమును తెలుపనుద్దేశించి యొకడు ప్రయోగింప, ప్రయోక్త యభిప్రాయమునకంటె భిన్నార్థము నాశబ్దమునకు కల్పించుట వాక్ఛలమనబడునని సూత్రాభిప్రాయము.

ఉదాహరణము:— “ఇతడు నవకంబలుడు.” అను వాక్యమును ‘ఇతడు క్రొత్త కంబళి కలవాడ’ ను నర్థమును

బోధింపదలచి యొకడు ప్రయోగింప, ఆవాక్యమునకు తొమ్మిది కంబళ్లు కలవాడని యర్థమును కల్పించి ఈ దరిద్రునకు రెండు కంబళ్లైన లేవే తొమ్మిది యెటనుండి వచ్చినవని యాక్షేపించుట వాక్ఛలమగును.

"సంభవతోఽర్థస్యాతిసామాన్యయోగా దసంభూతార్థకల్పనా సామాన్యచ్ఛలమ్. ౧.౨.౧౩.

సంభవతః = సంభావింప వీలగు, అర్థస్య = వాదిచే ప్రయోగింపబడిన వాక్యార్థమునుప్రతిషేధించుట కొఱకు, అతిసామాన్యయోగాత్ = సంభావింప వీలయిన అర్థముకాక సామాన్యధర్మమును పురస్కరించుకొని వీలయినట్టి, అసంభూతార్థ కల్పనా = అసంభవమైనట్టి అర్థమును కల్పించుట, సామాన్య చ్ఛలమ్ = సామాన్యచ్ఛల మనబడును.

ఒక సామాన్యధర్మమును పురస్కరించుకొని వాది తాత్పర్యమునకు విషయమైన యర్థమునకు విరుద్ధార్థమును కల్పించుట సామాన్యచ్ఛలమని సూత్రాభిప్రాయము.

ఉదాహరణము:—దూరమునుండి వచ్చుచున్న శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్యులగు దయానంద భగవత్పాదులను చూచి యొకడు "వీరా! జగద్విఖ్యాతకీర్తులు! అఖిలజనవంద్యులు! దేశాత్మోద్ధారార్థము వైదికధర్మమునుపదేశించు పరివ్రాజకులు!" అని సహచరులతో ననఁదొకరు 'పరివ్రాజకునకు దేశాత్మోద్ధారార్థము వైదికధర్మోపదేష్టృత్వము సంభవమే' యని యనెననుకొనుడు. అంతట నొక ఛలవాది, పరివ్రాజకునకు వైదికధర్మోపదేశము సంభవమేని, కలరుగదా! యెందరోపరివ్రాజకులు నేడు భారతమున.

వారియందును పరివ్రాజకత్వము కలదుగదా? కాని, వారిలో నెందఱు సత్కార్యార్హులు? బకబిడాలవ్రతులై భారత భూమికి భారభూతులై యున్నారే! వారెల్లరు వైదికధర్మోపదేశకులేనా? అని యెదురొక్కనును. ఇక్కడ వాదిచే హేతువుగా నుద్దేశింపబడని పరివ్రాజకత్వసామాన్యమును వైదిక ధర్మోపదేశమునకు హేతువుగాగొని యాక్షేపించుట సామాన్యచ్ఛలమని సూత్రాభిప్రాయము.

ఉపచారచ్ఛలము:—

"ధర్మవికల్పనిర్దేశేఽర్థసద్భావ ప్రతిషేధఉపచారచ్ఛలమ్"
౧. ౨. ౧౪.

ధర్మ వికల్ప నిర్దేశే = (శబ్ద వృత్తులయిన 'శక్తి - లక్షణ' లు ఇక్కడ ధర్మ పదమున వ్యవహరింప బడినవి.) శక్తి - లక్షణా వృత్తులలో నొకదానిచే నిర్దేశింపబడిన శబ్దమున, అర్థసద్భావప్రతిషేధః = రెండవ వృత్తిచే నట్టి యర్థ మాశబ్దమునకు లేదని ఖండించుట, ఉపచారచ్ఛలమ్ = ఉపచారచ్ఛల మనబడును.

శబ్దమున నర్థబోధకవృత్తులు రెండు గలవు. ఒకటి శక్తి. రెండు లక్షణ. ఇందు శక్తి ముఖ్యవృత్తి. లక్షణ గౌణవృత్తి. ఇట్టి రెండు వృత్తులలో నొకదానిని మనస్సున నిడుకొని వాదిచె ప్రయోగింపబడిన శబ్దమునకు మఱియొకదానితో నాయర్థమును కాదనుట ఉపచారచ్ఛలమనబడునని సూత్రాభిప్రాయము.

ఉదాహరణము:—లక్షణావృత్తి నుద్దేశించి "మంచెలు (అరచుచున్నవి) కేకలుపెట్టుచున్నవి" అనియొకడన, శక్తి

వృత్తి ననుసరించి "మంచెలెట్లు కేకలు పెట్టగలవయ్యా? మంచెలమీదనున్న మనుజులు కేకలుపెట్టుచున్నారు కాని", యని ఖండించుట ఉపచారచ్ఛలమగును.

ఇట్లు ఛలము ముత్త్రివిధములని నిరూపించి యంతకంటె నెక్కువ తక్కువకావని ధ్రువపరుప పూర్వపక్షము మొనర్చుచున్నాడు సూత్రకారుడు.

"వాక్ఛలమేవోపచారచ్ఛలం తదవిశేషాత్" ౧.౨.౧౫.

ఉపచారచ్ఛలము, వాక్ఛలమేవ = వాక్ఛలమే. తదవిశేషాత్ = వాక్ఛలముకంటె భిన్నము కాకుండుట వలన

వాక్ఛలమున వాదిచే ప్రయోగింపబడిన శబ్దమున కర్థాంతరము కల్పించి ఖండించునట్లు, ఉపచారచ్ఛలమునను వాదిప్రయోగించుశబ్దమునకు తదభిప్రేతార్థమునకంటె భిన్నార్థము కల్పింపబడును. వాక్ఛలము, ఉపచారచ్ఛలము రెండు వేరుగావు.

ఖండన సూత్రము:—

"న తదర్థాంతరభావాత్." ౧.౨.౧౬.

న = వాక్ఛలము ఉపచారచ్ఛలముకాదు; కారణమేమి? తదర్థాంతర భావాత్ = ఆరెంటిలోను భేదముండుట వలన.

వాక్ఛల - ఉపచారచ్ఛలములలో సామాన్య దృష్టికి భేదము కన్పింపకున్నను వానిలో చాల భేదముకలదు. వాక్ఛలమున శక్తివృత్తిచే బోధింపబడిన అర్థము శక్తివృత్తిచే బోధింపబడిన అర్థాంతరముచే ఖండింపబడును, ఉపచారచ్ఛల

మున శక్తివృత్తిచే బోధింపనెంచిన యర్థము లక్షణావృత్తిచే కల్పితమగు అర్థముచేతను, లక్షణావృత్తిచే బోధింపనెంచిన యర్థము శక్తివృత్తి కల్పితార్థముద్వారాను ఖండింపబడును. కాబట్టి రెండును భిన్నములని సూత్రాభిప్రాయము.

"అవిశేషేవా కించిత్సాధర్మ్యా దేకచ్ఛలప్రసంగః"
౧.౨.౧౭.

వా = మరియు, కించిత్సాధర్మ్యాత్ = ఏ కొంచెపు సమానత వలననో, అవిశేషే = భేదము లేదన్నచో, ఏకచ్ఛల ప్రసంగః = ఒకేఛల మనవలసి వచ్చును.

పైజెప్పిన భేదమతిస్వల్పమనియెంచి వాక్ఛలోపచార చ్ఛలములలో భేదములేదని యెంచినపక్షమున సామాన్య చ్ఛలమునుసైతము భిన్నముగా నెంచక ఒక్కటే ఛలమని యెంచవలసివచ్చును. కాబట్టి యత్కించిద్భేదమును గూడ భేదముగా నెంచి సూత్రకారుడు ఛలము మూడు విధములని వర్ణించియున్నాడు.

జాతి లక్షణము:—

"సాధర్మ్య వైధర్మ్యాభ్యాం ప్రత్యవస్థానం జాతిః"
౧.౨.౧౮.

సాధర్మ్య వైధర్మ్యాభ్యామ్ = సమాన విశేషధర్మముల ద్వారా, ప్రత్యవస్థానమ్ = వాదిస్థాపిత సాధ్యధర్మమును ఖండించుట, జాతిః= జాతి యనబడును.

వాదిచే స్థాపింపబడిన సాధ్యధర్మమును ఖండించుటకు వ్యాప్తిరహితమగు హేతువును గ్రహించుట జాతియనబడును.

నిగ్రహస్థాన లక్షణము:—

"విప్రతిపత్తి రప్రతిపత్తిశ్చ నిగ్రహస్థానమ్," ౧.౨.౧౯

విప్రతిపత్తిః = విరుద్ధ జ్ఞానము, అప్రతిపత్తిః = ఆరంభింపవలసిన యెడ ఆరంభింప కుండుట, (వాది సాధించిన దానిని దూషించుటయో, వాది దూషించిన దానికి సమాధానము చెప్పుటయో ఆరంభ మనబడును. అట్లుచేయకుండుట అనారంభము - అప్రతిపత్తి). నిగ్రహస్థానమ్ = నిగ్రహస్థాన మనబడును.

పరుడు చెప్పినదానిని సరిగాగ్రహింపక విపరీతముగ గ్రహించుటయు, పరుడుస్థాపించిన దానిని ఖండింపకుండుటయు పరాజయమునకు కారణములు. కాబట్టి విప్రతిపత్తి అప్రతిపత్తి యనునవి నిగ్రహస్థానము లనబడును

జాతి నిగ్రహస్థానము లెన్నియన:

"తద్వికల్పాజ్జాతి నిగ్రహస్థాన బహుత్వమ్." ౧.౨.౨౦.

తద్వికల్పాత్ = సాధర్మ్య వైధర్మ్యముల ద్వారా చేయుఖండనముల వలనను, విప్రతిపత్తి అప్రతిపత్తులు అనేకవిధములగుటవలనను, జాతినిగ్రహస్థాన బహుత్వమ్ = జాతి, నిగ్రహస్థానము లనేకవిధములు.

పైజెప్పిన జాతినిగ్రహస్థాన లక్షణములలోగల భేదముల ననుసరించి జాతినిగ్రహస్థానము లనేకవిధములని సూత్రాభిప్రాయము.

న్యాయదర్శనమున ప్రథమాధ్యాయము.

న్యాయ దర్శనము

ద్వితీయాధ్యాయము

(ఆద్యాహ్నికము)

ప్రథమాధ్యాయమున ప్రమాణాది పదార్థములు సామాన్యములతో పేర్కొనబడి వాని లక్షణవిభాగములు చేయబడినవి. ఈ యధ్యాయమున నాయా పదార్థములను క్రమముగా పరీక్షింపదలచి సూత్రకారుడు ముందుగా సంశయమును పరీక్షించుచున్నాడు. పాఠక్రమము ననుసరించి ప్రమాణములను ముందు పరీక్షింపవలసియుండ వానిని విడిచి సంశయమును పరీక్షించుటకు కారణము సంశయింపక విచారణ కలుగకుండుటయే.

పూర్వపక్షము:

"సమానానేకధర్మాధ్యవసాయాదన్యతరధర్మాధ్యవసాయాద్వా న సంశయః" ౨. ౧. ౧.

సమాన.....సాయాత్ = సాధారణ - అసాధారణ ధర్మనిశ్చయ జ్ఞానమువలనగానీ, అన్యతర ధర్మాధ్యవసాయాత్ వా = సాధారణ అసాధారణ ధర్మములలో నొకదాని నిశ్చయజ్ఞానము వలనగానీ, సంశయః = సందేహము, న = కలుగదు.

("సమానానేక...సంశయః" ౧. ౧. ౨౩) అను నీ సూత్రమున చెప్పబడిన సంశయ లక్షణము సరికాదు. సమానానేకధర్మముల గ్రహణమువలనగానీ, అన్యతరధర్మగ్రహణమువలనగానీ ధర్మియందు సంశయము కలుగుననుట

యుక్తముగాదు. ధర్మ ధర్మ్యలు వేరువేరు పదార్థములు గదా! రూపమును చూచినపుడు స్పర్శమందు సందేహము కల్గునా? దేవదత్తునిజూచిన గోవిందునియందు సందేహమెట్లు గల్గును? మఱియు, సమానధర్మాధ్యవసాయమువలన సంశయము కలుగుననుటలో, అధ్యవసాయమన్న నిశ్చయ జ్ఞానము గదా? నిశ్చయజ్ఞానమువలన సంశయజ్ఞాన మెట్లుకల్గును? కార్యకారణములలో సారూప్యమేమియు కనబడదే? కాబట్టి సమానధర్మనిశ్చయజ్ఞానమువలన సంశయము కలుగనేరదు. ఇట్లే అనేక అన్యతర ధర్మముల నిశ్చయజ్ఞానము వలనను సంశయము కలుగనేరదని సూత్రాభిప్రాయము.

"విప్రతిపత్త్యవ్యవస్థాధ్యవసాయాచ్చ" ౨. ౧. ౨.

పూర్వాధ్యాయమున లక్షణసూత్రమున జెప్పిన, విప్రతిపత్తి-అవ్యవస్థల యధ్యవసాయము వలనను సంశయము కలుగ నేరదు.

విప్రతిపత్తిః=విరుద్ధజ్ఞానము - లేక - (ఆత్మఉన్నది- ఆత్మలేదు.) అను నిట్టి విరుద్ధమగు లోకమతము. ఇట్లు లోకమతమును నిశ్చయముగా నెఱిగినందున ఆత్మయందేల సందేహము కలుగును? కలుగజాలదు. ఇట్లే విప్రతిపన్న వస్తువును నిశ్చయింపగల కొండొక ధర్మోపలబ్ధి=ధర్మగ్రహణముఅవ్యవస్థితమైయున్నదనియు, లేక అట్టి ధర్మానుపలబ్ధి-ధర్మాగ్రహణము అవ్యవస్థితమైయున్నదనియు స్పష్టముగా-వేరువేరుగా నెఱిగినవ్యక్తి యేల సందేహించును? దేనివలన నేది జనింపదో అది యద్దానికి కారణమనుట యుక్తముకాదని సూత్రాభిప్రాయము.

విప్రతిపత్తివలన సంశయము కలుగకుండుటకు కారణ మేమనః—

"విప్రతిపత్తౌచ సంప్రతిపత్తేః." ౨.౧.౩.

విప్రతిపత్తౌచ = పూర్వము చెప్పబడిన విప్రతిపత్తియందు, సంప్రతిపత్తేః = వాది ప్రదివాదుల కుభయులకును నిశ్చయజ్ఞాన ముండుట వలన సంశయములేదని సూత్రతాత్పర్యము.

ఆత్మయున్నదని చెప్పు వాడికిగానీ, ఆత్మలేదని చెప్పు ప్రతివాదికిగానీ, వారి ఆత్మాస్తిత్వ—ఆత్మనాస్తిత్వ సిద్ధాంతములందు ఎట్టి సంశయమును లేదు. నిశ్చయమే కలదు. కాబట్టి అట్టియెడ సంశయమునకు తావేది? సంప్రతిపత్తి యన నిశ్చయజ్ఞానము. నిశ్చయము సంశయమునకు కారణ మెట్లు కాగలదు? అసంభవము. నిశ్చయమువలన సంశయము కలుగునెడల కార్యకారణములలో వైరూప్యమేర్పడగలదు.

విప్రతిపత్తివలన సంశయము కలుగకున్న పోనిండు. కాని ఉపలబ్ధ్యనుపలబ్ధ్య వ్యవస్థవలననేల సంశయము కలుగదనః—

"అవ్యవస్థాఽత్మని వ్యవస్థితత్వా చ్చావ్యవస్థాయాః" ౨. ౧. ౪.

అవ్యవస్థాయాః = ఉపలబ్ధ్యనుపలబ్ధిరూప అవ్యవస్థ, అవ్యవస్థాత్మని = తన స్వరూపమున, వ్యవస్థితత్వాత్ చ= వ్యవస్థితము - ప్రతిష్ఠితమైయుండుటవలన, సంశయము కలుగదు.

ఏ యవ్యవస్థ సంశయమునకు కారణముగా చెప్పబడు చున్నదో అది తన స్వరూపమున వ్యవస్థితమైయున్నదా? లేదా? తన స్వరూపమున స్థిరమైయున్న నది సంశయమునకు

కారణమెట్లగును? అవ్యవస్థ తన స్వరూపముననే వ్యవస్థితము గానిపక్షమున స్వరూపరహితమైన యవ్యవస్థ సంశయమునకు కారణ మెవ్విధమునను కాజాలదని సూత్రాభిప్రాయము.

సమానానేకాది ధర్మోపపత్తివలన సంశయము కలుగు చుండుట లోకమున జూచుచున్నామే! కాదందు రేల?యనినః

"తథాఽత్యంతసంశయ స్తద్ధర్మసాతత్యోపపత్తేః"

౨. ౧. ౫.

తథా = సమానధర్మజ్ఞానాదులవలన సంశయము కలుగునెడల, అత్యంత సంశయః = అత్యంత సంశయము కలుగును. సంశయనివృత్తి కలుగుటయే దుర్లభమగును. కారణ మేమనః తద్ధర్మ సాతత్యోపపత్తేః = ఆ సమాన అసమాన ధర్మముల గ్రహణ మెల్లపుడు కలుగుచుండుటవలన.

ఎట్టి ధర్మజ్ఞానమువలన సంశయముకలుగునని చెప్ప బడుచున్నదో ఆధర్మ మా వస్తువునందెల్లపుడు (వస్తువున్నంత కాలము) నుండునుగదా? వస్తు (ధర్మి) వెల్లపుడును ధర్మ గ్రహణపూర్వకముగనే గ్రహింపబడును. కాబట్టి ధర్మిగ్రహణ మున్నంతకాలము ధర్మగ్రహణము నుండును. అట్టియెడ సమా నాదిధర్మగ్రహణము సంశయమునకు కారణమైనచో కారణ మున్నంతకాలము కార్యమయిన సంశయమును కలుగు చుండును. అందుచే సంశయోచ్ఛేద మెన్నడును కలుగ నేరదని సూత్రాభిప్రాయము.

ఉత్తరపక్షముః

"యథోక్తాధ్యవసాయాదేవ తద్విశేషాపేక్షాత్ సంశయే నాసంశయో నాత్యంతసంశయోవా" ౨. ౧ ౬.

తద్విశేషాపేక్షాత్ = దేనియందు సంశయము కలుగుచున్నదో దాని విశేషధర్మ్మముల (స్థాణుత్వ పురుషత్వాదుల) నపేక్షించుట వలన, యథోక్తాధ్యవసాయాదేవ = పూర్వము చెప్పబడిన ఉపలబ్ధ్యనుపలబ్ధ్యవ్యవస్థలతో కూడిన సమాన ధర్మోపపత్త్యాదుల వలననే, సంశయే = సందేహము కలుగుచుండ, నఅసంశయః = సంశయము కలుగకుండుట గానీ, నఅత్యంత సంశయోవా = సంశయ మెన్నటికి దూరము కాకుండుటగానీ లేదు.

సమానధర్మ్మగ్రహణము మాత్రము సంశయమునకు కారణమని చెప్పిన సంశయముకలుగకుండుటగాని అత్యంత సంశయము కలుగుటయో సంభవించును. కాని సంశయ కారణములను జెప్పిన సూత్రమున విశేషధర్మ్మముల నపేక్షించు సమాన ధర్మోపపత్త్యాదులవలన సంశయము గలుగునని చెప్పబడినది. అందువలన నెట్టిదోషమును కలుగదు.

స్థాణువు (నిలబడియున్న కొయ్య) లోను, పురుషుని లోను సమానముగ నుండు ఎత్తు, లావు మున్నగు సమాన గుణములను జూచుచు—వంకర, తొఱ్ఱ, చేతులు, కాళ్లు మున్నగు విశేషగుణము లట కనబడకపోవుటవలన నెదుట కనబడునవస్తువునందు స్థాణువా పురుషుడా యను సంశయము కలుగును. ఇక్కడ విశేషగుణముల యాకాంక్షతో గూడిన సమానగుణముల జ్ఞానము సంశయమునకు కారణము గాని, సమానగుణజ్ఞానముమాత్రము కారణముకాదు. విశేషగుణములు చూడబడగానే సంశయము విడిపోవును. కాబట్టి పూర్వమున జూపబడిన దోషములు నిర్హేతుకములని సూత్రాభిప్రాయము.

"యత్ర సంశయ స్తత్రైవ ముత్తరోత్తర ప్రసంగః"
౨.౧.౭.

యత్ర సంశయః = పరీక్షింపదగిన విషయమునందెటనైనను కలుగు సంశయమును పూర్వపక్షులెవరైన నాక్షేపించిన, తత్ర = ఆస్థలమున, ఏవమ్ = పైసూత్రమున వర్ణించినట్లు, ఉత్తరోత్తర ప్రసంగః=పూర్వపక్షమునకు తరువాత జూపినట్లు సమాధానము చెప్పవలసియుండును.

ముందు వ్రాయబోవు శాస్త్రమున నాయాస్థలములందు జూపబడిన సంశయముల విషయమున నెవరేని పూర్వపక్షమొనర్చిన (ఖండించిన) పైసూత్రమున జెప్పినట్లు సమాధానము చెప్పవలయునని సూత్రాభిప్రాయము.

పరీక్షకు అంగమైన సంశయమును ముందుగా పరీక్షించి యనంతరమున ప్రత్యక్షాదిప్రమాణములను పరీక్షింపదలచి సూత్రమును రచించుచున్నాడు.

పూర్వపక్షము:—

"ప్రత్యక్షాదీనా మప్రామాణ్యం త్రైకాల్యాసిద్ధేః" ౨.౧.౮.

ప్రత్యక్షాదీనామ్= ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద ప్రమాణములలో, అప్రామాణ్యం = ప్రమాణత్వము సంభవింపదు. ఎందువలననన? త్రైకాల్యాసిద్ధేః = ముక్కాలము లందును సిద్ధింప కుండుటవలన.

ప్రామాణ్యమనగా ప్రమేయసిద్ధికి హేతుత్వము. ప్రమాణమునందు ధర్మమే ప్రామాణ్యమనియు చెప్పనగును. కాబట్టి ధర్మిసిద్ధించినపుడే ధర్మముసిద్ధింపగలదు. ప్రమాణములు ఆకాశపుష్పమువలె నసంభవములు. అవి ప్రమేయమునకు పూర్వముగానీ, ప్రమేయసమయమునగానీ, ప్రమేయ

మున కనంతరముగానీ సిద్ధింపనేరవు. కాబట్టి ప్రామాణ్యమెట్లు సిద్ధింపగలదని సూత్రాభిప్రాయము.

త్రికాలములందెట్లు సిద్ధింపవనః

"పూర్వంహి ప్రమాణసిద్ధౌ నేంద్రియార్థ సన్నికర్షా త్ప్రత్యక్షోత్పత్తిః." ౨.౧.౯.

హి = ఎందువలన ననగా, పూర్వం = ప్రమేయము సిద్ధించుటకు పూర్వము, ప్రమాణసిద్ధౌ = ప్రత్యక్షాది ప్రమాణములు సిద్ధించినచో, ఇంద్రియార్థ సన్నికర్షాత్ = ఇంద్రియములతో వస్తువులకు సంబంధము కలుగుట వలన, ప్రత్యక్షోత్పత్తిః = ప్రత్యక్ష ప్రమాణమేర్పడుననుట న = తప్పగదా?

ఇట ప్రమాణము జ్ఞానము. ప్రమేయము వస్తువు. వస్తుసిద్ధికి పూర్వమే ప్రమాణములు సిద్ధించినచో ప్రమాణములద్వారా ప్రమేయములు (వస్తువులు) సిద్ధించును. కాబట్టి ప్రమాణములకంటె ప్రమేయములు పూర్వము అనజెల్లదు. అట్లందు మేని, పూర్వమురచింపబడిన "ఇంద్రియార్థముల సన్నికర్షము వలన కలుగుజ్ఞానము ప్రత్యక్షము (౧.౧.౪.)" అను సూత్రమునకు విరుద్ధమగును. సూత్రమునగల అర్థశబ్దమువలన ప్రమేయమే గ్రహింపబడుచున్నదిగదా? ఆప్రమేయము ప్రత్యక్షోత్పత్తికి కారణమగుటవలన ప్రత్యక్షప్రమాణముకంటె ముందున్నట్లు తెలియుచున్నది. కాబట్టి ప్రమాణము ప్రమేయముకంటె పూర్వమను టెట్లును పొసగదనిభావము.

ప్రమాణము పూర్వముకాదన్న తరువాత నందుమేని,

"పశ్చాత్ సిద్ధౌ న ప్రమాణేభ్యః ప్రమేయసిద్ధిః." ౨.౧.౧౦.

పశ్చాత్ = ప్రమేయసిద్ధికి తరువాత, సిద్ధౌ = ప్రమాణము సిద్ధించు నేని, ప్రమాణేభ్యః= ప్రమాణముల వలన, ప్రమేయసిద్ధిః = ప్రమేయములు సిద్ధించు ననుట, న = తగదు.

ప్రమాణమువలన ప్రమీయమాణమగు - తెలియ నగు వస్తువు ప్రమేయ మనబడుచున్నది. కాబట్టి ప్రమేయ సిద్ధికి తరువాత ప్రమాణసిద్ధి యనిన, ప్రమాణము లేనిది ప్రమేయమెట్లు సిద్ధింపగలదు? అను ప్రశ్న కలుగును. ఏలయన, ప్రమాణమే లేనిది దేనిచే ప్రమీయమాణమై (తెలియబడి) ప్రమేయమనబడును? వస్తుస్వరూపము ప్రమాణముద్వారా యేర్పడకున్నను, దాని ప్రమేయత్వము మాత్రము ప్రమాణము వలననే కలుగుచున్నది. కాబట్టి ప్రమాణము ప్రమేయముకంటె ముందు సిద్ధించుట తప్పనిసరి యని భావము.

దీనింబట్టి ప్రమేయము పూర్వమై, ప్రమాణము తరువాతనే యనిన ప్రమాణములవలన ప్రమేయసిద్ధియనుట విరుద్ధమగును. కాబట్టి ప్రమేయానంతరము ప్రమాణమనుటయు ననుచితమని సూత్రాభిప్రాయము.

పూర్వాపరములు విడిచి ప్రమాణ ప్రమేయములు రెండును సమకాలీనము లందుమేని,

“యుగపత్సిద్ధౌ ప్రత్యర్థ నియతత్వాత్ క్రమవృత్తిత్వాభావో బుద్ధీనామ్.” ౨.౧.౧౧.

యుగపత్సిద్ధౌ = ప్రమాణప్రమేయము లొకే కాలమున సిద్ధించు ననిన, బుద్ధీనామ్ = ప్రమాణజ్ఞానములకు, క్రమవృత్తిత్వాభావః = క్రమవృత్తిత్వము – ఒకదానితదుపరి యొకటి కలుగుట యనునది యుండ

చేరదు. కారణమేమన, ప్రత్యర్థనియతత్వాత్ = ప్రమేయక్రమము నందు నియమముండుట వలన.

ప్రమాణ ప్రమేయము లొకేసమయమున సిద్ధించు ననిన రూపరసగంధస్పర్శాదిప్రమేయముల జ్ఞానమొకదాని తరువాత నొకటి కలుగునట్టి లోకానుభవమునకు విరుద్ధ మగును. కాబట్టి ప్రమాణ ప్రమేయములు రెండు నొకేమాటు సిద్ధించుననుటయు తగదని పూర్వపక్షము.

ఉత్తర పక్షము:—

"త్రైకాల్యాసిద్ధేః ప్రతిషేధానుపపత్తిః" ౨. ౧. ౧౨.

త్రైకాల్యాసిద్ధేః = ప్రత్యక్షాదిప్రమాణములు ముక్కాలము లందును సిద్ధింపవనుటవలన, ప్రతిషేధానుపపత్తిః = వాది ప్రామాణ్యమును ఖండించుటకే వీలులేదు.

ప్రమాణములే సిద్ధింపవని చెప్పు పూర్వపక్షి యా ప్రమాణముల ప్రామాణ్యమును ఖండింపబూనుట హాస్యాస్పదమని సూత్రాభిప్రాయము. ప్రామాణ్యము ప్రమాణముల ధర్మము. ప్రమాణములే (ధర్మి) సిద్ధింపనపుడు ప్రామాణ్యమును ఖండించు టెట్లు? కాబట్టి ప్రత్యక్షాదిప్రమాణములలో ప్రామాణ్యములేదనుట తగదని భావము.

ప్రత్యక్షాదిప్రమాణముల ప్రామాణ్యము నంగీకరింప కుండుటయననేమి? ఆ ప్రమాణములే లేవనుటయా? లేక ఆ ప్రమాణములలో నర్థమును సిద్ధింపజేయుశక్తి లేదనుటయా? శక్తి లేదందుమేని ప్రమాణములున్నవి కాని వానిలో ప్రమేయజ్ఞానము కలిగించు సామర్థ్యములేదని యర్థమగు

చున్నది. అట్లుకాక ప్రమాణములే లేవనిన, ప్రమాణము లన్నియు లేవా? లేక యేదేని యొక్క ప్రమాణములేదా? తెలుపవలసియుండును. ప్రమాణములన్నియు లేవనుట యిష్ట మేని సూత్రమున (౧. ౧. ౮.) ప్రత్యక్షాది యని విశేషనామ ముల పేర్కొనుట యనుచితము. కొండొక ప్రమాణపు ప్రామాణ్యము నిషేధించుట యిష్టమేని మిగిలిన ప్రమాణము లంగీకరించినట్లగును. ఏదేని యొక ప్రమాణమంగీకరించినను ప్రమాణములే లేవనుట సముచితముగాదు. కాబట్టి 'ముక్కాల ములందును సిద్ధింపనందువలన' అను హేతువు సరియైనది కాదని యీసూత్రాభిప్రాయము.

ప్రమాణముల ప్రామాణ్యమును ఖండించుట తగ దనుటలో మరియొక హేతువు.

"సర్వప్రమాణప్రతిషేధాచ్చ" ౨. ౧. ౧౩.

పై సూత్రమునుండి 'ప్రతిషేధానుపపత్తిః' అను పద మీ సూత్ర మున ననువర్తించును. ఈ సూత్రమునగల చ కారమునకు 'కూడ' అని యర్థము.

సర్వప్రమాణప్రతిషేధాచ్చ=ప్రత్యక్షాది ప్రమాణముల నన్నింటి ప్రామాణ్య మంగీకరింపనందువలనకూడ (ప్రత్యక్షాదిప్రమాణముల ప్రా మాణ్య మంగీకరింపదగదను) పైఖండన సరియైనదికాదు.

ఏ ప్రమాణమువలన ప్రత్యక్షాది ప్రమాణముల ప్రామాణ్యమంగీకరింపదగదని చెప్పబడునో అదియు ప్రత్య క్షాదిప్రమాణములలో నొకటియేగదా! పూర్వసూత్రమున ప్రమాణముల నన్నిటిని ఖండించెను. మఱి ప్రామాణ్య

మును నిషేధించు ప్రమాణమెద్ది? ప్రమాణమే లేనియెడల ఖండన నంగీకరించుటెట్లు? కాబట్టి పూర్వసూత్రమున జెప్ప బడిన ప్రామాణ్యఖండన సరియైనదికాదని సూత్రాభి ప్రాయము.

ఏ ప్రమాణబలమున ప్రత్యక్షాది ప్రామాణ్యము నిషేధింపబడుచున్నదో ఆ ప్రమాణము మాత్ర మంగీకరింప బడుననిన,

"తత్ప్రామాణ్యే వా న సర్వప్రమాణవిప్రతిషేధః"
౨. ౧. ౧౪.

తత్ప్రామాణ్యే వా = ప్రతిషేధకప్రమాణ ప్రామాణ్య మంగీక రింపబడినచో, సర్వప్రమాణ విప్రతిషేధః = సర్వప్రమాణ ప్రతిషే ధము (ఖండన). న = తగదు. అనిసూత్రార్థము.

ప్రత్యక్షాదిప్రమాణముల ప్రామాణ్యమును ఖండింప నేదేని యొక ప్రమాణమంగీకరింపవలయునుగదా? ఖండన కొఱకు అంగీకరింపబడు ప్రమాణము ప్రత్యక్షాదులలో చేరునా? లేక వానిలో చేరదా? చేరునెడల ప్రత్యక్షాదు లన్నియు నప్రమాణములన నొప్పదు. వేరగునెడల, ప్రత్య క్షాదుల ఖండనార్థము వానికంటె భిన్నముగా నొక ప్రమాణ మంగీకరించుచు నన్ని ప్రమాణములు ఖండింపబడినవనుట యంతకంటె హాస్యాస్పదము.

ప్రత్యక్షాదులు ప్రమాణములు కావనుటకు హేతు వుగా చెప్పిన "త్రైకాల్యాసిద్ధేః" అను కారణమును సరియైన

కారణము కాదని యొకవిధముగా ఖండించి ప్రస్తుతము మఱి యొక సమాధానము చెప్పబడుచున్నది.

"త్రైకాల్యాప్రతిషేధశ్చ శబ్దాదాతోద్యసిద్ధివత్
తత్సిద్ధేః" ౨. ౧. ౧౫.

త్రైకాల్యాప్రతిషేధశ్చ = ప్రత్యక్షాదులు ముక్కాలము లందు సిద్ధింప వనుటయు వీలుపడదు. కారణమేమన? శబ్దాత్ = వెనుక సిద్ధించు శబ్దమువలన, ఆతోద్య సిద్ధివత్ = శబ్దముకంటె పూర్వమే సిద్ధించిన వీణ మున్నగు వాద్యములు సిద్ధించునట్లు- తత్సిద్ధేః = తరువాత సిద్ధించుప్రమాణమువలన పూర్వమేసిద్ధించిన ప్రమేయముకూడ సిద్ధించుననిసూత్రార్థము.

ప్రమేయముకంటె పూర్వముగానీ తరువాతగానీ సమకాలమునగానీ ప్రమాణములు సిద్ధింపనేరవని చెప్పుటతగదు. ప్రమేయము తరువాత ప్రమాణము సిద్ధించునన్నను దోషము వాటిల్లదు. ప్రమాణమే లేకున్న ప్రమేయమెట్లుండగలదని గదా! దోషము చెప్పబడినది. చూడుడు: వీణ, తంబుర మున్నగు వాద్యములు ముందుగా సిద్ధపరుపబడునుగదా! అటుపై వీణాదులు వాయించగా శబ్దము లేర్పడును. ఇట్లు తరువాత బుట్టిన శబ్దములను విని వానిద్వారా వీణ లేక తంబుర వాయింపబడుచున్నది యని తెలిసికొందుముగదా? దీనినిబట్టి (తరువాత నేర్పడుశబ్దము ప్రమాణముగా అంతకు పూర్వమే యేర్పడియున్న వాద్యవిశేషములయిన ప్రమేయములు తెలియబడునట్లు) తరువాత నేర్పడు ప్రమాణముల బట్టి పూర్వము సిద్ధించియుండు ప్రమేయములు తెలియబడు ననుట దోషముకాదు. కాబట్టి ప్రమాణములు ముక్కాలము

లందును సిద్ధింపనేరవు (త్రైకాల్యాసిద్ధేః) అనుట సరిగాదు. ప్రత్యక్షాదుల ప్రామాణ్యము ఖండింపబడ నేరదు.

'శబ్దమునలన వీణాదులు సిద్ధించునట్లు' అనుటలో శబ్దము ప్రమాణముగా తీసికొనబడినది. కాని యది సరి కాదు. కారణమేమన, శబ్దము ప్రమేయముగాని ప్రమాణము గాదు. కాబట్టి పై హేతువు సరిగాదన్నచో,

"ప్రమేయాచ తులాప్రామాణ్యవత్." ౨. ౧. ౧౬.

తులా = త్రాసు, ప్రమేయాచ = ప్రమేయమయ్యు, ప్రామాణ్యవత్ = నిమిత్తవశమున ప్రమాణమైనట్లు శబ్దము సైతము ప్రమాణము కాగలుగునని సూత్రార్థము.

ప్రపంచమున నేదియు స్వభావవశమున ప్రమాణము గానీ, ప్రమేయముగానీ కానేరదు. కాబట్టి శబ్దము ప్రమేయమేగాని ప్రమాణము కాదని చెప్పుటెట్లు? గురుత్వగుణము గల సువర్ణాదులభార పరిమాణాదులను తెలిసికొనగోరినపుడు త్రాసు ప్రమాణమగును. ఇట్లు తూచబడిన సువర్ణాదుల ద్వారా మరియొక త్రాసు సరియైనదా కాదాయని యెఱుగ గోరుదుమేని యపుడు సువర్ణము ప్రమాణమును త్రాసు ప్రమేయమునునగును. కాబట్టి సిద్ధికి హేతువు ప్రమాణము అనియు, సిద్ధికి విషయమగునది ప్రమేయమనియు మనమెంచుదుము. దీనింబట్టి యే వస్తువైనను స్వభావవశమున ప్రమాణ ప్రమేయ వ్యవహారమును బొందక నిమిత్తవశమున ప్రమాణమనియో, ప్రమేయమనియో వ్యవహరింపబడునని తెలియుచున్నది.

ఒక వస్తువొకట ప్రమేయమయ్యి మరియొకట ప్రమాణము కావచ్చును. జ్ఞానమునకు విషయమైనచో ప్రమేయము అనబడును. జ్ఞానమునకు సాధనమయినచో ప్రమాణమగును. కాబట్టి సువర్ణగురుత్వము జ్ఞానవిషయమైనపుడు తుల.(త్రాసు) జ్ఞానసాధనమై ప్రమాణమనబడుచున్నది. త్రాసుసరియగునా? కాదా? యని తెలిసికొననెంచినపుడు జ్ఞానమునకు విషయమై ప్రమేయమగుచున్నది. అపుడు సువర్ణాదులు ప్రమాణములగుచున్నవి. అట్లేశబ్దముకూడ జ్ఞానవిషయమైనపుడు ప్రమేయమయ్యి వీణాదులజ్ఞానమునకు సాధనమైనపుడు ప్రమాణము కాగలదు. కాబట్టి 'శబ్దాదాతోద్యసిద్ధివత్' అనుటలో నెట్టి దోషమును లేదని తెలియుచున్నది. ఇట్లే శాస్త్రమున జెప్పబడు విషయమంతయు తెలియనగును.

ఉదా:—ఆత్మపదార్థము ఉపలబ్ధికి విషయమగుటచే ప్రమేయములందు చెప్పబడినది. అది ఉపలబ్ధి (జ్ఞానమున) యందు స్వతంత్రమగుటచే ప్రమాత యనబడును. బుద్ధి జ్ఞానసాధనమయి ప్రమాణమనబడును. జ్ఞానవిషయమై ప్రమేయమగును. ప్రమాణమును ప్రమేయమును కానపుడు ప్రమితి యనబడును. ఇట్లే కారకశబ్దములు నిమిత్తవశమున నొకేవస్తువున నన్నియు వర్తించుట మనమెఱుగుదుము. వృక్షమున్నది యనుటలో స్వస్థితిలో స్వతంత్రమగుటచే వృక్షము కర్త యనబడును. వృక్షమును చూచుచున్నాడనుటలో నదియే కర్మ. వృక్షముతో (ద్వారా) చంద్రునిచూపుచున్నాడనుటలో కరణము. వృక్షముకొఱకు నీరుపోయుచున్నాడనుటలో

సంప్రదానము. వృక్షమునుండి ఆకు రాలుచున్న దశలో అపాదానము. వృక్షమున పక్షులున్నవనుటలో నదియే యధికరణము అగుచున్నది. దీనింబట్టి ద్రవ్యమైనంతమాత్రమునగానీ, క్రియయైన మాత్రమునగానీ అది కారకమన వీలుపడదు. కాని, క్రియావిశేషమో, క్రియాసాధనమోనైౖ కారకమనబడుచున్నది. ఇట్లే ప్రమాణ ప్రమేయ శబ్దములును కారకములే యగుటచే ప్రత్యక్షాది ప్రమాణములును జ్ఞాన సాధనములయి ప్రమాణములును, జ్ఞానవిషయములయి ప్రమేయములు ననబడును అని వివేకము.

పూర్వపక్షము :—

ఈ ప్రత్యక్షాది ప్రమాణములు మరియొక ప్రమాణము వలన సిద్ధించుచున్నవా లేక ప్రమాణము లేకయే సిద్ధించుచున్నవా? ఇట్లు ప్రశ్నించుటలో నుద్దేశమేమన?

"ప్రమాణతః సిద్ధేః (ప్రమాణానాం) ప్రమాణాంతర సిద్ధి ప్రసంగః" ౨.౧.౧౭.

ప్రమాణానాం = ప్రత్యక్షాది ప్రమాణములు, ప్రమాణతః = వేరొక ప్రమాణమువలన, సిద్ధేః = సిద్ధించునెడల, ప్రమాణాంతర సిద్ధిప్రసంగః = ప్రత్యక్షాది నాలుగు ప్రమాణములకంటె వేరుగా మరియొక ప్రమాణ మంగీకరింపవలసి వచ్చునని సూత్రార్థము.

ప్రత్యక్షాదిప్రమాణము లే ప్రమాణమువలన సిద్ధించుచున్నవో యా ప్రమాణము ప్రత్యక్షాదులకంటె వేఱగునెడల ఆ ప్రమాణము దేనివలన సిద్ధించునో యదియునొక ప్రమాణమగును. దానిని సిద్ధింప వేరొకటియునంగీకరింపవలసివచ్చును.

ఇట్లు ప్రమాణముల సంఖ్యకు మేరయే లేని స్థితియేర్పడును. ఈస్థితిని శాస్త్రమున 'అనవస్థ' దోషమందురు. 'ప్రత్యక్షాను మానోపమానశబ్దాః ప్రమాణాని (౧.౧.౩) యని పూర్వము చెప్పబడిన సూత్రమునగల ప్రమాణసంఖ్యకును విరుద్ధమగును. కాబట్టి ప్రత్యక్షాదిప్రమాణములు ప్రమా ణాంతరమువలనగాక స్వయముగానే సిద్ధింపగల వందుమేని,

"తద్వినివృత్తేర్వాప్రమాణసిద్ధివత్ ప్రమేయసిద్ధిః"
౨. ౧. ౧౯.

వా = లేక, తద్వినివృత్తేః=ప్రమాణాంతరము వలనగాక ప్రత్య క్షాది చతుర్విధ ప్రమాణములు తమంతతామే సిద్ధించునెడల, ప్రమాణ సిద్ధివత్ = ప్రమాణములు సిద్ధించినట్లు, ప్రమేయసిద్ధిః = ప్రమేయ ములును సిద్ధించును.

ప్రత్యక్షాది ప్రమాణములు తమకంటె భిన్నమగు ప్రమాణము నపేక్షింపకయే సిద్ధించుపక్షమున ప్రమేయ ములు మాత్రము స్వయముగా నేల సిద్ధింపవు? వాని సిద్ధి కొఱకు ప్రత్యక్షాది ప్రమాణముల నంగీకరింపనేల? అక్కఱ లేదందుమేని ప్రత్యక్షాది ప్రమాణములే లోపించును. వేరుగా ప్రమాణమంగీకరింతుమేని యనవస్థాదోషము వాటిల్లునని పైసూత్రముల యభిప్రాయము.

ఉత్తరపక్షము:—

"న ప్రదీప ప్రకాశవత్ తత్సిద్ధేః" ౨. ౧. ౧౯.

న = పైజెప్పినది సరికాదు. ప్రదీప ప్రకాశవత్ = ఒకదీపపు కాంతి మరియొక దీపసహాయ మపేక్షింపకయే సిద్ధించునట్లు, తత్సిద్ధేః = ప్రత్యక్షాది ప్రమాణములు వేరొకప్రమాణము నపేక్షింపకయే సిద్ధించును.

దీపపుకాంతి ఇతర వస్తువులను ప్రకాశింపజేయును. మఱియు తన్ను తానే ప్రకాశింపజేసికొనును. ఆ దీపకాంతిని తెలుపుటకు మఱియొక దీప మపేక్షింపబడదు. అట్లే ప్రత్యక్షాది ప్రమాణములును ప్రమేయముల జ్ఞానము కలిగించుచు తమ జ్ఞానమును తామే కలిగింపగలవు. కాబట్టి భిన్నప్రమాణ మంగీకరింపవలసిన యవసరముండదు. అందువలన ననవస్థయు వాటిల్లదు. ప్రత్యక్షాది ప్రమాణములు నాలుగే యను సూత్రము విరుద్ధము కాదు.

పూర్వ పక్షము:—

ప్రత్యక్షాది ప్రమాణములు ప్రమేయ సాధనములని సామాన్యముగా పరీక్షించి విశేషముగ పరీక్షించుచున్నాడు.

"ప్రత్యక్ష లక్షణా నుపపత్తి రసమగ్ర వచనాత్"

౨. ౧. ౨౦.

ప్రత్యక్ష లక్షణానుపపత్తిః="ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నం...... ప్రత్యక్షమ్ ౧.౧ ౪." అని పూర్వము చెప్పిన ప్రత్యక్షప్రమాణ లక్షణము సరికాదు. కారణ మేమనగ? అసమగ్ర వచనాత్ = లక్షణము పూర్ణముగ చెప్పకుండుటవలన.

ఇంద్రియములకు వస్తువులతో సంయోగాది సంబంధము కలిగినపు డేర్పడు జ్ఞానము ప్రత్యక్షమని పూర్వము చెప్పిన లక్షణము సంపూర్ణము కాకుండుటవలన సరికాదని సూత్రార్థము.

ఇంద్రియార్థముల సన్నికర్షమువలననే జ్ఞానము కలుగనేరదు. దానితోబాటు ఆత్మ మనస్సుల సన్నికర్షము సైతం

మవసరము. అట్టి యాత్మ మనఃసన్నికర్షము ప్రత్యక్ష లక్షణ సూత్రమున జెప్పియుండలేదు. కాబట్టి యాలక్షణము సమగ్రము కాదు.

ఆత్మ మనఃసన్నికర్షము ప్రత్యక్షమున కెట్లు కారణమన,

"నాత్మ మనసోః సన్నికర్షాభావే ప్రత్యక్షోత్పత్తిః"
౨. ౧. ౨౧.

ఆత్మమనసోః = ఆత్మమనస్సులకును, సన్నికర్షాభావే = వానితో ఘ్రాణాదీంద్రియములకును సంబంధము కలుగనపుడు, ప్రత్యక్షోత్పత్తిః న=ప్రత్యక్షము కలుగదు.

ఇంద్రియార్థసన్నికర్షము లేనపుడు ప్రత్యక్షము కలుగనట్లు ఆత్మ మనఃసన్నికర్షములేక ప్రత్యక్షము కలుగదు. కాబట్టి ఆత్మ మనః సన్నికర్షముకూడ ప్రత్యక్షకారణమే. ఏది లేకున్న నేదికలుగక, యేదియున్న నేదికలుగునో అది దానికి కారణమనుట నియమమే కదా. ప్రత్యక్షము కలుగవలయునన్న ఇంద్రియముతో వస్తు సన్నికర్షమేగాక ఆత్మ మనఃసన్నికర్షము నుండవలయును. కాబట్టి ప్రత్యక్ష లక్షణమున నదియు చేర్పవలయునని సూత్రాభిప్రాయము.

"దిగ్దేశ కాలాకాశేష్వప్యేవం ప్రసంగః" ౨. ౧. ౨౨.

ఏవమ్=ఇట్లే, దిగ్దేశకాలాకాశేష్వపి=దిక్కు, దేశము, కాలము, ఆకాశము వీనికిని, ప్రసంగః =ప్రత్యక్షజ్ఞాన కారణత్వ మున్నది.

ఆత్మ మనస్సన్నికర్షము ప్రత్యక్షమునకు కారణమైనట్లు దిగ్దేశకాలాకాశములు సైతము ప్రత్యక్షమునకు కారణము

లగును. ప్రత్యక్ష లక్షణమున వాని కారణత్వము జెప్పకుండు టయు కొఱతయే యగునని యీ సూత్రాభిప్రాయము.

ఉత్తరపక్షము :—

దిగాదులు కారణమేలకావనుశంకను తొలగించుచు ఆత్మమనస్సన్నికర్షము కార్యమే కాగలదని వ్యవస్థచేయు చున్నాడు.

"జ్ఞానలింగత్వా దాత్మనో నానవరోధః." ౨.౧.౨౩.

ఆత్మనః = ఆత్మ, జ్ఞానలింగత్వాత్ = జ్ఞానమను గుణము లింగ ముగా కలదగుటవలన, అనవరోధః = కారణముగా సంగ్రహింప కుండుట,న = కలుగనేరదు.

"ఇచ్ఛాద్వేష......జ్ఞానాన్యాత్మనోలింగమ్. ౧.౧.౧౦" అనుసూత్రమునజ్ఞానము ఆత్మకు లింగముగా నర్ణింపబడినది. ఆ జ్ఞాన మాత్మమనస్సన్నికర్షము లేనిదే కలుగనేరదు. సన్నికర్షమువలన కలుగుజ్ఞానము అది లేకున్న కలుగదు. ప్రత్యక్షాది జ్ఞానమాత్మగుణమై సన్నికర్షము వలననే జనించు నది కాబట్టి దానికి సన్నికర్షము కారణమని వేరుగా చెప్పవల సిన యవసరముండదు. ఇట్లు జ్ఞానము దిగాదులకు లింగము కాదు. దిగాదులున్న జ్ఞానము కలిగి యవి లేకున్నదికలుగదను నియమమును లేదు. కాబట్టి ఆత్మ మనస్సన్నికర్షము జ్ఞానము నకు కారణమైనట్లు దిగాదులయునికి కారణము కానేరదని సూత్రాభిప్రాయము.

అట్లయిన ప్రత్యక్షలక్షణసూత్రమున ఆత్మమనస్సన్ని కర్షమును కారణముగాచెప్పక ఇంద్రియార్థ సన్నికర్షము నేలచెప్పిరనగా:

"తదయౌగపద్యలింగత్వాచ్చ మనసః" ౨.౧.౨౮

ఈసూత్రమున పైసూత్రమునుండి 'నానవరోధః' అనుపదము అనువర్తించును.

మనసః = మనస్సు, తదయౌగపద్యలింగత్వాచ్చ = ఒక్కసారి యనేకవిషయములకు సంబంధించినజ్ఞానము కలుగకుండుటయే లింగముగా కలదగుటవలన, అనవరోధః న= మనఃసన్నికర్షమును కారణముగా సంగ్రహింపకుండుట కలుగనేరదు. సంగ్రహింపబడినదైయుండవలయును.

యుగపత్ జ్ఞానానుత్పత్తి మనస్సునకు లక్షణముగా (సూ. ౧.౧.౧౬.) పూర్వము వర్ణింపబడినది. జ్ఞానోత్పత్తికి ప్రయోజకమగు మనఃసన్నికర్షము నంగీకరింపకున్న జ్ఞానమే కలుగనేరదు. కాబట్టి సూత్రమున నుల్లేఖింపకున్నను సంగ్రహింపవలసినదేయని సూత్రాభిప్రాయము.

ఉత్తర పక్షము:—

"ప్రత్యక్ష నిమిత్తత్వా చ్చేంద్రియార్థయోః సన్నికర్షస్య స్వ శబ్దేన వచనమ్" ౨. ౧. ౨౯.

ఇంద్రియార్థయోః సన్నికర్షస్య = ఇంద్రియార్థముల సన్నికర్షము, ప్రత్యక్షనిమిత్తత్వాచ్చ = ప్రత్యక్షజ్ఞానమునకే కారణమగుట వలన, స్వశబ్దేన వచనమ్ = ఇంద్రియార్థ సన్నికర్ష మనెడి పదమును సూత్రమున నుల్లేఖించి ప్రత్యక్షప్రమాణకారణముగా జెప్పబడినదని సూత్రార్థము.

ఇంద్రియార్థసన్నికర్షము ప్రత్యక్ష ప్రమాణమునకు మాత్రమే కారణము. ఆత్మమనఃసన్నికర్షము ప్రమాణముల కన్నింటికి కారణము. కాబట్టి యాత్మతో మనఃసన్నికర్షము ప్రత్యక్షానుమానోపమాన శబ్దప్రమాణములకు నన్నిటికి

సాధారణ కారణము ఇంద్రియార్థ సన్నికర్షము ప్రత్యక్ష ప్రమాణమున కసాధారణ కారణము. లక్షణమనగా నసాధారణకారణ మగుటవలన ప్రత్యక్షలక్షణమున నింద్రియార్థ సన్నికర్షమే చేర్పబడినదని సూత్రాభిప్రాయము.

"సుప్త వ్యాసక్త మనసాంచ సన్నికర్ష నిమిత్తత్వాత్"

౨. ౧. ౨౬.

చ = మఱియు, సుప్తవ్యాసక్త మనసామ్ = గాఢనిద్రయందో, ఇతర విషయమునందో లగ్నమైయున్న మనస్సుగలవారికి, సన్నికర్ష నిమిత్తత్వాత్ = తీవ్రమైనధ్వని స్పర్శముల సన్నికర్షమువలన గలుగు శ్రావణస్పర్శ ప్రత్యక్షములకు ఇంద్రియార్థసన్నికర్షమే కారణమగుట వలన నని స్వశబ్దముచే సూత్రమున పేర్కొనబడినది.

గాఢనిద్రాగతుడైన వ్యక్తి యేమియు నెరుగజాలడు. ఒకానొక విషయమున లగ్నమైయున్న మనస్సుగలవాడును తదితర విషయముల నెఱుగజాలడు. ఇట్లు సుప్తమో, కొండొక విషయమునవ్యాసక్తమో అగు మనస్సుగలవ్యక్తి తీవ్రమగు స్పర్శమువలనగానీ, తీవ్రమైన శబ్దమొనరించిన గానీ, ప్రత్యక్షము ననుభవింప గలుగుచున్నాడు. అట్టియెడ ఆత్మమనఃసన్నికర్షము కారణముకాజాలదు. సుషుప్తియందున్న వ్యక్తికి అకస్మాత్తుగా బాహ్యస్పర్శజ్ఞానము కలుగునపుడు ఇంద్రియార్థ సన్నికర్షమేగాని, ఆత్మప్రేరణ వలన మనస్సు ప్రేరేపింపబడి యింద్రియముతో సన్నికృష్టమగుటలేదుగదా! కాబట్టి యింద్రియార్థసన్నికర్షమే ప్రత్యక్ష లక్షణమున గ్రహింపబడినది.

"తైశ్చాపదేశో జ్ఞానవిశేషాణామ్." ౨.౧.౨౭.

చ = మఱియు, జ్ఞానవిశేషాణామ్ = గంధాది విషయములకు సంబంధించిన జ్ఞానములు, తైః = ఆయాఇంద్రియార్థములద్వారా, అపదేశః = చెప్పబడును. (కాబట్టి యింద్రియార్థ సన్నికర్షము సూత్రమున గ్రహింపబడినది.)

రూప రస గంధాదులకు సంబంధించిన ప్రత్యక్ష జ్ఞానము లింద్రియముల ద్వారమున నర్థముల ద్వారముననుచెప్పబడును.

ఉదా:— కంటితో చూచుచున్నాడు. జిహ్వతో రుచి చూచుచున్నాడు. నాసికతో నాఘ్రాణించుచున్నాడు. శ్రవణముతో వినుచున్నాడు. త్వగింద్రియముతో స్పర్శము నెఱుగుచున్నాడు. ఇట్లే రూపజ్ఞానము, రసజ్ఞానము, గంధజ్ఞానము, శబ్దజ్ఞానము, స్పర్శ జ్ఞానమును. ఈ వ్యవహారమున నింద్రియములు నర్థములు ప్రధానముగ గ్రహింపబడుట లోక విదితము. కాబట్టి ప్రత్యక్ష లక్షణమున నింద్రియార్థ సన్నికర్షము ప్రధానముగ గ్రహింపబడెనని సూత్రాభిప్రాయము.

పూర్వపక్షము:—

పై సూత్రముల వర్ణించిన సమాధానమును దృఢపరుపనెంచి మరల శంకించుచున్నాడు.

"వ్యాహతత్వా దహేతుః" ౨. ౧. ౨౮.

ఇంద్రియార్థసన్నికర్షము, వ్యాహతత్వాత్ = ఆత్మమనఃసన్నికర్షము లేనియెడల శక్తిలేనిదగుట వలన, అహేతుః = హేతువు-ప్రత్యక్ష జ్ఞానకారణము కాజాలదని యర్థము.

ఇంద్రియార్థ సన్నికర్షము తనలోగల జ్ఞానజనకశక్తి వ్యాహతము కాకున్నంతవరకు జ్ఞానము జనింపజేయ గలుగును. ఆత్మమనఃసన్నికర్షము లేనపు డాశక్తి వ్యాహతమగుచు జ్ఞానము జనింపదు. ఇందుల కుదాహరణము:— మనస్సు సావధానముగా లేనపుడు ఇంద్రియార్థములు సన్నికృష్టములై యుండినను జ్ఞానము కలుగకుండుటయే. కాబట్టి యింద్రియార్థసన్నికర్షము మాత్రము ప్రత్యక్ష జ్ఞానకారణము కాక ఆత్మమనఃసన్నికర్షము గూడ కారణము అని తెలియుచున్నది. స్పష్టముగా జెప్పదలచిన ఆత్మమనఃసన్నికర్షము, ఇంద్రియమనఃసన్నికర్షము, ఇంద్రియార్థసన్నికర్షము నను మూడును ప్రత్యక్షజ్ఞానకారణ మనవలయును. ఇట్లు చెప్పకుండుట వలన ప్రత్యక్షలక్షణ మసమగ్రమనిభావము.

ఉత్తరపక్షము:—

"నార్థవిశేషప్రాబల్యాత్" ౨. ౧. ౨౯.

అర్థవిశేష ప్రాబల్యాత్ = ఇంద్రియార్థ సన్నికర్షము ప్రత్యక్షజ్ఞానమునకు ప్రాధాన్యమగుటవలన నదియే కారణముగా చెప్పబడినది, కాబట్టి న = ఆ హేతువు వ్యాహతము కాదు.

ఇంద్రియార్థ సన్నికర్షమును ప్రత్యక్షజ్ఞాన లక్షణముగా జెప్పుటలో ఆత్మమనఃసన్నికర్షమును జ్ఞానకారణముగా నంగీకరింపకుండుట యుద్దేశము కాదు. ఆత్మమనఃసన్నికర్షము జ్ఞానముల కన్నింటికీ సాధారణకారణము; ఇంద్రియార్థసన్నికర్షము అసాధారణకారణము. అసాధారణ కారణము లక్షణముగా నంగీకరింపవలయును. కాబట్టి, ప్రత్యక్ష

లక్షణమున నింద్రియార్థసన్నికర్షమే గ్రహింపబడినది. అందు వలన నేదోషము లేదని సూత్రాభిప్రాయము.

ఇట్లు ప్రత్యక్షలక్షణమును జెప్పి యాప్రత్యక్షము అనుమానమేల కాదని శంకించుచున్నాడు.

పూర్వపక్షము:—

"ప్రత్యక్ష మనుమాన మేకదేశగ్రహణా దుపలబ్ధేః"

౨ ౧ ౩౦.

ప్రత్యక్షం=ప్రత్యక్షప్రమాణము, అనుమానమ్=అనుమానప్రమాణమే కారణమేమన, ఏకదేశగ్రహణాత్ =ఇంద్రియములద్వారా పదార్థములో కొంతభాగమే గ్రహింపబడినందువలన, ఉపలబ్ధేః=పదార్థమంతయు గ్రహింపబడుచున్నది.

ఇంద్రియార్థసన్నికర్షమువలన ప్రత్యక్షముగలుగు నని చెప్పబడినది కాని, ఇంద్రియార్థసన్నికర్షమువలన పదార్థ మంతయు మొదట గ్రహింపబడక యెదుటనున్న భాగము మాత్రమే గ్రహింపబడును. అటుపై పదార్థమంతయు కన బడును ఒకడొక చెట్టును చూచుచున్నా డనుకొనుడు. అపుడు ప్రథమమున నతని కాచెట్టులో కొంత (ఎదుటనున్న) భాగముకనబడును. అదిచూచి తరువాత చెట్టును పూర్ణముగా నెఱుగును కాబట్టి యీ ప్రకారము అనుమానమువలె నున్నది. అనుమానమునను ముందు ఇంద్రియార్థ సన్నికర్షముచే వహ్నిలో నేకదేశమగు ధూమము తెలియబడును. అటుపై ధూమముద్వారా వహ్ని తెలియబడును. అను మానమున నెట్లు ఇంద్రియముచే ధూమమును జూచి

యట్టుపై వహ్నినెరుగుచున్నామో అట్లే ప్రత్యక్షమునను ముందు ఇంద్రియముచే వస్తువున నొకభాగమును జూచి యట్టుపై వస్తువును పూర్ణముగా నెరుగుచున్నాము. కాబట్టి ప్రత్యక్షమునకును, అనుమానమునకును నెట్టిభేదములేదు. కాగా ప్రత్యక్ష మనుమానమే యని భావము.

నైయాయికులు అవయవములద్వారా అవయవి యను నొక పదార్థము అవయవములకంటె భిన్నముగా నేర్పడునని యంగీకరింతురు. ఇట ప్రత్యక్ష మనుమానమే యను పూర్వపక్షి అవయవి యను పదార్థమొందు అవయవములకంటె వేరుగా నుండునని యంగీకరింపడు. అతనిదృష్టిలో వాస్తవమున అవయవములు తప్ప అవయవి లేదు. ఆ యవయవములును గంధ రస రూప స్పర్శ పరమాణువులు. అయ్యవి అతీంద్రియములయ్యు నొకదానితో నొకటిచేరి ప్రత్యక్షములగును. కాబట్టి యతని మతమున నెదుటి యవయవములు ఇంద్రియముతో సన్నికృష్టములై గ్రహింపబడి యట్టుపై మొత్తమవయవముల విషయమున నేర్పడుజ్ఞానము అనుమానమగునని యభిప్రాయము.

ఉత్తర పక్షము:—

"న ప్రత్యక్షేణ యావత్ తావదప్యుపలంభాత్."

౨. ౧. ౩౧.

న=ప్రత్యక్ష మనుమానముకాదు. కారణమేమన, ప్రత్యక్షేణ = ప్రత్యక్ష ప్రమాణముద్వారా, యావత్తావదపి=(ఎంతో యొకంతైనను)-పదార్థమున నొక కొంతయైనను, ఉపలంభాత్ = గ్రహింపబడుచున్నదని యంగీకరించుచుండుటవలన.

ప్రత్యక్ష మనుమానమే యని చెప్పు వ్యక్తి యేకదేశ గ్రహణమని దేని నంగీకరించుచున్నాడో ఆ యేక దేశ గ్రహణము ప్రత్యక్షమా? కాదా? ప్రత్యక్షమగునెడల ప్రత్యక్ష మనుమానమే యనుటలో నర్థమేమి? ప్రతిజ్ఞావ్యాఘాతమే గదా! ఆ మొదట గ్రహింపబడునది ప్రత్యక్షమున గాకున్న మఱే ప్రమాణముననో చెప్పవలసి యుండును. అనుమాన మనుటకు వీలులేదు. ఇంద్రియార్థ సన్నికర్షమువలన తెలియబడునది యనుమాన మెట్లగును? కాబట్టి ప్రత్యక్ష మనుమాన మనుట తగదు. ప్రత్యక్షానుమానములలోగల భేదము నెవ్వరు తొలగింపజాలరు.

పూర్వపక్ష సూత్రమున కనబఱచిన అవయవ అవయవి విషయమును ముందురాబోవు సూత్రములందు సూత్రకారుడు స్వయముగా చర్చించును.

"న చైకదేశోపలబ్ధి రవయవి సద్భావాత్." ౨.౧.౩౨.

ఏకదేశోపలబ్ధిశ్చ = ఇంద్రియ సన్నికర్షము వలన నేకదేశోపలబ్ధి కలుగుననుటయు, న=సరిగాదు. కారణమేమన? అవయవి సద్భావాత్ = ఏకదేశముతోబాటు అవయవియు నుండుట వలన.

వస్తువున నేయేకదేశము (భాగము) తో నింద్రియ సన్నికర్షము కలుగునో యాభాగమున నవయవి లేకున్న నా యింద్రియార్థ సన్నికర్షముచే నది గ్రహింపబడకుండును. ఏక దేశము (భాగము) మాత్రమే గ్రహింపబడును. కానియట్లు గాక యవయవియు నటతప్పక గ్రహింపబడును. ఏకదేశము, అవయవము, భాగమునను పదములు పర్యాయములు. అవ

యవములకు, నవయవికి గల సంబంధము నిత్యము (సమవాయము). కాబట్టి యే యవయవములతో (ఏకదేశముతో) నింద్రియము సంబద్ధ మగుచున్నదో యాయవయవములతో నిత్యసంబంధముగల యవయవితో మాత్రమింద్రియ మేల సంబద్ధముగాదు? ఇంద్రియసన్నికర్షమేర్పడిన నవయవి గ్రహింపబడక యవయవము (ఏకదేశము) మాత్రమేల గ్రహింపబడును? కాబట్టి యేకదేశముతోబాటు అవయవియు తప్పక గ్రహింపబడును. ఏకదేశము మాత్రము గ్రహింపబడు ననుట సాహసము.

అవయవి నంగీకరింపనివారి నిట్లు ప్రశ్నింపవలయును. ఏకదేశమననేమి? (ఏకశ్చ అసౌదేశః) ఒకదేశమనికదా! యర్థము. దేశమన్నను ఆధారమన్నను ఒక్కటియే. అట్లయిన ఆధారము దేనికి? ఆధేయములేని ఆధారమున కర్థమేమి? ఏకదేశము నంగీకరించుచు ఏకదేశి (అవయవి) నంగీకరింపకుండుటకు వీలేమి? దేశమన్న భాగమందువేని, దేనికది భాగము? అవయవములకా? అవయవికా? అవయవములకనుటయుక్తము కాదు. ఏలయనః అవయవములు పరమాణువులే కదా! అవి నిరవయవములు—నిర్భాగములు. కాబట్టి వానికి భాగమనుటెట్లు కుదురును? కుదురదని భావము అవయవికి భాగమందువా? అవయవి నంగీకరింపవలసి వచ్చును. అవయవములలో వానికంటె భిన్నముగా అవయవి యొకటి లేదనుట తగదు. అట్లుగాక, ఇంద్రియసన్నికృష్టములగు నెదుటిభాగములచేత పరభాగముల ననుమానింతుమందువేని, పూర్వాపర భాగము

లకు సంబంధము (వహ్ని ధూమములకువలె) ప్రత్యక్షముగా గ్రహింపబడినదా? లేదా? గ్రహింపబడిన పక్షమున పూర్వ పర భాగములు రెండును ప్రత్యక్షములయి ప్రత్యక్షము సిద్ధించును. ప్రత్యక్ష మనుమానమనుటెట్లుపొసగును? ప్రత్యక్షముగా వాని సంబంధము గ్రహింపబడని పక్షమున పూర్వ భాగముచే పరభాగ మనుమానింతుమనుట పొసగదు. సంబంధము గ్రహింపబడని రెండు పదార్థములలో నొక దానిచే మరియొకటి యనుమానించుట సంభవముకాదు. కాబట్టి యవయవ వ్యతిరిక్తముగా నవయవి యొకటి యంగీకరింపక తప్పదు. అవయవి యంగీకరింపబడుటచే నేకదేశోపలబ్ధి యనియు, ప్రత్యక్ష మనుమానమే యనియు ననుట యెట్లుగను పొసగదని సూత్రాభిప్రాయము.

పూర్వపక్షము:—

పూర్వ సూత్రమున జెప్పబడిన 'అవయవి సద్భావాత్' అను హేతువు నంగీకరింపక శంకించుచున్నాడు.

"సాధ్యత్వా దవయవిని సందేహః" ౨. ౧. ౩౩.

అవయవిని = అవయవియందు, సందేహః = సంశయమున్నది. కారణమేమన, సాధ్యత్వాత్ = అవయవములకంటె వేరుగా నవయవి యొకటి కలదని సాధింపవలసి యుండుటవలన.

అవయవి సిద్ధమైనపుడు (ఉభయులు నంగీకరించిన మీాదట) 'అవయవి సద్భావాత్' అవయవి యుండుట వలన నను హేతువుప్రయోగింప వీలగును. అవయవి యొకటి కలదందువేని, యది యవయవము లందున్నదై ప్రతి అవయవ

మునను సంపూర్ణముగా నుండునా? లేక ఏకదేశముగా నుండునా? ఒకయవయవమున సంపూర్ణముగా నుండునన్న మిగిలిన యవయవములు వ్యర్థములగును. మఱియు అవయవి ప్రత్యక్షమే యనుచున్నావు కాబట్టి, ఒక్కయవయవమున సంపూర్ణముగాగల యవయవి ప్రత్యక్షము కావలయునన్న వస్తుప్రత్యక్షమునకు కారణములగు మహత్త్వానేకద్రవ్యత్వ ములు నటనుండ వలయునుకదా? అదియెట్లు పొసగును? ఇంతి యకాక ప్రత్యవయవమునకు అవయవి సంపూర్ణముగా నున్న శృంగమున స్తనకార్యము సంపన్నము గావలసి యుం డును. అదియెటను కానరాదు. కాబట్టి ప్రత్యవయవమునను అవయవి సంపూర్ణముగా నుండునన వీలుపడదు. కనుక ఏక దేశముగా - అసంపూర్ణముగ నుండునన్న నదియుపొసగదు. అవయవి కాధారమగు నవయవములకు మించి దానికి గల యేకదేశములేమి? అందువలన 'అవయవిసద్భావాత్' అను హేతువు సందిగ్ధమై సిద్ధాంతపక్షమును సాధింపజాలదని సూత్రాభిప్రాయము.

ఉత్తరపక్షము:—

"సర్వాగ్రహణ మవయవ్యసిద్ధేః" ౨. ౧. ౩౪.

అవయవ్యసిద్ధేః = అవయవములకంటె భిన్నముగా అవయవిలేని యెడల, సర్వాగ్రహణమ్ = ద్రవ్యాది పదార్థములన్నియు ప్రత్యక్షము కాకుండుట సంభవించును.

ద్రవ్యగుణకర్మాది పదార్థములన్నియు నింద్రియము లచే గ్రహింపబడుచున్నవి కదా! లోకమున నెల్లరచే, 'ఇది

జలము' 'ఇది భూమి' 'ఇది యగ్ని' యని ద్రవ్యములు; 'ఇది నలుపు' 'ఇది తెలుపు' 'ఇది పరిమాణము'నని గుణములు; 'తినుచున్నాడు' 'వండుచున్నాడు' 'నడుచుచున్నాడ'ని క్రియలు గ్రహింపబడుచుండుట నిర్వివాదము. అవయవములకంటె వేరుగా నవయవియే లేక యవయవ సముదాయములే ద్రవ్యాదులగునెడల నవయవము లతీంద్రియములయినందువలన ద్రవ్యాదులు మనచే నెన్నడు గ్రహింపబడకుండవలయును. కాబట్టి, యవయవి నంగీకరింపని పక్షమున సర్వము గ్రహింపబడకుండవలసినస్థితి యేర్పడును.

అవయవి విషయమున నది యవయవములలో నేక దేశముగ నుండునా? సంపూర్ణముగా నుండునా? యని ప్రశ్నించుటయు తగదు. కారణమేమన; ఏకదేశ మనునది యనేకములలో నొకదానికి పేరు. అనేకావయవములలో కొన్నింటినో యొకదానినో యేకదేశమని వ్యవహరించుట యుచితము. అవయవి యొక్కటే కాబట్టి యం దేకదేశమనియు సంపూర్ణమనియు వ్యవహారము పొసగదు. అట్లయిన, ననేకావయవములలో నొక యవయవి యెట్లున్నది; అందువా? ఆశ్రయాశ్రిత భావమున - సమవాయమున నందుము. ఆశ్రయాశ్రితములన నేమందువా? ఏవి దేనికంటె భిన్నముగా నుండజాలవో (స్వయముగా సిద్ధింపవో) యవి యాశ్రయములు - అవయవములు, అది యాశ్రితము అనగా అవయవి. అవయవములను విడిచి యవయవి యుండనేరదు. ఇదియ యాశ్రయాశ్రితభావము = సమవాయము. ఇట్లు సమస్తావయవాశ్రిత

మగు నవయవి నంగీకరించినందువలన నెట్టిదోషము నుండ జాలదు.

అవయవములకంటె వేరుగా నవయవి యొకటి కలదని తెలిసికొను టెట్లన:

"ధారణాకర్షణోపపత్తేః" ౨. ౧. ౩౫.

ధారణాకర్షణోపపత్తేః = ధారణ ఆకర్షణలవలన నవయవి తెలియబడును.

అవయవికి సంబంధించిన ఏకదేశమును గ్రహించినపు డవయవియు గ్రహింపబడును. ఒకపదార్థములో నొకభాగ మును పట్టుకొనినపు డాభాగము (ఏకదేశము) తో బాటు ఆపదార్థమంతయు పట్టుకొనబడును. అపుడాయవయవి (పదా ర్థము) మఱియొక స్థానమునకు పోజాలదు. ఈస్థితియే ధారణ మనబడును. అవయవిలో నొకభాగమును పట్టుకొనినపుడు దానితోపాటు అవయవియు పట్టుకొనబడి మఱియొక స్థాన మునకు చేర్పబడుట ఆకర్షణమనబడును. అవయవియే లేని పక్షమున నీధారణాకర్షణములు సంగతములుకావు. కాబట్టి ధారణాకర్షణముల సంగతియే యవయవములకంటె అవ యవి భిన్నముగా నున్నదని తెలుపుచున్నది.

ఆశంకాపూర్వక సమాధానము:—

"సేనావనవద్గ్రహణమితిచే న్నాతీంద్రియత్వా దణూ నామ్" ౨ ౧ ౩౬.

సేనావనవత్ = (మనుష్యులు, వృక్షములు ననువానికంటె భిన్న ములుగాని) సేనావనములవలె, గ్రహణమ్ = అవయవములకంటె భిన్నము

కాని ఘటపటాది వస్తువులు గ్రహింపబడును, ఇతిచేత్ = అందువేని, న = అట్లుకాజాలదు. (కారణమేమన) అణూనామ్ = అవయవములన బడు పరమాణువులు, అతీంద్రియత్వాత్ = ఇంద్రియములచే గ్రహింప బడని స్వభావము కలవగుట వలన.

వృక్షములుగానీ, మనుష్యులుగానీ యతీంద్రియ ములు- ఇంద్రియములచే గ్రహింపబడనివి కావు అని వేరుగా గ్రహింపబడనప్పుడు వనమనియు, సేనయనియు నందుము. మనము వస్తువులలో నేకదేశమనియు, నవయవములనియు వేనిననుచున్నామో యవి పరమాణువులే కదా! అవి వృక్ష మనుష్యులవలె కాక యతీంద్రియములు. కాబట్టి యింద్రియ ములచే గ్రహింపబడవు. అట్టియెడ వానిసముదాయములలో ఘటపటాది బుద్ధి యెట్లుకలుగును? అవయవము లతీంద్రియము లయినప్పుడు వాని సముదాయ మింద్రియగోచరమనుట పొస గదుకదా? మఱియు ఘటపటాదులను చూచినపుడు 'ఇది యొకఘటము' 'ఇదియొక పటము' నని బుద్ధికలుగును. అట్టియెడ, అవయవములకంటె వేరుగా నవయవి యొకటి యంగీకరింప కున్న 'ఒకఘటము, ఒకపటము' నను జ్ఞానములో ఒక్కటి యననేమి? ఒక్కటి యనుదానికి విషయము అనేకావయవ ములు కాజాలవుకదా? అవయవములకంటె వేరుగా నవయవి యొందులేనియెడల ఒక్కటి యను బుద్ధి యెట్లుసమన్వయింప వీలగును? కాబట్టి యవయవి యొకటి యంగీకరింపక తప్పదు. ఇట్లు ప్రత్యక్ష మనుమానము కానేరదు.

పూర్వపక్షము:— (అనుమాన ప్రమాణ పరీక్ష)

"రోధోపఘాత సాదృశ్యేభ్యో వ్యభిచారా దనుమాన మప్రమాణమ్" ౨.౧.౩౭.

అనుమానమ్ = అనుమానప్రమాణము, అప్రమాణమ్ = ప్రమాణముకాదు కారణమేమన, రోధోపఘాతసాదృశ్యేభ్యః = రోధోపఘాత సాదృశ్యముల వలనకలుగు ఆనుమానిక జ్ఞానములందు, వ్యభిచారాత్ = ప్రామాణ్యము వ్యభిచరించుటవలన.

ప్రవాహమున కడ్డుగట్టుట (రోధము) చే నిండిన నదిని చూచి వర్షము కురిసినదని యనుమానింతుమేని యట ప్రామాణ్యముండదు. చీమలుండుతావున కుపద్రవము (ఉపఘాతము) కలిగించుటచే బారులుతీర్చి స్థానాంతరమునకేగు చీమలను జూచి వర్షముకురియునని యూహించిన నటను ప్రామాణ్యముండదు. ఇట్లే మయూరమువలె నెవడేని యరచిన యరుపులో సాదృశ్యముండుటచే వర్షముకురియ నున్నదని యనుమానింతుమేని యట్టియెడను ప్రామాణ్య ముండనేరదు. ఈ మూడుతావులందును అనుమాన స్వరూపముండినను ప్రామాణ్యము సున్న. ఈ యనుమానములలో ననుమాన లక్షణము లేకపోలేదు. కాబట్టి యనుమాన మప్రమాణము.

ఉత్తరపక్షము:—

"నైకదేశ త్రాస సాదృశ్యేభ్యోఽర్థాంతరభావాత్" ౨.౧.౩౮.

న = పూర్వ సూత్రమున చెప్పినది సరికాదు. ఏలయన, ఏకదేశ త్రాస సాదృశ్యేభ్యః = ఏకదేశ త్రాస సాదృశ్యముల వలన కలుగు జ్ఞానములు, అర్థాంతర భావాత్ = అనుమాన జ్ఞానము కంటె భిన్నములగుటచే.

పూర్వ సూత్రమున గట్టు, ఉపద్రవము, పోలికల వలన ననుమాన మేర్పడు చున్నది కాని, అందు ప్రామా

ణ్యము లేదనుట సరికాదు. కారణమేమన, నదీ ప్రవాహము నకు రోధమేర్పరుచుటవలన (అడ్డు కట్టుట వలన) నేర్పడు నదీపూర్ణత వర్షము కురిసిన దనుటకు పూర్ణ హేతువు కాదు. అది హేతువున నేకదేశమే. వర్షము కురిసిన దని యనుమా నించుటకు హేతువు నది నిండుటయే కాక నురుగు, మురి కితో కూడిన క్రొత్తనీరు ప్రవాహమున నగపడ వలయును. అట్టి ప్రవాహమే హేతు వగును. చీమలుండు తావున నుప ద్రవము (ఉపఘాతము) కలిగించినపు డట చీమలు భయము (త్రాసము)తో పరువిడును. అట్టి త్రాసయుక్త పిపీలికల పంక్తి యొక్కటియే కురియబోవు వర్షమునకు హేతువు కాదు. ఉపద్రవాదుల వలన కలుగు భయము లేనపుడు పలు తావులలో చీమలు తమ యండములను తీసికొని యున్నత స్థానముల కేగుట కురియబోవు వర్షమునకు హేతువు. మఱియు నిట్లే మయూర కేకాసాదృశ్యము గల యితరధ్వనులు కురియ నున్న వర్షమునకు హేతువుగాక మయూర కేకలే హేతు వగును. కాబట్టి హేతువులు కాని వానిని హేతువులని చెప్పి వానివలన గలుగు ననుమితి యనుమితి గాదనుట తగదు. హేతువు సరి గాకున్న అనుమానమున ప్రామాణ్యము లేకు న్నను దోషము లేదు. హేతువు సరియైన యనుమాన మప్ర మాణ మైన దోష మగును. పూర్వ పక్షమున నట్టి దోష మొండును చూపబడలేదు, కాబట్టి భూత భవిష్య ద్వర్త మాన విషయికమగు ననుమానము ప్రమాణమే.

పూర్వ పక్షము:—

భూత భవిష్య ద్వర్తమాన కాలములు సిద్ధించిన గదా తద్విషయిక మగు అనుమానము సిద్ధింపగలదు. కాగా వర్తమానకాలమే లేదని పూర్వపక్షము చేయుచున్నాడు.

"వర్తమానాభావః పతతః పతితపతితవ్యకాలోపపత్తేః"
౨.౧.౩౯.

పతతః=తొడిమనువీడి క్రిందపడుచున్న ఫలమునకు, పతిత పతితవ్య కాలోపపత్తేః=పడినకాలము, మరికొంత పడనున్నకాలము తక్క వేరు సమయము లేకుండుటవలన వర్తమానాభావః = వర్తమానకాలమనునది లేదు.

తొడిమనుండి యూడి క్రిందబడుచున్న ఫలమునకా ఫలము భూమిని చేరువరకు తొడిమకు భూమికి గల యంతరము (దానికి) మార్గమననగును. ఆఫలము భూమిని చేరక మధ్యలోనే యున్నపుడు అంతవరకు గడచిన మార్గముతోకూడిన కాలము పతితకాలము (భూతము); ముందా ఫలము భూమిని చేరువరకుగల మార్గసంయుక్తకాలము పతితవ్య (భవిష్యత్తు) కాలము ననుట తగును. ఫలము భూమిని చేరుట కింతకంటె వేరొక మార్గమున్నదన వీలులేదు. కాబట్టి భూత భవిష్యత్తులు కాక వేరొక వర్తమాన మెటనున్నది?

ఉత్తరపక్షము:—

"తయోరప్యభావోవర్తమానాభావే తదపేక్షత్వాత్"
౨.౧.౪౦.

తదపేక్షత్వాత్ = వర్తమానము నపేక్షించుటవలన, వర్తమానాభావే = వర్తమానము లేనియెడల, తయోరప్యభావః = భూత భవిష్యత్కాలములు నుండవు.

కాలము మార్గముచే వ్యక్తము చేయబడదు. క్రియచే వ్యక్తము చేయబడును. ఫలము పడుచున్నదనుతావు. పడుట యను క్రియ సమాప్తమైన పతితకాలము-భూతకాల మన బడును పడనున్న క్రియ పతితవ్య కాలమును (భవిష్యత్తును) తెలుపును. ఈ రెండు దశలందును ఫలమున క్రియ యుండ నేరదు. పడుట యను క్రియ ఫలమున వర్తించు కాలము వర్తమానకాల మనబడును. ఇట్లు క్రియకు, వస్తువునకు గల సంబంధమును తెలుపునది వర్తమాన కాలము. ఆ వర్తమాన కాలము నపేక్షించి భూత భవిష్యత్కాలము లేర్పడును. కాబట్టి వర్తమానమే లేదనిన భూత భవిష్యత్తులు నుండ జాలవు.

"నాతీతా నాగతయో రితరేతరాపేక్షాసిద్ధిః" ౨.౧.౪౧.

అతీతానాగతయోః = భూత భవిష్యత్తులకు, ఇతరేతరాపేక్షా సిద్ధిః = ఒక దాని నపేక్షించి మరియొకటి సిద్ధమగుట, న = లేదు.

మఱియు భూతకాలము భవిష్యత్తునుగానీ, భవిష్యత్తు భూతకాలమునుగానీ యపేక్షించి సిద్ధింపనేరవు. ఒక సిద్ధవస్తు వన్యవస్తువును సిద్ధింపజేయునుగాని స్వయముగా నసిద్ధమై యన్యవస్తువును సిద్ధింపజేయు ననుట యసంభవము. భవిష్యత్తు సిద్ధించుటకు పూర్వమే భూతముగతించును. భూతకాలము గతించిన యనంతరముకాని భవిష్యత్తు కలుగనేరదు.

వీనిలో పరస్పరాపేక్ష కానిపింపదు. హ్రస్వదీర్ఘములు పరస్పరాపేక్షములు. హ్రస్వము నపేక్షించి దీర్ఘము దీర్ఘమగునుగాని హ్రస్వములేని దీర్ఘమున కర్థములేదు. అట్లే దీర్ఘమున్న హ్రస్వము సిద్ధించునుగాని యదిలేనినా డది సిద్ధింపదు. అట్టి యపేక్ష భూతభవిష్యత్తులలో కానరాదు. కాబట్టి వర్తమాన కాల మంగీకరింపక తప్పదు.

వర్తమానకాలము వస్తువున్నదని తెలుపును. వర్తమాన మంగీకరింపనియెడల ద్రవ్యమున్నది, గుణమున్నది, కర్మమున్నదని ప్రయోగింప జాలమని వివేకము.

భూతభవిష్యత్తులు పరస్పరాపేక్షములు కాకున్న పోనిండు, వర్తమానాపేక్షములు మాత్రమెట్లు కాగలవన,

"వర్తమానాభావే సర్వాగ్రహణం ప్రత్యక్షానుపపత్తేః"

౨.౧.౪౨

వర్తమానాభావే = వర్తమానమే లేనియెడల, ప్రత్యక్షానుపపత్తేః = ప్రత్యక్షప్రమాణ ముపపన్నము కాదుగనుక, సర్వాగ్రహణమ్ = ప్రపంచమున నే పదార్థమును గ్రహింపబడ జాలదు.

ప్రమాణములలో ప్రత్యక్షము వర్తమాన వస్తు విషయికము. ఉన్న వస్తువును తెలిసికొన నుపయోగించును. వర్తమానమే లేకున్న ప్రత్యక్ష ప్రమాణము సిద్ధింపనేరదు. అనుమానాదులు ప్రత్యక్ష మూలము లగుటచే ప్రత్యక్షము సిద్ధింపని నాడు ప్రమాణము లేవియు సిద్ధింపవు. కాబట్టి ప్రమేయ జ్ఞానము కలుగుటయే దుర్లభమగును. అందువలన వర్తమానము రెండు విధముల సిద్ధించు చున్నదని తెలియు

చున్నది. ఒకటి క్రియాసంతాన వ్యంగ్యము. రెండవది యర్థసద్భావవ్యంగ్యము. అనగా అనేకవిధ క్రియవలన వర్తమానము తెలియనగును. వస్తువుయొక్క యునికి వలనను తెలియనగును. క్రియాసంతానవ్యంగ్యమున కుదాహరణములు:- వండుచున్నాడు. నరుకుచున్నాడు. పొయ్యిమీద పాత్ర నుంచుట, అందు నీరు పోయుట, బియ్యమందులో పోయుట, పొయ్యిలోని పుల్లల నెగదోయుట, అగ్నిని ప్రజ్వలింపజేయుట, తెడ్డుతో కలియబెట్టుట, గంజి వార్చుట, పాత్రను దింపుట మున్నగు క్రియాసమూహము వండుటను తెలుపును. పెక్కుమార్లు గొడ్డలి నెత్తివేయుట నరుకుట యనబడును.

అర్థ సద్భావ (వస్తుసత్తా) వ్యంగ్యమున కుదాహరణములు:- ద్రవ్యమున్నది. గుణమున్నది. ఘటపటాదులున్నవి. కాలము నిత్యమగుటచే వర్తమానత్వమందు సిద్ధించినను అతీతానాగతత్వము లెట్లు సిద్ధింపగలవన,

"కృతతా కర్తవ్యతోపపత్తేస్తూభయథా గ్రహణమ్"
౨.౧.౪౩.

కృతతా కర్తవ్యతోపపత్తేః = వ్యంజకమగు క్రియవలన భూత భవిష్యత్తులు సిద్ధించుటచే. ఉభయథాగ్రహణమ్ = కాలము నిత్యమయ్యు భూతభవిష్యచ్ఛబ్దములచే వ్యవహరింపబడును.

కాలమునిత్యమైనను దానిని వ్యక్తపరుచు క్రియ క్షణికమగుటచే భూతభవిష్యచ్ఛబ్దములచే నది వ్యవహరింప బడుట యసంగతముకాదు. కాలము క్రియావ్యంగ్యమనుట సర్వతంత్ర

సిద్ధాంతము. క్రియ క్షణికమై కృతము, కర్తవ్యము, క్రియమాణమునని విభజింపబడును. క్రియ విభజింపబడుటచే నాక్రియచే వ్యక్తమగు కాలమును ముప్విధములవిభక్తమైవ్యవహరింపబడుచున్నది. అందు కృతక్రియచే వ్యక్తకాలము అతీతము-భూతమనబడును. కర్తవ్యక్రియావ్యక్తకాలము అనాగతము-భవిష్యత్తనబడును. క్రియమాణక్రియచే వ్యక్తమగుకాలము వర్తమానమనబడును. ఇట్లు క్రియాసంబంధమునవలన కాలము భూత భవిష్య ద్వర్తమాన శబ్దములచే వ్యవహరింపబడుచు లోకమున నెల్లరచే గ్రహింపబడుచున్నది. కాబట్టి ప్రత్యక్షానుమాన ప్రమాణములును నిర్దుష్టములని తేలుచున్నది.

పూర్వపక్షము:— (ఉపమాన పరీక్ష)

"అత్యంత ప్రాయైక దేశ సాధర్మ్యా దుపమానాసిద్ధిః"

౨.౧.౪౪.

అత్యంత ప్రాయైకదేశ సాధర్మ్యాత్ =(ఇందలి సాధర్మ్య పదము అత్యంత – ప్రాయ – ఏకదేశ శబ్దము లన్నింటితో నన్వయించును.) అత్యంత సాధర్మ్యము వలనగానీ, ప్రాయస్సాధర్మ్యము వలన గానీ, ఏకదేశ సాధర్మ్యము వలనగానీ, ఉపమానాసిద్ధిః = ఉపమాన ప్రమాణము సిద్ధింపనేరదు.

ఒక వస్తువు నందుండు ధర్మములన్నియు మరియొక దానియందుండుట అత్యంతసాధర్మ్య మనబడును. దాని వలన నుపమానము సిద్ధింపదు. ఒక గోవుతో మఱియొకగోవు నుపమింతుమా? 'ఆవు ఉన్నట్లు ఆవుండును' అనము కదా!

ఒక వస్తువు నందలి యనేక ధర్మములు మరియొక వస్తువునందుండుట ప్రాయస్సాధర్మ్య మనబడును. ఇదియు నుపమాన సాధకము కాదు ఎద్దులోనుండు ననేక ధర్మములు మహిషమున నుండును. కాని ఎద్దున్నట్లు మహిష ముండు ననుట కూడదు.

ఒక వస్తువునందలి యేకాంచెము ధర్మమో మరియొక దానియం దుండుట యేకదేశసాధర్మ్యమనబడును. ఇందునను ఉపమానము సిద్ధింపదు. ఏకదేశసాధర్మ్యము లేనివస్తువులు ప్రపంచమున నుండవు. కాబట్టి ఆవగింజయున్నట్లు మేరు పర్వత ముండుననియు నుపమింప వీలగునుగదా!

పైజెప్పిన యుదాహరణములనుబట్టి సాధర్మ్యము లక్షణముగాగల యుపమానము అర్థసాధనము కాదని పూర్వ పక్షాభిప్రాయము.

ఉత్తరపక్షము: —

"ప్రసిద్ధసాధర్మ్యా దుపమానసిద్ధేః యథోక్తదోషానుప పత్తిః" ౨ ౧. ౪౫.

ప్రసిద్ధసాధర్మ్యాత్ = ప్రసిద్ధసాధర్మ్యమువలన, ఉపమానసిద్ధేః = ఉపమాన ప్రమాణము సిద్ధించుటచేత, యథోక్త దోషానుపపత్తిః = పై జెప్పబడిన దోషము లుండజాలవు

పూర్వము తనచే తెలియబడిన పదార్థముతో నితర పదార్థములకు గల సమానధర్మము ప్రసిద్ధసాధర్మ్యమనబడును. దానియందు సాధ్యమును సాధించుభావముండును. అత్యంత

సాధర్మ్యాదులు సాధ్యసాధనములుగా లక్షణసూత్రమున చెప్పి యుండలేదు. కాబట్టి పూర్వము తనచే నెఱుగబడిన గోవు నందుగల ధర్మములు గవయమున జూచి గో సదృశమగు నీజంతువు గవయపదవాచ్యమని యెఱుగుటలో నెట్టిదోషము నుండజాలదని భావము.

అత్యంత సాధర్మ్యములును ప్రకరణమునుబట్టి సాధ్య సాధకములు గావచ్చును. (౧) రామ రావణుల యుద్ధము రామ రావణుల యుద్ధమువలెనే యుండును. ఇట యుద్ధక్రియ యీ యుద్ధక్రియతోనే యుపమింపబడినది. (౨) ఎద్దువలె నీమహిషమున్నది. ఇందు రెండు జంతువులలోగల బలప్రక ర్షమున నెక్కుడు సాధర్మ్య ముండుటచే ఎద్దువంటి బలము కలది మహిషమని యుపమానము. (3) ఆవగింజ వంటిదే మేరువు:- అనుటలో ఆవ యెట్లు ఉనికి (సత్త) గలదియో అట్లే మేరువు నునికి గలదియని స్వల్పసాధర్మ్యము ఉపమాన మని యెఱుగునది.

పై యుదాహరణములద్వారా పూర్వపక్షమున జూపిన దోషముల నుద్ధరించుటచే నుపమాన ప్రామాణ్యమును దొల గింప నేరికిని శక్యముగాదని వివేకము.

పూర్వపక్షము:—

"ప్రత్యక్షే ణాప్రత్యక్షసిద్ధేః" ౨.౧.౪౬.

ప్రత్యక్షేణ = ప్రత్యక్షగోచరమైన గోసాధర్మ్యాదులచే, అప్ర త్యక్షసిద్ధేః = అప్రత్యక్షమగు గవయ సంజ్ఞావిశిష్టమగు గవయము తెలియ బడుటవలన నుపమాన మనుమానమే యగుచున్నది.

ప్రత్యక్ష ధూమముచే నగ్నిననుమానించినట్లు ప్రత్యక్ష గోసాదృశ్యముచే గవయము నెరుగుటయే యుపమానము. కాబట్టి యనుమానమునకు, నుపమానమునకు నెట్టి భేదము లేదు. అందువలన నుపమాన మనుమానాంతర్గతమే.

"నాప్రత్యక్షే గవయే ప్రమాణార్థ ముపమానస్య
పశ్యామః" ౨.౧.౪౭.

ఉపమానస్య = ఉపమాన ప్రమాణముయొక్క, ప్రమాణార్థమ్ = ప్రమాణ శబ్దార్థమును, అప్రత్యక్షే = ప్రత్యక్షముకాని, గవయే = గవయ సంజ్ఞతో కూడిన గవయ పదార్థమున, న పశ్యామః = అంగీకరింపము.

గో సాదృశ్యముచే నప్రత్యక్ష గవయమును సాధించుట యుపమానప్రమాణార్థమైనచో నది యనుమానాంతర్గతమగును. కాని, ప్రత్యక్షముగా గ్రహింపబడు గవయము గవయ పద వాచ్యమను సంజ్ఞా సంజ్ఞి సంబంధమును సాధించుట మాయుపమానమునకు ఫలము. కాబట్టి ప్రత్యక్షమగు గో సాధర్మ్యముచే నాసంబంధము తెలియబడినప్పటికి ధూమముచే వహ్ని ననుమానించినట్లెన్నడు కాజాలదు. అనుమానమున ధూమమున్నతావున వహ్నియుండునను వ్యాప్తిస్మరణ ముండును. ఉపమానమున నట్లుగాక 'గోవట్లో గవయమట్లు' అను నారణ్యకవచనము స్మరింపబడును. గో సాదృశ్యము ప్రత్యక్షమగును. ఇట్లు అనుమానోపమానములలో మహాదంతర మున్నదని సూత్రాభిప్రాయము.

"తథేత్యుపసంహారా దుపమానసిద్ధే ర్నావిశేషః"
౨.౧.౪౮.

తథేత్యుపసంహారాత్ = ఉపమానము (యథాగౌ స్తథాగవయః — గోవెట్లో గవయమట్లు) అను వాక్యముద్వారా, సిద్ధేః = సిద్ధించుట వలన, న అవిశేషః = అనుమానముతో సమానము కాదు

'గోవెట్లో గవయ మట్లు' ను వాక్యముద్వారా ఉపమానము సిద్ధించును అనుమానమున నట్టి వాక్యజ్ఞానమునకు తావు లేదు. కాబట్టి ఉపమాన మనుమానము కాదు.

పూర్వపక్షము:— (శబ్దపరీక్ష)

"శబ్దోఽనుమానమర్థస్య అనుపలబ్ధే రనుమేయత్వాత్." ౨.౧.౪౯.

అర్థస్య = శబ్దవిషయమగు నర్థము, అనుపలబ్ధేః = ప్రత్యక్షముగా నుపలబ్ధము కాక, అనుమేయత్వాత్ = అనుమానింపశక్యమగుటవలన, శబ్దః = శబ్దప్రమాణము, అనుమానమ్ = అనుమానమే.

పరోక్షము, అపరోక్షము నని యర్థము రెండు విధములు. అందపరోక్షము ప్రత్యక్షప్రమాణముచే నుపలబ్ధమగును. పరోక్ష మట్లుకాదు. కాబట్టి యది యనుమానమునకు విషయమగును. పరోక్షాపరోక్షములకు మించి మఱియొండు పదార్థము ప్రపంచమున గానము. అట్టియెడ శబ్ద ప్రమాణమును వేరుగా నంగీకరింపనేల? విషయ భేదము ననుసరించియే ప్రమాణభేదమును స్వీకరింపవలయును. అనుమానమెట్లు ప్రత్యక్షము కాని విషయమును తెలుపునో అట్లే శబ్దమును పరోక్ష విషయమునే బోధించును. కాబట్టి శబ్దప్రమాణము అనుమానంతర్గతమేల కాదు?

"ఉపలబ్ధే రద్విప్రవృత్తిత్వాత్" ౨.౧.౫౦.

ఉపలబ్ధేః = శబ్దమువలనను, అనుమానము వలనను కలుగు జ్ఞానము, అద్విప్రవృత్తిత్వాత్ = రెండువిధములగు ప్రవృత్తులుకలవి కాకుండుట వలన శబ్ద మనుమానమే

అనుమాన ప్రమాణముకంటె శబ్దము భిన్నమగునెడల అనుమానమువలన కలుగు జ్ఞానము (ఉపలబ్ధి) కంటె శబ్దము వలన కలుగు జ్ఞానము భిన్నప్రకారముగా నుండవలయును. ప్రత్యక్షప్రవృత్తి ప్రత్యక్షార్థమున నుండును. అనుమాన ప్రవృత్తి యప్రత్యక్షార్థమున నుండును. అట్లే శబ్దమును భిన్నార్థ విషయిక ప్రవృత్తికలదైయున్న ప్రమాణాంతరము కాగలను. అట్లుగాక యనుమానమువలె నదియు పరోక్షార్థ మునే తెలుపుచున్నందువలన శబ్ద మనుమానమే.

"సంబంధాచ్చ." ౨.౧.౫౧.

సంబంధాచ్చ = వాచ్యవాచక భావలక్షణాత్మక నియతసంబంధము వలనను శబ్దమనుమానమే.

దృష్టిగోచరమైన ధూమాదిలింగములు తమతో సంబద్ధములగు వహ్న్యాద్యగు పదార్థముల జ్ఞానమును కలిగించు చున్నవి. అట్లే శబ్దమును శ్రవణగోచరమై స్వసంబంధియగు నర్థమును బోధించును. కాబట్టి శబ్దమనుమానమే.

ఉత్తరపక్షము:—

"ఆప్తోపదేశ సామర్థ్యా చ్ఛబ్దా దర్థసంప్రత్యయః."

౨.౧.౫౨.

ఆప్తోపదేశ సామర్థ్యాత్ = ఆప్తోపదేశమువలన కలుగు (యథార్థ జ్ఞానము నుత్పన్న మొనర్చుట యను) సామర్థ్యముగల, శబ్దాత్ = శబ్దమువలన, అర్థసంప్రత్యయః = అర్థజ్ఞానము కలుగును.

లింగమువలన లింగి తెలియబడినట్లు శబ్దమువలననే శబ్దార్థము గోచరమగునెడల శబ్దప్రమాణ మనుమానము కానగును. కాని ఆప్తోపదేశ సామర్థ్యముగల శబ్దమువలన నర్థ ప్రత్యయము కలుగుటచే నట్లు కానేరదు.

అనుమానమున నాప్తోపదేశమునకు తావులేదు. శబ్దమోయాప్తోపదేశకృత సామర్థ్యసహాకారములేక యర్థబోధకము కానేరదు. కాబట్టి శబ్దానుమానములలో భేదము లేకపోలేదు. శబ్దమనుమానమువలె పరోక్షార్థమునే బోధించినను, ఆప్తులచే నుపదిష్టమగుటచేతనే ప్రమాణమై, అర్థజ్ఞానముకలిగించుట కాప్తులచే నుపదిష్టమై ప్రమాణము కావలయునను నియమములేని యనుమానముకంటె నెంతో భిన్నమగుట నిర్వివాదమని సూత్రతాత్పర్యము.

అనుమానముకంటె శబ్దప్రమాణము భిన్నమని తెలుపబడినది. ప్రాసంగికముగా శబ్దార్థములకుగల సంబంధమెట్టిదో పరీక్షింపదలచి ముందుగా శబ్దార్థములకు సంబంధమే లేదనుచున్నాడు.

(ఈ ప్రకరణమున శబ్దార్థములకుగల సంబంధ మవినాభావమని పూర్వపక్షము; కాదు సామయికము - సాంకేతికమని సిద్ధాంతము.)

పూర్వపక్షము:—

"పూరణప్రదాహపాటనానుపలబ్ధేశ్చ సంబంధాభావః."

౨.౧.౫౩.

పూరణప్రదాహపాటనానుపలబ్ధేః = మోదకము, అగ్ని, కత్తి యనుశబ్దముల నుచ్చరించినపుడు ముఖము (నోరు) నిండుటగానీ, దహింపబడుటగానీ, చీల్పబడుటగానీ జరుగుట లేదు, కాబట్టి, సంబంధాభావః = శబ్దార్థములకు సంబంధము లేదు.

శబ్దార్థములకు సంబంధమున్న శబ్దసమీపమున నర్థము, అర్థ సమీపమున శబ్దము నుండవలయును. అర్థ సమీపమున శబ్దమున్నదని చెప్పవలనుపడదు. అట్లున్న పక్షమున, శబ్దముకంఠ తాల్వాది ముఖావయవములచే నుచ్చరింపబడుచున్నదికదా! అదియెట్లు సంభవమగును? అర్థము (ఘటపటాది వస్తువులు)న్న చోట కంఠ తాల్వాది అవయవములు లేవుకదా! శబ్ద సమీపమున నర్థమున్న దందుమా, నోటిలోని తాల్వాద్యవయవ ప్రదేశములచే నగ్ని, మోదకాది శబ్దముల నుచ్చరించి నపుడు తత్సమీపమున నుండు నగ్ని, మోదకాది వస్తువులచే నోరు దహింపబడుటయు, నిండుటయు జరుగవలయును కదా; అట్లు జరుగకపోవుటచే శబ్దాంతికమున నర్థమున్నదనుటయు పొసగదు. కాబట్టి శబ్దార్థములకు సంబంధము లేదు.

"శబ్దార్థవ్యవస్థానా దప్రతిషేధః" ౨.౧.౫౪.

శబ్దార్థ వ్యవస్థానాత్ = శబ్దమువలన కలుగు నర్థజ్ఞానమున వ్యవస్థ యుండుటవలన, అప్రతిషేధః = శబ్దార్థములకు సంబంధము లేదనుట తగదు.

శబ్దార్థములు పరస్పరము సంబద్ధములు కానియెడల శబ్దమువలన కలుగు నర్థజ్ఞానమున (ఒక శబ్దమొక యర్థమును తెలుపునుకాని సర్వార్థములను తెలుపదను) వ్యవస్థ యుండనేరదు. వ్యవస్థ కనబడుచున్నది కాబట్టి సంబంధమున్నదనియే

తెలుచున్నది. కాని యీ సంబంధము కుండకు అందలి రేగుపండ్లకు నున్న సంబంధమువలె సంయోగము కాదు. తంతు పటములకువలె సమవాయమునుకాదు. సంయోగ, సమ వాయ సంబంధములలో నొకటి శబ్దార్థములకుగల సంబంధ మగునెడల మోదకాది శబ్దోచ్చారణవలన పూరణ దాహా దులు కలుగవలసియుండును. కాబట్టి శబ్దార్థముల సంబంధము సంయోగముగానీ, సమవాయముగానీ కాక యవినాభావ మని పూర్వపక్షి యభిప్రాయము.

ఉత్తర పక్షము:—

"న, సామయికత్వాచ్ఛబ్దార్థ సంప్రత్యయస్య" ౨.౧.౫౬.

శబ్దార్థ సంప్రత్యయస్య = శబ్దమువలన కలుగు నర్థజ్ఞానము, సామయికత్వాత్ = (ఈ శబ్దమువలన నీయర్థము తెలిసికొనదగునను నీశ్వర సంకేతము సమయ మనబడును) సామయిక మగుటవలన, న = అవినాభావ సంబంధము కాదు.

'ఈ శబ్దమున కిదియర్థము' లేక 'ఈ శబ్దముచే నీయ ర్థము తెలియనగును' అనునియమము—సమయము (సంకే తము) అనబడును. అట్టిసమయమే శబ్దార్థముల సంబంధము నకు హేతువు. కాబట్టి శబ్దార్థసంబంధమును వాచ్యవాచక భావ సంబంధమనియు, వృత్తియనియు, శక్తియనియు వాదు దురు. పరంపరగాన్వృద్ధవ్యవహారాదులవలన నా (సమయము) సంబంధము తెలియబడును. దానింబట్టి శబ్దమువలన నర్థ ప్రత్యయము కలుగును. వ్యవస్థయునేర్పడును. శబ్దార్థములకు గల సంబంధము స్వాభావికమని యంగీకరించు వారును

ఆ సంబంధము జ్ఞాతమయినవారికే శబ్దమువలన నర్థబోధము కలుగునని యంగీకరింపకతప్పదు. జ్ఞాతమగుటయన, ఈశబ్దమీ యర్థమునకు వాచకమనియో, ఈశబ్దముచే నీయర్థమెరుగదగు ననుటయోకదా. ఇదియే సమయము, కాబట్టి శబ్దార్థముల ప్రత్యయము సాంబంధికముగాక సామయికమే యగును.

"జాతివిశేషేచా నియమాత్." ౨.౧ ౫౬.

జాతివిశేషేచ = ఘటాదిజాతిభేదమునందును, అనియమాత్ = పటశబ్దవాచ్యత్వ నియమములేకుండుట వలన శబ్దార్థసంబంధ మవినాభావముకాక సామయికమే యని యర్థము.

మఱియు శబ్దార్థములు స్వాభావిక సంబంధము కలవగుచో ఘటాద్యర్థములు పటశబ్దముచేతను బోధింపబడవలసి యుండునను నియమ ముండియుండెడిది. అట్టిది కానము. కాబట్టి సంకేత హేతుకమే శబ్దార్థ జ్ఞానము.

శబ్దప్రమాణమును సామాన్యముగ పరీక్షించి విశేష రూపమున పరీక్షింపనెంచి సూత్రమును రచించుచున్నాడు.

పూర్వపక్షము :—

"తదప్రామాణ్యమనృతవ్యాఘాతపునరుక్తదోషేభ్యః"
౨. ౧. ౫౭.

(అయథార్థమును జెప్పుట యనృతమనబడును. అసంబద్ధమును జెప్పుట వ్యాఘాత మనబడును. చెప్పినది మరల జెప్పుట పునరుక్త మనబడును.) అనృతవ్యాఘాతపునరుక్తదోషేభ్యః = అనృతాది దోషములవలన, తత్ = బ్రాహ్మణప్రభృతిఅదృష్టార్థబోధకశబ్దములు, అప్రామాణ్యమ్ = ప్రమాణములు కావు.

శబ్దములు దృష్టార్థప్రవక్తృకములు, అదృష్టార్థప్రవక్తృకములు నని రెండు విధములు. అందు వైదికశబ్దములు దృష్టార్థప్రవక్తృకములు. ఈశ్వరుడు సర్వజ్ఞుడును, సర్వద్రష్టయు నగుటంజేసి, ఈశ్వరీయములయిన ఋగ్యజుస్సామాథర్వము లనబడు వైదిక శబ్దములు దృష్టార్థప్రవక్తృకము లనుటలో నెట్టి సందియము నుండదు. కాబట్టి వైదికశబ్దములు అనృతవ్యాఘాత పునరుక్తాది దోషయుక్తములు కానేరవు. ఋగ్యజుస్సామములు బ్రహ్మపద వాచ్యములు. కారణము బ్రహ్మప్రభవములగుటయో బృహదర్థకములగుటయో యన నగును. వేదములు బ్రహ్మపదవాచ్యములనుటకుదాహరణము.

"బ్రహ్మణః ప్రణవంకుర్యా దాదావంతేచ సర్వదా
స్రవత్యనోంకృతం పూర్వం పరస్తాచ్చ విశీర్యతే"
(మను. ౨. ౭౪.)

బ్రహ్మ, ఛందస్సు, వేదము, మంత్రము నను పదములు పర్యాయములు. వేదమంత్రముల కాద్యంతములలో ప్రణవము నుచ్చరింపవలయునని శ్లోకాభిప్రాయము.

ఇట్లు బ్రహ్మపదవాచ్యములగు ఋగాది వేదములకు వ్యాఖ్యానములు. ఋషులచే వ్రాయబడి బ్రాహ్మణము లనబడును. అందు ఋగ్వేద వ్యాఖ్యానము ఐతరేయ బ్రాహ్మణము. యజుర్వేద వ్యాఖ్యానము శతపథ బ్రాహ్మణము. సామవేద వ్యాఖ్యానము తాండ్యబ్రాహ్మణము. అథర్వవేద వ్యాఖ్యానము గోపథబ్రాహ్మణము.

ఇట్టి బ్రాహ్మణములలో నొకట (పుత్రకామః పుత్రేష్ట్యాయజేత) పుత్రకామి పుత్రేష్టియాగము నొనరింపవలయునని విధిగలదు. ఆవిధిననుసరించి పుత్రకామేష్టి నొనరించినను పుత్రులు కలుగకుండుట చూచుచున్నాము. కాబట్టి యనృత దోషయుక్తమైన యీ వాక్యము అప్రమాణము. ఇట్లే (ఉదితే హోతవ్యమ్, అనుదితే హోతవ్యమ్, సమయాధ్యుషితే హోతవ్యమ్.) సూర్యుడుదయించిన తర్వాత హోమము చేయవలయును. ఉదయింపకముందు హోమమొనరింప వలయును. సమయము గతించినతదుపరి హోమము చేయవలయును. అని హోమమును విధించి, (శ్యావోఽస్యాహుతి మభ్యవహరతి య ఉదితే జుహోతి, శబలోఽస్యాహుతి మభ్యవహరతి యోఽనుదితే జుహోతి, శ్యావశ్యబలావాఽస్యాహుతి మభ్యవహరతః యః సమయాధ్యుషితేజుహోతి) ఉదయించినమీదట హోమమొనర్చిన శ్వానము ఆ యాహుతిని తినుననియు, ఉదయింపక పూర్వమొనర్చిన యాహుతిని శబలము తినుననియు, సమయాతిక్రమణ మొనర్చి చేసిన యాహుతి శ్యావ శబలములు తినుననియు చెప్పుటచే నసంబద్ధములైన యీ వాక్యములు అర్థబోధకములు కాజాలవు.

మఱియు, (స్త్రైస్త్రిః ప్రథమామన్వాహ త్రిరుత్తమామ్. శత. ౧. ౨. ౨. ౬.) ఈ వాక్యముచే ప్రథమోత్తమ 'సామిధేని' ఋక్కులను ముమ్మారు రుచ్చరింప వలయునని చెప్పుటచే చెప్పినదానిని మరలచెప్పుట యను పునరుక్త దోషముండుటచే నప్రమాణమని యభిప్రాయము.

పైనవర్ణించిన యుదాహరణముల వలన బ్రాహ్మణ గ్రంథములలోని శబ్దము లనృతాది దోషయుక్తములగుటచే అర్థప్రత్యాయకములు - అర్థబోధకములు కాక యప్రమాణ ములగునని సూత్రాభిప్రాయము

ఉత్తరపక్షము:—(అనృతదోషనివారణ.)

"న కర్మకర్తృసాధనవైగుణ్యాత్" ౨.౧.౫౮.

కర్మ కర్తృసాధన వైగుణ్యాత్ = కర్మ, కర్త, సాధనములు వీని వైకల్యము వలన ఫలము గలుగదు. కాబట్టి, న = అనృతదోషము శబ్దమున లేదు.

శాస్త్రమున చెప్పినట్లనుష్ఠింపకుండుట కర్మ వైగుణ్యము. అనభిజ్ఞత, నిందితాచరణముకలవాఁడగుట కర్తృ వైగుణ్యము. సహకారి కారణములన్నియు లేకుండుట కర్మ వైగుణ్యము.

కర్మచేయువ్యక్తియు, సాధనములును, స్వయముగా కర్మయును గుణయుక్తములుగా నుండవలయును. నాడే శాస్త్రవిహిత కర్మ సమయమున ఫలము నొసంగగలుగును. కర్మ, కర్త, సాధనములు వీని మూటిలో నేవి గుణరహితము లైనను ఫలము లభించుట దుర్లభము. కాబట్టి శాస్త్రవిహిత కర్మలు ఫలోదయములు కాకుండుటకు కారణము సాధనాదుల లోటుగాని, శబ్దమనృతమగుట కాదు.

(వ్యాఘాతదోషపరిహారము)

"అభ్యుపేత్యకాలభేదేదోషవచనాత్" ౨. ౧. ౫౯.

అభ్యుపేత్య = ఒకడొక కాలమును తానగ్నిహోత్ర మొనర్చుట కంగీకరించి, కాలభేదే = ఆకాలము నతిక్రమించిన, దోషవచనాత్ = దోషమని చెప్పుటవలన వ్యాఘాత దోషమును లేదు.

కాలము రెండువిధములు ఉదితము, అనుదితము నని. సమయాధ్యుషిత మనుదితములోనే చేరును. ప్రాతఃసంధి కాలము సమయాధ్యుషితమనియు, సాయం సంధికాలము సమయూషితమనియు జెప్పబడును.

ఒకడు అగ్న్యాధాన సమయమున (ఉదితేజుహావాని) ఉదితమున నగ్నిహోత్రము చేయుదునని యంగీకరించి, యగ్నిహోత్రముజేయ నారంభించి, పిమ్మ దాలస్యాది దోషములకు లోనై, తానంగీకరించిన కాలము నతిక్రమించి యగ్నిహోత్రము చేయునెడల వాని యగ్నిహోత్ర ముచ్ఛిన్నమగునని చెప్పుట వ్యాఘాతమనబడదు. నియత సమయమున నగ్నిహోత్రము జేయునెడల నెట్టిదోషము నుండ దని సూత్రాభిప్రాయము. కాబట్టి వ్యాఘాతమను శబ్దదోష మిట లేదని వివేకము.

(పునరుక్త దోషనివారణ)

"అనువాదోపపత్తేశ్చ" ౨.౧.౬౦.

ఒకమాటు చెప్పినదానిని మరల చెప్పుట యనువాద మనవచ్చును. కాబట్టి పునరుక్త దోషమును లేదని సూత్రార్థము.

అనర్థకాభ్యాసము పునరుక్తదోషమనబడును. అర్థవంత మగు నభ్యాస మనువాదమనబడును. చెప్పినది మరల జెప్పుట (అభిహితాభిధానము) సార్థకము, నిరర్థకము నని రెండు

విధములు సంభవము. అందు నిరర్థకము పునరుక్త దోష యుక్తమగును. సార్థకము అనువాద మనబడి దోషముగా నెంచబడదు. ("సవై త్రిః ప్రథమామన్వాహ త్రిరుత్తమాం" శత. ౧.౩.౨.౬) అనుస్థలమున ప్రథమోత్తమ 'సామధేని' లను ముమ్మారుచ్చరించవలయునను విధానము అనువాదమేగాని పునరుక్తముకాదు.

("సమింధేసామిధేనీభిర్ హోతా తస్మాత్ సామిధేన్యో నామ" శత ౧. ౩. ౨. ౧.) అను శతపథప్రమాణము ననుస రించి ("ప్రవోవాజా అభిద్యవో హవిష్మంతో ఘృతాచ్యా, దేవాం జిగాతి సుమ్నయుః" ఋ. ౩. ౧. ౨౭. ౧) ప్రభృతి ఋక్కులు పదునొకండు వహ్నిసమింధన వేళలో పాడబడును. కాబట్టి సామధేని ఋక్కులనబడును. ఈ సామిధేనులు ప్రకృతి యాగమున పదునైదును, వికృతి యాగమున పదునేడును అనువదింపవలయునని విధింపబడయున్నది. ("సప్తదశసామిధే నీరనుబ్రూయాత్" ఐత. ౧. ౧. ౧.) ("పంచదశసామిధేనీ రన్వాహ" తై. సం ౨. ౬.౮. ౨.) అనువాక్యము లిందు ప్రమాణములు. ఇట్లు విధివిహితమైన యనువాదము నిరర్థక మనంజనదు. కాబట్టి పునరుక్తదోషము లేదని భావము. అనువాదము స్వీకరింపక సమాధానముచెప్పుట(పరిహరించుట) సరికాదు, అనగా,

"వాక్య విభాగస్య చార్థగ్రహణాత్" ౨.౧.౬౧.

వాక్య విభాగస్యచ = బ్రాహ్మణ వాక్యములలో నను వాదాది భేదముల విభాగము, అర్థగ్రహణాత్ = అర్థవశమున శిష్టులచే స్వీకరింప బడుటవలన పై జెప్పిన సమాధానము తగినదే.

శిష్టులు అర్థవైచిత్ర్యము నెఱింగి బ్రాహ్మణ వాక్యముల ననువాదాది భేదముల విభాగించిరి. ఒకానొక యర్థము విధించువాక్యము విధివాక్య మనబడును. విహితార్థస్తుతిగానీ, ప్రతిషిద్ధార్థ నిందగానీచేయు వాక్యము అర్థవాద మనబడును. ఒకానొక విశేషవిషయమును విధింపదలచి యొకమారుచెప్పినదానిని మరల చెప్పుట యనువాదమనబడును.

బ్రాహ్మణ వాక్యములను శిష్టు లెన్నివిధముల విభజించిరనగా:—

“విధ్యర్థ వాదానువాద వచన వినియోగాత్” ౨.౧.౬౨.

ఈ సూత్రమున వినియోగశబ్దము భేదార్థకము. విధి వచనము, అర్థవాదవచనము, అనువాద వచనము నను భేదముతో బ్రాహ్మణ వాక్యములు మువ్విధములని సూత్రాభిప్రాయము.

అందు విధి వాక్యము:—

“విధిర్విధాయకః.” ౨.౧.౬౩.

విధాయకః = ఉపదేశకము (ప్రవర్తకము - చోదకము) అగు వాక్యము, విధిః = విధివాక్యమనబడును. ఒకవాక్యము ద్వారా ఏదేనొక కార్యమున ప్రవర్తింపు మనియో లేక వలదనియో విధించుట, ‘ఇది చేయుము.’ ‘ఇదిచేయకుము’ అనుట విధియందురు.

ఉదా:- ‘స్వాధ్యాయోఽధ్యేతవ్యః’ (శత. ౧౧.౫.౮.౩.)

‘అగ్నిహోత్రం హోతవ్యం’ (శత. ౨.౨.౨.౧౮)

“సత్యంవద; ధర్మంచర; స్వాధ్యాయాన్మాప్రమదః; ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః; దేవపితృ కార్యాభ్యాం నప్రమదితవ్యం; మాతృదేవోభవ; పితృదేవోభవ.”

తై. శి. ౧.౧౧.)

అర్థవాదముః—

"స్తుతిర్నిందా పరకృతిః పురాకల్ప ఇత్యర్థవాదః"
౨.౧.౬౪.

స్తుతిః = స్తుతి, నిందా = నింద, పరకృతిః = పరకృతి, పురాకల్పః = పురాకల్పము, ఇతి = అని, అర్థవాదః = అర్ధవాదము నాలుగు విధములు.

ఒకని నొక కర్మయందు ప్రవర్తింపజేయుటకో, లేక యొకకర్మనుండి మరలించుటకో విధివాక్యముద్వారా యపేక్షింపబడి కొండొకయర్థమును ప్రశంసించుచునో లేక నిందించుచునో ప్రవర్తించు వాక్యము అర్థవాద మనబడును ఆ వాక్యము స్తుత్యాదిభేదముల నాలుగువిధములనిసూత్రార్థము.

స్తుత్యాత్మకార్థ వాదముః—

"సయథాఽహిస్త్వచో నిర్ముచ్యేతఏవం సర్వస్మాత్ పాప్మనో నిర్ముచ్యతే యఏవం విద్వానగ్నిహోత్రం జుహోతి" (శత. ౨.౨.౩.౬.)

పాము కుబుసమునుండి విడివడునట్లు అగ్నిహోత్రము చేయు వ్యక్తి సర్వ పాపములనుండి విముక్తుడగునని యభిప్రాయము.

"ఏతద్ధవై దేవా వ్రతం చరంతి యత్ సత్యం, తస్మాత్ తేయశః యశోహభవతి య ఏవం విద్వాన్ సత్యం వదతి" (శత. ౧.౧.౧.౫.)

విద్వాంసులు సత్యవ్రతము నాచరింతురు. సత్యమాడువారు యశస్సును బొందుదురని యభిప్రాయము.

"శిరో వై యజ్ఞ స్యాతిథ్యమ్" (శత. ౩.౪.౨.౧.)

ఆతిథ్యము యజ్ఞమునకు శిరస్సువంటిది.

నిందాత్మకార్థవాదము:—

"సమూలోవా ఏష పరిశుష్యతి యోఽనృత మభివదతి"

(ప్ర. ఉ. ౬.౧.)

అనృతమాడు వ్యక్తి సమూలము నశించును.

పరకృతిలక్షణార్థవాదము:—

ఇతరుని చే చేయబడిన వ్యాహృత విధివచనము పరకృతి.

"హుత్వావపామేవాగ్రేఽభిఘారయత్యథపృషదాజ్యం, తదుహ చరకాధ్వర్యవః పృషదాజ్యమేవాగ్రేఽభి ఘారయన్తి ప్రాణాఅగ్నేః పృషదాజ్యమితి వదన్తః"

(శత. ౩.౮.౩.౨౪.)

వపను ముందు హోమముచేసి యటుపై పృషదాజ్యము నభిఘరించునని చెప్పి, మరల చరకాధ్వర్యులు పృషదాజ్యమగ్నికి ప్రాణములు కాబట్టి ముందు పృషదాజ్యమునే యభిఘరించుననుట పరస్పర విరుద్ధమగుటచే నిది పరకృతి.

ఇతిహాసముద్వారా చెప్పునది పురాకల్ప మనబడును.

"ఏతేన హేంద్రోతో దైవాపః, శౌనకో జనమేజయం పారిక్షితం యాజయాంచకార, తేనేష్ట్వాసర్వాంపాపకృత్యాం, సర్వాం బ్రహ్మహత్యా మపజఘాన. సర్వాంహవై పాప కృత్యాం సర్వాం బ్రహ్మహత్యా మపహన్తి యోఽశ్వమేధేన యజతే" (శత. ౧౩.౫.౬.౧.)

శౌనకుడు జనమేజయునిచే నశ్వమేధమును జేయించెను. అతడశ్వమేధము నొనర్చి సర్వపాపకృత్యములను తొలగించుకొనెనని యభిప్రాయము. ఈయర్థవాదములు విధివాక్యముతోకూడి యర్థవంతములగును. స్వతంత్రముగా వీనికి సార్థకత యుండదు.

అనువాదలక్షణము:—

"విధి విహిత స్యాను వచన మనువాదః" ౨.౧.౬౪.

విధి విహితస్య = విధిచే విధింపబడినదానిని, అనువచనం = పునర్వచనము - మరలచెప్పుట అనువాదః = అనువాదమనబడును.

విధినిగానీ, విహితార్థమునుగానీ ఉద్దేశించి యనేక పర్యాయములు చెప్పెడు వాక్య మనువాద మనబడును. ("త్రిః ప్రథమా మన్వాహ... ...") అను నుదాహరణము నిట స్మరింపదగును. (అనువాదోపపత్తేశ్చ" ౨.౧.౭౦) అను సూత్రమున అనువాద రూపార్థవాదము స్పష్టపరుపబడినది. మఱియు, (ఓదనం పచేత్) 'అన్నము వండుము' అనునిది విధి వాక్యము. (ఆయుర్వర్చోబలం సుఖం ప్రతిభానం చాన్నే ప్రతిష్ఠితమ్) అని యర్థవాదము. (పచతు పచతు భవాన్) ఇది యనువాదము. ఇందు (పచతు పచతు) వండుము వండుము. అని రెండుమార్లు చెప్పుటలో త్వరగా వండుమని బోధయగును. ఇట్టి యర్థము నుద్దేశించి యొక శబ్దము పెక్కుమారులనబడుట యనువాద మనబడునని సూత్రాభిప్రాయము.

"నానువాద పునరుక్తయోర్విశేషః శబ్దాభ్యాసోపపత్తేః"

౨.౧.౬౬.

శబ్దాభ్యాసోపపత్తేః = చెప్పిన శబ్దమును మరలచెప్పుట యభ్యాస మనబడును అట్టి యభ్యాసము అనువాద పునరుక్తములలో రెంటియందుం డుటచే, అనువాద పునరుక్తయోః = అనువాద పునరుక్తములలో, నవిశేషః = భేదములేదు.

అనువాద పునరుక్తములలో నభ్యాసము (ఒకశబ్దము ననేక పర్యాయములనుట) సమానముగ నుండుటచే రెంటి యందును భేదములేదు.

ఉత్తరపక్షము:—

“శీఘ్రతర గమనోపదేశ వదభ్యాసాన్నాఽవిశేషః” ౨.౧.౬౭.

శీఘ్రతర గమనోపదేశవదభ్యాసాత్ = లోకసిద్ధమైన శీఘ్రతర గమనోపదేశమువలె నభ్యాసమును సార్థకమగుటవలన, నఅవిశేషః = అను వాద పునరుక్తములు సమానములు కావు.

అనువాద పునరుక్తులలో నభ్యాసము సమానమైనను అర్థగతభేదము లేకపోలేదు. ఒకనిని త్వరగా వెళ్లుమని చెప్ప దలచి ‘వెళ్లు వెళ్లు’ అని చెప్పుట లోకసిద్ధవిషయము. ఇందొక శబ్దము రెండుమార్లుచ్చరింపబడుటలో త్వరితము తెలుప బడును. కాబట్టి యిట పునర్వచనము సార్థకమై అనువాద మనబడును. నిరర్థకముగా నొకపద మనేక పర్యాయము లుచ్చ రింపబడుట పునరుక్తి యనబడును. కాబట్టి భేదము లేకపో లేదని సూత్రాభిప్రాయము.

అనృతాది దోషములు లేవన్నంత మాత్రమున బ్రాహ్మణ వాక్యాదులు ప్రమాణములా? యన,

"మంత్రాయుర్వేదప్రామాణ్యవచ్చ తత్ప్రామాణ్య మాప్తప్రామాణ్యాత్" ౨.౧.౬౮.

మంత్రాయుర్వేద ప్రామాణ్యవత్ చ = (మంత్రమనగా నిట వేదమని యర్థము) వేదము, ఆయుర్వేదము నెట్లు ప్రమాణములో అట్లే. తత్ప్రామాణ్యమ్=బ్రాహ్మణవాక్యప్రామాణ్యము ననియెఱుగవలయును, కారణమేమన; ఆప్తప్రామాణ్యాత్ =బ్రహ్మవాదులగు ఋషులు ఆప్తులు; వారు ప్రమాణమగుటవలన

ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, అర్థ వేదము నని నాలుగు ఉపవేదములు. చరకసుశ్రుతాదిఋషులు ఋగ్వేదాదుల నాధారముగా తీసికొని చరకసుశ్రుతాది గ్రంథ ములు రచించిరి. ఆ గ్రంథము లాయుర్వేదనామముచే వ్యవ హరింపబడుచున్నవి. ఇందు వేదానుకూలముగా నున్నంత వరకు సఫలములగుచు ప్రమాణము లగుచున్నవి. కాబట్టి వాని నుదాహరించుచు, నట్లే బ్రాహ్మణ వాక్యములును వేదానుకూలముగా నున్నంతవరకు ప్రమాణములనియు ప్రతి కూలస్థలముల నప్రమాణములనియు మహర్షి గోతముడు సూత్రమున తన యభిప్రాయమును వెల్లడించెనని భావము.

ద్వితీయాధ్యాయమున ఆద్యాహ్నికము.

న్యాయ దర్శనము

ద్వితీయాధ్యాయము

(ద్వితీయాహ్నికము)

పూర్వపక్షము:— (ప్రమాణ సంఖ్యానిర్ణయము)

"న చతుష్ట్వ మైతిహ్యార్థాపత్తి సంభవాభావ
ప్రామాణ్యాత్" ౨. ౨. ౧.

ఐతిహ్యార్థాపత్తి సంభవాభావ ప్రామాణ్యాత్ = ఐతిహ్యము, అర్థాపత్తి, సంభవము, అభావము నను ప్రమాణము లుండుటచే, చతుష్ట్వమ్=ప్రమాణములు నాలుగేయనుట, న = తగదు.

(ప్రత్యక్షానుమానోపమాన శబ్దాః ప్రమాణాని) యని సూత్రించి ప్రమాణములు నాలుగేయని పూర్వాధ్యాయమున చెప్పియుండుట సరికాదు. కారణమేమన, ఐతిహ్యము, అర్థాపత్తి, సంభవము, అభావము నను మరినాలుగు ప్రమాణము లున్నవి. కాబట్టి ప్రమాణము లెనిమిది యని చెప్పవలయునని సూత్రాభిప్రాయము.

"ఇట్లు చెప్పిరి" అను పరంపరగావచ్చు నైతిహాసిక జ్ఞానము ఐతిహ్య మనబడును. ఉపపాద్యజ్ఞానముద్వారా ఉపపాదక కల్పన అర్థాపత్తియనబడును. ఏదిలేకున్న ఏది కలుగ నేరదో యది ఉపపాద్య మనబడును. పగట భుజింపని వాడు రాత్రి వేళ భుజింపకున్న స్థూలుడు కాజాలడు. అతనియందు పీనత్వము

కలుగజాలదు. రాత్రిభోజన మిట ఉపపాదకము, పీనత్వము ఉపపాద్యము నని భావము

అవినాభావవర్తి యగు నొకవస్తువుయొక్క సత్తాజ్ఞానము వలన కలుగు మఱియొక పదార్థ సత్తా జ్ఞానము సంభవ మనబడును. కుంచెడు ధాన్యమున్న దనిన మానెడునున్న దని వేరే చెప్పనవసరముండదు. ఇట్లే యొకరూప్యమున్న దనిన పావులా యున్న దనుటలో నెట్టి సందియము నుండదు.

అభావమన విరోధి. కొండొక వస్తువుయొక్క జ్ఞానము కలుగకుండుట యభావ మనబడును.

ఉత్తరపక్షము:—

"శబ్ద ఐతిహ్యానర్థాంతరభావా దనుమానేఽర్థాపత్తిసంభవా
భావా నర్థాంతర భావాచ్చా ప్రతిషేధః ౨.౨.౨.

శబ్దే=శబ్దప్రమాణమున, ఐతిహ్యానర్థాంతర భావాత్=ఐతిహ్య ప్రమాణ మంతర్భావ మగుట వలనను, అనుమానేచ=అనుమాన ప్రమాణమున, అర్థాపత్తి సంభవాభావానర్థాంతర భావాత్ = అర్థాపత్తి మున్నగు ప్రమాణము లంతర్భావములగుట చేతను, అప్రతిషేధః=ప్రమాణములు నాలుగు కావని చెప్పుట తగదని సూత్రార్థము.

ఐతిహ్యాదులు ప్రమాణములుకావని మేము చెప్పము. కాని యవి ప్రమాణములయ్యు పూర్వము వర్ణింపబడినప్రత్యక్షాదిప్రమాణములలోనే చేరిపోవుటచే వానిని వేరుగా లెక్కింపము, కాబట్టి ప్రమాణములు నాలుగనుట దోషము కాదని భావము.

పూర్వపక్షము:—

"అర్థాపత్తిరప్రమాణమ్ అనైకాంతికత్వాత్." ౨. ౨. ౩.

అనైకాంతికత్వాత్=వ్యభిచారియగుటవలన, అర్థాపత్తిః=అర్థాపత్తి, అప్రమాణమ్=ప్రమాణము కానేరదు.

ఒక విషయమును గూర్చి చెప్పగా మరియొక విషయము తెలియును. దాని నర్థాపత్తియందురు. మేఘములు లేకున్న వర్షము కురియదని చెప్పగా మేఘములున్న వర్షము కురియునని బోధపడును. ఇట్లే స్థూలుడైన దేవదత్తుడు పగటి భోజనమే చేయడనిన, రాత్రిభోజనముచేయుచున్నాడనికదా తెలియును. కాని యీ జ్ఞానము సరియైనదనుటెట్లు? కారణమేమన: ఒకప్పుడు మేఘములున్నను వర్షింపవు. పగట భోజనముచేయని దేవదత్తునిలోగల స్థూలము రాత్రియందు భోజనము చేయకున్నను వాతరోగాదులవలనను కలుగవచ్చును. అర్థాపత్తి ప్రమాణమేయగునెడల నది యిట్లర్థమును వ్యభిచరింపరాదు. వ్యభిచారము కాననగుచున్నది. కాబట్టి యర్థాపత్తి ప్రమాణముగా నంగీకరించి యనుమానమున నంతర్భావము జేయుట తగదని సూత్రాభిప్రాయము.

ఉత్తరపక్షము: —

"అనర్థాపత్తా వర్థాపత్త్యభిమానాత్" ౨.౨.౪

అనర్థాపత్తౌ = అర్థాపత్తి కాని దానియందు, అర్థాపత్త్యభిమానాత్ =అర్థాపత్తియని భావము కలుగుటచే, వ్యభిచారముకనబడుచున్నది.

అర్థాపత్తి కానిదానిని — అర్థాపత్త్యాభాసమును అర్థాపత్తిగానెంచి పూర్వపక్షమున దోషము జూపబడినది. మేఘ

ములున్నంతమాత్రమున వర్షము తప్పక కురియును అనుట తగదు. ప్రతిబంధక రహితమగు మేఘములున్న వర్షము కురియును. రోగములేని యొకవ్యక్తి పగలు భుజింపక స్థూలుడుగానున్న అతడు రాత్రి భుజించుచున్నాడనుట సిద్ధము. ఇట్లు కారణములేనియెడల కార్యము కలుగదన్నపుడు దానికి విపరీతముగ కారణమున్న కార్యము కలుగునని యర్థాపత్తి ద్వారా తెలియును. కారణముండియు ప్రతిబంధకము (అడ్డు) వలన కార్యోత్పాదనము కలుగకుండుట యర్థాపత్తి కానేరదు. కాబట్టి అర్థాపత్త్యాభాసము నర్థాపత్తియని యెంచి దోషము జూపుట తగదని భావము.

“ప్రతిషేధా ప్రామాణ్యం చానైకాంతికత్వాత్”

౨. ౨. ౫.

అనైకాంతికత్వాత్ = వ్యభిచారి యగుటవలన, ప్రతిషేధా ప్రామాణ్యమ్=(వ్యభిచారి యగుటవలన) అర్థాపత్తి ప్రమాణము కాదను పూర్వపక్ష కథనము (ప్రతిషేధము) ప్రమాణము కాదు.

‘అర్థాపత్తి ప్రమాణము కాదు. అనైకాంతికమగుట వలన’ అను నీపూర్వపక్ష కథన మిట ప్రతిషేధమనబడును. ఈ ప్రతిషేధముచే నర్థాపత్తియొక్క-ప్రామాణ్యము నిషేధింపబడుచున్నది. కాని యర్థాపత్తియునికి నిషేధింపబడుటలేదు. కాబట్టి యీ ప్రతిషేధము స్వయముగా ననైకాంతికము — వ్యభిచారియగుటవలన పూర్వపక్షి కథనమును సాధింపనేరదు.

పూర్వపక్షి తన ప్రతిషేధమునకు అర్థాపత్తులన్నియు విషయమనక కొండొక యర్థాపత్తియే విషయము అనగా

"తత్ప్రామాణ్యే వా నార్థాపత్త్య ప్రామాణ్యమ్"
౨.౨.౬.

తత్ప్రామాణ్యే వా = పూర్వపక్షిప్రతిషేధమనైకాంతికమయ్యు ప్రమాణమగునెడల, అర్థాపత్త్యప్రామాణ్యమ్ న = అర్థాపత్తి అప్రమాణము కాదు.

అనైకాంతికత = (వ్యభిచారిత్వము) కొండొకతావున ప్రమాణమగునెడల మా చెప్పు నర్థాపత్తియు ప్రమాణమే యగును. అర్థాపత్తికి విషయము కార్యోత్పత్తి యున్నయెడల కారణము తప్పక ఉండితీరుననుటయే. ప్రతిబంధకమున్నచోట కారణము గార్యము నుదయింపజేయుననుటకాదు. కాబట్టి యర్థాపత్తి ప్రమాణమై యనుమానాంతర్గతమగు ననుటలో నెట్టి దోషమును లేదని వివేకము.

పూర్వపక్షము:—

అభావము అనుమానంతర్గతమా?

"నాభావ ప్రామాణ్యం ప్రమేయాసిద్ధేః" ౨.౨.౭.

అభావప్రమాణ్యం = అభావమున ప్రామాణ్యము, న = లేదు. ప్రమేయాసిద్ధేః = అభావమునకు ప్రమేయమే లేకుండుటవలన.

ప్రతి ప్రమాణమున కేదోయొక ప్రమేయముండి తీరవలయునుకదా! ప్రమేయము లేని ప్రమాణముండదు. ప్రమాణమనగా ప్రమేయ బోధకమనికదా! యర్థము. అభావమనగా లేకుండుట కాబట్టి యది యొకానొక ప్రమేయము నెట్లు బోధింపగలదు?

ఉత్తరపక్షము:—

"లక్షితేష్వలక్షణ లక్షితత్వా దలక్షితానాం
తత్ప్రమేయ సిద్ధేః" ౨.౨.౮.

లక్షితేషు = లక్షితులలో కలిసియున్న, అలక్షితానాం = లక్షితులు కానివారు, అలక్షణలక్షితత్వాత్ = లక్షణాభావమువలన తెలియబడుటచే, తత్ప్రమేయసిద్ధిః = అభావప్రమాణప్రమేయము సిద్ధించుచున్నది

లక్షణముతో కూడినవారు లక్షితులు. లక్షణమనగా వ్యావర్తకము - వేరు చేయునది. ఒక గురుకులమున ననేకులు బ్రహ్మచారు లున్నారనుకొనుడు. అందు కొందఱు హస్తములలో వేదాది గ్రంథము లుంచుకొని తోడి బ్రహ్మచారులతో కలిసి యుపదేశార్థము గురు సమీపమున కేగిరనుకొనుడు. అపుడాచార్యుడు గ్రంథహస్తులనెడు లక్షణముతో కూడియుండని వారి నిటకు కొనిరమ్మని సంరక్షకు నాజ్ఞాపింపగా నతడు లక్షణ రహితులను - అలక్షితులను వేరుచేసి యాచార్యుని సమీపమున జేర్చును. ఇట లక్షణాభావమే కదా సంరక్షకున కా బ్రహ్మచారుల జ్ఞానమును కలిగించినది? కాబట్టి యభావమునకు ప్రమేయము లేదనుట సరిగాదు.

ఉత్తరపక్షము:—

"అసత్యర్థే నాభావ ఇతిచేన్నాన్య లక్షణోపపత్తేః" ౨.౨.౯.

అర్థే = అభావప్రతియోగియగు లక్షణరూప వస్తువు, అసతి = అలక్షిత బ్రహ్మచారులలో లేకుండుటవలన, అభావః = లక్షణాభావము సిద్ధింపనేరదు, (అలక్షిత బ్రహ్మచారులలో లక్షణమే లేకుండుట వలన నటలక్షణాభావమున్నదనుట యుచితము కాదని భావము) అందుమేని, న =

అట్లు కాదు. అన్యలక్షణోపపత్తేః లక్షితబ్రహ్మచారులలోఁగల లక్షణాభావ మిట సిద్ధించుచున్నది.

ఏవస్తువెక్కడనుండునో యక్కడనే దాని యభావము నుండవలయును. అలక్షిత బ్రహ్మచారుల హస్తములలో వేదాది గ్రంథములుండుట యను లక్షణమే లేదు. కాబట్టి యిట లక్షణాభావ మెప్పుదందుమేని సరికాదు. కారణ మేమన, ప్రతియోగి స్థలముననే యభావముండవలయునన్న నియమ మెుండు లేదు. ఒకచో నున్నవస్తువున కభావము మరియొకచో లభించుట లోకసిద్ధము కాబట్టి, అలక్షిత బ్రహ్మచారులందుగల లక్షణము లేకుండుటయు నభావమే. ఆయభావమే వారిని సంరక్షకునకు బోధించి ప్రమాణమగుచున్నది. అభావమిట్లు ప్రమేయవంతమై ప్రమాణమగుటలో నెట్టి దోషమును లేదు.

పై జెప్పిన విషయమునే స్పష్టపరుపదలచి ఛలముగా శంకించుచున్నాడు.

"తత్సిద్ధేరలక్షితే ష్వహేతుః" ౨ ౨.౧౦.

తత్సిద్ధేః = లక్షితులలోనున్న లక్షణముయొక్క అభావము, అలక్షితేషు = లక్షితులుకాని వారిలో. అహేతుః = హేతువు కాదు.

లక్షణాభావము సిద్ధించినమీదట నది యలక్షితులకు బోధకము కాగలదు కాని, యది సిద్ధింపక కానేరదు. లక్షణముండగా దాని యభావమెట్లు సిద్ధింపగలదు? లక్షణము కలదు, లేదు అనుట వ్యాఘాతమగును. లక్షితులలో లక్షణముండు

టచే లేదనుట చెల్లదు. కాబట్టి లక్షణాభావమే సిద్ధింపనపుడది యలక్షితుల ప్రతిపత్తి (జ్ఞానము)కి హేతువెట్లు కాగలదు ?

"నలక్షణావస్థితాపేక్షాసిద్ధేః" ౨.౨.౧౧.

లక్షణావస్థితాపేక్షాసిద్ధేః=లక్షితులలోనున్న లక్షణము యొక్క యభావము అలక్షితులలో సిద్ధించుటవలన, న = ప్రతిపత్తిహేతువు కాదనుట తగదు.

లక్షణముండు స్థలముననే దాని యభావమున్నదనిన నది సిద్ధింపనేరదు కాని, లక్షితులలోగల లక్షణమునకు అలక్షితులలో దాని యభావము సిద్ధించుటలో నెట్టిదోషము నుండదు. అలక్షితులన లక్షణాభావము కలవారనుటయే కదా! లక్షణమొకచోనుండి మరియొకచో దాని యభావ మున్నదనుటలో వ్యాఘాతమునుకాదు. కాబట్టి లక్షితులలో గల లక్షణముయొక్క యభావము అలక్షితులలో సిద్ధించి యది ప్రతిపత్తి హేతువగుటలో నెట్టిదోషము లేదు.

అయినను ఉన్నది, లేదనుట వ్యాఘాతమే కదాయన,

"ప్రాగుత్పత్తే రభావోపపత్తేశ్చ" ౨.౨.౧౨.

సూత్రము నందలి చకారము ధ్వంసాదులకుబోధకము. ప్రాగుత్పత్తేః= ఉత్పత్తికి పూర్వముండు, అభావోపపత్తేః=అభావముసిద్ధించుట వలన.

పూర్వసూత్రమున జెప్పబడిన లక్షితులలో గల లక్షణముయొక్క యభావమే యలక్షితులలో సిద్ధించు చున్నదనుట రుచింపకున్న, అలక్షితులలో నాలక్షణ మేర్పడుటకు ముందు దాని యభావ ముండునుగదా. ఉత్పత్తికి పూర్వ

ముందు నభావము ప్రాగభావ మనబడును. అట్టి ప్రాగభావ మైనను ప్రతిపత్తి హేతువు కాగలదు.

ప్రమాణ లక్షణమును జెప్పుచు నాప్తోపదేశము శబ్దము ('ఆప్తోపదేశః శబ్దః' ౧. ౧. ౭.) అని చెప్పబడినది. ఆ శబ్దము నిత్యమా? యనిత్యమా?యని యిపుడు విచారింప బడును. ఆకాశ గుణమగు శబ్దము విభువు, నిత్యము, అభివ్యక్తిధర్మకము నని కొందఱు; గంధాది గుణములతో కూడి ద్రవ్యములతో నుండి యభివ్యక్తిధర్మకమని కొందఱు. ఆకాశ గుణమై యుత్పత్తి వినాశములు కలిగి బుద్ధివలె ననిత్యమని కొందఱు; మహాభూత సంక్షోభము వలన కలిగి యనాశ్రితమై యుత్పత్తివినాశములు కలిగినదని కొందఱు అందురు. కాబట్టి శబ్దము నిత్యమా? యనిత్యమా యని సంశయము కలుగగా అనిత్యమనిసిద్ధాంత పక్షమును సూత్రించుచున్నాడు.

"ఆదిమత్త్వాదైంద్రియకత్వాత్ కృతకవదుపచారాచ్చ"

౨. ౨. ౧౩.

ఆదిమత్త్వాత్ = (ఆదియనకారణము) కారణముగలదగుటవలన, ఐంద్రియకత్వాత్ = ఇంద్రియముచే గ్రహింపబడుటవలన,కృతకవదుపచారాచ్చ=(కృతకమ్=కార్యము)కార్యమువలెవ్యవహరింపబడుటవలనను శబ్దమనిత్యము.

కారణమువలన నేర్పడునది కారణవంతమనబడును. కారణవంతము అనిత్యము. ఉదాహరణము ఘటపటములే. శబ్దముసైతము సంయోగవిభాగాదులవలన కలుగును. కాబట్టి కారణముగలదై యనిత్యమగుచున్నది. ఇట్లే దర్శనాంతర

ములను జెప్పబడినది. ("సంయోగవిభాగాచ్ఛబ్దాచ్చ శబ్ద నిష్పత్తిః" వై. ద. ౨.౨.౩౧.)

ఇంద్రియముచే గ్రహింపబడు సంయోగ విభాగాది గుణము లనిత్యములైనట్లు శబ్దమును శ్రవణేంద్రియముచే గ్రహింపబడుచున్నది. కాబట్టి యనిత్యమని తెలియుచున్నది. శాస్త్రాంతరమునను ఇట్లే చెప్పబడినది. ("శ్రోత్ర గ్రహణో యోఽర్థః స శబ్దః" ౨.౨.౨౧. వై. ద.)

కృతకము (కార్యము) కృతకమువలె వ్యవహరింప బడును. అకృతకము (నిత్యవస్తువు) కృతక సమానముగ నెన్నడు వ్యవహరింపబడదు. కృతకములగు ఘట పటాదు లుత్పత్తి వినాశనములు కలవిగా చూడబడుచున్నవి. శబ్దము నట్లు వ్యవహరింపబడును. 'శబ్దము జనించినది. శబ్దము నశించి నది' యనుట వ్యవహారసిద్ధము కృతకములందు తీవ్ర మంద భేద వ్యవహారమున్నట్లు శబ్దమునను, తీవ్రశబ్దము, మందశబ్ద మను వ్యవహారములు చూడబడుచున్నవి. కాబట్టి శబ్దమనిత్య మని భావము.

పూర్వ పక్షము:—

పై జెప్పిన హేతువులలో దోషమును జూపుచున్నాడు.

"నఘటాభావ సామాన్య నిత్యత్వాత్ నిత్యేష్వ ప్యనిత్యవదుపచారాచ్చ" ౨.౨.౧౪.

ఘటాభావ సామాన్య నిత్యత్వాత్ = ఘటాభావము(ధ్వంసము), గోత్వాదిసామాన్యము రెండును నిత్యములగుటవలనను, నిత్యేష్వ

ప్యనిత్యవదుపచారాచ్చ = ఆకాశాది నిత్యపదార్థములు ననిత్యములవలె వ్యవహరింపబడుటవలనను, న = ఆదిమత్త్వాది కారణములచే శబ్దము అనిత్యమనుట తగదు.

ఆదికలది (కారణవంతము) యగుటచే శబ్దమనిత్యమనుట సరిగాదు. ఘటధ్వంసము ఆదికలదియైనను నిత్యముగా చూడబడుచున్నది. ధ్వంసమునకు ప్రతియోగి కాకుండుటయే నిత్యత్వముకదా ? (ధ్వంసాప్రతియోగిత్వం నిత్యత్వమ్.) ఘటధ్వంసమునకు మరల ధ్వంసము కలుగనేరదు. కాబట్టి యది ధ్వంసమునకప్రతియోగియై నిత్యమనబడుచున్నది. అందువలన శబ్దమాదికలదగుటచే ననిత్యమనుట వ్యభిచరించుచున్నది.

ఐంద్రియకమగుటచే శబ్దమనిత్యమనుటకూడ గోత్వాది సామాన్యములు (జాతులు) ఐంద్రియకములయ్యు నిత్యములగుటచే వ్యభిచరించుచున్నది.

ఇట్లే కృతకవదుపచారహేతువును వ్యభిచరించుచున్నది. కారణమేమన, 'ఆకాశైకదేశమున భూమియున్నది' యని నిత్యమగు నాకాశమున నేకదేశవ్యవహారము చూడబడుచున్నది. ఇట్లు ఆదిమత్త్వాదికారణములు మూడును (శబ్దమనిత్యమని సాధింప నుద్దేశింపబడినవి.) వ్యభిచరించుటచే శబ్దమనిత్యమనుట తగదు.

ఉత్తరపక్షము:—

"తత్త్వభాక్తయో ర్నానాత్వవిభాగా దవ్యభిచారః" ౨ ౨.౧౫.

తత్త్వభాక్తయోః = (నిత్యత్వము) తత్త్వము, భాక్తమునని, నానాత్వ విభాగాత్ = రెండువిధములగుటచే, అవ్యభిచారః=వ్యభిచారములేదు.

ముఖ్యము, గౌణము (తత్త్వభాక్తములు) నని నిత్యత్వము రెండువిధములు. ఉత్పత్తి వినాశములు లేకుండుట ముఖ్య నిత్యత్వము. ఉత్పత్తియో లేక వినాశమో లేకుండుట గౌణ నిత్యత్వము. ఘటధ్వంసాత్మక అభావము ఆత్మాదులవలె ముఖ్యనిత్యముకాదు. అది యనిత్యప్రాయమే. ధ్వంసమునకు నాశములేకున్నను ఉత్పత్తి కలదు. కాబట్టి ధ్వంసాదులు నిత్యములగుటచే నాదిమత్త్వకారణము వ్యభిచరించుననుట యుక్తియుక్తముకాదు.

"సంతానానుమాన విశేషణాత్" ౨ ౨ ౧౬.

సంతానానుమాన విశేషణాత్ = సామాన్యమనెడి విశేషణము హేతువున చేర్చుటవలన, వ్యభిచారము లేదు.

అనేక వస్తువులలో నొకటి-యాకారముగల జ్ఞానము కలుగజేయుటచే సామాన్యమిట సంతానమనబడును. ('బహుష్వేకాకారాబుద్ధిః సంతన్యతేఽనేన ఇతి). అనుమాన మననిట హేతువు. (అనుమీయతేఽనేన ఇతి). విశిష్టీకరణము విశేషణ మనబడును. (విశిష్యతేఽనేనేతి).

శబ్దము కేవల మైంద్రియకమగుటచే నది యనిత్యము కాదు. సామాన్యవంతమై, యైంద్రియకమగుటచే నది యనిత్యమని సిద్ధాంతము. గోత్వాది సామాన్యములు ఐంద్రియకములు (ఇంద్రియగ్రాహ్యములు) అయినను సామాన్యవంతములు కావు. గోత్వమనెడి సామాన్యమున గోత్వత్వమనెడి

సామాన్యమొండులేదు. శబ్దము శబ్దత్వమనెడి సామాన్యము కలదై యైంద్రియకమగుటచే నది యనిత్యమేయని సూత్రాభిప్రాయము. కాబట్టి గోత్వాది సామాన్యములు ఐంద్రియకములయ్యు నిత్యములైనను, శబ్ద మట్లుగాక శబ్దత్వమనెడి సామాన్యముగలదై యైంద్రియక మగుటచే ననిత్యమే యని వివేకము.

మూడవహేతువున వ్యభిచారమును తొలగించుచున్నాడు.

"కారణ ద్రవ్యస్య ప్రదేశశబ్దే నాభిధానాత్" ౨.౨.౧౭.

ప్రదేశ శబ్దేన = దేశపదముచేత, కారణద్రవ్యస్య = కారణవంతమగు ద్రవ్యము - సావయవము, అభిధానాత్ = చెప్పబడుటవలన.

'ఆత్మప్రదేశము' 'ఆకాశైకదేశము' నని వ్యవహారము లోకమున జూడబడుచున్నను అందలి ప్రదేశైకదేశ శబ్దములు ముఖ్యార్థమున ప్రయోగింపబడవు. కారణమేమన, ప్రదేశైకదేశ శబ్దములు ముఖ్యముగా నవయవములను - కారణములను బోధించును. ఆకాశమునగానీ, ఆత్మయందుగానీ యవయవములులేవు. కాబట్టి వానిప్రయోగ మట గౌణమని యెఱుంగవలయును. కాబట్టి యాకాశాత్మలు కృతకములగు ఘటపటాదిద్రవ్యములవంటివి కావు. అవి నిత్యములే. ఆత్మాదుల నవయవబోధకములగు ప్రదేశైకదేశ శబ్దములు ముఖ్యములు కాకపోవుటంబట్టి కృతకవద్వ్యవహార మట వ్యభిచరించుననుట యుక్తిసంగతము కాదు:

పైజెప్పిన హేతువులు దోషయుక్తములు కాకున్నను అవి సాధ్యసాధకము లెట్లనః

"ప్రాగుచ్చారణా దనుపలబ్ధేః ఆవరణాద్యనుపలబ్ధేశ్చ." ౨ ౨ ౧౮.

ఉచ్చారణాత్ ప్రాక్ = ఉచ్చారణకు పూర్వమున, అనుపలబ్ధేః = ఉపలంభము కాకుండుట చేతను, ఆవరణాద్యనుపలబ్ధేశ్చ = ప్రతిబంధకములగు నావరణాదు లుపలబ్ధము కాక పోవుటచేతను శబ్దమనిత్యము.

శబ్దములు నిత్యమేయగునెడల ఉచ్చరించుటకు పూర్వమవి తెలియబడవలెను. అవి తెలియబడకుండుటకు ప్రతిబంధకములుగా నావరణాదులేవైన నున్న వందుమేని యానరణాదులున్నట్లైన నవియు తెలియవలయును. ప్రతిబంధకములు లేక యుచ్చారణకు ముందుపలబ్ధము కాకపోవుటచే శబ్దముచ్చారణాదులచే నుత్పన్నమై యనిత్యముగుచున్నదని స్పష్టమగుచున్నది. కాబట్టి పూర్వహేతువులు శబ్దమనిత్యమని సాధించుటలో నెట్టిసందియము లేదు.

పూర్వపక్షము:—

"తదనుపలబ్ధే రనుపలంభా దావరణోపపత్తిః" ౨.౨.౧౯.

తదనుపలబ్ధేః = ఆవరణాదుల యనుపలబ్ధి, అనుపలంభాత్ = ఉపలంభము కాకుండుట వలన, ఆవరణోపపత్తిః = ఆవరణాదు లున్నవనుట యొప్పును.

శబ్దోచ్చారణకు పూర్వము దాని యనుపలబ్ధికి కారణము ఆవరణాదులు ప్రతిబంధకము లగుటయే కాని యనిత్యత్వము కాదు. ప్రతిబంధకము లయిన ఆనరణాదు లుపలబ్ధము లగుట లేదుకదా యందువేని, వాని యనుపలబ్ధియు నుపలబ్ధమగుట లేదుకదా. కాబట్టి యొక వస్తువు యొక్క యనుపలబ్ధ్యనుపలంభము దాని యునికిని బోధించును.

ఆవరణాదుల యనుపలబ్ధి వలన నీవెట్లు వాని యభావము నంగీకరించుచున్నావో యట్లే నేనును ఆవరణాదుల యనుపలబ్ధ్యనుపలంభము వలన వాని భావము నంగీకరించుచున్నానని పూర్వపక్షి యభిప్రాయము. కాబట్టి యుచ్చారణకు పూర్వము శబ్ద ముపలబ్ధము కాకుండుటకు కారణము దాని యనిత్యత్వము కాదని భావము.

"అనుపలంభా దప్యనుపలబ్ధి సద్భావవ న్నావరణానుప
పత్తి రనుపలంభాత్" ౨.౨.౨౦.

అనుపలంభాదపి = ఆవరణానుపలబ్ధి యుపలంభము కాకుండుట వలనను, అనుపలబ్ధి సద్భావవత్ = ఆవరణాద్యనుపలబ్ధి యున్నదని యంగీకరించినట్లు, అనుపలంభాత్ = ఆవరణానుపలంభమువలన, ఆవరణానుపపత్తిః న = ఆవరణ సద్భావమును సిద్ధింపగలదు.

మఱియు ఉచ్చారణకు పూర్వము శబ్దము గ్రహింపబడకుండుటకు ప్రతిబంధకముగా నావరణాదులుండిన, నందు వలన గ్రహింపబడలేదనవచ్చును. కాని యావరణాదు లుపలబ్ధములగుటలేదు. వాని యనుపలబ్ధి యట నున్నదనుటకు కారణము వాని యుపలంభాభావమేకదా? ఉపలంభాభావము ఆవరణానుపలబ్ధి కలదనుటకు హేతువైనట్లు, ఆవరణాదుల యుపలంభాభావము సైతము వాని సద్భావమును (ఉనికిని) ఎట్లు బోధింపదు? బోధించుననియే భావము. కాబట్టి యావరణముండుటచే శబ్దోచ్చారణకు పూర్వమది గ్రహింపబడుట లేదుగాని శబ్దములేక కాదు.

ఉత్తరపక్షము:—

"అనుపలంభాత్మకత్వా దనుపలబ్ధే రహేతుః" ౨.౨.౨౧

అనుపలబ్ధేః=ఆవరణాదుల యనుపలబ్ధి, అనుపలంభాత్మకత్వాత్= ఆవరణాద్యుపలబ్ధ్యభావాత్మక మగుటవలన, అహేతుః = (తదనుపలబ్ధేః ౨.౨.౧౯. అను సూత్రమున జెప్పబడిన) హేతువు సరికాదు.

ఉపలబ్ధమగు వస్తువు ఉన్నదందుము. ఉపలబ్ధము కాకున్న లేదందుము. ఇట్లుపలబ్ధ్యనుపలబ్ధులు సదసద్విషయములు. అనుపలబ్ధియన నుపలబ్ధ్య భావమే. అభావమగుట వలన నుపలబ్ధము కాదని భావము.

ఆవరణమో సద్వస్తువు-భావాత్మకము. అట్టిదున్న పక్షమున నుపలబ్ధము కావలయును. ఉపలబ్ధ మగుటలేదు కాబట్టి లేదనుచున్నాము. కాబట్టి యనుపలంభము వలన నావరణాదు లున్నవనుట యహేతువు-పొసగదని భావము.

పూర్వపక్షము:—

"అస్పర్శత్వాత్" ౨.౨.౨౨.

అస్పర్శత్వాత్=స్పర్శరహిత మగుటచే, శబ్దము నిత్యము.

ఆకాశాదులు స్పర్శములేనివై నిత్యము లనబడుచున్నవి. అట్లే శబ్దమును స్పర్శము లేనిదగుట వలన నిత్యమే.

ఉత్తరపక్షము:—

"న కర్మానిత్యత్వాత్" ౨.౨.౨౩.

కర్మానిత్యత్వాత్ = స్పర్శ రహితమయ్యు కర్మము అనిత్యమగుట వలన, న = శబ్దము స్పర్శ లేనిదగుటచే నిత్యమనుట తగదని యర్థము. *

స్పర్శరహితమైనదెల్ల నిత్యమను నియమము లేదు. కర్మము స్పర్శరహితమే కాని నిత్యము కాదు. కాబట్టి శబ్దము నిత్యమనుటకు జెప్పబడిన అస్పర్శత్వ హేతువు సరికాదు.

పూర్వపక్షము:—

"సంప్రదానాత్" ౨.౨.౨౮.

సంప్రదానాత్ = సంప్రదానము వలన శబ్దము నిత్యము.

గురువు శిష్యునకు శబ్దములను సంప్రదానము చేయును (ఇచ్చును). శిష్యుడు వానిని గ్రహించును. శబ్దమనిత్యమగు నెడల నియ్యది సంభవింపదు. కాబట్టి శబ్దము నిత్యము.

ఉత్తరపక్షము:—

"తదంతరాలానుపలబ్ధే రహేతుః" ౨. ౨. ౨౯.

తదంతరాలానుపలబ్ధేః = గురుశిష్యులమధ్య శబ్దమవస్థితము కానందున, అహేతుః = సంప్రదాన హేతువు సరికాదు.

సంప్రదీయమాన వస్తువు దాతృపరిగ్రహీతల మధ్య (అంతరాలమున) నవస్థితమై గోచరించును. అట్లు గురుశిష్యుల

---

*"నాణు నిత్యత్వాత్"

అణునిత్యత్వాత్ = అణువు రూపము గలదయ్యు నిత్యమగుట వలన, న=శబ్ద నిత్యత్వ సాధక హేతువు సరికాదని సూత్రాభిప్రాయము }

'నాణు నిత్యత్వాత్' అనునిది వాస్తవమున సూత్రము కాదు. భాష్య వాక్యము. కాబట్టి వార్త్తికాదుల నియ్యది కానరాదు. అందువలన సూత్రముల జేర్పనైతి.

మధ్య యిచ్చిపుచ్చుకొను వేళల శబ్దమవస్థితమైయున్న సంప్ర దానహేతువు శబ్దనిత్యత్వమును సాధింపగలదు. కాని యట్లు శబ్దమవస్థితము కాకుండుటవలన నీ హేతువు సరికాదు.

పూర్వ పక్షము:—

"అధ్యాపనా దప్రతిషేధః" ౨.౨.౨౬.

అధ్యాపనాత్ = అధ్యాపనమువలన, అప్రతిషేధః = సంప్రదానమ హేతువనుట సరిగాదు.

గురుశిష్యుల మధ్య శబ్దము ప్రత్యక్షముగా గ్రహింపబడకున్నను అనుమానమున నది తెలియనగును. గురువుచే నీయబడి శిష్యునిచే నది గ్రహింపబడకున్న నధ్యాపనము జరుగనేరదు. గురువుచే సంప్రదీయమాన శబ్దమును శిష్యుడు పొందుటయే యధ్యాపన మనబడునుగదా. కాబట్టి సంప్రదాన హేతువు శబ్దనిత్యత్వమును బోధింపగలదని భావము.

ఉత్తరపక్షము:—

"ఉభయోః పక్షయో రన్యతరస్యాధ్యాపనా దప్రతిషేధః" ౨.౨.౨౭.

ఉభయోః పక్షయోః = శబ్దము నిత్యము, అనిత్యము నను రెండు పక్షములందును, అన్యతరస్య = ఏదోఒకపక్షమంగీకరించుటచే, అధ్యాపనాత్ = అధ్యాపనము జరుగగలదు. కాబట్టి, అప్రతిషేధః = పైన జెప్పిన సమాధానము సరిగాదని యర్థము.

గురువుచే నీయబడు శబ్దము గురుశిష్యులకు మధ్య నవస్థితమైయుండి శిష్యునిచే గ్రహింపబడుట యధ్యాపనము.

కాబట్టి యంతరాలమున శబ్దావస్థితి దాని నిత్యత్వమును సాధింపగలదనిగదా! పూర్వపక్షి యభిప్రాయము.

శబ్ద మనిత్యమని సిద్ధాంతించు మేము గురువుచే నీయబడు శబ్దము సంతానవృత్తితో శిష్యుని ప్రాపించుట యధ్యాపన మందుము ఇట్లుభయపక్షములందు సిద్ధించు నధ్యాపనము గురుశిష్యుల మధ్య శబ్దావస్థితిని సాధించి తద్వారా దాని నిత్యత్వమును సాధించును గాని శబ్దసంతానమును బోధించి యనిత్యత్వమును సాధింప నేరదని చెప్పనేరము గదా! కాబట్టి యధ్యాపనము నిత్యత్వమును సాధింపనేరదని యభిప్రాయము.

భాష్యకారులు (వాత్స్యాయనుడు) ఆచార్యస్థ శబ్ద మంతేవాసిని చేరుట యధ్యాపనమా? లేక, నృత్యోపదేశము వలె గ్రహింపబడిన దాని ననుకరించుట యధ్యాపనమా? యని శంకించి యధ్యాపనము సంప్రదానమునకు లింగము కాదని నిరాకరించి యుండిరి.

పూర్వపక్షము:—

"అభ్యాసాత్" ౨.౨.౨౮.

అభ్యాసాత్ = అభ్యాసము వలన శబ్దము నిత్యము.

ఒకటి విషయమునకు సంబంధించి యనేక క్రియలు కలుగుట యభ్యాస మనబడును. ఒక శబ్దమును మరల మరల నుచ్చరించుటయు, ఒకే రూపము ననేక పర్యాయములు దర్శించుటయు నభ్యాస మనబడును. అనేక పర్యాయము లొకే శబ్దము నుచ్చరింప వలయునన్న నది యవస్థితమై యుండ

వలయును. ఒకచో నవస్థితమై యుండని రూపమును మరల మరల చూచుట సంభవింపదు గదా! 'ఒకరూపము ననేక పర్యాయములు చూచుచున్నారు.' 'ఒక యనువాకము ననేక పర్యాయములు అధ్యయనము చేయుచున్నాడు.' అను తావులందు సమానముగ నభ్యాసము గోచరించుచున్నది. అభ్యాస మవస్థితమునకే సంభవించును. కాబట్టి శబ్దము నిత్యము.

ఉత్తరపక్షము:—

"నాన్యత్వేఽప్యభ్యాసస్యోపచారాత్" ౨.౨.౨౯.

అన్యత్వేఽపి = శబ్దమనేక మైనను, అభ్యాసస్యోపచారాత్ = అభ్యాసము సంభవమగుట వలన, న=పూర్వపక్షి చెప్పినది సరికాదు,

ఒకేరూప మనేకపర్యాయములు దర్శింప బడునట్లు, ఒకేశబ్ద మనేక పర్యాయము లనుట యభ్యాసము అను నియమము లేదు. శబ్దమొక్కటి కాక యనేకములైనను అభ్యసింప వీలగును. అగ్నిహోత్రాది కర్మము లనేకములయ్యు నభ్యసింపబడుచున్నవి. (ద్విర్భుంక్తే ద్విర్జుహోతి. ద్విరనృత్యత్, త్రిరనృత్యత్.) రెండుమారులు భుజించుచున్నాడు. రెండు మారులు హోమము చేయుచున్నాడు. మూడుమారులు నృత్యము చేసెను. అనునిట్టి యనేకకర్మలందును అభ్యాసమును జూచుచున్నాము కాబట్టి గురువుచే నీయబడు శబ్దమొక్కటిగా నుండి యభ్యసింపబడుచున్న దను నియమము లేదు. గురువుచే నుచ్చరింపబడు శబ్దము సంతానవృత్తితో ననేకము లగుచు శిష్యునిచే గ్రహింపబడి పునఃపునః అభ్యసింపబడును.

ఇట్లు ఒక విషయముననే గాక యనేక విషయమునను అభ్యాసము సంభవ మగుటవలన నభ్యాసహేతు వనైకాంతికమై శబ్ద నిత్యత్వమును సాధించు ననుట పొసగదని సూత్రాభిప్రాయము.

పూర్వపక్షము:—

"అన్యదన్యస్మా దనన్యత్వా దన్య దిత్యన్యతాఽభావః"

౨. ౨. ౩౦.

అన్యస్మాత్ = అన్యముకంటె, అన్యత్ = దేనినన్యమనుచున్నావో యది, అనన్యత్వాత్ = తనకంటె నన్యముకాదు. కాన, అన్యత్ ఇతి = అన్యము అనుదానిలో, అన్యతాఽభావః = అన్యత్వమే లేదు.

'అన్యత్వేఽప్యభ్యాసస్యోపచారాత్' అను సూత్రమున అన్యత్వము కలదని యెంచి హేతువునందువ్యభిచారము చూపబడినది. లోకమున నెచ్చటను అన్యత్వమనునదియే లేదు. ప్రతివస్తువును తాను తనకంటె నన్యము కానేరదు. ఇట్లు ఏ వస్తువునందు నన్యత్వము సిద్ధింపనపుడు పూర్వసూత్రమున జూపిన దోషము సరికాదని సూత్రభావము.

ఉత్తరపక్షము:—

"తదభావే నాస్త్యనన్యతా తయోరితరేతరాపేక్షసిద్ధేః"

౨. ౨. ౩౧.

తదభావే = అన్యత్వమే లేనియెడల, అనన్యతా నాస్తి = అనన్యతయు లేదు. తయోః = అన్యత్వ-అనన్యత్వములు, ఇతరేతరాపేక్షసిద్ధేః = ఒకటి యుండిననే మరియొకటి యుండును.

జగత్తున నన్యత్వమే లేకున్న, అనన్యత్వమును లేదని సిద్ధమగును. అన్యత్వము నపేక్షించియే అనన్యత్వము సిద్ధిం

చును కదా! కాబట్టి యందొకటి లేదు; రెండనది కలదనుట యసంగతము మఱియు లోకమున నొక వస్తువు తాను తన కంటె నన్యము కాకపోవచ్చును. కాని పఱియొకదాని కంటె నన్యము కాదనుట యనుభవ విరుద్ధము. నీలము తనకంటె నన్యము కాకున్నను పీతముకంటె నన్యము కాక యనన్యమే యనుట ఎట్లు పొసగును? కాబట్టి యన్యతాఽభావమును సాధింపబూనుట వివేకము కాదు. (స్వాపేక్షయా) తనకంటె నితరము అన్యమే యగును. అందువలన (నాఽన్యత్వేఽప్యభ్యాసస్యోపచారాత్) అను సూత్రమున జూపబడిన వ్యభిచార దోషము యుక్తమే యని అభిప్రాయము.

పూర్వపక్షము:—

"వినాశ కారణానుపలబ్ధేః ౨.౨.౩౨.

వినాశకారణానుపలబ్ధేః = వినాశకారణము లభింపనందున.

లోకమున ఘటపటాది కార్యము లనిత్యములు. వాని వినాశ కారణములును మనము జూడగలుగు చున్నాము. శబ్దమునకు వినాశ కారణము లభింప నందువలన నదినిత్యమే యని భావము.

ఉత్తరపక్షము:— (ప్రతిబంధి సమాధానము)

"అశ్రవణ కారణానుపలబ్ధేః సతత శ్రవణ ప్రసంగః"

౨.౨.౩౩.

అశ్రవణ కారణానుపలబ్ధేః = శబ్దము వినబడకుండుటకుగల కారణము లభింపనందువలన, సతతశ్రవణ ప్రసంగః=శబ్దమెల్లప్పుడు వినబడు చుండవలసి యుండును.

శబ్దము నిత్యమగునెడల నెల్లప్పుడు నది వినబడుచుండ వలయును. నిత్యమై వినబడకుండుటకు కారణమేమి? అట్టి కారణమేదైన నున్న నది తెలియబడవలయును కదా! కారణము లేకయే శబ్దము నిత్యమై యుండియు నది యెల్లపుడు వినబడక యప్పుడప్పుడు వినబడుచుండునని కల్పించుట యుక్తము కానేరదు. ఉన్నశబ్దము కారణము లేకయే యెల్లపుడు వినబడదని యంగీకరించునెడల వినాశకారణము లభింపకున్నను శబ్దము నశించుచునేయున్నది కాబట్టి యది యనిత్యమనుటలోను దోషము లేదు.

ప్రతిబంధి యుత్తరము నొసగి ముఖ్య సమాధానమిచ్చుచున్నాడు.

“ఉపలభ్యమానేచానుపలబ్ధే రసత్వా దనపదేశః” ౨ ౨.౩౪

ఉపలభ్యమానేచ = (మఱియు) శబ్దవినాశ కారణము లభించుచుండ, అనుపలబ్ధేః = దానియనుపలబ్ధి, అసత్వాత్ = లేకుండుటచే, అనపదేశః = వినాశకారణము లభింపలేదనుట సరికాదు.

ఘటాదులవలె నుత్పన్నవస్తువు నశించును అను ననుమానము ననుసరించి సంయోగవిభాగాదులవలననే శబ్దము జనించుచున్నది కాబట్టి తప్పక నశించునని సిద్ధించుచున్నది. అవశ్యముగా నేర్పడు వినాశమయినను కారణములేకున్న నేర్పడనేరదు కాబట్టి వినాశకారణమూహింపబడును. ఇట్లు కారణముపలబ్ధముగుచుండ వినాశకారణానుపలబ్ధివలన శబ్దము నిత్యమనుట తగదు. అనుమానముద్వారా సిద్ధించు వినాశకారణమువలన శబ్దము అనిత్యమే యని సూత్రాభిప్రాయము.

పూర్వశబ్ద వినాశమునకు కారణము తరువాతి శబ్దమే. అన్నిటి కంటె చివరి శబ్దము తనకంటె పూర్వముండు శబ్దమే వినాశ కారణముగా గలిగి యుండునని వివేకము.

వినాశకారణము ప్రత్యక్షముగా సిద్ధింపవలయుననిన,

"పాణి నిమిత్తప్రశ్లేషాచ్ఛబ్దాభావే నానుపలబ్ధిః"
౨. ౨. ౩౫.

పాణినిమిత్తప్రశ్లేషాత్ = వాయింపబడి మ్రోగుచున్న కంచుగంట మున్నగు వస్తువులతో చేతినిసంయోగింపజేసినందువలన, శబ్దాభావే=శబ్దమునశించుచుండగా, నానుపలబ్ధిః=వినాశకారణము లభింపదనుటతగదు.

ఉత్పన్న శబ్దము దేనివలన నశించుచున్నదో అదియే దానికి వినాశకారణమనుట నిస్సంశయము. ఒక కంచుగంటను వాయించి యందు శబ్దము బయలుదేరినపుడు చేతితో నాగంటను తాకిన వెంటనే శబ్దము నశించుట లోకసిద్ధము. ఇట్లు హస్తస్పర్శమువలన శబ్దమునశించుట చూచుచున్నాము. ఇది ప్రత్యక్షసిద్ధము. కాబట్టి వినాశకారణము లభింపకుండుట వలన శబ్దము నిత్యమే యనుట చెల్లదు.

"అస్పర్శత్వా దప్రతిషేధః" ౨. ౨. ౩౬.

అస్పర్శత్వాత్ = శబ్దాశ్రయము స్పర్శింపవీలుగాని దగుటవలన నది నిత్యమేయనుట, అప్రతిషేధః = ప్రతిషేధముకాదు.

మఱియు 'పాణినిమిత్త ప్రశ్లేషా' దను సూత్రమున శబ్దమును నశింపజేయుకారణము ప్రత్యక్షముగా సిద్ధించుచున్నట్లు రూపింపబడినది. కాబట్టి అస్పర్శత్వమను హేతువు శబ్ద నిత్య

త్వమును సాధింప నేరదు. ఇట్లు శబ్దమనిత్యమనియే సిద్ధమగు చున్నది.

"విభక్త్యంతరోపపత్తేశ్చ సమాసే" ౨.౨.౩౭.

(పైసూత్రమంతయు నిందనువర్తించును.) సమాసే = వ్యాకరణ శాస్త్రమున ప్రసిద్ధమగు సమాసమునందు, విభక్త్యంతరోపపత్తేశ్చ = పూర్వముండు విభక్తిస్థానములో మరియొక విభక్తి జనించుట వలనను, శబ్దమనిత్యమని సిద్ధించుచున్నది.

అనేక పదముల నొకపదముగాచేసి వ్యవహరించుట వ్యాకరణశాస్త్రమున సమాస మనబడును. ఇట్లు కొన్ని పదములనుజేర్చి యొకటిగా జేయునపు డాయా పదములలో గల విభక్తి లోపించి మఱియొక విభక్తి యేర్పడును. ఇది యొక శబ్దసంస్కారము. శబ్దము నిత్యమగునెడల నిట్టి సంస్కారము పొసగనేరదు. నిత్యమున తరుగు పెరుగులు కలుగ జాలవు. సమాసమున నొకవిభక్తి పోవుటయు, మరియొకటి యట చేరుటయు వ్యాకరణసిద్ధము. కాబట్టి శబ్దమనిత్యమే యని సూత్రాభిప్రాయము.

ఇంతవరకు శబ్దమనిత్యమని నిర్ణయింపబడినది. ప్రస్తుత మున మరియొక విషయమును పరీక్షింపదలచి ముందుగా సంశయమును ప్రదర్శించుచున్నాడు.

"వికారాదేశోపదేశాత్ సంశయః" ౨.౨.౩౮.

వికారాదేశోపదేశాత్ = వికారము, ఆదేశము నను నీ రెండునుప దేశింప బడుటవలన, సంశయః = శబ్దమునగల యొకవర్ణస్థానమున నేర్పడు మరియొక వర్ణము వికారమా? ఆదేశమా? యను సంశయము కలుగును.

'దధ్యత్ర' (దధి+అత్ర) యనునిట్టి సంధిస్థలము లందు (ఇకోయణచి) అను నిట్టి వ్యాకరణ సూత్రముల ద్వారా ఇకార స్థానమున యకార ముపదేశింప బడుట వ్యాకరణ శాస్త్ర సిద్ధము. సంధిస్థలమున ఇకారము ఇత్వమును విడిచి యత్వమును బొందును. ఈస్థితిని వికారమని కొందఱు పలుకుదురు. ఇకారమును విడిచి దాని స్థానమున యకారము ప్రయోగింప బడుట ఆదేశమని కొందరు చెప్పుదురు. కాబట్టి వికారమా? ఆదేశమా? యని సందేహము కలుగుట స్వభావము. ఇందు వికారమనుట పూర్వపక్షము. ఆదేశ మనుట సిద్ధాంతమని భావము.

(వికారవాదము)

"ప్రకృతి వివృద్ధౌ వికార వివృద్ధేః" ౨.౨.౩౯.

ప్రకృతివివృద్ధౌ = ప్రకృతి వృద్ధినొందిన, వికారవివృద్ధేః = వికారనందును వృద్ధికలుగుట వలన, ఇకారాదికి కలుగు యకారాది వికారముకాదని సూత్రార్థము

లోకమున మూలపదార్థము(ప్రకృతి)న వృద్ధియేర్పడిన, దానిచే నేర్పడు (వికారము) కార్యము నందును వృద్ధి కలుగుట చూచుచున్నాము. సువర్ణమున పెంపుగలిగిన దానిచే నొనరింపబడు భూషణములందును వృద్ధికలుగును. క్షీరమున నెంత పెంపుగలిగిన దానివలన నేర్పడు దధి (పెరుగు) యందును నంత పెంపు గలుగును. దధి, భూషణములు క్షీర సువర్ణ వికారములగుట లోక విదితము. ఇట్లే 'ఇ' కారమునకు 'య' కారము వికారమే యగునెడల ఇకారమున వృద్ధి కలిగి

నప్పుడు యకారమునను వృద్ధి కలుగవలసి యుండును. అట్లు కలుగకుండుట వ్యాకరణశాస్త్రప్రసిద్ధ విషయము. ఎట్లన, (దధి+అత్ర=దధ్యత్ర) ఈస్థలమున 'ఇ' కారము హ్రస్వము. (సుధీ+ఉపాస్యః=సుధ్యుపాస్యః) ఈస్థలమున 'ఈ' కారము దీర్ఘము. ఈ, 'ఇ'కార, 'ఈ'కార స్థానముల నేర్పడు యకార మొకటిగానే యుండును. ఈరెండవ యుదాహరణమున 'ఈ' కార స్థానమున నేర్పడు 'య'కారమునకును 'ఇ'కార స్థానమున నేర్పడు 'య'కారమునకును నెట్టి భేదమును లేదు. ఇది వికారమగునెడల ప్రకృతి భూతమగు 'ఇ'కారమున వృద్ధి (పెంపు) కలుగుటచే 'య' కారమునను పెంపు గలుగ వలసి యుండును. అట్లు కలుగక పోవుటచే వికారము కాదని యభిప్రాయము.

పూర్వపక్షము:—

"న్యూన సమధికోపలబ్ధేః వికారాణా మహేతుః" ౨.౨.౪౦

వికారాణామ్ = వికారములు (కార్యములు), న్యూనసమధికోపలబ్ధేః = ప్రకృతిభూత (మూల) పదార్థములకంటె హెచ్చుతగ్గులుగా నేర్పడుట లోకమున చూచుటచే, అహేతుః = ప్రకృతి ననుసరించి వికారమున హెచ్చుతగ్గులు కలుగవలయుననెడి హేతువు సరియైనదికాదు.

మూలపదార్థము (కారణపదార్థము) ననుసరించి మూలమున పెంపుగలిగిన పెచ్చుగానేర్పడి, తగ్గు గలిగిన తక్కువగా నేర్పడునదియే వికారమను నియమము లేదు. నారికేళ బీజమునుండి యేర్పడు నారికేళాంకురము బీజముకంటె చిన్నదిగా జూడబడుచున్నది. మఱ్ఱివిత్తనమునుండి యేర్పడు వటాంకురము విత్తనముకంటె పెద్దదిగా నుండును. కాబట్టి

మూలముకంటె వికృతులలో హెచ్చుతగ్గులుండవనుట సరి కాదు. అందువలన 'ఇకార' స్థానమున ప్రయోగింపబడు యకారము వికారముకాక ఆదేశమే యగుననుట పొసగదు.

ఉత్తరపక్షము:—

"నాతుల్య ప్రకృతీనాం వికార వికల్పాత్" ౨.౨.౫౧.

అతుల్య ప్రకృతీనామ్ = ప్రకృతి పదార్థములు భిన్నములయినపుడు, వికార వికల్పాత్ = వికార పదార్థములందును భేదముండవలసియుండుటచే, న = పూర్వోక్త శంక సరికాదు.

"ప్రకృతి వివృద్ధౌ" అనుసూత్రమున ప్రకృతి పదార్థము ననుసరించి వికారమున హెచ్చుతగ్గులు కలుగవలయుననుట (ఆదేశవాదులమగు) మా యభిప్రాయముకాదు. ప్రకృతిపదార్థము భిన్నమైనపుడు వికారమును భిన్నము కావలసియుండుననుట మా యభిప్రాయము. నారికేళబీజము నుండి వటాంకురముగానీ, వటబీజమునుండి నారికేళముగానీ కలుగనేరదు. వటబీజమునుండి వటాంకురమే ఉద్భవించును. అట్లే 'ఇ'కారమునకు 'య'కారము వికారమగునెడల 'ఈ'కారమునకు 'య'కారముగాక మరియొకటియై యుండవలయును. అట్లుగాక 'ఇ'కార 'ఈ'కారములకు రెంటికిని యకారమే ప్రయోగింపబడుటచే 'య'కారము వికారముకాదు. ఆదేశమే యగును.

పూర్వపక్షము:—

"ద్రవ్య వికారే వైషమ్యవత్ వర్ణవికార వికల్పః"
౨.౨.౫౨.

ద్రవ్యవికారే వైషమ్యవత్ = ద్రవ్యరూపమున వట నారికేళ ములు తుల్యములయ్యు విలక్షణములైనట్లు, వర్ణవికార వికల్పః = ఇకార ఈకారస్థానమున ప్రయోగింపబడు యకారములు వర్ణరూపమున సమానములయినను విషమములే.

వట నారికేళ వృక్షములు ద్రవ్యభావమున సమానములైనను, ప్రకృతి (బీజ) భేదమువలన వికారములగు వంపుర ములు భిన్నములు (విలక్షణములు) అయినట్లు ఇకార ఈకార స్థాన ప్రయుక్త యకారములు ప్రకృతి భేదమువలన విలక్షణములే యని యెఱుగవలయునని వికారవాది యభిప్రాయము. కాబట్టి ఇకార స్థానిక యకారము వికారమేగాని యాదేశము కానేరదు.

ఉత్తరపక్షము:—

"న వికారధర్మానుపపత్తేః" ౨.౨.౪౩.

వికార ధర్మానుపపత్తేః = యకారమున వికృతి ధర్మము లేకుండుటవలన, న = వికారవాది యభిప్రాయము సరికాదు.

వికారములలో ప్రకృతిధర్మము కానరానంత వరకు ప్రకృతులు భిన్నమైనంత మాత్రముచేత తద్వికారములును భిన్నములే యనుట యెట్లుపొసగును ? వట నారికేళ వృక్షములు, వాని మూలములగు బీజములు భిన్నములగుటవలన భిన్నములనుట తగదు. బీజధర్మము వృక్షమున చూడబడుచున్నది. అందుచే నవి భిన్నములనుట యుచితమే. యకారమున ప్రకృతి ధర్మములగు హ్రస్వత్వ దీర్ఘత్వములు కనబడకుండుటచే ఇకార ఈకారములలో వచ్చు యకారము వాని వికారము కానేరదు.

ప్రకృతి భూతమగు వస్తువులో నేధర్మము లుండునో ఆధర్మములు కలిగియుండి వ్యూహాభేదము (పూర్వరూపము పోయి క్రొత్తరూపము) కలుగుట వికార మనబడును. క్షీరము ప్రకృతిభూతమగు వస్తువు. పెరుగు దానికి వికృతి. పెరుగులో క్షీరధర్మ ముండును కాని క్షీరరూపము పోయి క్రొత్తరూప మొకటి యేర్పడును. కాబట్టి పాలకు వికృతి పెరుగు.

"వికారప్రాప్తానా మపునరాపత్తేః" ౨.౨.౪౮.

వికార ప్రాప్తానామ్=వికృతి రూపము నొందిన ప్రకృతివస్తువులు, అపునరాపత్తేః=మరల స్వస్వరూపమును బొందవు.

వికారము మరల ప్రకృతి రూపమును బొందదు. పెరుగు మరల పాలరూపమును బొందకుండుట లోకవిదితమే కాని, దధ్యత్ర అను పదమున సంధి నపేక్షించినపుడు ఇకార స్థానమున యకారమును ప్రయోగింతురు. సంధి నపేక్షింప నపుడు (దధి+అత్ర) ఇకారమునే ప్రయోగింతురు. కాబట్టి ఇకారస్థానమున ప్రయోగింపబడు యకారము దాని వికారము గాక ఆదేశమే యని సూత్రాభిప్రాయము.

పూర్వపక్షము:-

"సువర్ణాదీనాం పునరాపత్తే రహేతుః" ౨.౨.౪౯.

సువర్ణాదీనాం = బంగారము మున్నగునవి, పునరాపత్తేః = నగల రూపమున వికృతములయ్యు మరల పూర్వరూపమును బొందుట చూచు చున్నాము. కాబట్టి, అహేతుః = వికృతులు మరల ప్రకృతిరూపమును బొందవని చెప్పిన హేతువు సరికాదు.

బంగారము నగలరూపమున వికృతరూపమును బొంది యు మరల స్వస్వరూపమును బొందుచుండుట చూచు చున్నాము. అట్టియెడ వికారము ప్రకృతిరూపమును బొంద నేరదనుట తగదు. కాగా యకారము ఇకారవికారము కాదను టయు హేతుబద్ధముకాదు.

ఉత్తరపక్షము:—

"న తద్వికారాణాం సువర్ణభావావ్యతిరేకాత్" ౨.౨.౪౬.

తద్వికారాణామ్ = సువర్ణవికారములయిన నగలు, సువర్ణభావా వ్యతిరేకాత్ = సువర్ణమే కాని, దానికంటె విలక్షణమైన వికృతిని బొందలేదు. కాబట్టి, న = వికారములు ప్రకృతిరూపమును బొందవని చెప్పిన హేతువు అహేతువుకాదు.

ప్రతి యల్పవికారమును ప్రకృతిరూపమును బొందదని సమాధానకర్త యభిప్రాయముకాదు. ప్రకృతిధర్మము కలిగి యుండి విజాతీయరూపమున పరివర్తించు వికారము మరల ప్రకృతి రూపమును బొందదని యభిప్రాయము. కాబట్టి క్షీర వికృతి దధియైనట్లు ఇకార స్థానమునవచ్చు యకారము దాని వికృతికాక యాదేశమే యగును.

"నిత్యత్వేఽవికారాత్, అనిత్యత్వేచానవస్థానాత్" ౨.౨.౪౭

నిత్యత్వే = వర్ణములు నిత్యములయిన పక్షమున, అవికారాత్ = వికార మసంభవము. అనిత్యత్వేచ = నిత్యములుకాని పక్షమున, అనవ స్థానాత్ = అవస్థాయిత్వము (స్థితి) లేనివగును.

వర్ణములు నిత్యములో లేక యనిత్యములో యగును. ఉభయపక్షములందును యకారము వికారమననొప్పదు నిత్య

పక్షమున వర్ణము వికృతినొందజాలదు. వికృతి నిత్యత్వమునకు విరోధి. అనిత్యమైనచో ఇకారము నశించినతదుపరి వచ్చు యకారము ఇకార వికృతియనుట ఎట్లుచెల్లును? ప్రకృతి భూత వస్తువు అవస్థాయియై (స్థిరమై)న కదా వికృతి నొందగలుగును? కాబట్టి యుభయవిధముల నెట్లు చూచినను ఇకార స్థానిక యకారము ఆదేశమే యననొప్పును. వికారమనుట పొసగదు.

పూర్వపక్షము:—

వికారవాది వర్ణములు నిత్యములను పక్షము నంగీకరించి తన వాదమును స్థిరపరుప నుద్దేశించుచు సమాధానము నిచ్చుచున్నాడు.

"నిత్యానా మతీంద్రియత్వాత్ తద్ధర్మ వికల్పాచ్చ వర్ణవికారాణా మప్రతిషేధః" ౨. ౨. ౫౮.

నిత్యానాం = నిత్యపదార్థములు, అతీంద్రియత్వాత్ = (కొన్ని ఇంద్రియగోచరములయినను) అతీంద్రియములగుటవలన, తద్ధర్మవికల్పాత్ = వాని ధర్మములలో వికల్పముకలుగుట కవకాశముండుట చేత, వర్ణవికారాణామ్ = వర్ణములునిత్యములైనను వానికి వికారములు, అప్రతిషేధః = కలుగవని చెప్పవీలుబడదు.

నిత్య పదార్థము లన్నియు నొకే విధముగ నుండు నన వీలుపడదు. కొన్నిట నొక ధర్మము, మరి కొన్నిట మరియొక ధర్మము చూచుచున్నాము. ఆకాశ పరమాణ్వాది నిత్యపదార్థములు ఇంద్రియములకు గోచరములు కావు. గోత్వ పృథివీత్వాది జాతులు నిత్యము లైనను ఇంద్రియ గోచరములే యని శాస్త్ర మంగీకరించు చున్నది. ఇట్టి వికల్పము నిత్య

పదార్థములలో నంగీకరించు చున్నాము. కాబట్టి, ఆకాశాది నిత్య పదార్థములలో వికారము లేకున్నను వర్ణములు నిత్యము లయినప్పటికి వికారవంతము లని చెప్పిన దోషమేమి? కాగా వర్ణములు నిత్యములని యంగీకరించిన పక్షమున ఇకారస్థానిక యకారము వికారమని చెప్పవలనుపడదనుట తగదు.

"అనవస్థాయిత్వేచ వర్ణోపలబ్ధివత్ తద్వికారోపపత్తిః"
౨.౨.౪౯.

అనవస్థాయిత్వేచ = వర్ణములనిత్యములై స్థాయిత్వము లేనివైనను, వర్ణోపలబ్ధివత్ = అవి శ్రవణేంద్రియములచే గ్రహింపబడుచున్నట్లు, తద్వికారోపపత్తిః = వర్ణవికారమును సంభవమే.

వర్ణము లనిత్యము లను పక్షమున నవి స్థాయిత్వము లేనివగుటచే వానికి వికారముకలుగుట కవకాశము లేదందు రేని యది సరికాదు. కారణమేమన, అనిత్యము లయినను శ్రవణేంద్రియముచే గ్రహింపబడుచున్నట్లాదేశవాదులయిన మీరు నంగీకరించుచున్నారుకదా! స్థాయిత్వము లేనివై శ్రవణముచే గ్రహింపబడునట్లు వికారము నేల పొందజాలవు? పొందగలవు. కాబట్టి యుభయపక్షములందును ఇకారస్థానిక యకారము వికారమేగాని యాదేశము కాదని పై రెండు సూత్రముల తాత్పర్యము.

ఉత్తరపక్షము: —

"వికార ధర్మిత్వే నిత్యత్వాభావాత్ కాలాంతరే
వికారోపపత్తేశ్చాప్రతిషేధః" ౨.౨.౫౦.

వికారధర్మిత్వే = వర్ణములు వికారము కలవగుచో, నిత్యత్వాభావాత్ = నిత్యములు కాజాలవు. చ = మరియు, కాలాంతరే = వర్ణస్థితి కాలముకంటె భిన్నమైన కాలములో, వికారోపపత్తేః = వికారము కలుగుచున్నది. కాబట్టి, ప్రతిషేధః = వర్ణములు నిత్యములు, అనిత్యములనను నుభయపక్షములందును వికారవాద మయుక్తమనుట నిషేధింపబడదు.

నిత్యవస్తువుల స్వరూపము మారజాలదు. మారినట్లయిన నవి నిత్యములుకావు. నిత్యత్వము, వికారము నను నీ రెండుధర్మములు పరస్పర విరుద్ధములు. కాబట్టి యవి రెండు నొక వస్తువున నుండనేరవు. అందువలన వర్ణములు నిత్యములు, వికారవంతములు ననుట పొనగదు.

వర్ణము లనిత్యములను పక్షమున నవి స్థాయిత్వము (స్థిరత) లేని వగుటచే వికారము కలుగు సమయమున నుండ జాలవు. కాబట్టి యేది లేదో దాని వికారమెట్లు గలుగ గలదు? వికృతివేళ ప్రకృతి యుండితీరవలయును. దధి+అత్ర యనునపుడు ఇకారముండును; యకారముండదు. దధ్యత్ర యని సంధించి పలుకునపుడు యకారముండును; ఇకార ముండదు. అట్టిచో ఇకార యకారములకు ప్రకృతి వికృతి భావమెట్లు చెప్పనగును? కాబట్టి ఇకార స్థానిక యకార ముభయపక్షములందును ఆదేశమే యగునుకాని వికారము కాజాలదు.

“ప్రకృత్యనియమాత్” ౨.౨.౪౧.

ప్రకృత్యనియమాత్ = వర్ణవికారములకు ప్రకృతినియమము లేక పోవుటవలనను వికారవాదము యుక్తముకానేరదు.

మఱియు లోకమున, నేది దేనికి ప్రకృతియో యది దాని కెన్నడును వికృతికాక ప్రకృతిగా నుండుటయే జూచుచున్నాము. ఇట్లే యేది దేనికి వికృతియో యదిదానికి సర్వదా వికృతియే యగును; గాని ప్రకృతి కానేరదు.

క్షీరము దధికి ప్రకృతి. దధి క్షీరమునకు వికృతి. ఈదధి క్షీరములలో నొకప్పుడు దధి క్షీరమునకు ప్రకృతి యగుటయు, మరియొక యెడ వికృతి యగుటయు జూడనేరము. క్షీరము సర్వదా ప్రకృతియే. దధి వికృతియే.

వర్ణవికారములలో నిట్టిప్రకృతి వికృతి నియమములు కానరావు. 'దధ్యత్ర' యను స్థలమున ఇకార స్థానమున యకారము ప్రయోగించుచున్నాము. కాబట్టి, యిట ఇకారము ప్రకృతి, యకారము వికృతి యగును. * 'విధ్యతి' అను స్థలమున వకారోత్తర ఇకారము యకారస్థలమున ప్రయోగింపబడుచున్నది. కాబట్టి యిట యకారము ప్రకృతి, ఇకారము వికృతి యగుచున్నది. కాగా ఇకార యకారములు ఒకచో ప్రకృతి భావమును, మరియొకచో వికృతిభావమును పొందుచు ప్రకృతి వికృతి నియమములను వ్యభిచరించు (నుల్లంఘించు) చున్నవి. కాబట్టి వికారవాదము యుక్తిసంగతము కాదని సూత్రాభిప్రాయము.

---

* (విధ్యతి). వ్యధ = హింసాయాం. అను ధాతురూపము. 'ఇగ్యణః సంప్రసారణమ్' అను సూత్రము ననుసరించి వకారోత్తర యకారమునకు ఇకారమాదేశమగును.

పూర్వపక్షము:—

"అనియమే నియమాన్నానియమః" ౨.౨.౫౨.

అనియమే = ప్రకృత్యనియమమున, నియమాత్ = నియమముండుట వలన, అనియమః=అనియమము, న = లేదు.

ఇకార స్థానమున యకారము, యకారస్థానమున ఇకారము ప్రయోగింపవలయునను వ్యవస్థయొకటి వర్ణవికార విషయమున గానవగుచుండుటవలన అనియమ మెక్కడ నున్నది? నియమమే కలదు.

ఉత్తరపక్షము:—

"నియమానియమవిరోధాదనియమే నియమాదప్రతిషేధః"
౨.౨.౫౩.

నియమానియమ విరోధాల్ = నియమము, అనియమము నను రెండును పరస్పర విరుద్ధములు.(అవి రెండు నొక యధికరణమున నుండజాలవు.) కాబట్టి, అనియమే = ప్రకృత్యనియమమున, నియమాత్ = నియమముండుట వలన, అప్రతిషేధః = ప్రకృత్యనియమము కాదనుటతగదు.

ప్రకృత్య నియమములో నొక వ్యవస్థయున్నను ప్రకృతి కుండవలసిన నియమమున్నట్లు కానేరదు. నియమ మనగా నొక యర్థము నంగీకరించుట. అనియమ మన దాని నిషేధము. కాగా నియమానియమములు పరస్పర విరుద్ధములై యొక యధికరణమున నుండజాలవు. అంగీకృతార్థము, ప్రతిషిద్ధార్థము రెండు నొక్కటి కానేరవుకదా! అనియమములో వ్యవస్థ యున్నంతమాత్రమున అనియమము నియమ మెన్న

డును కాజాలదు కాబట్టి ప్రకృతి వికారముల కుండవలసిన నియమము లేకపోవుటవలన ఇకార స్థానిక యకారమాదేశమే కాని వికారమెన్నడును కానేరదు.

(ఆదేశమే వికారమని వ్యవహరింపబడుట)

"గుణాంతరాపత్త్యుపమర్దహ్రాస వృద్ధిలేశ శ్లేషేభ్యస్తు వికారోపపత్తే ర్వర్ణవికారాః" ౨.౨.౫౭.

గుణాంతరాపత్తిః = ధర్మియుండగా ధర్మాంతరము కలుగుట. ఒకానొక పదమున అనుదాత్తముపోయి దాని స్థానమున నుదాత్తమేర్పడుట. (దధ్నా)

ఉపమర్దః=ధర్మి పోయి దానిస్థానమున మరియొక ధర్మిప్రయోగింపబడుట. (అస్తిస్థానమున భూప్రయోగము.)

హ్రాసః = దీర్ఘమునకు హ్రస్వము ప్రయోగించుట. (శ్రీపమ్)

వృద్ధిః=హ్రస్వమునకు దీర్ఘము.(అచీకమత)

లేశః = లాఘవము. తగ్గింపు. (స్తః)

శ్లేషః = ప్రకృతికో, ప్రత్యయమునకో యధికముగాచేరుట = ఆగమము. (సంస్కర్తా)

గుణాంతరా......శ్లేషేభ్యః = గుణాంతరాదులవలన, వికారోపపత్తేః = ఒకదాని ప్రయోగమున కన్యమును ప్రయోగించుట యను వికారము సంభవించుట వలన, వర్ణవికారాః = ఇట్టితావులలో వర్ణవికారమని చెప్పుట తగును.

పైన జూపినట్లు వ్యాకరణ శాస్త్రరీతి ననుసరించి యాయా స్థలములందు కలుగు ప్రయోగ విధులలో వికార శబ్ద ప్రయోగము చేయబడును.

(పదనిరూపణము)

“తే విభక్త్యంతాః పదమ్” ౨.౨.౫౫.

తే = ఆవర్ణములు, విభక్త్యంతాః = అంతమున విభక్తిగలవై పదమ్ = పదమని వ్యవహరింపబడును.

విభక్తులు రెండువిధములు. నామికి. ఆఖ్యాతికి. నామ విభక్తి ‘సుప్’ అనియు, ఆఖ్యాతవిభక్తి (క్రియావిభక్తి) ‘తిజ్’ అనియు ననబడును. ఈ ‘సుప్’ ‘తిజ్’లు అంతము నందుగల వర్ణములు పద మనబడును. వ్యాకరణాచార్యుడు పాణిని (సుప్ తిజంతం పదమ్) సుబంతము, తిజంతము పద మని సూత్రించియున్నాడు. ఇట్లు పదము నామము, ఆఖ్యా తము నని రెండువిధములగును.

(పదార్థ నిరూపణమున సంశయము)

“వ్యక్త్యాకృతి జాతి సన్నిధా వుపచారాత్ సంశయః”
౨.౨.౫౬.

వ్యక్త్యాకృతి జాతిసన్నిధౌ = వ్యక్తి, ఆకృతి, జాతి యను నీ మూడు నత్యంత సమీపవర్తులు (అవినాభావ వృత్తులు) అగుటచే, ఉప చారాత్ = గోవు అను పదప్రయోగమువలన, సంశయః = పదము నకు వ్యక్తి అర్థమా? ఆకృతియా? జాతియా? యని సంశయము కలుగును

లోకమున సర్వత్ర పదమునకు, పదార్థమునకు సంబంధప్రాప్తి యుండుటచేతనే పదప్రయోగము చేయబడు చున్నది. వ్యక్తి, ఆకృతి, జాతి యను నివి పదార్థము కాకు న్నచో నాయర్థమున ‘పదము’ ప్రయోగింపబడనేరదు. వ్యక్త్యా కృతి జాతులు పరస్పర మవినాభావ సంబంధము కలవిగా

తెలియనగుచున్నవి. గో పదము వలన గో వ్యక్తియు, గో జాతియు, తదాకృతియు తెలియుటచే నిందు పదమున కర్థమేది యని సంశయము పొడముచు.

కొందఱు వ్యక్తి పదార్థమందురు. మరికొందరు ఆకృతి యని నుడువుదురు. వేరొక కొందరు జాతి యందురు. వైదికులుమాత్రము వ్యక్త్యాకృతివిశిష్టజాతి వాకొనుచున్నారు.

గోవు మున్నగు ద్రవ్యములు వ్యక్తులనియు, అవయవ సన్నివేశము ఆకృతి యనియు, గోత్వాదులు జాతి యనియు వివేకము.

వ్యక్తియే పదార్థమను వాని సమాధానము.

"యాశబ్దసమూహత్యాగపరిగ్రహసంఖ్యావృద్ధ్యుపచయ
వర్ణసమాసానుబంధానాం వ్యక్తావుపచారాత్ వ్యక్తిః"
౨. ౨. ౫౭.

యా శబ్ద...అనుబంధానామ్ = యచ్ఛబ్దాదులు, వ్యక్తౌ=వ్యక్తియందు, ఉపచారాత్ =ప్రయోగింపబడుటవలన, వ్యక్తిః=వ్యక్తిపదార్థము.

(౧) యాశబ్దః = 'యా' అను పదముతో కూడిన వాక్యము (యాగౌస్తిష్ఠతి. యాగౌర్నిషణ్ణా. ఏయావు నిలుచున్నదో, ఏ యావు కూర్చున్నదో.) ఈవాక్యములలో ఆవునకు కూర్చుండుట, నిలుచుండుట యను క్రియలకు సంబంధము తెలియుచున్నది. గోపదమునకు వ్యక్తి అర్థముకాక ఆకృతి జాతులగునెడల వానికా క్రియలతో నెట్లు సంబంధము పొసగును? వ్యక్తి ద్రవ్యమగుటచే నందు క్రియ గలుగ

నగును. ఆకృతి జాతులు నిష్క్రియలగుటచే వానికి క్రియలతో నన్వయము వీలుపడదు. కాబట్టి గోపదమున కర్థము ద్రవ్యమగు వ్యక్తియే యని యభిప్రాయము.

(౨) సమూహః=సముదాయము. (గవాంసమూహః) గోవుల సమూహము. ఆవుల సముదాయమునుచూచి గో సమూహమనిన నట ద్రవ్యసముదాయ మర్థమగునుకాని జాత్యాకృతులు బోధపడవు.

(౩) త్యాగః = దానము. తన స్వత్వమును విడిచి యందితరులకు స్వత్వమును కలిగించుట. (యాచకాయ గాం దదాతి) యాచకునకు గోవు నిచ్చుచున్నాడు. ఇట త్యజింపబడునది ద్రవ్యముకాని జాత్యాకృతులు కావు.

(౪) పరిగ్రహః = ఒకనిచే నీయబడిన దానిని ఆదరపూర్వకముగా గ్రహించుట. (గాం పరిగృహ్ణాతి) గోవును గ్రహించుచున్నాడు. ఇట ద్రవ్యమే గ్రహణ యోగ్యముకాని జాత్యాకృతులు కానేరవు.

(౫) సంఖ్యా=గణన. (వింశతిర్గావః)ఇరువదియావులు. పదియావులు. ఇటను ద్రవ్యమే.

(౬) వృద్ధిః = వర్ధిల్లుట. (వర్ధతే గౌః) ఆవు పెరుగుచున్నది. ఇందునను ద్రవ్యమే.

(౭) అపచయః = క్షయము. (గౌరకృశ్యత్) గోవు కృశించినది.

(౮) వర్ణః = రంగు.

(౯) సమాసః = బాగుగా కూర్చుండుట.

(౧౦) అనుబంధః = సరూప ప్రజననము. తనవంటి దానిని జనింపజేయుట. ఇట్టి తావులందన్ని యెడల పదార్థము వ్యక్తియగును కాని జాత్యాకృతులు కాజాలవని సూత్రాభిప్రాయము.

(వ్యక్తివాద నిరాకరణము.)

"న తదనవస్థానాత్." ౨.౨.౬౨.

తదనవస్థానాత్=యాశబ్దాదులు వ్యక్తియందే వ్యవస్థితము కాక పోవుట వలన, న=వ్యక్తియే పదార్థమనుట తగదు.

యాశబ్దాదులు కేవలము వ్యక్తినే బోధించు పక్షమున వ్యక్తి పదార్థము కాగలదు. గోవు నిలుచున్నది అనినపుడు గోత్వవిశిష్ట గోవ్యక్తి నిలుచున్నది యను నర్థము సూచింపబడును. జాతిరహిత వ్యక్తి మాత్రము నిలుచున్నదను వ్యవస్థ యెన్నడును కలుగ నేరదు. కాబట్టి జాతివిశిష్ట వ్యక్తియే పదార్థము కాగలదు.

ఒకానొక పదప్రయోగమున కేవల వ్యక్తియే తెలియబడిన వినువానికి వ్యక్తి మాత్రము బోధపడి జాతి తెలియబడకుండ వలసి యుండును. లోకమున నట్లు చూచుట లేదు. నిలుచుండుట మున్నగు క్రియలు జాత్యాకృతులతో నన్వయింప జాలవు. కాబట్టి వ్యక్తియే పదార్థ మనుటయు సరిగాదు. కారణమేమన, క్రియా గుణములు జాత్యాకృతులతో సాక్షాదన్వయము బొందజాలక పోయినను వ్యక్తిద్వారా

అన్వయింప వీలగును. కాబట్టి యేదోషము నుండదని సూత్ర తాత్పర్యము.

వ్యక్తిమాత్రము పదార్థము కాక జాతివిశిష్టవ్యక్తి పదార్థమగు పక్షమున కొన్నియెడల కేవల వ్యక్తియందు పద ప్రయోగమేల చూడబడుచున్నదన,

"సహచరణ స్థాన తాదర్థ్యవృత్త మాన ధారణ
సామీప్య యోగ సాధనాధిపత్యేభ్యో బ్రాహ్మణ
మంచ కట రాజ సక్తు చందన గంగా శాటకాన్న
పురుషేష్వతద్భావేఽపి తదుపచారః" ౨, ౨. ౬౫.

సహచరణ స్థాన......అధిపత్యేభ్యః = సహచరణాదుల వలన, బ్రాహ్మణ......పురుషేషు=బ్రాహ్మణాదుల యందు, అతద్భావేపి = బ్రాహ్మణాద్యర్థములు లేకున్నను, ఆయర్థములం దేల్ల పదములు ప్రయోగింప బడుచున్నవో యట్లే, తదుపచారః= వ్యక్తిమాత్రమర్థము కాకున్నను వ్యక్త్యర్థమున నే కొన్నియెడల ప్రయోగింపబడును.

సహచరణమ్ = సాహచర్యము - అవినాభావ సంబంధము. స్థానమ్ = స్థితి, తాదర్థ్యమ్ = తదర్థత, వృత్తమ్ = హితప్రవర్తనాది చరిత్ర, మానమ్ = పరిమాణము, ధారణమ్ = ధృతి, సామీప్యమ్ = సమీపత, యోగః = గుణాదులసంబంధము, సాధనమ్ = హేతువు, ఆధిపత్యమ్ = స్వామ్యము.

బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, మంచః =మంచెమీదనున్నవ్యక్తి. కటః = వీరణము, గంగా = గంగాసమీపప్రదేశము. శాటకః = వస్త్రము. అన్నమ్ = ప్రాణము.

ప్రయోగములు:- (యష్టికాన్ భోజయ; బ్రహ్మదండాన్ భోజయ) యష్టికులను భుజింపజేయుము. బ్రహ్మ

దండులను భుజింపజేయును. ఇట్టియెడల యష్టిక బ్రహ్మ దండ శబ్దములకు వైదిక జ్ఞానోపదేశకులైన బ్రాహ్మణులని యర్థము. యష్టిక బ్రహ్మదండ శబ్దములు దండవాచకము లయ్యు బ్రాహ్మణార్థమున ప్రయోగింపబడినవి. కారణము సాహచర్యము.

(మంచాః క్రోశన్తి) మంచెలు కేకలువేయుచున్నవి. ఇట మంచెశబ్దము మంచెమీఁదనున్న వ్యక్తిని తెలుపును. స్థితి కారణము.

(కట మానయ) కటమును తెమ్ము. కటమనగా చాప. కాని యిట చాప అల్లుట కనువైన తుంగను తెమ్ము అని యర్థము. (కటమునకు వీరణమని భాష్యకర్తలు ప్రయోగించిరి వీరణ మనగా తృణ విశేషమని వాచస్పతి మిశ్రు లభిప్రాయపడుచున్నారు. కాబట్టి నేను తుంగ యని వాడితిని.)

(యమోరాజా, కుబేరోరాజా) యముడురాజు. కుబేరుడు రాజు. ఇట యమ కుబేర శబ్దములకు రాజని యర్థము కాకున్నను రాజువలె ప్రవర్తించు వ్యక్తులయెడ ప్రయోగింపబడినవి.

(ఆఢకం సక్తవః) అడ్డెడువేలపిండి. మానెడువేలపిండి.

(తులాచందనమ్) తులము చందనము.

(గంగాయాం గావశ్చరన్తి) గంగలో గోవులు మేయుచున్నవి.

(కృష్ణః శాటకః) చీర నలుపు.

(అన్నం ప్రాణః) అన్నమే ప్రాణము.

(అయం పురుషః కులమ్-గోత్రమ్) ఇతడు కులము-ఇతడు గోత్రము.

ఈ వాక్యములందును పైన జూపినట్లు కొలత, బరువు మున్నగు కారణములవలన నొకపదము కొండొక విశేషార్థమున ప్రయోగింపబడుట మనము చూచుచున్నాము. కాబట్టి పదమునకు జాతివిశిష్ట వ్యక్తియే యర్థమైనప్పటికి కొన్ని యెడల కేవల వ్యక్తియందు నౌపచారికముగా ప్రయోగింపబడునని భావము.

(ఆకృతియే పదార్థమను వాదము)

"ఆకృతిస్తదపేక్షత్వాత్ సత్త్వవ్యవస్థాన సిద్ధేః" ౨.౨.౬౦.

(సత్త్వః = గోవు మున్నగు (ప్రాణులు) సత్త్వవ్యవస్థానసిద్ధేః = ఇది గోవు; ఇది అశ్వము; అను వ్యవహార వ్యవస్థాసిద్ధి, తదపేక్షత్వాత్ = ఆకృతిజ్ఞానము నపేక్షించుట వలన, ఆకృతిః= ఆకృతి పదార్థము.

ప్రాణుల యవయవముల నియతమైన సన్నివేశము ఆకృతి యనబడును. అట్టి యాకృతి తెలియనంతవరకు 'ఇది యావు', ఇది గుఱ్ఱము' అను లోకవ్యవహారమే సిద్ధింపదు. ఈ లోక వ్యవహారమును సాధించుటయే శబ్ద ప్రయోజనము. కాబట్టి ఆకృతియే శబ్దమునకు అర్థము.

(పదమునకు జాతియే అర్థము.)

"వ్యక్త్యాకృతియుక్తేప్యప్రసంగాత్ ప్రోక్షణాదీనాం మృద్గవకే జాతిః" ౨.౨.౬౧.

వ్యక్త్యాకృతియుక్తేపి = వ్యక్త్యాకృతులతో కూడియున్నను, మృద్గవకే = మట్టితో చేయబడిన ఆవువిషయమున, ప్రోక్షణాదీనాం= ప్రోక్షణము (నీళ్ళు చల్లుట) మున్నగుక్రియలు, అప్రసంగాత్ = ప్రసక్తములు కాకపోవుట వలన, జాతిః = జాతియే పదార్థము.

గోదాన కర్మ విషయమున 'గోవును ప్రోక్షింపుము' గోవును 'తీసికొనిరమ్ము' 'గోవునిమ్ము' అనునిట్టి వ్యవహారము మృణ్మయ గోవు విషయమున ప్రయోగింప బడదు. కారణ మేమి? మృణ్మయ గోవునందు వ్యక్తి, ఆకృతియు నుండినను గోత్వమను జాతి యుండదు. ఏది లేకుండుటచే పై ప్రయోగములు చేయబడుట లేదో అదియే పదార్థము కాగలదు. కావున జాతియే పదార్థమని తెలుచున్నది.

మృణ్మయ గోవును సైతము గోవు పదముచే వ్యవహరించునపు డట గోత్వమేల యుండదని శంకింప జనదు. గోత్వము నిత్యమైనను ఆకాశమువలె సర్వగతము కాదు. సాస్నాదులతో కూడిన గోపిండములందే యుండును. మట్టితో చేయబడిన గోవు (బొమ్మ)లో గోత్వజాతి యుండదని అభియుక్తుల మతము. గోత్వము లేనియెడ గోపద వ్యవహారమెట్లు పొసగు నందురేని వ్రాసినచిత్రములనుచూచి 'అదిగో ఆవు' 'అదిగో గుఱ్ఱము' అనునట్లు గౌణప్రయోగము నట స్వీకరించుటచే నెట్టి దోషము లేదు. కాగా, జాతియే పదార్థమని సూత్రాభిప్రాయము.

"నాకృతి వ్యక్త్యపేక్షత్వా జ్జాత్యభివ్యక్తేః" ౨.౨.౬౨.

జాత్యభివ్యక్తేః= జాత్యభివ్యక్తి (ప్రత్యక్షముగా కలుగు జాతిజ్ఞా

వము) ఆకృతి వ్యక్త్యపేక్షాత్ = ఆకృతితో కూడిన వ్యక్తిజ్ఞానము నపేక్షించుట వలన, న = జాతి పదార్థముకాదు.

వ్యక్త్యాకృతులు గ్రహింపబడకున్నను జాతిజ్ఞానము కలుగునెడల జాతి పదార్థము కాగలుగును. వ్యక్తి, ఆకృతియు గ్రహింపబడని జాతిజ్ఞానము కలుగనే కలుగదు. కాబట్టి, కేవల జాతి పదార్థమనుట యుక్తముకాదు.

వ్యక్తికానీ, ఆకృతికానీ, జాతికానీ పదార్థముకానిచో నెయ్యది పదార్థమన,

"వ్యక్త్యాకృతి జాతయస్తు పదార్థః" ౨.౨.౬౩.

వ్యక్త్యాకృతి జాతయః = వ్యక్తి, ఆకృతి, జాతి యను నీమూడును నొకచో నొకటి, మఱియొకచో మఱియొకటియు ప్రధానతను వహించుచు పదార్థః = పదార్థమగును.

సూత్రమునందలి 'తు' పదము గౌణప్రాధాన్యభావము నందలి యనియమమును సూచించును. ఒకానొక పదమును ప్రయోగించినపుడా పదముచే వ్యక్త్యాకృతి జాతులు మూడును బోధింపబడును. కాని వానిలో నొకటి ప్రధానముగను, మిగిలినవి యప్రధానముగను తెలియును. భేదము వివక్షితమైనపుడు వ్యక్తి ప్రధానమగును. ఉదా:—ఆవు నిలుచున్నది. ఆవు పండుకొనియున్నది. సామాన్యము వివక్షితమగుచో జాతి ప్రధానము. ఉదా:—గోవును కాలితో తన్నరాదు. ఆకృతి ప్రధానస్థలమునకు దాహరణము; పిండితో గోవును చేయుము.

(వ్యక్తి నిరూపణము.)

"వ్యక్తిర్గుణవిశేషాశ్రయోమూర్తిః" ౨.౨.౬౪.

గుణవిశేషాశ్రయః = రూపాదిగుణవిశేషములకాశ్రయమయిన, మూర్తిః=వ్యాపకముగాని పరిమాణముగల యవయవసంస్థానాత్మకమైన ద్రవ్యము, వ్యక్తిః = ఇంద్రియగ్రాహ్యమై వ్యక్తి యని చెప్పబడును.

వ్యాపక పరిమాణము కలిగియుండక రూపాది గుణ విశేషముల కాధారముగానుండు ద్రవ్యము వ్యక్తియనబడును. ఇంద్రియములచే తెలియబడునది వ్యక్తి యని భావము. (వ్యజ్యతే గృహ్యతే ఇంద్రియైః ఇతి వ్యక్తిః)

(ఆకృతి నిరూపణ)

"ఆకృతిర్జాతిలింగాఖ్యా" ౨.౨.౬౫.

జాతిలింగాఖ్యా=జాతి, లింగము (సంజ్ఞ) గా గలిగినది - జాతిని తెలుపుట కసాధారణకారణము,ఆకృతిః=ఆకృతి యనబడును.

దేనిద్వారా జాతియు దాని లింగములును తెలియబడునో యది యాకృతియని వాత్స్యాయనులు

దృష్టి గోచరమగుటయే తడవుగా దేనిద్వారా గోత్వాది జాతి చిహ్నితమగునో-తెలియబడునో-యదియే యాకృతి. నియత సన్నివేశముగల యవయవముల జ్ఞానము వలననే జాతి (గోత్వాది) గ్రహింపబడుచుండుట లోక సిద్ధము.(జాతేరస్త్రీ విషయా దయోపధాత్. అష్టా. ౪. ౧. ౬౩.) అను వ్యాకరణ సూత్రమును వ్యాఖ్యానము చేయుచు భాష్యకారుడు పతంజలి మహర్షి (ఆకృతి గ్రహణాజాతిః) ఆకృతిచే గ్రహింపబడునది జాతి యని నిర్వచించియున్నాడు. (ఆకృతిః = అవయవసన్నివేశ విశేషము. గ్రహణం = గ్రహణ సాధనముగా గలిగినది. జాతిః = జాతియని యర్థము) అవ

యవ సన్నివేశ విశేషముచే వ్యక్తపరుపబడినది జాతియని భావము. కాగా, గో మనుష్యాది ప్రాణుల శిరఃపాణ్యాద్యవయవముల నియత సన్నివేశమును చూచినపుడు గోత్వ మనుష్యత్వాది జాతులెట్లు తెలియబడుచున్నవో యట్లు బ్రాహ్మణత్వాదికములు తెలియబడకుండుటచే నవి జాతులుకావు. ఉపాధులని వైదికుల సిద్ధాంతము. బ్రాహ్మణత్వాదులు యోని వ్యంగ్యములుకాని యాకృతి వ్యంగ్యములు కావన జెల్లదు. అట్లుండుమేని యనేక వ్యంజకముల నంగీకరింపవలసి వచ్చును. మఱియు, ఐతరేయ వ్యాస ప్రభృతి ఋషివర్యులలో బ్రాహ్మణత్వముండి, యోని (బ్రాహ్మణునకు బ్రాహ్మణి యందు జన్మించుటయను) లేకుండుటచే నట్టివారియెడ జాతి లక్షణ మవ్యాప్తమగును. కాబట్టి ఆకృతియే జాతిలక్షణము. కాగా బ్రాహ్మణత్వాదులు జాతులుగావు.

(జాతినిరూపణము)

"సమాన ప్రసవాత్మికా జాతిః" ౨.౨.౬౬

సమాన ప్రసవాత్మికా=సమానాకారముగల జ్ఞానమును జనింప చేయ గలిగినది. జాతిః = జాతి యని యర్థము.

అనేక భిన్నాధికరణములలో సమాన జ్ఞానమును కలిగించునది జాతి యని చెప్పబడును. అనేకములయిన ఘటపటాది వస్తువులలో ఇది ఘటము, ఇది ఘటము, అవియు అట్లే ఇది పటము, ఇది పటము అని యొకే విధమగు జ్ఞానమును కలిగించునది జాతి యనబడునని సూత్రాభిప్రాయము.

న్యాయదర్శనమున ద్వితీయాధ్యాయము.

న్యాయ దర్శనము

తృతీయాధ్యాయము

(ఆద్యాహ్నికము)

పూర్వాధ్యాయమున ప్రమాణములు పరీక్షింపబడినవి. ప్రమేయమిట పరీక్షింపబడవలసియున్నది. అదియు ద్వాదశ విధమని పూర్వమే యుద్దేశింపబడినది. అందు ప్రథమోద్దిష్టమయిన యాత్మను పరీక్షింపగోరి యది శరీరముకంటె భిన్నమైన దనుటలో హేతువును చూపుచున్నాడు.

"దర్శన స్పర్శనాభ్యామేకార్థగ్రహణమ్" ౩.౧.౧.

దర్శన స్పర్శనాభ్యాం=(దర్శనము-చక్షురింద్రియము, స్పర్శనము-త్వగింద్రియము,) ఈ రెండింద్రియముల ద్వారమున, ఏకపదార్థ గ్రహణాత్ = ఒకేవిషయము గ్రహింపబడుట వలన.

మనము ముందు కంటితోచూచి తెలిసిన వస్తువును చేతితో స్పృశించి తెలిసికొనుచున్నాము. 'నేను దేనిని కంటితో చూచితినో దానిని స్పృశించుచున్నాను' అని యందుము. ఇట్టియెడ ఒకే విషయమును గ్రహించు దర్శన స్పర్శనముల (నేత్ర త్వగింద్రియముల) కంటె భిన్నమగు కర్త యొకడు లేకున్న నిట్లు సంభవము కానేరదు. కన్నుచూచి తెలిసికొనినదానికి కన్ను కర్తయై, స్పృశించి తెలిసినదానికి త్వగింద్రియమే కర్తయగునెడల నీరెండు జ్ఞానములు భిన్న

కర్తృకము లగుటచే కంటితో చూచినదానినే చేతితో స్పృశించుచున్నానను ప్రతిసంధానము (పూర్వాపరముల కలయిక) కలుగనేరదు. దేవదత్తుడు తెలిసికొనినదానిని, యజ్ఞదత్తుడు "నేను పూర్వము గ్రహించినదాని నిపుడు గ్రహించుచున్నా''నని ప్రతిసంధింపజాలడుగదా! కాబట్టి దర్శన స్పర్శనములద్వారా నొక యర్థమును గ్రహించునట్టి యాత్మయొకటి శరీరేంద్రియాదులకంటె భిన్నముగా నున్నదని యంగీకరింపవలయును.

పూర్వపక్షము:—

"న విషయ వ్యవస్థానాత్" 3.౧.౨.

విషయవ్యవస్థానాత్ = ఇంద్రియములచే గ్రహింపబడు విషయములు వ్యవస్థితము లగుటవలన, న = శరీరేంద్రియములకంటె వేరుగా నొక చేతనాత్మ యున్నదనుట తగదు.

ఇంద్రియములు తమతమ విషయములనే గ్రహించును. చక్షువు రూపమును గ్రహించును. జిహ్వ రసమునే గ్రహించును. నాసిక గంధము గ్రహించును. ఇట్లు ఒక ఇంద్రియ మొక విషయమును గ్రహించు ననునది విషయ నియమము—విషయవ్యవస్థ. చక్షువుండిన రూపము గ్రహింపబడును. చక్షువు లేకున్న రూపము గ్రహింపబడదు. కాబట్టి చక్షువే రూపగ్రహణకర్త అంతకంటె భిన్నముగా నొక చేతనాత్మ కల్పించుట యనుచితమని సూత్రభావము.

ఉత్తరపక్షము:—

"తద్వ్యవస్థానా దేవాత్మసద్భావా దప్రతిషేధః'' 3.౧.3.

తద్వ్యవస్థానాదేవ = ఆవిషయనియమ ముండుట వలననే, ఆత్మ సద్భావాత్ = ఆత్మయొకటి యున్నదని చెప్పవీలగుచున్నది. కాబట్టి, అప్రతిషేధః = ఆత్మలేదనుట తగదు.

ఇంద్రియములు తమతమ విషయములనే గ్రహింపగలవను నియమము (వ్యవస్థ) లేకున్న నేదో యొక యింద్రియమన్ని విషయములను గ్రహింపగలిగి యుండెడిది. ఇంద్రియములు నియతవిషయము లగుటచే నేత్రేంద్రియమునకు విషయమైన రూపము త్వగింద్రియముచే తెలియబడదు. కాబట్టి యింద్రియాతిరిక్తముగా వేరొకయాత్మ యుండిననే గాని దర్శన స్పర్శనముల ద్వారమున ఒకే యర్థమును గ్రహించుటకు వలనుపడదు. ఇట్లాత్మ సద్భావమంగీకరింపక తప్పదు. చక్షువున్న రూపము గ్రహింపబడి యది లేకున్న గ్రహింపబడకుండుట యను నన్వయ వ్యతిరేకములవలన చక్షువు రూపగ్రహణమున కారణమగును కాని కర్తను నిషేధింపజాలదు. అట్లు కాని పక్షమున అంధకారమున దీపముండిన రూపగ్రహణము కలుగును; లేకున్న కలుగదు కావున, దీపము రూపమును గ్రహించుచున్నదననలసి వచ్చును. కారణముగా నంగీకరించు పక్షమున నెట్టి దోషము వాటిల్లదు. కాబట్టి శరీరేంద్రియముల కంటె వేరుగా ఆత్మయొకటి శరీరమున నుండి యింద్రియాదుల సహాయమున నెల్ల విషయములు గ్రహించుచున్నదనియు, పూర్వాపర ప్రత్యయముల ప్రతిసంధించుచున్నదనియు నంగీకరించుట న్యాయ్యము.

(శరీరాత్మ వాదము)

"శరీరదాహే పాతకాభావాత్" 3.౧.౪.

శరీరదాహే = శరీరమును దహించుటలో, పాతకాభావాత్ = పాతకము లేకపోవుట వలన, శరీరము చేతనము కాదు.

హింసాకృత పాపము పాతక మనబడును. శరీరము చేతన మగునెడల దానిని దహించువానికి హింస యొనర్చిన పాప మొదవును. లోకము ననుసరించి గానీ, శాస్త్రము నను సరించిగానీ, శరీర దాహికి పాతక మొదవు ననుట చూడము. మాతాపితరుల యంత్యేష్టి నొనర్చువాడు పాతకి యనబడునా? శరీరము చేతనమైన యెడ ఆత్మహింసాపాపము తప్పక కలు గును. కాబట్టి శరీరము చేతనముకాదని భావము.

పూర్వపక్షము:—

"తదభావః సాత్మకప్రదాహేపి తన్నిత్యత్వాత్" 3.౧.౫.

తన్నిత్యత్వాత్ = ఆత్మనిత్యమగుటవలన, సాత్మకప్రదాహేపి= భిన్నమైన యాత్మతోకూడిన శరీరమును దహించినప్పటికి, తదభావః = దగ్ధముచేయు వ్యక్తికి పాపము సంభవింపదు.

కేవల శరీరమును దహించిన వానికెట్లు పాపముండదో యట్లే ఆత్మతోకూడిన శరీరమును దహించినను పాపము కలుగనేరదు. ఆత్మ నిత్యము, శరీరము జడము నగుటచే హింసకలుగుట యసంభవము. నిత్యమైన యాత్మను హింసింప గల వాడెవడు? హింసింపబడు నెడల నిత్యమెట్లగును? ఆత్మ నంగీకరించు వా రది నిత్యమందురు గదా! కాబట్టి ఆత్మ

యున్నను, లేకున్నను శరీర దాహమున నెట్టి పాతకమును కలుగనేరదు.

ఉత్తరపక్షము:—

"న కార్యాశ్రయ కర్తృవధాత్." ౩.౧.౬.

కార్యాశ్రయ కర్తృవధాత్ = సుఖదుఃఖానుభవమిట కార్య మనబడును. దానికాశ్రయము శరీరము ఆ శరీరములో కూడిన ఆత్మ కర్త. అట్టి యాత్మను వధింమటవలన, న = సాత్మకశరీరమును దహించిన పాతకము లేదనుట తగదు.

నిత్యమయిన ఆత్మను నశింప జేయుట హింస యన బడదు. సుఖ దుఃఖ రూప భోగాయతనమైన శరీరముతో కూడినయాత్మ నాశము - శరీరాత్మల విశిష్టసంబంధ నాశము హింస యనబడును. సాత్మక శరీర దాహమున నిది సంభవమే కాబట్టి ఆత్మ నిత్యమగుటచే జడ శరీరమును దహింప జేసినను పాతకము లేదనుట తగదని వివేకము.

"సవ్యదృష్ట స్యేతరేణ ప్రత్యభిజ్ఞానాత్" ౩.౧.౭.

సవ్యదృష్టస్య = వామచక్షువుతో చూచినవస్తువు, ఇతరేణ = దక్షిణ నేత్రముతోచూచి, ప్రత్యభిజ్ఞానాత్ = ప్రతిసంధించుట వలన - గుర్తుపట్టుట వలన,

ఒకప్పుడు వామనేత్రముతో చూచి తెలిసికొనిన వస్తువును మరియొకప్పు డా వామనేత్రము నశించిన తదుపరి కుడికన్నుతో నావస్తువును చూచి 'ఇది నేను నాడు చూచిన వస్తువే'యని గుర్తించుచుండుట లోకవిదితము ఇంద్రియ ములే చేతనములై వేరుగా ఆత్మయొందు లేకున్న నిట్టి

(ప్రత్యభిజ్ఞ)అదే యిది యను జ్ఞాన ముదయింపనేరదు. మొదట వస్తువును చూచినకన్ను నశింప మరియొక కన్ను దానినెట్లు గుర్తింప గలుగును? ఆత్మయొకటి వేరుగా శరీరమున నున్నదనిన నేత్రములు కరణములుగా నాత్మకు నుపయోగించును. ఆత్మ యొకకంటితో నొకవస్తువును చూచినపుడు ఆవస్తు సంబంధమైన సంస్కార మొకటి యేర్పడును. మరియొక కంటితో నావస్తువును చూచునదియు పూర్వాత్మయే కాబట్టి పూర్వజనిత సంస్కార సహాయముతో ఆవస్తువే యిది యని గుర్తింప గలుగుటలో నెట్టియాటంకము నుండనేరదు. కాబట్టి ఆత్మ శరీరేంద్రియ భిన్నమే యని భావము.

పూర్వపక్షము:—

"నైకస్మిన్నాసాస్థి వ్యవహితే ద్విత్వాభిమానాత్" ౩.౧ ౮.

ఏకస్మిన్ = రెండు నేత్రము లొకే యింద్రియ మైనప్పటికి, నాసాస్థి వ్యవహితే = నాసికకు సంబంధించిన యెముకచే వ్యవహితమై - రెండుగా చీల్చబడి, ద్విత్వాభిమానాత్ = రెండుగా కనబడుటవలన, న = పూర్వోక్తము సరికాదు.

నేత్రేంద్రియములు రెండగుచో ప్రత్యభిజ్ఞవలన చేత నాత్మ వేరుగాసిద్ధింపగలదు కాని, నేత్రేంద్రియ మొక్కటియే. నూతిపై నొక కొయ్య నడ్డముగా వైచిన నదిరెండుగా తోచునట్లు, నాసికచే వ్యవహితమై యొకే నేత్రము రెండుగా కనబడుచున్నది. కాబట్టి వామనేత్రముతో చూచిన దానిని కుడినేత్రము గుర్తింపజాలదను హేతువును పురస్కరించుకొని యాత్మ సిద్ధింపనేరదు.

ఉత్తరపక్షము:—

"ఏక వినాశే ద్వితీయావినాశాన్నైకత్వమ్" ౩. ౧. ౯.

ఏకవినాశే = ఒకటినశించిన, ద్వితీయావినాశాత్ = రెండవది నశింపకుండుట వలన, నైకత్వమ్ = నేత్రేంద్రియ మొక్కటికాదు.

వామనేత్రము చెడిపోయిన దక్షిణనేత్రము చెడుట కానీ, దక్షిణ చక్షువుచెడిన వామము చెడుట కానీ మనము చూచుటలేదు. నేత్ర మొక్కటియై నాసికావ్యవధానముచే రెండుగా తోచునెడల నొక్కటిచెడిన రెండవదియు చెడవలసి యుండును. ఒకే యవయవిలో కొన్ని యవయవములుచెడి మరికొన్ని సరిగా నుండుటచే నవయవి చెడకుండుటకు వీలు లేదు. కాబట్టి నేత్రములు రెండు కావనుట యుక్తిసంగతము కాదు.

పూర్వపక్షము:—

"అవయవ నాశేఽప్యవయవ్యుపలబ్ధేరహేతుః" ౩.౧.౧౦.

అవయవనాశేఽపి=కొన్నిశాఖలునశించినను, అవయవ్యుపలబ్ధేః = వృక్షరూపావయవి లభించుటవలన, అహేతుః = ఒకటి నశించిన మరియొకటి నశింపవలయు ననుట సరియైన హేతువుకాదు.

ఒక వృక్షమున్నదనుకొనుడు. దాని శాఖలే దాని కవయవములు. వానిలో కొన్ని ఖండింపబడినను ఆ వృక్షము నశింపదు. కాబట్టి కొన్ని యవయవములు నశించిన మాత్రమున నవయవియు నశించునను హేతువుతో నేత్రములు రెండనుట సరికాదని భావము.

ఉత్తరపక్షము:—

"దృష్టాంత విరోధా దప్రతిషేధః" ౩.౧.౧౧.

దృష్టాంత విరోధాత్ = దృష్టాంత వైరుధ్యము వలన, అప్రతిషేధః = హేతువు సరికాదనుట చెల్లదని యర్థము.

నేత్ర వృక్షములలో సామ్యము లేకుండుటవలన దృష్టాంతము సరికాదు. నేత్రస్థానములు, వాని మూలములు భిన్నములుగా మనము చూడఁగలము. శిరస్సునకు సంబంధించిన ఎముకను పరీక్షించిన నందు రెండు కన్నులుండుటకు రెండు స్థానములు వేరువేరుగా కనబడును. కాబట్టి యవియొకదానికింకొకటి యవయవములు కావు. అవయవములే యగునెడల అవయవ నాశమున నవయవి నశింపక తప్పదు. వృక్షమునందును కొన్ని శాఖలు నశించిన నా వృక్షము పూర్వమున్నట్లుండుననుట ప్రత్యక్ష విరుద్ధము. కొన్ని శాఖలు నశించిన తరువాత మిగులువృక్షము మొదటి వృక్షమెన్నడును కాజాలదు. కాబట్టి నేత్రములొక్కటే యనుట తగదు. ఇట్లు ఒకనేత్రముతో చూచిన దానిని రెండవనేత్రముతో చూచి గుర్తించు ప్రత్యభిజ్ఞాత వేరుగా నుండుననుట నిర్వివాదమని భావము.

"ఇంద్రియాంతర వికారాత్" ౩. ౧. ౧౨.

ఇంద్రియాంతర వికారాత్ = మరియొక ఇంద్రియములో వికారము కలుగుట వలన ఆత్మ వేరుగా నున్నది.

మరియును ఒకానొకప్పు డాస్వాదించిన ఫలము మరల కనిపించినపుడో లేక దాని గంధ ముపలబ్ధమైనపుడో యాఫల

రసము స్మరింపబడి యందలి యాశచే నోట నీరూరుట లోకవిదితము. ఇదే యింద్రియాంతర వికారమనబడును. రసాస్వాదమును స్మరించుటవలన రసనేంద్రియములో నిట్టి వికారము కలుగును. రసము ననుభవించు నాత్మయొండు శరీరేంద్రియములకు మించి లేకున్న నిది యెట్లు సంభవింప గలదు? కర్త లేక క్రియయు కలుగదు. స్మరించుట క్రియయే యగును. ఇంద్రియమే కర్తయందుమా? వీలుపడదు. రసము నాస్వాదించిన యింద్రియము జిహ్వ ప్రస్తుత రూపోపలబ్ధి చక్షువునకు కలుగుచున్నదికదా! ఒకరు చూచినది మరియొక రెట్లు స్మరింపగలరు? కాబట్టి ఇంద్రియములకంటె భిన్నముగా నాత్మ యొండుకలదనక తప్పదు.

పూర్వపక్షము:—

"నస్మృతేః స్మర్తవ్య విషయత్వాత్" ౩.౧.౧౩.

స్మృతేః = స్మరణము, స్మర్తవ్యవిషయత్వాత్ = స్మరణీయార్థ విషయమగుటవలన, న = పూర్వము చెప్పినది సరిగాదు.

ఏ విషయమునకు సంబంధించిన స్మృతి కలుగునో ఆస్మృతి యా విషయమును స్మరింపజేయును కాని యన్యమునుస్మరింపజేయజాలదు. ప్రస్తుతమిటరూపాదులతోనుండు రస (విషయ)మునకు సంబంధించిన స్మృతి రసము ననుమానింపజేయును కాని ఆత్మ నెట్లు చేయగలదు? ఆత్మ ననుమానింపజేయునందువేని ఆత్మ స్మృతికి కారణమా? లేక విషయమా? స్మృతికి కారణము సంస్కారము; విషయము

రసము. కాబట్టి యుభయ విధములను స్మృతిచే నాత్మ యూహింపబడదు.

ఉత్తరపక్షము:—

"తదాత్మగుణ సద్భావాదప్రతిషేధః" ౩.౧.౧౪.

తదాత్మగుణ సద్భావాత్ = స్మృతియాత్మగుణ మగుటవలన, అప్రతిషేధః = స్మృతి యాత్మానుమాపకమే.

స్మృతి యాత్మకు కారణమనిగానీ, విషయమనిగానీ చెప్పినచో పై దోషము వాటిల్లును. స్మృతి యాత్మగుణము. ఆత్మ స్మృతి కాశ్రయ మని భావము. కాబట్టి ఆశ్రయరూపమున నాత్మ స్మృతిద్వారమున అనుమానింపబడును. స్మృతి జ్ఞానములో చేరి గుణ మనబడును. గుణమున కాశ్రయ మొకటి యుండవలయును. స్మృతి కాశ్రయము విషయము కానేరదు. సంస్కారమునకు నట్టి యోగ్యత లేదు. కాగా, స్మృతి కాశ్రయ మాత్మయొకటి సిద్ధించుటలో నేయాటంకమునుండదు.

పూర్వపక్షము:—

"నాత్మ ప్రతిపత్తి హేతూనాం మనసి సంభవాత్" ౩.౧.౧౫.

ఆత్మప్రతిపత్తిహేతూనాం = ఆత్మసిద్ధికి చెప్పబడిన హేతువులు, మనసి సంభవాత్ = మనస్సనెడి ఇంద్రియమున సమన్వయింప వీలగుట వలన, న = శరీరేంద్రియములనుమించి యాత్మ యొందు లేదు.

ఆత్మకలదని పై జెప్పిన మూడు హేతువులును మనస్సునం దన్వయింప నగును. మనస్సు సర్వార్థములను గ్రహించును.

నేత్రాది ఇంద్రియములచే గ్రహింపబడు విషయములలో నెక్కటియు మనస్సుచే గ్రహింపబడనిది యుండదు. అన్ని యింద్రియములతోను మనస్సునకు సంబంధ ముండును కాబట్టి చక్షువుతో చూచి తెలిసికొనినదానిని స్పృశించి యెరుగుటకును, వామనేత్రముతో చూచిన దానిని దక్షిణనేత్రముతో గుర్తించుటకును, ఇంద్రియాంతర వికారమునకు హేతువైన స్మృతి కాశ్రయమగుటకును మనస్సునకు వీలున్నది. చక్షువుతో చూచును; జిహ్వతో నాస్వాదించును; నాసికతో నాఘ్రాణించును; త్వగింద్రియముతో స్పృశించును అను నిట్టి ప్రయోగములును మనస్సున నన్వయింపవచ్చును. కాబట్టి, యే హేతువులతో సిద్ధాంతి ఆత్మను సిద్ధింపజేయ యత్నించుచున్నాడో యీహేతువులన్నియు మనస్సునందు వర్తింపగలవు. కావున, మనస్సుకంటె వేరుగా ఆత్మయొకటి లేదని పూర్వపక్షి తాత్పర్యము.

ఉత్తరపక్షము:—

"జ్ఞాతుర్జ్ఞాన సాధనోపపత్తేః సంజ్ఞాభేదమాత్రమ్" ౩.౧.౧౬

జ్ఞాతుః = జ్ఞాతయైన మనస్సునకు, జ్ఞాన సాధనోపపత్తేః=బాహ్య జ్ఞాన సాధనములవలె నాభ్యంతర జ్ఞానమున కొక సాధనముండుట యగత్యము కాబట్టి, సంజ్ఞాభేదమాత్రమ్ = సంజ్ఞలలో భేదముమాత్రమే.

జ్ఞాతకు చక్షురాదీంద్రియములు బాహ్య జ్ఞానసాధనములున్నట్లు, ఆభ్యంతర జ్ఞానములకు సాధనమొండుండవలసి యుండును. సుఖ దుఃఖాదులనేకము లాభ్యంతర విషయము

లున్నవి. వానిని తెలిసికొనుటకు అంతరింద్రియ మొకటి తప్పక కావలసియుండును. బాహ్యేంద్రియములచే సుఖ దుఃఖాది జ్ఞానము కలుగనేరదు. మనస్సు నాయా విషయ జ్ఞానములకు కర్తగా నంగీకరింతుమేని దానికి కరణముగా నుపయోగించు అంతరింద్రియము వేరొండు కావలసియుండును. ఒకే వస్తువు కర్తృకరణములుగా నంగీకరింప వీలుండదు. కారణము కర్తృకరణ ధర్మములు వేరగుటయే. కాగా, ఉభయపక్షము లందును జ్ఞాతృ పదార్థ మంగీకరింపక తప్పదు. ఆ పదార్థము నొకరు ఆత్మయనియు, మఱియొకరు మనస్సు అనియు నందు రేని నామములలో భేదమేర్పడుచున్నది. పూర్వపక్షి యభి ప్రాయము ననుసరించి జ్ఞాతృ పదార్థము మన స్సనబడినచో వేరొక నామముగల యంతరింద్రియము నంగీకరింపవలసి వచ్చును. సిద్ధాంతి పక్షమున జ్ఞాత ఆత్మ యనబడును. అంత రింద్రియము మన స్సనబడు నని వివేకము.

బాహ్య విషయములను తెలిసికొనుటకు బాహ్యేంద్రి యములను కరణము లపేక్షితము లయినట్లు అభ్యంతర విష యముల కరణాపేక్ష నియమము లేకుండుటచే నాభ్యంతర కరణము వేరొండేల యన,

"నియమశ్చ నిరనుమానః" ౩.౧.౧౭.

నియమశ్చ = బాహ్యవిషయములకు బాహ్యకరణము లుండ వల యును కాని అభ్యంతర విషయముల కట్టి కరణాపేక్ష యుండదను నియ మము, నిరనుమానః=నిర్యుక్తికము - నిష్ప్రమాణము.

ఎవడేని కరణవ్యాపారము లేకయే కర్మగోచర క్రియను కలిగింప గలుగుచో పైనియమ మంగీకరింప నగును కాని యట్లు కానరాదు. కుఠారము (గొడ్డలి) నాడింపకయే యెవడైనను కొమ్మను నరుక గలుగునా? లేదు. బాహ్యక్రియ లకు కరణము కావలసి యుండును కాని అభ్యంతర క్రియల కక్కఱ లేదందుమా? క్రియలలో నట్టి భేదము నభియుక్తులు (శాస్త్రవేత్తలు) అంగీకరింపరే. కాబట్టి యొకక్రియకు కరణ మావశ్యకము, మఱియొకటి కనావశ్యక మనుట నిర్యుక్తి కము. బాహ్య విషయజ్ఞానమున కరణ మెట్లు కావలయునో అభ్యంతర విషయజ్ఞానమును విషయజ్ఞానమే కావున కరణము కావలసియే యుండును కాబట్టి బాహ్యవిషయజ్ఞానార్థము చక్షురాది బాహ్య కరణముల నెట్లుపయోగించునో అట్లే యాభ్యంతర సుఖదుఃఖాది జ్ఞానార్థము మనస్సును వ్యాపార వంతముగా చేయునట్టి యాత్మ యొండు స్వీకరింపక తప్పదు.

(ఆత్మనిత్యత్వ విచారణ)

"పూర్వాభ్యస్త స్మృత్యనుబంధా జ్జాతస్య హర్షభయ శోక సంప్రతిపత్తేః" ౩.౧.౧౮.

జాతస్య = జన్మించిన బాలునియందు, పూర్వాభ్యస్త స్మృత్యను బంధాత్ = పూర్వమనేక పర్యాయము లనుభవించిన పదార్థముల స్మృతి సంబంధహేతువైన సంస్కార విశేషమువలన, హర్షభయశోక సంప్రతిపత్తేః = హర్షభయశోకములు లభించుటవలన, ఆత్మ నిత్యము.

జన్మించిన తదుపరి బాలుడు కొండొకవేళ నవ్వును. మరియొకప్పుడు కంపించును. ఇంకొకయెడ నేడ్చును. నవ్వు

కంపము, రోదనము నను నీభావములు హర్షభయ శోకములు లేక కలుగ నేరవు. లోకమున హర్షము కలిగినపుడు నవ్వుటయు, భయము కలిగినపుడు కంపించుటయు, శోకము వలన నేడ్చుటయు మనము చూచుచున్నాము. కాబట్టి హర్షాదులు నవ్వు మున్నగువానికి నిమిత్తములని తేలుచున్నది. క్రొత్తగా జన్మించిన బాలుడు తనకు క్రొత్తగా ప్రత్యక్షమగు పదార్థములలో నేది యిష్టమో - సుఖకరమో- దుఃఖకరమో యెఱుగజాలడు. కాని యిష్టానిష్ట వస్తువులు ప్రాప్తించినపుడా బాలుడు సంతసించుటయు, దుఃఖించుటయు చూచుచున్నాము. ఈ హర్ష శోకములకు కారణము పూర్వానుభవ స్మరణ తక్క వేరొండు కానరాదు. స్మరణము సంస్కారజన్యము. బాలునిలో నిట్టిసంస్కారము లెన్నడు కలిగియుండును జన్మించుటకు పూర్వ మాబాలుడు లేనిపక్షమున? కావున ఈజన్మకు పూర్వమే వేరొక జన్మమందీ సంస్కారమునకు తగిన యభ్యాసము కలిగియుండవలయునని తేలుచున్నది. ఇట్లాయా జన్మలలో కనబడు హసిత శోకాదులను చూచి పూర్వపూర్వజన్మల నూహింపనగును. అందువలన ఆత్మనిత్యము అనాదియని సుఖముగా సిద్ధమగుచున్నది.

ఒక విషయమునకు సంబంధించిన యనేక విజ్ఞానముల నుదయింపజేయుట యభ్యాసము. ఒకానొక ప్రత్యక్షజ్ఞానము నశించిన తదుపరి ఆజ్ఞానమునకు విషయమైన వస్తువే విషయముగాగల జ్ఞానము స్మృతి. స్మృతి సంబంధమునకు కారణమైన భావనాసంస్కారము అనుబంధము. మరణాదులకు

సాధనములైన సర్పాదులు సమీపించినపుడు వానినుండి తొలగగోరిన వ్యక్తికి కలుగు "దీనిని తప్పుకొనజాలను" అను భావము భయము. ఇష్టమైన పదార్థము వియుక్తమైనపుడు మరల దానిని బొందజాల నను జ్ఞానము శోకము. ప్రాప్తి, అనుభవము, సంప్రతిపత్తి యనునవి పర్యాయపదములు.

పూర్వపక్షము:—

"పద్మాదిషు ప్రబోధసమ్మీలన వికారవత్తద్వికారః"
౩.౧.౧౯.

పద్మాదిషు = తామరపువ్వులు మున్నగువానియందు కనబడు, ప్రబోధసమ్మీలన వికారవత్ = పుష్పదళముల వికాససంకోచములవలె, తద్వికారః = బాలకునందు కలుగు హసితాదివికారములు స్వాభావికము లగుటచే హర్షశోకాదులవలన ననుట యుక్తము కాదు.

కమలాది పుష్పములలో కలుగు వికాసాదులు వస్తు స్వభావజన్యము లయినట్లు బాలకునందు కలుగు హసితాదులును స్వభావ జన్యములే కాని యన్యముకాదు. హసితాదులకు కారణములుగా హర్షాదుల నూహించి యట్టుపై ఆత్మ నిత్యమని తర్కించుట గౌరవము.

ఉత్తరపక్షము: —

"నోష్ణశీతవర్షకాల నిమిత్తత్వాత్ పంచాత్మక వికారాణామ్" ౩.౧.౨౦.

పంచాత్మక వికారాణామ్ = పాంచభౌతికములయిన పద్మాదుల వికారములకు, ఉష్ణ శీత వర్ష కాల నిమిత్తత్వాత్ = ఉష్ణ శీత వర్షకాలములు నిమిత్తములగుట వలన, న = (ప్రబోధాదులు స్వభావ జన్యములగుటచే) హసితాదులు నట్లేయనుట తగదు.

పద్మాదులలో కలుగు ఉన్మీలన నిమీలనములు నిర్నిమిత్తములుకావు. ఉష్ణశీతాదులు వానికి నిమిత్తములు. ఉష్ణాదులున్నపుడే వికాసాదులు కలుగును. లోకమున కలుగు వికారములన్నియు ననిమిత్తకములే నిమిత్తములేని వికారమెన్నడును చూడనేరము. ఇట్లే బాలునిలో నేర్పడు హసితాదులును వికారము లనుట నిర్వివాద విషయము. వానికి కారణములు హర్షాదులు. అందులకు నిమిత్తము పూర్వాభ్యస్త సంస్కార జనితస్మృతి యనకతప్పదు. కాబట్టి ఆత్మ యనాది, నిత్యమనియే సిద్ధాంతము.

"ప్రేత్యాహారాభ్యాస కృతాత్ స్తన్యాభిలాషాత్."
౩.౧ ౨౧.

ప్రేత్య = మరణించి మరల జనించిన బాలకుని, ఆహారాభ్యాస కృతాత్ = ఆహారాభ్యాసము వలన జనించిన, స్తన్యాభిలాషాత్ = మాతృస్తనములోని పాలను గ్రహించుకోరిక వలన.

బాలకుడు జన్మించినతోడనే తల్లిస్తనములనుండి స్తన్యమును గ్రహింప వలయునని యత్నించుట లోకసిద్ధ విషయము స్తన్యముకొఱకు బాలునిలోనేర్పడు నీప్రవృత్తి యభిలాషాపూర్వకము. బాలునిలో నేర్పడు నీస్తన్యాభిలాషయు నాహారాభ్యాసము వలనకలుగును. ఆహారము తీసికొనుట కలవాటు పడినవారే యాకలిగొన్నపుడు దాని నివారణకొఱకు మరల నాహారము తీసికొన యత్నింతురు. క్రొత్తగాజన్మించిన బాలు డంతకుపూర్వము శుత్పీడితుడై పాల నాహారముగా గ్రహించియుండడేని ప్రస్తుతప్రవృత్తి యతనిలో కలుగనేరదు.

కాబట్టి బాలు డీజన్మకు పూర్వమే క్షీరగ్రహణమున కభ్యస్తుడై యున్నట్లు తేలుచున్నది. పూర్వాభ్యాస స్మరణమువలననే యీ జన్మమందు క్షుత్పీడితుడై స్తన్యమునకై ప్రవర్తించుచున్నాడు. అందువలన నీబాలున కీశరీరప్రాప్తికి పూర్వము మరియొకశరీరముతో సంబంధ మున్నట్లు తేలుచున్నది. ఇట్లే శరీరాంతరమును. కాబట్టి యాత్మ యనేక శరీరములతో సంబద్ధమగుచు నిత్యముగా నుండును;

పూర్వపక్షము:—

"అయసోఽయస్కాంతాభిగమనవత్ తదుపసర్పణమ్"
3. ౧. ౨౨.

అయసః = ఇనుపముక్కలు సూదులు మొదలగునవి, అయస్కాంతాభిగమనవత్ = సూదంటురాతి నెరుక్కని సమీపించునట్లు, తదుపసర్పణమ్ = బాలకుడు జన్మించుటయే తడవుగా స్తనములచెంత జేరును.

సూదులు సూదంటురాతిని సమీపించుట స్వాభావికమైనట్లు బాలుడు జన్మింపగానే మాతృస్తనతటముల చెంత కేగుట స్వాభావికమేయగును. ఇందు పూర్వాభ్యాస జనిత స్తన్యాభిలాష కారణమనుట పొసగదు. కాబట్టి జన్మజన్మాంతరముల నూహించి యాత్మ నిత్యమనుట యుక్తి విరుద్ధము.

ఉత్తరపక్షము:—

"నాన్యత్ర ప్రవృత్త్యభావాత్" 3.౧.౨3.

అన్యత్ర = లోహముకాక యితరలోష్టాదులలో, ప్రవృత్త్యభావాత్ = సూదంటు రాతిని సమీపించుట జూడకపోవుట వలన, న = స్తన్యప్రవృత్తి స్వాభావిక మనుట తగదు.

సూదులు సూదంటురాతిని సమీపించుట నిర్నిమిత్తమై స్వాభావిక మగునెడల నితర లోష్ఠాదులు నట్లేల సమీపింపవు? సూదుల యభిసర్పణమున నిమిత్తమొండు లేకున్న ఇతర పదార్థములు నట్లే సూదంటురాతి నభిగమింపవలసియుండును. అట్లు చూడబడకపోవుటచే సూదుల యభిసర్పణమునకు కొండొక నిమిత్తమట నుండి తీరవలయును. అది యదృష్టమైన వస్తుశక్తిరూపమే కావచ్చు. అట్లే బాలకుని స్తన్యాభిలాష నిర్నిమిత్తము కానేరదు. ఆనిమిత్తమును పూర్వజన్మాభ్యాసజనిత సంస్కారోద్బుద్ధమగు స్మృతియే కావలయును. కాబట్టి జన్మాంతరసిద్ధిపూర్వకముగ నాత్మ నిత్యమనియే స్థిరపడుచున్నదని వివేకము.

"వీతరాగ జన్మాదర్శనాత్" ౩.౧.౨౪.

వీతరాగ జన్మాదర్శనాత్ = రాగద్వేషాదులు నశించినయోగి జన్మించుట చూడము. కాబట్టి యాత్మ నిత్యము.

మఱియు పుట్టునట్టి ప్రతిప్రాణియు రాగముతో కూడియుండుట మనము చూచుచున్నాము. రాగరహిత జన్మమొండును కానరాదు. రాగమనునది పూర్వానుభూత విషయ చింతన వలననే కలుగును. పూర్వానుభూత విషయముల స్మరింపకయే యట్టివాని యందు రక్తుడగుట యసంభవము. ఇప్పుడిప్పుడే జన్మించిన బిడ్డకు విషయముల పూర్వానుభవ మీజన్మమందు కలుగనేరదు. మరియొక జన్మమందు శరీరములేక యనుభవము కలుగదు. కాబట్టి జన్మ జన్మాంతరములనుండి యాత్మ యనాదియై, నిత్యమనక తప్పదు.

పూర్వ సూత్రమున కేవల స్తన్యమున ననురాగము వర్ణింప బడినది. ఇట పదార్థ మాత్రమున రాగము ప్రాణుల కున్నట్లు ప్రదర్శింప బడినదని వివేకము.

పూర్వపక్షము:—

"సగుణ ద్రవ్యోత్పత్తివత్తదుత్పత్తిః" 3.౧.౨౫.

సగుణ ద్రవ్యోత్పత్తివత్ = ఘటపటాది వస్తువులు గుణసమేత ములై పుట్టుట స్వాభావిక మైనట్లు, తదుత్పత్తిః = రాగముతో జన్మిం చుట యాత్మకు స్వాభావికము.

ఘటపటాది వస్తువులన్నియు పుట్టుకతోనే సగుణములై యుండుట స్వభావముగా చూచుచున్నాము. గుణసమేత మగు నుత్పత్తికి కారణాంతరము చూడజాలము. అట్లే యాత్మయు సరాగముగ జన్మించుట స్వాభావికమగును. కాగా జన్మజన్మాంతరముల నూహించి యందువలన నాత్మ యనాదియనియు, నిత్యమనియు నెంచుట సరిగాదు.

ఉత్తరపక్షము:—

"న సంకల్ప నిమిత్తత్వాద్ రాగాదీనామ్" 3.౧.౨౬.

రాగాదీనాం = రాగద్వేషాదులు, సంకల్పనిమిత్తత్వాత్ = (ఇది నాకిష్టమును సాధించును. ఇదినాకనిష్టమును కలిగించును. అనుపూర్వాను భూతవిషయాను చింతనము సంకల్పము.) ఇట్టిసంకల్ప జనితమగుట వలన, న = సరాగజన్మ స్వాభావికము (నిర్నిమిత్తము) అనుట యుక్తము కాదు.

ఘటపటాది ద్రవ్యములు సగుణములై జనించుట స్వాభావికము కాదు. ఘటము కపాలరూప కారణజన్యమైనట్లు ఘటమునందలి గుణములును కపాలములలోని గుణములు

నిమిత్తములుగా జనించును. కాబట్టి సగుణ ఘటోత్పత్తి నిర్నిమిత్తకమనుట న్యాయసంగతముకాదు.

శాస్త్రాంతరమున నిట్లే వర్ణింపబడినది. (ద్రవ్యాణి ద్రవ్యాంతర మారభంతే గుణాశ్చ గుణాంతరమ్. వై. ౧.౧. ౧౦.) ద్రవ్యములు ద్రవ్యాంతరమును, గుణములు గుణాంతరమును జనింపజేయునని సూత్రాభిప్రాయము. ఘట పటాదులగుణములు సకారణకములైనట్లు రాగాదులును సనిమిత్తకములే. ఇట నిమిత్తము పూర్వానుభూత విషయానుచింతనకుమించి మఱియొండు కాజాలదు. కాబట్టి, పూర్వానుభవము జన్మాంతరము నూహింపజేయగా నాత్మయనాదియై, నిత్యమగుచున్నది.

(శరీరపరీక్షణ)

"పార్థివం తద్విశేషగుణోపలబ్ధేః" ౩.౧.౨౮.

తద్విశేష గుణోపలబ్ధేః = పృథివికి సంబంధించిన విశేషగుణము లభించుట వలన, పార్థివమ్ = మనవంటి ప్రాణుల శరీరము పార్థివము.

పృథివి గంధవతి. శరీరము గంధవంతము. కాబట్టి యీ మన శరీరము పృథివ్యాత్మకమని బోధపడుచున్నది. జలము, అగ్ని మున్నగు ద్రవ్యములు, రసరూపాదులు శరీరమున గానఁగుచుండుటచే శరీరము పార్థివ మనుటెట్లన, రసరూపాదులు శరీరమున నున్నవనుట సత్యమే. కాని శరీరము పార్థివ మనుటలో నితర ద్రవ్యములకు సంబంధించిన యణువులు శరీరమున సంయుక్తములు కావని సూత్రార్థము కాదు. పార్థివేతర పరమాణువులు శరీరారంభకములుకావు. శరీరము

పార్థివమనగా పార్థివ పరమాణువులు ప్రాధాన్యములై శరీరారంభకములనియు, తదితర ద్రవ్యాణువులు సంయుక్తములై! యప్రధానములుగా నుండుననియు సూత్రాభిప్రాయము. కాబట్టి శరీరము పార్థివ మనుట దోషరహితమే యనిభావము.

"శ్రుతి ప్రామాణ్యాచ్చ" ౩.౧.౨౮.

శ్రుతి ప్రామాణ్యాచ్చ = శ్రుతి ప్రామాణ్యము వలనను,

(...... భస్మాంతగ్ం శరీరమ్. యజు. ౪౦.౧౫.)

అను నిట్టి శ్రుతులనుబట్టి చూచినను, శరీరము పార్థివమనియే తెలియుచున్నది. శరీరము భస్మాంతమని శ్రుతి చెప్పుచున్నది. భస్మము పార్థివము కాబట్టి శరీరము పార్థివమే.

పూర్వపక్షము:— (ఇంద్రియ పరీక్షణ)

"కృష్ణసారే సత్యుపలంభాత్ వ్యతిరిచ్యచోపలంభాత్ సంశయః" ౩.౧.౨౯.

కృష్ణసారే సతి = కంటిలోని నల్లనిభాగము కృష్ణసారమనబడును. అది యున్నపుడు, ఉపలంభాత్ = వస్తువు గ్రహింపబడుటవలన, వ్యతిరిచ్యచ ఉపలంభాత్ = అది లేనపుడును (విషయములు దానికి దూరముగానున్నపుడు) ఉపలబ్ధి కలుగుట వలన, సంశయః = కృష్ణసారమే యింద్రియమా ? మరి యొండా? యని సంశయము కలుగుచున్నది.

కంటిలోని కృష్ణసారము (నల్లగుడ్డు)న్నపుడు వస్తువులు గ్రహింపబడుచున్నవి. దానికి దూరముగానుండు వస్తువులును తెలిసికొనబడుచున్నవి. నల్లగ్రుడ్డు నేత్రేంద్రియము కాక మరియొకటి యగునేని యది లేనపుడు వస్తువులు తెలియబడవలయును. అట్లు తెలియబడవు. నల్లగ్రుడ్డు మాత్ర

మింద్రియమైన దానికి దూరముగానుండి దానితో సంయుక్తములు కాని వస్తువులు తెలియబడకుండవలయును. అట్లుగాక దూరమున నున్న వస్తువులును తెలియబడుచున్నవి. కాబట్టి నల్లగ్రుడ్డే నేత్రేంద్రియమా? లేక యందుండు తైజస పదార్థమింద్రియమా? యని సందేహాభిప్రాయము.

నల్లగ్రుడ్డు పార్థివపదార్థము. అది తనతో నసంయుక్త వస్తువును గ్రహింపనేరదు. కంటితో సంయుక్తము కాక దూరముగనుండు వస్తువులు నిత్యము మనము గ్రహించుచునే యున్నాము. కాబట్టి నల్లగ్రుడ్డు ఇంద్రియము కాదు. అందు తేజస్సునకు సంబంధించిన పదార్థము వేరుగా నుండును. అదియే నేత్రేంద్రియమని వైదికుల సిద్ధాంతము. బౌద్ధులు నల్లనిగ్రుడ్డే యింద్రియమందురు.

ఉత్తరపక్షము:—

"మహ దణుగ్రహణాత్" 3.౧.30.

మహ దణుగ్రహణాత్ = నల్లగ్రుడ్డుకంటె పెద్దవస్తువులు దానికంటె చిన్నవస్తువులు గ్రహింప బడుచుండుటచే నది నేత్రేంద్రియము కాదు.

కృష్ణసారము మాత్ర మింద్రియ మగునెడల దానికంటె మహత్తులు, మహత్తరములు, మహత్తమములు నైన వస్తువులుగానీ, దానికంటె నణువులు, నణుతరములు, నణుతమములు నైన వస్తువులుగానీ దానిచే గ్రహింపబడకుండవలయును. తైజస పదార్థములో తక్క తదితర ద్రవ్యములలో స్వపరిమాణమునకు మించిన పరిమాణము కలవానిని గ్రహింప జేయగల సామర్థ్యము లేదు. కాబట్టి కృష్ణసారమింద్రి

యము కాదు. అందుండు తైజస పదార్థమతి సూక్ష్మమింద్రియము. కృష్ణసారము దాని కధిష్ఠానము మాత్రము.

అయినను ఇంద్రియముతో సన్నికృష్టములు కాక దూరమున నున్న చిన్న, పెద్దవస్తువులు దానిచే నెట్లు గ్రహింపబడునన,

"రశ్మ్యర్థ సన్నికర్ష విశేషాత్ తద్గ్రహణమ్" ౩.౧.౩౧.

రశ్మ్యర్థసన్నికర్ష విశేషాత్=నేత్ర రశ్మితో వస్తువులు సంయుక్తము లగుట వలన, తద్గ్రహణమ్=చిన్న పెద్దవస్తువులు గ్రహింప బడుచున్నవి.

దీపపుకాంతి దీపమునకు దూరముననుండు వస్తువులను జేరి వానిని ప్రకాశింప జేయునట్లు కృష్ణసారగోలకమున నుండు నేత్రేంద్రియరశ్మి దూరమున నుండు వస్తువులతో సంయుక్తమై వానిని గ్రహింప జేయుచు. నేత్రేంద్రియము కంటె వస్తువు చిన్నదైనను, లేక పెద్దదైనను దానితో రశ్మి (కాంతి) సంయుక్తమగుట కెట్టి యాటంకము నుండదు. కాబట్టి మహదణుభేదము లేక యన్నిటిని గ్రహింప వీలగుచున్నదని తాత్పర్యము.

పూర్వపక్షము:—

"తదనుపలబ్ధే రహేతుః" ౩.౧.౩౨.

తదనుపలబ్ధేః=ఇంద్రియవస్తు సంయోగమునకు కారణమైన రశ్మి ప్రత్యక్షము గాకపోవుట వలన, అహేతుః='రశ్మ్యర్థ సన్నికర్షము వలన' ననెడి హేతువు సరికాదు.

నేత్రేంద్రియమునకు సంబంధించిన రశ్మి యొందు పత్యక్ష ప్రమాణసిద్ధ మగునెడల గోలకముకంటె భిన్నమైన

నేత్రేంద్రియమునకు దూరమున నుండు వస్తువు లారశ్మితో సంయుక్తములై గ్రహింపబడగల వనుట యుచితమగును. నేత్రరశ్మి ప్రత్యక్షము కాదు. కాబట్టి రశ్మియే లేదు. రశ్మి యున్న నది తైజస మగుటచే రూపవంతమై దీపకాంతివలె ప్రత్యక్షముగా గ్రహింపనగును. గ్రహింపబడ కుండుటచే రశ్మ్యర్థ సన్నికర్షమువలన దూరస్థ వస్తుగ్రహణమని చెప్పుట ప్రమాణ విరుద్ధము.

ఉత్తరపక్షము:—

"నానుమీయ మానస్య ప్రత్యక్షతోఽనుపలబ్ధి రభావహేతుః" 3.౧.33.

ప్రత్యక్షతః = ప్రత్యక్షముగా, అనుపలబ్ధిః = తెలియబడకుండుట, అనుమీయ మానస్య = అనుమానముచే తెలియబడు వస్తువుయొక్క, అభావహేతుః = అభావమునకు హేతువు న = కాదు.

కొండొక వస్తువు ప్రత్యక్షము కానంతమాత్రమున నది లేదని యనుట తగదు. వస్తుసద్భావము అనుమాన ప్రమాణము చేతను సిద్ధముకాగలదు. చంద్రుని పరభాగముకానీ, భూమి యధోభాగముకానీ ప్రత్యక్షముగా గ్రహింపబడనంత మాత్రమున లేదందుమా? అనుమానముచే నవి సిద్ధించుచున్నవి. అట్లే నేత్రరశ్మియు ననుమానముచే తెలియనగును. నేత్రమునకు, వస్తువునకు మధ్యలో నేదేని యావరణము (అడ్డు)న్న నావస్తువు గ్రహింపబడదు. లేకున్న గ్రహింపబడును. ఇట్టి యావరణాదులద్వారా నేత్రేంద్రియముతో వస్తువును సంయుక్త మొనర్చు సంయోజకము నేత్రరశ్మి

యొండు కలదని యూహింపనగును. కాబట్టి ప్రత్యక్షాగ్రహణము రశ్మ్యభావమును సిద్ధింపజేయనేరదని వివేకము.

రశ్మి సద్భావము సిద్ధించినను నది రూపవంత మగుటచే ప్రత్యక్షగ్రాహ్య మేలకాదనగా,

"ద్రవ్యగుణ ధర్మభేదాచ్చోపలబ్ధినియమః" ౩.౧.౩౮.

ద్రవ్యగుణధర్మ భేదాచ్చ = ద్రవ్యధర్మ విశేషమువలనను, గుణ ధర్మ విశేషము వలనను, ఉపలబ్ధినియమః = చాక్షుష ద్రవ్యోపలబ్ధి నియమ మేర్పడుచున్నది.

రూపవంతమగు ప్రతి ద్రవ్యమును ప్రత్యక్షము కావలయు నను నియమము లేదు. అట్లగుచో రూపవంతములగు ద్వ్యణుకములును ప్రత్యక్షము కావలసియుండును. కావున కొండొక వస్తువు ప్రత్యక్షము కావలయుననిన నది మహత్త్వముగలదై యనేక ద్రవ్యవంతమై ఉద్భూత రూపము కలదై యుండవలయును. రశ్మిలో రూపమున్నను ఉద్భూతత్వమను గుణధర్మవిశేషము లేకపోవుటచే నది చాక్షుష ప్రత్యక్ష గోచరము కాదు.

ఈ సూత్రమున ద్రవ్య ధర్మభేదము మహత్త్వాది విశేషమనియు, గుణధర్మభేదము ఉద్భూతత్వ విశేషమనియు వివేకము.

పూర్వపక్షముః— (తటస్థుడు)

"మధ్యందినోల్కాప్రకాశానుపలబ్ధివత్ తదనుపలబ్ధిః"
౩.౧ ౩౯.

మధ్యందినోల్కాప్రకాశానుపలబ్ధివత్ = పగటివేళనుల్కాప్రకాశము ప్రత్యక్షముకానట్లు, తదనుపలబ్ధిః చాక్షుషరశ్మియు గ్రహింపబడదు.

రాత్రియందు ఆకాశము నుండి యప్పుడపుడు నేర్పడు నుల్కాపాతములను మనము చూచు చుందుము. పగటియందు నట్టివి జరుగుచుండును. కాని మనము వానిని జూడనేరము. కారణము సూర్యకాంతి యెక్కువగా నుండుటచే నందులుల్కాకాంతులు తిరోభూతము లగును. అధిక కాంతి యల్పకాంతిని తనలో నిముడ్చుకొనును. అందువలన నది వేరుగా గ్రహింపబడదు. ఈస్థితినే యభిభవ మందురు. ఇట్లే నేత్రరశ్మి సూర్యరశ్మిచే నభిభూతమై గ్రహింపబడదని భావము.

ఉత్తరపక్షము: —

"న రాత్రావప్యనుపలబ్ధేః" ౩.౧.౩౬.

రాత్రావపి = రాత్రియందును, అనుపలబ్ధేః = ప్రత్యక్షము కాకుండుటవలన, న = అభిభూతమగుటచే నేత్రరశ్మి ప్రత్యక్షము కాదనుట యుక్తి విరుద్ధము.

సూర్యకాంతిచే నేత్రరశ్మి యభిభూతమై గ్రహింపబడకున్న రాత్రియందైనను ప్రత్యక్షము కావలసియుండును. ఉల్కాపాతము పగలు కనబడకున్నను రాత్రి కననగుచున్నది. అందువలన నుల్కాప్రకాశము పగలు అభిభూతమయి ప్రత్యక్షము కాదనుట యుక్తి సంగతమే యగును. కాని నేత్రరశ్మి కిది వర్తింపదు.

అట్లయిన నేత్రరశ్మి యేల ప్రత్యక్షము కాదన,

"బాహ్య ప్రకాశానుగ్రహాత్ విషయోపలబ్ధే రనభి
వ్యక్తితో౽నుపలబ్ధిః" ౩.౧.౩౭.

బాహ్యప్రకాశానుగ్రహాత్ = బాహ్యప్రకాశ సాహాయ్యము వలన, విషయోపలబ్ధేః = వస్తుగ్రహణ మేర్పడు చుండుటచేత, అనభివ్యక్తితః = ఉద్భూతము కాకుండుట వలన, అనుపలబ్ధిః = నేత్రరశ్మి గ్రహింపబడదు.

ఎయ్యది స్వవిషయమును గ్రహింపజేయుటలో బాహ్యప్రకాశము నపేక్షించునో యది యనుద్భూతమగుటచేతనే గ్రహింపబడదు. అభిభవ మక్కడ కారణముకాదు. చాక్షుష రశ్మి స్వవిషయమును గ్రహింపజేయుటకు బాహ్యప్రకాశ సాహాయ్యము నపేక్షించును. కాబట్టి యది యనుద్భూత మగుటచేతనే చాక్షుషము కాకున్నది. అన్యకాంతిచే నభిభూతమగుట దాని యనుపలబ్ధికి కారణము కాదు.

ఉల్కాప్రకాశమునలె నభిభూతమై నేత్రరశ్మి ప్రత్యక్షము కాకున్నదని యేల నుడువరాదన,

"అభివ్యక్తౌచాభిభవాత్" ౩.౧.౩౮.

అభివ్యక్తౌచ = ఉద్భూతమై బాహ్యప్రకాశ సాహాయ్యము నపేక్షింపనిది, అభిభవాత్ = అభిభూతమగును.

చక్షురింద్రియముచే గ్రహింపబడి (ఉద్భూతమై) బాహ్యప్రకాశ సాహాయ్యము నపేక్షింప నట్టిది యభిభూతమగును. ఉల్కాప్రకాశ మిట్టిదే. బాహ్యప్రకాశము లేనప్పుడది చక్షుర్గోచర మగుచున్నది. అందువలన నది యుద్భూత

రూపవంతము. కాబట్టి దానికంటె మించిన సూర్యకాంతిచే పగటివేళ నది యభిభూతమగుచున్నది. నేత్రరశ్మి యట్లుకాదు. అదియెన్నడు నభివ్యక్తముకాదు. ఉద్భూత రూపవంతమై చక్షుర్గోచర మగునదికాదు. స్వవిషయమును గ్రహింప చేయుటలో బాహ్యప్రకాశ సాహాయ్యము నపేక్షించును. కాబట్టి, నేత్రరశ్మియుండియు నభిభూత మగుటచే నుపలబ్ధము కాదనుట తగదు. అనుద్భూత మగుటచే నుపలబ్ధముకాదనుటయే యుక్తి సంగతము.

"నక్తంచర నయనరశ్మి దర్శనాచ్చ." ౩.౧.౩౯.

రాత్రియందు చరించు మార్జాలము మున్నగు జంతువుల నేత్రములందు రశ్మి జూడబడుట వలన ప్రాణుల నేత్రములందు రశ్మి (కాంతి) యున్నదని తెలియుచున్నది. మార్జాలాది జంతువుల జాతి తదితర ప్రాణులకంటె భిన్నమగుటచే వాని కన్నులందు రశ్మియున్నను ఇతర ప్రాణుల కన్నులందు రశ్మియుండదన వలను పడదు. జాతిభేదమున్నను ఆవరణమున్నపుడు మార్జాలాదులును జూడజాలవు. కావున వాని కన్నులు నితర ప్రాణుల కన్నుల వంటివే యని తేలుచున్నది. కాబట్టి నేత్రరశ్మి సద్భావము నిర్వివాద సిద్ధము.

ఇంద్రియములు రశ్మిద్వారా వస్తువునుచేరి దాని నెఱుగజేయు (ప్రాప్యకారిత్వ) పక్షమున రశ్మ్యర్థసన్నికర్ష విశేషము హేతువు కాగలదు. అట్లుకాక యప్రాప్యకారిత్వ పక్షమున రశ్మ్యర్థ సన్నికర్షవిశేషము హేతువు కానేరదని శంకించుచున్నాడు.

అప్రాప్యగ్రహణమ్ కాచాభ్రపటల స్ఫటికాంత
రితోపలబ్ధేః" ౩.౧.౪౦.

కాచాభ్రపటల స్ఫటికాంతరితోపలబ్ధేః = గాజు, అభ్రకము, స్ఫటికము వీనిలో నేదేని యావరణముగా నున్నను నేత్రేంద్రియము వస్తువును గ్రహింపగలుగు చున్నది. కాబట్టి, అప్రాప్యగ్రహణమ్ = ఇంద్రియముతో సన్నికృష్టమై వస్తువు గ్రహింపబడుచున్న దనుట సరికాదు.

ఆవరణము (అడ్డు) లేని తావులందు దూరస్థ వస్తువు లెట్లు చక్షురింద్రియముచే గ్రహింపబడుచున్నవో యట్లే స్ఫటికాదులచే నడ్డగింపబడిన వస్తువులును చాక్షుష ప్రత్యక్షమునకు విషయము లగుచున్నవి. ఇంద్రియము వస్తుస్థలమున కేగి దానితో సన్నికృష్టమై యద్దానిని ప్రకాశింపజేయునదగు నెడల అవ్యవహితములే గ్రహింపబడవలయును. వ్యవహితములు (ఆవరణముకలవి) గ్రహింపబడవు. వ్యవధానము (అడ్డు) న్నపుడు ఇంద్రియము వస్తువుతో సన్నికృష్టము కాజాలదుకదా! స్ఫటికాదులచే వ్యవహితములయ్యు వస్తువులు నేత్రముచే గ్రహింపబడుచుండుట లోకసిద్ధముగుటంజేసి ఇంద్రియము ప్రాప్యకారి కాక యప్రాప్యకారి యని తెలియుచున్నది. అట్లంగీకరించిన వస్తుగ్రహణమున రశ్మ్యర్థ సన్నికర్షము హేతువు కానేరదు.

ఉత్తరపక్షము:—

"కుడ్యాంతరితానుపలబ్ధే రప్రతిషేధః" ౩.౧.౪౧.

కుడ్యాంతరితానుపలబ్ధేః = గోడచేనడ్డగింప బడిన వస్తువులు గ్రహింపబడ కుండుటవలన, అప్రతిషేధః = రశ్మ్యర్థ సన్నికర్షము హేతువు కాదనుట యుక్తముకాదు.

ఇంద్రియము అప్రాప్యకారి యగునెడల కుడ్యాదులచే నడ్డగింపబడిన వస్తువుల జ్ఞానమును కలుగవలయును. అట్లు కలుగుటలేదు. కాబట్టి యింద్రియము అప్రాప్యకారికాదు. ప్రాప్యకారియే. ఇంద్రియము రశ్మిద్వారా వస్తువును ప్రాపించి యద్దానిని ప్రకాశింపజేయునని యభిప్రాయము.

ప్రాప్యకారియైన కుడ్యవ్యవహితములవలె కాచాభ్ర స్ఫటికాదులచే నడ్డగింపబడిన వస్తువు లేల గ్రహింబడకుండవన,

"అప్రతీఘాతాత్ సన్నికర్షోపపత్తిః" ౩. ౧. ౪౭

అప్రతీఘాతాత్ = (ప్రతీఘాతః = ప్రతిబంధము.) కాచాదులు నేత్రరశ్మికి ప్రతిబంధకములు కాకపోవుటవలన, సన్నికర్షోపపత్తిః = రశ్మ్యర్థ సన్నికర్షము కలుగగలదు.

నేత్రరశ్మి తైజస మగుటవలన స్వచ్ఛమైన వస్తువులు దాని నడ్డగింపవు. స్ఫటికాదులు స్వచ్ఛద్రవ్యములు కాబట్టి యట్టి పదార్థములచే నడ్డగింపబడిన వస్తువులతో నేత్రరశ్మి సన్నికృష్ట మగుటలో నెట్టి యాటంకము లేదు. అందువలననే యావస్తువులు గ్రహింపబడుచున్నవి.

స్ఫటికాదులు నేత్రరశ్మి నడ్డగింపవని యెట్లు విశ్వసింపవలయు ననిన,

"ఆదిత్యరశ్మేః స్ఫటికాంతరితేఽపిదాహ్యేఽవిఘాతాత్" ౩.౧.౪౩.

ఆదిత్యరశ్మేః = సూర్యరశ్మికి, స్ఫటికాంతరితేఽపి దాహ్యే = దహింపజేయదగిన వస్తువు స్ఫటికాదులచే వ్యవహితమై యున్నప్పటికి

దానిని, అవిఘాతాత్ = దహింపజేయుటలో నెట్టివిఘాతము కలుగకుండుట వలన నేత్రరశ్మి నవి యడ్డగింపవని విశ్వసింప వలయును.

తపింపజేయుటకో లేక దహింపజేయుటకో వీలయిన వస్తువులు గాజు, స్ఫటికము మున్నగువానిచే నావరింపబడి యున్నను సూర్యకిరణములు స్ఫటికాదుల ద్వారా ప్రవేశించి యావస్తువును దహించుట చూచుచున్నాము. కిరణసంగ్రాహక కాచయంత్రము (భూతద్దము) ద్వారా సూర్యకిరణములకు, సులభముగా దహింపజేయదగు దూదిమున్నగు వస్తువుపై పడునట్లుచేసిన నాకిరణము లావస్తువును దహించుట చూచుచున్నాము. అట్లే నేత్రరశ్మియు తైజస మగుటచేత కాచాదులచే నడ్డగింపబడ దని విశ్వసించుట కెట్టి యభ్యంతరము నుండదని భావము.

పూర్వపక్షము:—

"నేతరేతర ధర్మప్రసంగాత్." ౩.౧.౪౪.

ఇతరేతర ధర్మప్రసంగాత్ = కుడ్యాదుల ప్రతిబంధక ధర్మము కాచాదులందును, కాచాదుల యప్రతిబంధక ధర్మము కుడ్యాదులందును ప్రసక్తమగుటంజేసి, న = పైనచెప్పినట్లు విశ్వసింప జనదు.

కుడ్యాదులు రశ్మిప్రతిబంధకములు కాచాదులుకావని నిర్ణయింపదగిన నియమ మొండు లేకుండుటచే ఒకదాని ధర్మము మరియొకదానియందు ప్రసక్తము కాగలదు. కాబట్టి సూర్యరశ్మివలె నేత్రరశ్మియు కాచాదులచే వ్యవహిత వస్తువులను చేరుట కాటంకము లేకపోవుటవలన వాని యుపలబ్ధి కలుగుచున్నదనుట సరికాదని శంకాభిప్రాయము.

ఉత్తరపక్షము:—

"ఆదర్శోదకయోః ప్రసాదస్వాభావ్యాత్ రూపోపలబ్ధివ త్తదుపలబ్ధిః." ౩.౧.౪౭.

ఆదర్శోదకయోః = అద్దము, జలము నను రెండును, ప్రసాద స్వాభావ్యాత్ = స్వచ్ఛస్వభావము కలవగుటవలన, రూపోప లబ్ధివత్ = ప్రాణుల ముఖాదులు రూపములు కనబడునట్లు, తదుపలబ్ధిః = ప్రసాద స్వభావముగల కాచస్ఫటికాదులచే నడ్డగింపబడిన వస్తువుతో నేత్రరశ్మి సన్నికర్ష మేర్పడుట వలన నావస్తు వింద్రియముచే గ్రహింపబడుచున్నది.

దర్పణము, జలము మున్నగువస్తువులు స్వచ్ఛములగుటచే వానియందు వస్తువులు ప్రతిబింబించును. కాని, కుడ్యాదులలో నట్లు కాదు. కాచాదులు స్వచ్ఛమగుటచే నవి నేత్ర రశ్మి నడ్డగింపవు అందువలన రశ్మిసన్నికృష్టములయి వస్తువులు తెలియబడును. కాబట్టి స్వభావమే యిట నియమకారణము. కాచస్వభావము కుడ్యమునకుగానీ, కుడ్యస్వభావము కాచాదులకుగానీ లేదు. కావున నొకవస్తుధర్మము మరియొకవస్తువునందు ప్రసక్తమగు ననుట యుక్తిసంగతము కాదు.

స్వభావము నియామకకారణమైన, కాచస్ఫటికాదులు ప్రతిబంధకములై కుడ్యాదు లప్రతిబంధకము లేలకావు?

"దృష్టానుమితానాం నియోగ ప్రతిషేధానుపపత్తిః" ౩.౧.౪౮.

దృష్టానుమితానాం = దృష్టములు, ననుమితములునైన వస్తువుల విషయమున, నియోగప్రతిషేధానుపపత్తిః = ఇట్లగు గాక! ఇట్లుకాకుండు గాక! యను నియోగ ప్రతిషేధములు కూడవు.

లోకమున పదార్థములుదృష్టములు,అదృష్టములు లేక యనుమితములు నని రెండువిధములు.ప్రమాణములద్వారా దృష్టానుమితపదార్థములు మరియొక విధముగ నేల యుండ రాదని ప్రశ్నించుట యుక్తముకాదు. చక్షువుచే తెలియబడు రూపము నాసికచే నేల తెలియబడ రాదని కాని, నాసికచే గ్రహింపబడు గంధము నేత్రముచే తెలియబడుగాత యని గానీ నియోగించుట కెవరికి శక్యమగును? రూపగంధాదులెట్లు నియత స్వభావములు, నియతధర్మములు కలవై యన్యథా నియోగింప ననువుకాకున్నవో యట్లే కాచాదులును నియత స్వభావము కలవైయుండి మఱియొక విధమున నేల యుండ గూడదని నియోగింప ననువుపడవు. కాబట్టి కాచాదులు ప్రతిబంధకములు కాకపోవుటంజేసి ఇంద్రియరశ్మి వస్తువును జేరి దానిని ప్రకాశింప జేయును. ఇట్లు నేత్రేంద్రియముప్రాప్య కారియనుట సిద్ధము.

శ్రోత్రేంద్రియము తక్క యితరేంద్రియములన్నియు చక్షురింద్రియమువలెనే గోలక భిన్నములై ప్రాప్యకారులు (వస్తుసన్నికృష్టములై ప్రకాశింపజేయునవి) అని గ్రహింప వలయును.

ఇంద్రియముల యేకత్వానేకత్వములు పరీక్షింపదలచి సందేహించుచున్నాడు.

"స్థానాన్యత్వే నానాత్వా దవయవినానాస్థానత్వాచ్చ సంశయః" ౩.౧.౪౭.

స్థానాన్యత్వే = స్థానము లనేకము లయినపుడు, నానాత్వాత్ = స్థాని నానాత్వము చూడబడుట వలనను, అవయవినానాస్థానత్వాచ్చ = ఒకేయవయవి యనేకస్థానములు కలదగుటవలనను, సంశయః = నానా స్థానములలోనుండు స్థానులవలె నింద్రియము లనేకములా? లేక యనేక స్థానములందుండు అవయవివలె నింద్రియమేకమా? యని సంశయము కలుగును.

అనేకభాండములం దుంచబడిన ఫలములవలె స్థానము లనేకములయిన స్థానులు ననేకములగుట చూచుచున్నాము. అనేక తంతువులచే నేర్పడు వస్త్రమువలె యవయవాత్మక స్థానము లనేకము లయినను స్థాని (యవయవి) యొక్కటిగా నుండుటయు చూచుచున్నాము. కాబట్టి, శరీరమున నానా స్థానములుగల యింద్రియములును నానాస్థానములలోనుండు ఫలములవలె యనేకములా? లేక నానాస్థానిక—అవయవాత్మక అవయవివలె నేకమా? యని సంశయము వొడముచు. ఇంద్రియ మొక్కటే యనుట పూర్వపక్షము. ఇంద్రియము లనేకము లనుట సిద్ధాంతమని వివేకము.

పూర్వపక్షముః—

"త్వగవ్యతిరేకాత్." ౩ ౧.౪౮.

అవ్యతిరేకాత్ = సర్వేంద్రియస్థానము లందును సంబంధ ముండుటవలన, త్వక్ = త్వగింద్రియ మొక్కటే

త్వక్కు సమస్త శరీరమునందును వ్యాపించియున్నది. త్వక్కుచే వ్యాపింపబడని యింద్రియస్థాన మొందును శరీర మున గాంచము. నేత్రగోలకములందును స్పర్శజ్ఞానము కలు గుట సర్వవిదితము. కాబట్టి యనేకస్థానములుగల యొక

యనయవివలె నానాస్థానములుగల త్వగింద్రియ మొక్కటే యీశరీరమున నున్నట్లంగీకరింపవలయును. అనేకేంద్రియముల నంగీకరించుట యుక్తముకాదు.

ఉత్తరపక్షము:—

"న యుగప దర్థానుపలబ్ధేః" 3 ౧.౪౯.

యుగపత్ = ఒకే క్షణమున, అర్థానుపలబ్ధేః = సర్వేంద్రియార్థములు గ్రహింపబడకుండుటవలన, న = పూర్వోక్తము సరికాదు

శరీరమున త్వగింద్రియము తక్క ఇతరేంద్రియములు లేనియెడల, స్పర్శజ్ఞానముతో బాటు రూపాదులును తెలియబడవలయును. ఘటమును స్పృశించినపుడు కఠినత్వము స్పృశింపబడి రూపము స్పృశింపబడకుండునా? త్వగింద్రియ సన్నికర్షము కఠినత్వమున కుండి రూపమునకు లేకపోవుగదా? అట్టియెడ స్పర్శ తెలిసి రూపమేల తెలియకుండును? ఒకేక్షణమున రెండును తెలియకుండుట లోకసిద్ధవిషయము. కాబట్టి త్వగింద్రియము లేదనుట యుక్తిసంగతముకాదు.

"ఇంద్రియార్థపంచత్వాత్" 3.౧.౫౦.

ఇంద్రియార్థపంచత్వాత్ = ఇంద్రియార్థములయిన గంధాదులు ఐదగుటవలన నింద్రియములు నైదు.

గంధము, రసము, రూపము, స్పర్శము, శబ్దము ననునవి యైదు నింద్రియార్థము లనబడును. ఈ పంచార్థములలో స్పర్శ త్వగింద్రియముచేతనే గ్రహింపబడి రూపాదులు గ్రహింపబడకుండుట సర్వవిదితము. కాబట్టి స్పర్శగ్రాహకము అగు

త్వగింద్రియము నంగీకరించినట్లు రూప, రస, గంధ, శబ్దములను గ్రహించుటకు యోగ్యమయిన నేత్రము, జిహ్వా నాసిక, శ్రవణము నను నింద్రియముల నంగీకరింపక తప్పదు. ఇట్లు అర్థములయిదగుటవలన నింద్రియములు నైదనుట యుచితమని భావము.

పూర్వపక్షము:—

"న తదర్థబహుత్వాత్" ౩. ౧. ౫౧.

తదర్థబహుత్వాత్ = ఇంద్రియార్థము అనేకము లగుటవలన, న = ఇంద్రియము లైదనుట తగదు.

ఇంద్రియార్థము లైదే యయిన పక్షమున వానిని గ్రహింపగల యింద్రియములు నైదనుట యుక్తమేయగును; కాని అర్థము లనేకములగుటవలన నింద్రియము లైదేయను టెట్లు పొసగును? అర్థము లనేకము లెట్లన? సుగంధము, దుర్గంధము ననిగంధములు రెండు, మధురము, ఆమ్లము (పులుపు) లవణము, కటువు (కారము), కషాయము (ఒగరు), తిక్తము (చేదు) నని రసము లారు; ఇట్లే నీలాదిభేదములతో రూపములు నేడు; శీతము, ఉష్ణము, అనుష్ణాశీతము నని స్పర్శములు మూడు; వర్ణము, ధ్వని యని శబ్దములు రెండు రకములు. ఇట్లనేక అర్థము లుండ వానిని గ్రహించుటకు సాధనములయిన ఇంద్రియము లనేకము లుండవలయును.

పూర్వపక్షము:—

"గంధత్వాద్యవ్యతిరేకాద్ గంధాదీనామప్రతిషేధః"

3. ౧. ౫౨.

గంధాదీనాం గంధత్వాద్యవ్యతిరేకాత్ = సుగంధము, దుర్గంధము నను గంధభేదము - గంధత్వమును విడిచియుండ నేరదు. కాబట్టి, అప్రతిషేధః = ఇంద్రియపంచత్వమును కాదన వలనుపడదు.

అర్థము లైదగుటవలన నింద్రియము లైదని చెప్పియుంటిమి. ఆ యర్థములు గంధాదులు. అయ్యవి సుగంధ దుర్గంధాది భేదయుక్తములే. అయినను, గంధత్వాదుల కాశ్రయములే యగును. కాని భిన్నములు కావు. ఇట్లాశ్రయభేదము ననుసరించి యింద్రియభేద మని మా యభిప్రాయము. సర్వవిధ గంధములును గంధత్వమున కాశ్రయమనక తప్పదు. ఇట్లే సర్వ రసములు రసత్వమున కాశ్రయములు. రూపాదులు నిట్లే యెంచవలయును. ఇట్లు గంధత్వాద్యాశ్రయభేదమువలన నర్థము లయిదు విధములే యగును. కాగా, వాని గ్రాహకము లింద్రియములు నైదే.

పూర్వపక్షము:—

"విషయత్వావ్యతిరేకాదేకత్వమ్" ౩. ౧. ౫౩.

విషయత్వావ్యతిరేకాత్ = గంధాదివిషయములు విషయత్వము నతిక్రమింపజాలవు కావున, ఏకత్వమ్ = ఇంద్రియైకత్వము.

గంధాదులు గంధత్వము నతిక్రమింపకుండుటచే నైదగు నేని, గంధాదులు విషయములగుటచే విషయత్వమున కాశ్రయములై విషయత్వము నతిక్రమింపమిచే నేకత్వమును సిద్ధించును. ఇట్లర్థములలో నేకత్వము సిద్ధింప నర్థగ్రాహకములైన ఇంద్రియములలో నేకత్వము సిద్ధించును.

ఉత్తరపక్షము:—

"నబుద్ధిలక్షణాధిష్ఠాన గత్యాకృతి జాతిపంచత్వేభ్యః."

౩.౧.౬౨.

బుద్ధి.........పంచత్వేభ్యః = బుద్ధి, లక్షణము, అధిష్ఠానము, గతి, ఆకృతి, జాతి యను నీయారింటి పంచత్వము వలన, న = పూర్వ సూత్రోక్తము సరికాదు.

గంధ సామాన్యమైన గంధత్వముచే సుగంధ దుర్గంధములు, ఇట్లే రసత్వసామాన్యముచే షడ్విధరసములు, రూపత్వముచే శుక్లాది రూపములు, స్పర్శత్వముచే శీతోష్ణాది స్పర్శలు, శబ్దత్వముచే వర్ణధ్వన్యాత్మక శబ్దములు వ్యవస్థా పూర్వకముగా నొక్కొక యింద్రియముచే గ్రహింపబడుచున్నట్లు, విషయత్వమనెడి సామాన్యముద్వారా వ్యవస్థితములై గంధాదులొక యింద్రియముచే గ్రహింపబడి యన్యేంద్రియములనపేక్షింపని పక్షమున నింద్రియములనేకములు కాక యొకటి యనదగును. అట్టినియమము కానరానంతవరకు నింద్రియమొక్కటే యనుట ప్రమాణవిరుద్ధము. గంధత్వ, రసత్వ, రూపత్వ, స్పర్శత్వ, శబ్దత్వసామాన్యముల ద్వారా ఐదువిధములుగా విషయము లన్నియు వ్యవస్థితములై నాసికాదీంద్రియములచే వేరువేరుగా గ్రహింపబడుటచే నింద్రియములైదనక తప్పదు. గ్రహింపదగిన విషయములు (అర్థములు) అయిదగుటచే గ్రాహకములయిన యింద్రియములైదని భావము. ఇంద్రియార్థములైదనుట వలన నింద్రియములైదైనట్లు బుద్ధ్యాదులైదగుటచే నింద్రియములైదనుట యుక్తము.

(౧) బుద్ధి=జ్ఞానము. ఇంద్రియములచే నేర్పడు జ్ఞానము పంచవిధము. ఘ్రాణజము, రాసనము, చాక్షుషము, స్పార్శనము, శ్రావణము. కాబట్టి నాసిక, రసన, చక్షువు, స్పర్శనము, శ్రవణము నని ఇంద్రియము లైదు.

(౨) లక్షణము:— గంధగ్రాహక మింద్రియము ఘ్రాణము. రసగ్రాహక మింద్రియము రసన. రూపగ్రాహక మింద్రియము చక్షువు. స్పర్శగ్రాహక మింద్రియము త్వక్కు. శబ్దగ్రాహక మింద్రియము శ్రవణము. ఇట్టింద్రియ లక్షణము లయిదగుటచే నింద్రియము లైదు.

(౩) అధిష్ఠానము=ఇంద్రియస్థానము. నాసాదిఇంద్రియ స్థానము లైదును భిన్నము లగుటచే నింద్రియము లైదు.

(౪) గతి = అర్థగ్రహణపద్ధతి. గతిభేదముచే నింద్రియము లైదు. నాసిక, జిహ్వా, త్వక్కు నను నీ మూడింద్రియములు తమదగ్గరచేరి తమతో సన్నికృష్టములైన స్వవిషయములను గ్రహించును. చక్షువు తన కిరణములతో దూరమున నున్న విషయమును చేరి గ్రహించును, శ్రవణము సంతానవృత్తితో తన చెంత జేరిన శబ్దమును గ్రహించును.

(౫) ఆకృతి=ఇంద్రియాధిష్ఠానముల సంస్థానవిశేషము. ఇంద్రియముల యాకృతియు నైదువిధము లగుటచే నింద్రియము లైదు.

(౬) జాతి=ఘ్రాణత్వాదిధర్మము. ఇంద్రియములలోని ఘ్రాణత్వాదిధర్మము నైదువిధములగుటచే నింద్రియము లైదే.

ఇంద్రియములు కిమాత్మకములన,

"భూతగుణవిశేషోపలబ్ధేః తాదాత్మ్యమ్" ౩.౧.౬౫.

ఘ్రాణాదులయిన యింద్రియములద్వారా, భూతగుణవిశేషోపలబ్ధేః=పృథివ్యాదిపంచభూతములలోని గంధాది విశేషగుణములు తెలియబడుటవలన, తాదాత్మ్యమ్=ఇంద్రియములు పంచభూతాత్మకములు.

ఏది యేభూతమునందలి గుణవిశేషమును తెలుపునో యది తదాత్మకమగుట నియమము. ఘ్రాణేంద్రియము గంధ రస-రూప-స్పర్శ-శబ్దములలో గంధమునే తెలుపును. కాబట్టి యది పార్థివము-పృథివ్యాత్మకము రసనేంద్రియము ఆప్యము—జలాత్మకము. రసమునే గ్రహించును. చక్షువు తైజసము—అగ్న్యాత్మకము. రూపమును గ్రహించును. స్పర్శనము వాయ్వాత్మకము. స్పర్శను గ్రహించును. శ్రవణము ఆకాశాత్మకము. శబ్దమునే గ్రహించును. ఇట్లు ఘ్రాణాదీంద్రియములు పంచభూతాత్మకములు.

(అర్థపరీక్షణ)

"గంధ రసరూప స్పర్శశబ్దానాం స్పర్శపర్యంతాః
పృథివ్యాః." ౩.౧.౬౬.

గంధరసరూప స్పర్శశబ్దానాం = గంధము, రసము, రూపము, స్పర్శము, శబ్దము నను వీనిలో, స్పర్శపర్యంతాః= శబ్దముతక్క మిగిలిన గంధ రస రూప స్పర్శములు, పృథివ్యాః = పృథివికి సంబంధించిన గుణములు.

గంధము, రసము, రూపము, స్పర్శము ఇవి పృథివి యందుండును,

"అప్తేజోవాయూనాం పూర్వపూర్వమపోహ్యాకాశ
స్యోత్తరః." ౩.౧.౬౭.

గంధ, రస, రూప, స్పర్శములలో, పూర్వం పూర్వం = పూర్వ పూర్వ గుణములు, అపోహ్య = విడిచిన మిగిలినవి, అప్తేజోవాయూనాం = జలాగ్నివాయువుల గుణములగును. ఉత్తరః = శబ్దము, ఆకాశస్య = ఆకాశమునకు సంబంధించినది.

జలమున రసము రూపము స్పర్శము నను గుణములును, అగ్నియందు రూపస్పర్శలును, వాయువునందు స్పర్శము, ఆకాశమున శబ్దము నను గుణము లున్నవని భావము.

పూర్వపక్షము:—

"నసర్వగుణానుపలబ్ధేః" ౩.౧.౬౮.

సర్వగుణానుపలబ్ధేః = ఆయాభూతాత్మక ఇంద్రియముచే నాయా భూతగుణములన్నియు గ్రహింపబడ కుండుటచేత = పైసూత్రములందు వర్ణింపబడినట్లు గుణము లంగీకరింప తగదు.

పృథివియందు గంధ రస రూపస్పర్శములు, జలమునందు రసరూప స్పర్శములు, అగ్నియందు రూపస్పర్శములు, నున్న యెడల పార్థివమైన ఘ్రాణేంద్రియముచే గంధాదులు, జలీయమైన రసనేంద్రియముచే రసాదులు, తైజసమగు చక్షురింద్రియముచే రూపస్పర్శములు గ్రహింపబడవలయును. అట్లు గ్రహింపబడుట లేదు. ఘ్రాణముచే గంధము, రసనచే రసము, చక్షువుచే రూపముమాత్రమే గ్రహింప బడుచున్నది. కాబట్టి యేభూతాత్మకమైన యింద్రియముచే నేగుణము గ్రహింపబడుచున్నదో యాగుణమే యాభూతముననున్నట్లెంచవలయును. అన్యగుణములుండుట యుక్తివిరుద్ధమని సూత్రార్థము.

ఉత్తరపక్షము:— (ఏకదేశి సమాధానము)

"ఏకైకశ్యేనోత్తరోత్తర గుణ సద్భావా దుత్తరోత్తరాణాం తదనుపలబ్ధిః." ౩.౧.౬౮.

ఉత్తరోత్తరభూతానాం=తరువాతితరువాతిజలాదిభూతములలో; ఏకైకశ్యేన=ఒక్కటొక్కటిగా, ఉత్తరోత్తరగుణసద్భావాత్ =తరువాతితరువాతి రసాదిగుణములుండుటవలన, తదనుపలబ్ధిః = పృథివ్యాదులలో ఘ్రాణాదులచేనవి తెలియబడవు

గంధరసరూపస్పర్శ శబ్దములలో నొక్కటొక్కటిగ క్రమముగా నొక్కొక్కభూతము నందుండుటవలన రసాదులు భూమియందును, రూపాదులు జలమునందును, స్పర్శాదులగ్నియందును తెలియబడకపోయినను దోషము లేదు. పృథివియందు గంధగుణము మాత్రముండును. అది ఘ్రాణముచే గ్రహింపబడుచునేయున్నది. జలమునందు రసమున్నది. అది రసనచే నుపలబ్ధమగుచున్నది. ఇట్లగ్ని వాయ్వాకాశములలో రూప స్పర్శ శబ్దము లొక్కటొక్కటిగానుండి యాయాచక్షురాదీంద్రియములచే నుపలబ్ధము లగుచునేయున్నవి. ఏవియుపలబ్ధములగుట లేదో యవి యాభూతములందు లేనే లేవు. కాబట్టి దోషము లేదు.

పృథివ్యాదులలో రసాదులేల యున్నవన,

"విష్టం హ్యపరం పరేణ." ౩ ౧.౭౦.

అపరం=పూర్వము, పరేణ = పరముతో, విష్టంహి = సంయుక్తమైయున్నది.

పృథివియందు శీతస్పర్శము వాస్తవమున లేకున్నను 'శిలాతల మతిశీతలము' అనుతావులందు జలసంయోగముచే

నట శీతలత యని తెలియనగును. కాబట్టి యది యౌపాధి కము. ఒకభూతములో మఱియొకభూతము సంయుక్తమై యున్నదనుట నిర్వివాద విషయము. కాబట్టి యొకభూతము నందు వేరొండుభూతగుణము లుపలబ్ధము లగుచునే యుండునని సూత్రాభిప్రాయము.

ఉత్తరపక్షము:— (సిద్ధాంతి)

"న పార్థివాప్యయోః ప్రత్యక్షత్వాత్." ౩.౧.౬౧.

పార్థివాప్యయోః = పృథివీజలముల రసరూపములు, ప్రత్యక్షత్వాత్ = రసనచక్షువులచే నుపలబ్ధములగుటవలన, న = పైమూడుసూత్రము లందు చెప్పబడినది సరికాదు.

మధురాది భేదయుక్తమైన రసము పృథివియందుండు టను రసనేంద్రియముద్వారా తెలిసికొనుచున్నాము. ఇట్లే జలమునందలి శుక్లరూపము చక్షువుచే గ్రహింపబడుచున్నది. ప్రత్యక్షప్రమాణ మితర ప్రమాణములకంటె నెక్కుడు ప్రామాణ్యము కలదగుటవలన ప్రత్యక్షముగా చూడబడుదాని నపలాపముచేయుట (కాదనుట) యుక్తి యుక్తముకాదు. ఉత్తరోత్తర భూతముల సంయోగమువలన నవి యుపలబ్ధమగు చున్నవనుట యుక్తముకాదు. అట్లయిన జలమునందు మధుర రసముతోబాటు తక్కిన రసములేలయుండవు? అట్లే తేజస్సు నందు లోహితరూపముతోబాటు శుక్లరూప మేలయుండదు కాబట్టి అన్యభూత సంయోగముచే నన్యగుణ్యము లుపలబ్ధము లగుచున్నవి; అవి యౌపాధికము లనుట తగదు. భూతాంతర సంయోగమువలన నుపలబ్ధములగుచో జలమున షడ్విధరస

ములు, అగ్నియందు శుక్లరూపము నుపలబ్ధము కావలసి యుండును. అట్లు కాకపోవుటచే పృధివ్యాదులలో గంధాదు లెట్లు స్వాభావిక గుణములో యట్లే రసాదులు స్వాభావికము లని యెఱుంగవలయును.

రసాదులును పృధివ్యాదుల స్వాభావిక గుణములయిన పక్షమున గంధమునలె రసమునునాసికచే నేల గ్రహింపబడదన

"పూర్వంపూర్వం గుణోత్కర్షాత్ తత్ప్రధానమ్."
3.౧.౬౨.

పూర్వం పూర్వం = నాసికాదీంద్రియములలో పూర్వపూర్వేం ద్రియము- నాసికాదిఇంద్రియము, గుణోత్కర్షాత్ = గంధగుణము ప్రాధాన్యముగా కలదగుటవలన, తత్ప్రధానమ్ = గంధగుణమును ప్రధానముగ గ్రహించును.

ఏద్రవ్యమున నేగుణము ప్రధానముగనుండునో యా ద్రవ్యము ద్రవ్యాంతరమున నున్న యాగుణమునే ప్రకటించును. నాసికాది ఇంద్రియములందు ఇతరగుణములున్నను, గంధాది గుణములు ప్రధానముగనున్నవి. కాబట్టి యవి యాయా ద్రవ్యములలోని గంధాది గుణములనే ప్రకాశింపజేయును-గ్రహించును. నాసిక గంధమును, రసనరసమును, చక్షువు రూపమును, స్పర్శనము స్పర్శను, శ్రవణము శబ్దమునే గ్రహించును. అన్య గుణములను గ్రహింపవు. కాబట్టి రసాదులు పృథివీగుణము లైనను నాసిక గంధమునే గ్రహించును; రసాదులను గ్రహించ దనుట దోషముకాదు.

నాసికాదు లిట్లు పాంచభౌతికము లని సిద్ధించుచుండ గంధాదు లేల ప్రధానములయి రసాదులు కాకున్నవన,

"తద్వ్యవస్థానంతు భూయస్త్వాత్" ౩.౧.౬౩.

భూయస్త్వాత్ = ఇంద్రియములకు ప్రకృతి యగు భూతద్రవ్య మధికముగా నందుండుటవలన, తద్వ్యవస్థానం = ఒక యింద్రియమున నొక గుణము ప్రధానము; మిగిలినవి యప్రధానము లను వ్యవస్థ యేర్పడుచున్నది.

సామాన్యముగ నింద్రియములన్నియు పాంచభౌతికములయినను, నొక్కొక యింద్రియమున నొక్కొక ప్రకృతి ద్రవ్య మధికముగా నున్నది. నాసికేంద్రియమున పృథివీ ద్రవ్యాంశ మధికము. రసనయందు జలము, చక్షువునందు తేజస్సు, త్వక్కునందు వాయువు. శ్రోత్రమున నాకాశము. ఏ ద్రవ్య మే యింద్రియమున నెక్కువగా నున్నదో దాని గుణమున కంను ప్రాధాన్యమని వివేకము. కాబట్టి ఘ్రాణాదులలో గంధాదులు ప్రధానములు; రసాదులు కాదను వ్యవస్థ యుచితమే

ఘ్రాణాదీంద్రియములలో గంధాదిగుణములు ప్రధానములుగ నున్నచో నా యా యింద్రియములలోని గుణము లాయా యింద్రియములచే నేల గ్రహింపబడవన,

"సగుణానామింద్రియభావాత్" ౩.౧.౬౪.

సగుణానాం = గంధాదిగుణములతో కూడిన ఘ్రాణాదులే ఇంద్రియ భావాత్ = ఇంద్రియము లనబడును.

ఘ్రాణాది ఇంద్రియములు గంధాదిగుణయుక్తములు కానిచో నానియం దింద్రియభావము — విషయగ్రాహకత యుండనేరదు. నిర్గుణములు గుణగ్రాహకములు కానేరవు. దీపము రూపరహితమగుచో నది యితర ద్రవ్యము లందలి రూపమును ప్రకాశింపజేయనేరదు. కాబట్టి ఘ్రాణాదీంద్రియములు తమలోని గంధాదిగుణములను వేరుచేసి తాము గుణరహితములయి గంధాదిగుణములను గ్రహింపనేరవు. కారణము వానిలో నవు డింద్రియత్వము లేకపోవుటయే.

"తేనైవ తస్యాగ్రహణాచ్చ" ౩.౧.౬౫.

తేనైవ=దానిచేతనే, తస్యాగ్రహణాచ్చ=అది గ్రహింపబడకుండుటవలన ఘ్రాణాదీంద్రియములు స్వగుణములను గ్రహింపనేరవని యర్థము.

ఘ్రాణాదులలో గంధాదిగుణములు లేనియెడల నవి యింద్రియముల స్వరూపమునే పొందజాలవు. కాబట్టి గంధాదిగుణములే ఇంద్రియస్వరూపములని తెలియుచున్నది. అట్టియెడ ఇంద్రియములు స్వగుణముల నేల గ్రహింపవని ప్రశ్నించుట చక్షువు తన్నుతానేల గ్రహింపదని ప్రశ్నించుటయగును. అది యసంభవము. కాబట్టి ఇంద్రియములు స్వగుణములను గ్రహింపనేరవని భావము.

పూర్వపక్షము:—

"న శబ్దగుణోపలబ్ధేః" ౩.౧.౬౬.

శబ్దగుణోపలబ్ధేః=శ్రోత్రేంద్రియముచే శబ్దగుణ ముపలబ్ధమగుచుండుటవలన, న = ఇంద్రియములు స్వగుణములను గ్రహింపనేరవనుట యుక్తము కాదు.

కర్ణఛిద్రముచే నావరింపబడిన యాకాశమే కర్ణేంద్రియ మనబడును. ఆకాశాత్మకమగు కర్ణము స్వగుణమయిన శబ్దమును గ్రహించుచున్నందున ఇంద్రియములు స్వగుణగ్రాహకములు కావనుట ప్రమాణవిరుద్ధము.

ఉత్తరపక్షము:—

“తదనుపలబ్ధిరితరేతర ద్రవ్యగుణవైధర్మ్యాత్.” ౩.౧.౬౭.

ఇతరేతర ద్రవ్య గుణవైధర్మ్యాత్ = ఘ్రాణాదిద్రవ్యములు, వాని గంధాది గుణములు పరస్పరము విలక్షణధర్మములు కలవగుటచే, తదనుపలబ్ధిః = శబ్దగుణము శ్రోత్రేంద్రియముచే గ్రహింపబడుచున్నది.

ఘ్రాణాదులు తమలో ఇంద్రియత్వము సంపాదించుటకై గంధాదిగుణముల నెట్లపేక్షించునో యట్లు (శ్రోత్రేంద్రియము) ఆకాశము ఇంద్రియమగుటకు శబ్దగుణ సాహాయ్యము నపేక్షింపదు. గంధాదులు గంధాదులచే వ్యక్తములగునట్లు శబ్దము శబ్దాంతరముచే వ్యంజకము కాదు. శబ్దము సంతానవృత్తితో శ్రవణేంద్రియమును చేరును. గంధాదులట్లు చేరవు. ఇట్టి భేదములుండుటచే దానియుపలబ్ధియందును భేదముండుట సహజము. కాబట్టి శ్రోత్రేంద్రియముచే స్వగుణమైన శబ్దగ్రహణము కలిగినప్పటికి ఘ్రాణాదీంద్రియములు స్వగుణగ్రాహకములు కానని వచ్చుదోషమెందును కానరాదు. శ్రవణముకాక మిగిలిన ఇంద్రియములు స్వగుణములను గ్రహింపవను నియమము నచలమేయని సూత్రాభిప్రాయము.

తృతీయాధ్యాయమున ఆద్యాహ్నికము.

న్యాయదర్శనము

తృతీయాధ్యాయము

(ద్వితీయాహ్నికము)

క్రమము ననుసరించి యింద్రియముల తరువాత బుద్ధిని పరీక్షింపగోరి ముందు సంశయించుచున్నాడు.

"కర్మాకాశ సాధర్మ్యాత్ సంశయః" ౩.౨.౧.

కర్మాకాశసాధర్మ్యాత్ = కర్మ, ఆకాశము నను నీ రెంటితోను సమానమయిన ధర్మము కలదగుటవలన, సంశయః = బుద్ధి కర్మవలె ననిత్యమా? లేక యాకాశమువలె నిత్యమా? యని సందేహము కలుగును.

కర్మయందును, ఆకాశమునందును స్పర్శధర్మము లేదు. కర్మ యనిత్యము. ఆకాశము నిత్యము. ఇట్లు స్పర్శ ధర్మములేని వస్తువులు నిత్యములు, అనిత్యములు నని రెండు విధములుగా చూడబడుచున్నవి. ఇట్లే బుద్ధియందును స్పర్శ ధర్మము లేదు. కాబట్టి, యస్పర్శత్వమున బుద్ధి కర్మతోను, ఆకాశముతోను సమమగుచున్నది. సమానధర్మము కలదిగాన కర్మవలె ననిత్యమా లేక యాకాశమువలె నిత్యమా! యని సంశయము కలిగించుచున్నది.

న్యాయశాస్త్రమున బుద్ధిశబ్దము జ్ఞానార్థమున వాడబడును. కాని సాంఖ్యదర్శనమున నాత్మ, మనస్సు, అంతఃకరణము, చిత్తము నని దానికి నామాంతరములని యెంచుదురు. ఇంద్రియములు గోలకములు. వానియందు ప్రతిబింబి

తములయిన విషయములు ఇంద్రియసంసృష్టమయిన బుద్ధియందు ప్రతిబింబించుచుండునని వారి మతము. బుద్ధియం దా విషయములు ప్రతిబింబింపగా నా బుద్ధి యా యా విషయాకారతను పొందును. ఇట్టి విషయాకారతయే 'ఇది ఘటము ఇదిపటము' నను విషయజ్ఞానము. కాబట్టి సాంఖ్యులదృష్టిలో బుద్ధియొక్క విషయాకారతయే జ్ఞానమనబడును. ఈ బుద్ధి నిత్యమని సాంఖ్యులమతము. ఇదియే యీ సూత్రమున పూర్వపక్షము. ఆత్మేంద్రియార్థముల సన్నికర్షమువలన కలుగు జ్ఞానము బుద్ధి యనబడును. అది యాత్మకాదు. మనస్సం యుక్తమైన యాత్మకు గుణము అది యనిత్యము నని న్యాయ మతము. ఇదియే సిద్ధాంతపక్షము.

పూర్వపక్షము:—

"విషయప్రత్యభిజ్ఞానాత్" ౩. ౨. ౨.

విషయప్రత్యభిజ్ఞానాత్ = విషయసంధానముచే బుద్ధి నిత్యము.

పూర్వమొకప్పుడు తా జూచినవస్తువును మరల వేరొక పర్యాయము చూచిన 'అదే యిది' యని కలుగుజ్ఞానము ప్రత్యభిజ్ఞాన మనబడును. ఈ జ్ఞానమున కధికరణము బుద్ధియే యగును. బుద్ధి స్థిరముకాక నశ్వరమగునేని ప్రత్యభిజ్ఞానమున కధికరణము కాజాలదు. ప్రథమ పర్యాయమునజూచిన బుద్ధి వేరు. కాలాంతరమున జూచు బుద్ధి వేరగును. అట్టియెడ ప్రత్యభిజ్ఞానమే కలుగ నేరదు. ఒకరుచూచిన దానిని మరి యొకరుజూచి తాను పూర్వముచూచిన దిదియే యని యెట్లు

చెప్పగలరు? చైత్రుడు జూచి తెలిసికొనినదానిని మైత్రుడు గుర్తుపట్టగలుగునా? ఎన్నడు నట్లు జరుగనేరదు. కాబట్టి బుద్ధి స్థిరమై, నిత్యమైననాడే ప్రత్యభిజ్ఞానము సంభవించును. అందు వలన బుద్ధి నిత్యము.

పూర్వపక్షము:—

"సాధ్యసమత్వా దహేతుః" ౩.౨.౩.

సాధ్యసమత్వాత్ = సాధ్యముతో సమానమగుట వలన, అహేతుః=విషయప్రత్యభిజ్ఞచే బుద్ధి నిత్యమనెడి హేతువుసరికాదు.

సిద్ధవిషయమే హేతువు కాగలదు. అసిద్ధము హేతువు కాజాలదు. బుద్ధినిత్యత్వ మెట్లుసాధ్యమో యట్లే బుద్ధికి ప్రత్యభిజ్ఞ కలుగుననునదియు సాధ్యవిషయము. కాబట్టి హేతువుగా ప్రయోగింపజనదు. ప్రత్యభిజ్ఞ యనునది చేతనధర్మము. అది యచేతనమైన బుద్ధికి ధర్మముగా చెప్ప వలనుపడదు. చేతనము పూర్వమెరిగిన దానిని గుర్తించి (అదే యిది) ప్రత్యభిసంధి చేయగలుగును. అచేతన మెన్నడు నట్లు చేయ నేరదు. సాంఖ్యులబుద్ధి యచేతనము కాగా నచేతనమైనబుద్ధి యందు ప్రత్యభిజ్ఞ కలుగదు. ప్రత్యభిజ్ఞ సిద్ధింపకున్న బుద్ధి స్థిరమగుటచే నిత్యమనుటయు నసంగతము.

"న యుగపదగ్రహణాత్." ౩.౨.౪.

యుగపత్ = ఒకేసారి, అగ్రహణాత్ = అనేకవిషయములు గ్రహింపబడకుండుటవలన, న=బుద్ధిచేతనముకాదు.

బుద్ధి చేతనమే యగునెడల, ఇంద్రియగోలకముల కది సర్వదా సమీపమున నంటియుండుటచే నన్నియింద్రియగోల

కములందును ఒకేక్షణమున ప్రతిబింబించు నానావిధవిషయములు నొక్కసారిగా గ్రహింపబడవలయును. బుద్ధికి నింద్రియములకు మధ్య నొక్కొక యింద్రియముతో బుద్ధిని సంయుక్తపరచు నంతఃకరణము వేరుగాలేదుకదా! కాబట్టి నియమముగా నొకటివెంట మరియొకటిగా రూప రసాదులు గ్రహింపబడక అన్నియు నొకేసమయమున గ్రహింపబడవలయును. అట్లు గ్రహింపబడకుండుటచే బుద్ధి చేతనము కాక యచేతనమనియే ధ్రువపడుచున్నది.

"అప్రత్యభిజ్ఞానేచ వినాశప్రసంగః." ౩.౨.౫.

అప్రత్యభిజ్ఞానేచ = ప్రత్యభిజ్ఞానమే కలుగనిపక్షమున, వినాశప్రసంగః= బుద్ధికి నాశప్రసక్తికలుగును.

ప్రత్యభిజ్ఞాన బలమువలననే బుద్ధిస్థిరమని చెప్పవీలగును. అది యంగీకరింపని పక్షమున బుద్ధిస్థిరమని యెట్లుచెప్పగలము? హేతువులేని బుద్ధిస్థైర్యము యుక్తిసంగతముకాదు. కాబట్టి బుద్ధిస్థిరము, నిత్యము నని చెప్ప వలనుపడదు. నిశ్చితముగ నశించు ననవలసివచ్చును.

పూర్వపక్షము:—

"క్రమవృత్తిత్వా దయుగపద్గ్రహణమ్." ౩.౨.౬.

క్రమవృత్తిత్వాత్= విషయములతో క్రమముగా సంబంధము కలుగుటచే అయుగపద్గ్రహణమ్= ఒకేక్షణమున బుద్ధి గ్రహింపదు.

బుద్ధి చేతనము కానందువలన యుగపద్గ్రహణము కలుగదనుట యుక్తముకాదు. విషయములతో క్రమముగా సం

బంధము కలుగుటచే బుద్ధికి క్రమముగా జ్ఞానము కలుగుచున్నది. ఆత్మ చేతనమయ్యు నసంబద్ధమగు నర్థమును గ్రహింపనేరదు కదా! కాబట్టి యుగపద్గ్రహణము కానందున బుద్ధి యచేతన మనుట యుక్తముకాదు.

వస్తువులతో యుగపత్సంబంధ మున్నయెడను యుగపత్ జ్ఞానమేల కలుగదన:

"అప్రత్యభిజ్ఞానంచ విషయాంతరవ్యాసంగాత్" ౩.౨.౭.

ఈ సూత్రమున ప్రత్యభిజ్ఞానశబ్దము జ్ఞానార్థమున వాడబడినది. అనేకవిషయములతో సంబంధమున్నప్పటికి, విషయాంతర వ్యాసంగాత్=అన్యవిషయమున మిక్కిలి యాసక్తిగలిగియుండుటవలన, అప్రత్యభిజ్ఞానంచ=మిగిలిన విషయముల జ్ఞానము కలుగదు.

కొన్నియెడల సన్నికర్షమున్నప్పటికి జ్ఞానముకలుగని మాట సత్యమే యయినను బుద్ధి యచైతన్యమనిసిద్ధింపదు. బుద్ధి కొండొక విషయమును గ్రహించుటలో వ్యాసక్తమై యుండుటవలన తదితర విషయములను గ్రహింపదనవచ్చును. అన్యమును విడిచి యొకదానియందు లగ్నమగుట వ్యాసంగమనబడును. ఒకచో వ్యాసక్తుడైన వ్యక్తి యన్యము తెలిసికొనజాలడనుట వైదికులైన మీరు నంగీకరింతురు. "అన్యత్రమనా అభూవం నాదర్శమ్, అన్యత్రమనా అభూవమ్ నాశ్రౌషమ్" బృ. ఉ. ౩. ౫. ౩.) నా మనస్సు అన్యత్రలగ్నమై యున్నది. కావున నేను చూడలేదు. వినలేదు. అనునిది లోకానుభవసిద్ధము. కాబట్టి యొకప్పుడు బుద్ధియు సన్నిహితార్థమును గ్రహింపనంతమాత్రమున నది యచేతన మన

నెప్పుదని యభిప్రాయము. చేతనమై నాశరహితమగుటచే నిత్యమనియు తెలుచున్నది.

ఉత్తరపక్షము:—

"గత్యభావాత్" ౩.౨.౮.

గత్యభావాత్=బుద్ధి గతిరహితమగుటచే పూర్వపక్ష మయుక్తము.

బుద్ధి స్థిరమై, గతిరహితమగుటచే నది విషయస్థలమునకు బోనేరదు. గతిలేనిదగుటచే నది యొక్కొక్క విషయమును చేరి యందు కొంతకాల దానియందు వ్యాసక్తమై యస్యమును గ్రహింపజనిగానీ, క్రమముగా గ్రహించుననిగానీ యనుట పొసగదు సాంఖ్యుల మతమున విషయములు ఇంద్రియ గోలకములందు ప్రతిఫలించి బుద్ధియందు ప్రతిబింబించుటయేకదా జ్ఞానమనబడును. ఇంద్రియగోలకములు సదా తెరువబడియుండును. వానిద్వారా వస్తువులు బుద్ధియందు ప్రతిఫలించును. ఒక్కొక్క యింద్రియ మొక్కొక్కసారి వస్తువుల ప్రతిఫలమునకు తావిచ్చిన క్రమ మేర్పడును. కాని, క్రమవృత్తికి వేరొండువిధానమేమున్నది? అట్టి ప్రసక్తి యింద్రియముల గానము. క్రమవృత్తి యసంభవమైనపుడు యుగపత్ విషయగ్రహణ మేలకలుగదు? కలుగవలసియేయుండును. అనుభవమున యుగపద్గ్రహణముకలుగకుండుటచే బుద్ధి యచేతన మనుట నిశ్చితము కాబట్టి బుద్ధియెఱుగును దానికి జ్ఞానము కలుగుననుట చెల్లదు. అచేతనమెట్లెఱుగగలదు? విషయాంతర వ్యాసక్తికూడ బుద్ధియందనుపపన్నమగుటచే నయ్యది నశింపదనుటయుతగదు. కాబట్టి

యనిత్యమగుట నిర్వివాదము జ్ఞానము (బుద్ధి) ఉత్పన్నమై నశించుట ప్రత్యక్షసిద్ధము. రసబుద్ధి కలుగుటయు, రూపబుద్ధి నశించుటయు లోకసిద్ధము. కాబట్టి బుద్ధి యనిత్యము, ననేకము నని సిద్ధాంతము.

ప్రస్తుతము బుద్ధి క్షణికమయి యాత్మ యన్నబడు నను వాదమును ఖండించుటకు సూత్రము.

"స్ఫటికాన్యత్వాభిమానవత్ తదన్యత్వాభిమానః"
౩. ౨. ౯.

స్ఫటికాన్యత్వాభిమానవత్=అనేక కుసుమముల సన్నిధానమున నొకే స్ఫటిక మనేకముగా తోచినట్లు, తదన్యత్వాభిమానః=గంధాది విషయభేదముచే బుద్ధియు ననేకము.

నానావర్ణములుగల కుసుమములు సమీపమున నుంచబడినపు డొక స్ఫటికమణి, పుష్పవర్ణములతో కూడి యెఱ్ఱగాను, పచ్చగాను, మఱియు ననేక విధముల భాసించుచు ననేకముగా తోచుట లోకసిద్ధము. అట్లే బుద్ధి యేకమయ్యు గంధాది నానావిషయసాన్నిధ్యమువలన గంధజ్ఞానము, రూపజ్ఞానము నని యనేకవిధముల భాసించును. కాబట్టి నానావిధ కుసుమసన్నిధానముచే స్ఫటికము నానావర్ణములతో నొప్పుచు 'నానా' యని తోచునట్లు, బుద్ధియు వాస్తవమున నొక్కటియై విషయసాన్నిధ్యమున ననేకముగా భాసించుచున్నదని భావము.

పూర్వపక్షము:—క్షణికవాది.

"స్ఫటికేఽప్యపరాపరోత్పత్తేః క్షణికత్వాత్ వ్యక్తీనామహేతుః" ౩.౨.౧౦.

వ్యక్తీనామ్=భాసించు వస్తువులన్నియు, క్షణికత్వాత్=క్షణికము లగుటవలన, స్ఫటికేఽపి=దృష్టాంతముగా చెప్పబడిన స్ఫటికమణి యందును, అపరాపరోత్పత్తేః=అన్యాన్యస్ఫటికవ్యక్తులు కలుగుచుండుట వలనను, అహేతుః=ఒక్కటే యనేకముగా భాసించుచున్నదనుట హేతువు కాదు.

లోకమునగల భావపదార్థములు (వ్యక్తులు) అన్నియు నొక్క క్షణము స్థితిగలవై యన్యక్షణమున నశించును. కావున క్షణికము లనబడును. పూర్వక్షణమున నున్న వ్యక్తి యుత్తరక్షణమున నుండదు. ఉత్తరక్షణమున క్రొత్తది యుద్భవించును. ఇది స్ఫటికమున ప్రత్యక్షముగా చూడనగును. అస్మదాదుల శరీరము ప్రతిక్షణము మార్పునొందుచు క్షయవృద్ధుల నొందుచుండుటచూచి క్షణపరిణామి శరీరమని యెవ రెఱుంగరు! శరీరము ప్రతిక్షణపరిణామియైన పూర్వవ్యక్తి నశించ క్రొత్తవ్యక్తి యేర్పడుచున్నదనక తప్పదు. కావున ఒకవస్తువునందు కలుగు నానాత్వము ఔపాధికమనుట సరి కాదు. ఇట్లే బుద్ధియు ప్రతిక్షణము నశించుచు, పుట్టుచు నుండుటచే నది 'నానా' యని యంగీకరింపక తప్పదు. అందువలన నానాత్వమౌపాధికము—నానావిషయ సన్నిధానముచే నేర్పడు నది యని చెప్పుట ప్రమాణ సంగతముకాదని భావము.

ఉత్తరపక్షము:—

“నియమహేత్వభావాత్ యథాదర్శనమభ్యనుజ్ఞా”
3. ౨. ౧౧.

నియమహేత్వభావాత్=ప్రతిభావవస్తువు క్షణికమనుటకు తగిన ప్రమాణము లేకుండుటవలన, యథాదర్శనమ్=ఏ వస్తు వెట్లుచూడబడిన నట్లు, అభ్యనుజ్ఞా=అంగీకరింపవలయును.

(యత్ సత్ తత్ క్షణికమ్) ప్రతిభావపదార్థము క్షణికము అను నియమమును రూపించు ప్రమాణ మొకటియును కానరాదు. సత్యమన భావపదార్థము. అనగా అర్థక్రియాకారి. క్షణికమన క్షణకాలము స్థితిగలది. ఏది సత్యమో యది క్షణికమనుటకు, సత్యక్షణికములకు ధూమాగ్నులవలె వాని యవినాభావ సంబంధ మెటనైన ప్రత్యక్షముగ గ్రహింపబడునని చెప్ప వలనుపడదు. క్షణికవస్తువువలన నర్థక్రియాకారిత్వము (కొంచెమొక ప్రయోజనసిద్ధి) సిద్ధింపదు. ఇట్లు ప్రత్యక్షానుమాన ప్రమాణములలో దేనిచేతను వస్తువు క్షణికమని చెప్ప వీలుకానిపక్షమున నెట్లంగీకరింపనగును? కాబట్టి యేవస్తువు ఎట్లు తెలియబడిన నట్లే యంగీకరింపవలయును. స్ఫటికము భావపదార్థమని గ్రహింపబడినట్లు క్షణికమని తెలియబడదు. కాబట్టి యనేకత్వము అందు సిద్ధింపనేరదు. బుద్ధివిషయమునన్నో రసజ్ఞానమునశించి గంధజ్ఞానము, అదియు నశింప రూపజ్ఞానము నుదయించుట చూచుచున్నాము. కాబట్టి బుద్ధి నానా యని సిద్ధమగుచున్నది. స్ఫటికము నిట్లే యనుటకు తగిన ప్రమాణము లేనందున నందలి నానాత్వ మౌపాధికమే కాని వాస్తవము కాదని సూత్రాభిప్రాయము.

శరీరము భావపదార్థమై, క్షణికమైనట్లు స్ఫటికమేల కాదన,

"నోత్పత్తివినాశ కారణానుపలబ్ధేః." ౩.౨.౧౨

ఉత్పత్తివినాశ కారణానుపలబ్ధేః = శరీరమునకువలె నుత్పత్తి, వినాశ కారణము లభింపమి, న = స్ఫటికము క్షణికమన నొప్పదు.

శరీరమున పూర్వవ్యక్తి నశించి క్రొత్తవ్యక్తి కలుగు చున్నదనుటకు తగినహేతువులయిన వృద్ధిక్షయములు లభించు చున్నవి. కాబట్టి శరీరము క్షణికమనుట ప్రమాణయుక్త మగును. అట్టిహేతువు స్ఫటికమున కానరాదు. కాబట్టి యది క్షణికమగుటెట్లు? శరీరము భావ (సత్వ) మైనట్లు స్ఫటికము భావమేకదా యని క్షణికమనచెల్లునా? చెల్లదు. ఒక కుసుమ మున రక్తవర్ణమున్న నితరకుసుమములు కుసుమములే యని వానియందును ఎఱుపు కల్పింపగలమా? కాబట్టి భావ (సత్వ) పదార్థమైనంతమాత్రమున శరీరమువలె స్ఫటికమును క్షణి కము కానేరదు.

క్షణికవాదులవలె వైదికులును శరీరము క్షణికమని యంగీకరింతురు. కారణ మేమన చిచ్ఛక్తి (చేతన పదార్థము) తక్క మిగిలిన భావపదార్థములన్నియు క్షణపరిణతి నొందు చుండుట నంగీకరింతురు. అయినను, బౌద్ధుల క్షణవాదము నకు, వైదికుల పరిణామ వాదమునకు చాల భేదమున్నది. క్షణికవాదులు ప్రతిక్షణమునను వస్తువు క్రొత్తదగుచున్న దెందురు. అనగా పూర్వపువస్తువు నశించి క్రొత్తది యుత్పన్న మగు నందురు. వైదికులుమాత్రము ఒకేవస్తువు పరిణతి నొందు నందురు. వస్తువట్లేయుండి యవస్థలు భేదించుచుండు నందురు. ఒకవ్యక్తి వృద్ధావస్థనుబొంది, "బాల్యయావనము లందత్యంత సుందరము, సుదృఢమునై యున్న నాశరీరము నేడు వికృతము, శిథిలము నైన"దని చెప్పుట మన మెరుగుదుము. అట్టియెడ శరీరమొక్కటియే యనియు, నందనేక అవస్థలు

కలిగిన దనియు స్పష్టపడుచున్నది. జ్ఞానము, కర్మ, శబ్దము మూడుక్షణములవరకు స్థాయిత్వము కలిగియుండి యటుపై నశించును. వైదికులు త్రిక్షణావస్థాయిత్వమును క్షణికమందురు. బౌద్ధుల క్షణికత్వమన ఒక్కక్షణము స్థాయిత్వము కలిగియుండుటయే యని వివేకము.

పూర్వపక్షము:—

"క్షీర వినాశే కారణా నుపలబ్ధివత్ దధ్యుత్పత్తివచ్చ తదుపపత్తిః" ౩.౨ ౧౩.

క్షీర వినాశే కారణానుపలబ్ధివత్ = క్షీర నాశమునకు కారణము లభింపని యట్లు, దధ్యుత్పత్తివచ్చ = దధి యుత్పన్న మగుటకును కారణము లభింపని విధమున, తదుపపత్తిః = స్ఫటిక వినాశోత్పత్తులకు గల కారణములు లభింపకున్నను దోషములేదని యర్థము.

శరీర పరిణతకు కారణములైన క్షయ వృద్ధులు ప్రమాణ గోచరము లయినట్లు స్ఫటికమున పూర్వవ్యక్తులు నశించి యపూర్వవ్యక్తు లుత్పన్నము లగుచున్నట్లు గ్రహించుటకు తగిన హేతువులు లభింపకున్నను అట్టి కారణము లున్నట్లూహింపవలయును. వస్తువు లేదనుటకు అనుపలబ్ధి కారణము కాదుగదా? దధివిచూచు వ్యక్తి క్షీర వినాశ కారణమును గానీ, దధ్యుత్పత్తి కారణమును గానీ చూడనేరడు. అంతమాత్రమున కారణము లేదన వలనుపడదు. వస్తు వినాశోత్పత్తులు కారణము లేక కలుగనేరవు. కాబట్టి క్షీర వినాశ దధ్యుత్పత్తులకు కారణము లుపలబ్ధములు కాకపోయినను నవి యున్నవని యంగీకరించినట్లు, స్ఫటికము నందును పూర్వ

పరవ్యక్తుల వినాశోత్పాద కారణము లుపలబ్ధములు కాకున్నను ఉన్నట్లంగీకరింప నగునని సూత్రభావము.

ఉత్తరపక్షము:—

"లింగతో గ్రహణా న్నానుపలబ్ధిః" ౩.౨.౧౪.

లింగతః = అనుమానము వలన, గ్రహణాత్ = గ్రహింప బడుట వలన, అనుపలబ్ధిః = క్షీర వినాశమునకు, దధ్యుత్పత్తికి కారణములు లభింపవనుట, న = సరిగాదు.

క్షీర వినాశమునకు, దధ్యుత్పత్తికిని గల కారణములు ప్రత్యక్షముగా గోచరింపక పోయినను, లింగము ద్వారా యవి యుపలబ్ధము లగుట సంభవమే. వినాశోత్పత్తులు సకారణకములు. ఘటపటాదుల వినాశోత్పత్తులను మనము సకారణకములుగా చూచుచున్నాము. అట్లే క్షీరవినాశము, దధ్యుత్పత్తియు వినాశోత్పత్తులే కాబట్టి వానికిని కొండొక కారణముండక తప్పదు. కాగా అవియు సకారణకములని యనుమానింతుము. ఇట్లు దధిక్షీరములవలె స్ఫటికమున పూర్వ పర వ్యక్తులు కానరామిచే వానికిగల కారణముల నూహింప జాలము. భావ పదార్థము లన్నియు వినాశోత్పత్తులు కలిగి యుండును. కాబట్టి స్ఫటికమునందు కారణము నపేక్షింప వలసిన యవసర మేమున్నదని యనరాదు. వినాశోత్పత్తులు భావపదార్థమున స్వాభావికము లైనను అవి కారణములేక కలుగనేరవు. పక్వము కాగలస్వభావము బియ్యమునందున్నను, జల దహనముల సంయోగములేక తండులములు పక్వములగునా? కొయ్యలు పగులునట్టి స్వభావము కలవైనను

కుఠారాదుల సంయోగము లేకయే పగులునా? పగులవు. కాబట్టి శరీరమువలె స్ఫటికము క్షణికమనుట యయుక్తము.

పూర్వపక్షము:—(గుణపరిణామవాది.)

"న పయసః పరిణామ గుణాంతర ప్రాదుర్భావాత్"
3.౨.౧౫.

పయసః = క్షీరమున క్షీరమట్లేయుండ, పరిణామ గుణాంతర ప్రాదుర్భావాత్ = పరిణామమువలన పూర్వగుణమునశించి క్రొత్తగుణము కలుగుట వలన, న = క్షీరమునశించి దధియేర్పడినదని యనుటతగదు.

క్షీరముకంటె దధి భిన్నమగునెడల క్షీరము నశించి దధ్యుత్పన్నమైనదని చెప్పనగును. క్షీరమున ఆమ్ల (పులుపు) గుణ సంయోగముచే పూర్వగుణము నశించి క్రొత్తగుణ మొండు కలుగుటచే క్షీరమే దధి యనబడుచున్నది. క్షీరము నశించి దధియేర్పడుచున్నదనువాని మతమున, దధ్యుత్పత్తి సమయమున నశించినక్షీరము దానికి కారణమెట్లు కాగలదో చెప్పవలసియుండును. వినష్ట మృత్తిక ఘటోత్పత్తికి కారణము కాగలుగునా? కాజాలదు. కారణము కార్యాన్వయము కావ లసియుండును. మా యీ గుణపరిణామ వాదమున నట్టి దోషము ప్రసక్తముకాదు. ద్రవ్యమట్లేయుండి గుణము మాత్రమే మారును. కాబట్టి గుణపరిణామవాదమే శ్రేష్ఠ మని శంకాభిప్రాయము.

ఉత్తరపక్షము:—

"వ్యూహాంతరాత్ ద్రవ్యాంతరోత్పత్తి దర్శనంపూర్వ ద్రవ్యనివృత్తే రనుమానమ్." 3.౨.౧౬.

వ్యూహాంతరాత్ = ఒకరకమగు నవయవ సంస్థానముగల ద్రవ్యమునుండి, ద్రవ్యాంతరోత్పత్తి దర్శనం = మరియొక రకమగు నవయవ సంస్థానముగల ద్రవ్య ముత్పన్నమైనట్లు గ్రహింపబడుట, పూర్వద్రవ్య నివృత్తేః = పూర్వద్రవ్య నాశనమునకు, అనుమానమ్ = లింగము - హేతువు.

కారణము సర్వథా నశించిన తదుపరి కార్యముజనించు నని చెప్పిన పైసూత్రమున జూపిన దోషము వాటిల్లును. కారణద్రవ్యమునగల యవయవవ్యూహము పోయి మరియొక విధమగు నవయవ వ్యూహ ముత్పన్న మగునని మా యభిప్రాయము. ఈ పక్షమున కార్యోత్పత్తి సమయమున కారణ ద్రవ్య ముండనిచో కార్యమెట్లుత్పన్నము కాగలదు? అను ప్రశ్నకు తావుండదు. కారణవ్యూహముపోయి మరియొక వ్యూహము కార్యమున కలుగుచుండుట ప్రత్యక్షసిద్ధమే. పూర్వవ్యూహము నశింపనిది వ్యూహాంతరము కలుగుట యసంభవము. కాబట్టి కారణవ్యూహనివృత్తి (నాశము) అనుమానింపనగును. అందువలన క్షీరవినాశము కలుగగా దధ్యుత్పన్న మగుననుట యుక్తమేయగును. గుణపరిణామ వాదము నంగీకరించిన కార్యద్రవ్యమున నేర్పడు వ్యూహాంతర మునకు సమాధానము చెప్పజాలము. కాగా ఆవాదము శ్రేష్ఠ మనజాలము.

మేఘమండలమున విద్యుత్తు లుత్పన్నము లగుటకు, నశించుటకు కారణములులేవు. కాబట్టి స్ఫటికవ్యక్తులు మాత్రము నిష్కారణకము లేల కావన,

"క్వచిద్వినాశ కారణానుపలబ్ధేః క్వచిచ్చోపలబ్ధే రనే
కాంతః" ౩.౨.౧౭.

క్వచిత్ = విద్యుత్తు విషయమున, వినాశకారణానుపలబ్ధేః = వినాశోత్పత్తి కారణములు లభింపనందువలన, క్వచిచ్చ = ఘటపటాదుల యుత్పత్తి వినాశముల విషయమున, ఉపలబ్ధేః = కారణములు లభించుచున్నందు వలనను, అనేకాంతః = స్ఫటికవ్యక్తుల వినాశోత్పత్తులు నిష్కారణకములనుట యేకాంతవాదము కాదు.

మేఘమండలమున నప్పుడప్పుడు స్ఫురించు విద్యుదుత్పత్తి వినాశములకుగల కారణములు మనకు గోచరములు కానట్లు స్ఫటికవ్యక్తుల యుత్పత్తి వినాశములకు కారణములు తెలియకున్నను నవి నిష్కారణకము లనుటకు వలనుపడదు. విద్యుదుత్పత్తి వినాశములకు హేతువులు కానరాకున్నను ఘటపటాదుల యుత్పత్తి వినాశములకు హేతువులు చూడబడుచున్నవి కదా? విద్యుత్తువలె స్ఫటిక వ్యక్తులు నిష్కారణకము లందువేని ఘటపటాదులవలె సకారణకము లేలకావు? కాబట్టి స్ఫటిక దృష్టాంతముతో భావపదార్థములు క్షణికములని సాధించుట యుక్తము కాదు. ఒక బుద్ధి నశించి మరియొక బుద్ధి యుత్పన్న మగుచుండుటచే, బుద్ధ్యుత్పత్తి వినాశములు సకారణకములని తెలియుచున్నది. కాబట్టి బుద్ధి యనిత్యము. అది రెండు క్షణములుండి మూడవ క్షణమున నశించుటచే క్షణిక మనబడును. కాబట్టి బుద్ధి ఆత్మ కాదు. ఆత్మకు సంబంధించిన గుణమని భావము.

"నేంద్రియార్థయో స్తద్వినాశేఽపి జ్ఞానావస్థానాత్."
౩.౨.౧౮.

తద్వినాశేఽపి = ఇంద్రియార్థములు నశించినను, జ్ఞానావస్థానాత్ = స్మృతిరూపమైన జ్ఞానముండుట వలన, ఇంద్రియార్థయోః = (బుద్ధి) ఇంద్రియార్థములకు సంబంధించిన గుణము, న = కాదు.

బుద్ధి యింద్రియములకుగానీ, అర్థములకుగానీ సంబంధించిన గుణము కాదు. వానికి సంబంధించినది యగుచో నింద్రియార్థములు నశించిన నదియు నశింపనగును. గుణినశించిన గుణముండ నేరదుకదా! చక్షురింద్రియము నశించి యొకవ్యక్తి యంధుడైనను 'నేను చూచియుంటిని' అనును. చూచితినను నది జ్ఞానరూపమే. కన్ను నశించినది. చూడబడినవస్తువు నశించినది. అయినను చూచితినను జ్ఞానముండును. కాబట్టి బుద్ధి (జ్ఞానము) ఇంద్రియార్థముల గుణము కాదని భావము.

"యుగపత్ జ్ఞేయానుపలబ్ధేశ్చ న మనసః." ౩.౨.౧౯.

యుగపత్ = ఒకేక్షణమున, జ్ఞేయానుపలబ్ధేః = గంధాది విషయములు తెలియకుండుటవలన, మనసశ్చ = మనోగుణమును, న = కాదు

జ్ఞానము (బుద్ధి) మనోగుణమగుచో మనస్సు జ్ఞానాశ్రయ మగుచున్నది. మనస్సు మధ్యమ పరిమాణముకలది యని వైదికులమతము. జ్ఞానాశ్రయమగు మనస్సుతో నింద్రియములన్నియు నొకేక్షణమున సంబద్ధములై యుండ, ఇంద్రియము లర్థములతో సన్నికృష్టములు కాగా సర్వవిషయములు నొకేక్షణమున గ్రహింపబడవలయును. అట్లుగ్రహింపబడుటలేదు. కాబట్టి బుద్ధిమనోగుణమును కాదు.

పూర్వపక్షము:—

"తదాత్మగుణత్వేఽపితుల్యమ్." ౩.౨.౨౦.

ఆత్మగుణత్వేఽపి = బుద్ధి ఆత్మగుణమైనను, తత్ = ఆదోషము, తుల్యమ్ = సమానమే యగును.

ఆత్మ యణుస్వరూపము. అయినను ఆత్మ మనస్సుతోను, మనస్సు ఇంద్రియములతోను, సంబద్ధములై యుండుట వలన నొకేక్షణమున సర్వవిషయక జ్ఞానము కలుగవలయుననెడి దోషము బుద్ధి ఆత్మగుణము అని యంగీకరించినపుడును కలుగును.

ఉత్తరపక్షము:—

"ఇంద్రియైర్మనసః సన్నికర్షాభావాత్ తదనుత్పత్తిః" ౩.౨.౨౧.

ఇంద్రియైః = ఘ్రాణాదీంద్రియములతో, మనసః = మనస్సునకు, సన్నికర్షాభావాత్ = ఒకేసారి సన్నికర్ష మేర్పడక పోవుటవలన, తదనుత్పత్తిః = సర్వవిషయకజ్ఞాన మొకేక్షణమున కలుగదు.

ఆత్మ, మనస్సు, ఇంద్రియములు నివి పరస్పరము సంయుక్తము లగుటయే జ్ఞానమునకు కారణ మని యంగీకరించిన పై దోష మిటను వాటిల్లగలదు.

అదృష్టవంతమగు నాత్మ మనస్సుతో సంయుక్తమై ప్రయత్నించును. అట్టిప్రయత్నముతో మనస్సునకు ఇంద్రియ ప్రదేశమున వృత్తికలుగును. అప్పుడింద్రియములతో మనస్సునకు సంబంధము కలుగును. అటుపై నర్థములతో నింద్రియములకు సన్నికర్ష మేర్పడిన జ్ఞానము కలుగును. ఇట్టి సన్నికర్షము సర్వేంద్రియములతో నాత్మ కొకేక్షణమున కలుగనేరదు. ఆత్మప్రయత్న పూర్వకముగా కలుగు సంబంధము

కాబట్టి యొకప్పుడొక యింద్రియముతోను, మఱియొకయెడ మఱియొక యింద్రియముతోను కలుగును. అందువలన సర్వ విషయిక జ్ఞాన మొకేక్షణమున కలుగవలయుననెడి ప్రసక్తి యిటకలుగదు. మనస్సు జడమై, ప్రయత్నవంతము కాకపోవు టచే దానికిగల సర్వేంద్రియ సన్నికర్షమును వారింప నెవరికి తరమగును? అందువలన మనస్సు జ్ఞానాశ్రయమగుచో సర్వ విషయక జ్ఞానమొక్కమాటుగా కలుగవలయు ననెడి దోష ప్రసక్తి కలుగును. ఆత్మగుణ మగుచో నట్టి ప్రసక్తి కలుగ నేరదని భావము.

ఆత్మ మనస్సుతోను, మనస్సు ఇంద్రియములతోను సన్నికృష్ట మగుటయే జ్ఞానకారణముగా నేల యంగీకరింప రాదన,

"నోత్పత్తి కారణా నుపదేశాత్" ౩.౨.౨౨.

ఉత్పత్తి కారణానుపదేశాత్ = జ్ఞానోత్పత్తికి కారణముగా నుప దేశింపకపోవుటచే, న = అట్లంగీకరింప లేదు.

అదృష్టవంతమగు నాత్మ మనస్సుతో సన్నికృష్టమై ప్రయత్నించినపుడాయా యింద్రియములతో మనస్సు సంబద్ధ మగును. ఆత్మ మనఃసన్నికర్షము, ప్రయత్నవంతమగు నాత్మ తోకూడిన మనస్సుతో నింద్రియమునకు సన్నికర్షము కలుగు టయే జ్ఞానోత్పత్తికి కారణముగా నాచార్యు లుపదేశించి యున్నారు. ఆత్మ, మనస్సు, ఇంద్రియములు వీని సన్నికర్షమూ మాత్రము జ్ఞానోత్పత్తికి కారణమని యుపదేశింపరైరి. అందువలన నిట్టి సన్నికర్షము జ్ఞానకారణముకాదు.

పూర్వపక్షము:— బుద్ధి యాత్మగుణమైనను నిత్యమే.

"వినాశ కారణానుపలబ్ధేశ్చావస్థానే తన్నిత్యత్వప్రసంగః."
3. ౨. ౨3.

వినాశ కారణానుపలబ్ధేశ్చ = వినాశ కారణము లభింపనందు వలనను, అవస్థానే = తప్పకస్థితికలది యగుటవలన, తన్నిత్యత్వ ప్రసంగః = బుద్ధి నిత్యము కావలసి యుండును.

విరోధి గుణమువలనను, ఆశ్రయనాశము వలనను గుణము నశించును. బుద్ధికి విరోధిగుణ మొండు లభింపదు. దాని కాశ్రయమైన యాత్మనిత్యమగుటచే నదియు నశింపదు. కాబట్టి బుద్ధియు నిత్యము కావలసియుండునని భావము.

ఉత్తరపక్షము:—

"అనిత్యత్వగ్రహాద్ బుద్ధేర్బుద్ధ్యంతరాద్ వినాశః శబ్దవత్." 3. ౨. ౨౪.

శబ్దవత్ = శబ్దమువలె, బుద్ధేః = బుద్ధికి, బుద్ధ్యంతరాత్ = విరోధియగు మరియొక బుద్ధివలన, వినాశః = వినాశము కలుగుచున్నదని కల్పింపనగును కారణమేమన, అనిత్యత్వగ్రహాత్ = బుద్ధియనిత్యమని గ్రహించుట వలన.

బుద్ధి (జ్ఞానము) యనిత్యమని యెల్లరు నెఱుగుదురు. ఒకజ్ఞానము తరువాత మఱియొక జ్ఞానము కలుగుచున్నపుడు వస్త్రజ్ఞానమునశించి కలశజ్ఞానము కలుగుచున్నదని గ్రహింపని వారెవరుందురు? జ్ఞానాశ్రయమగు నాత్మ నశింపదనుట వాస్తవమే. కాబట్టి బుద్ధినాశమునకు కారణము దానికి విరుద్ధమగు మఱియొకబుద్ధి యుత్పన్నమగుటయేయని యంగీ

కరింప వలసియుండును. ఉత్తరోత్తర శబ్దములు జనింపగానే పూర్వశబ్దములు నశించినట్లు ఒకబుద్ధి మఱియొకబుద్ధి జనించిన నశించుచున్నట్లు అంగీకరింపవలసి యుండును. కాబట్టి బుద్ధి యాత్మగుణ మయ్యు నిత్యము కాదు.

బుద్ధి యాత్మగుణ మగునెడల దానియుత్పత్తికి కారణమయిన ఆత్మమనస్సంయోగము, సంస్కారములును నాత్మయందుండుట వలన నొకేక్షణమున నానావిధ స్మృతి రూప బుద్ధులు కలుగవలసి యుండునని శంకించి యందులకు ఆత్మ విభువని యంగీకరించువా డిచ్చు సమాధానమును దూషించుచున్నాడు.

"జ్ఞానసమవేతాత్మప్రదేశసన్నికర్షాన్మనసః స్మృత్యుపపత్తేర్నయుగప దుత్పత్తిః." ౩. ౨. ౨౫.

మనసః = మనస్సునకు, జ్ఞానసమవేతాత్మ ప్రదేశ సన్నికర్షాత్ = జ్ఞానసాధన సంస్కారముతోకూడిన యాత్మప్రదేశముతో సన్నికర్షము కలుగుట వలన, స్మృత్యుత్పత్తేః = స్మృత్యాత్మక బుద్ధికలుగుచుండుటవలన, నయుగపదుత్పత్తిః = అనేకస్మృతు లొకేక్షణమున కలుగవు.

ఆత్మ విభువు; అంతట వ్యాపించియుండును. ప్రతి విషయప్రదేశమున నుండును. విషయానుభవము వలన కలిగిన సంస్కారములు స్మృతికి హేతువులై, యా యా విషయములతో కూడిన ఆత్మ ప్రదేశములందు సమవాయ సంబంధముతో నుండును. శరీరముననుండు ఆత్మయందుండవు. విషయమెట నుండునో దానిని తెలిసికొనుటవలన కలిగిన సంస్కారమును ఆవిషయదేశమున నున్నయాత్మయందే సమవేతమై

యుంచుట యుచితము. కాబట్టి, యట్టి సంస్కారయుక్తమగు నాత్మ ప్రదేశమునకు పోయి మనస్సు సన్నికృష్ట మైనపుడే తద్విషయక స్మృతి కలుగును. విషయములు భిన్నభిన్న ప్రదేశము లందుండును. మన స్సణు వగుటచే నది యెల్లయెడల నొక్కసారి సన్నికృష్టమును కాజాలదు. అందువలన ననేక స్మృతులు యుగపత్తున కలుగనేరవని విభువాది మతము.

"నాంతః శరీర వృత్తిత్వాత్" ౩.౨.౨౬.

అంతఃశరీర వృత్తిత్వాత్ = మనస్సు శరీరమునందు వర్తించునది యగుటవలన, న = విభువాది చెప్పిన సమాధానము సరికాదు.

మనస్సు శరీరమునందే వర్తించును. శరీరమునకు వెలుపల నది వర్తింపదు. శరీరము నందుండు నీమనస్సు, బాహ్యమున నున్న విషయప్రదేశమునందలి జ్ఞానసమవేత మగు నాత్మతో సన్నికృష్టము కావలయు ననిన నాప్రదేశమునకు వెళ్లవలసియుండును. మనస్సు శరీరమును విడిచి బయటికి వెళ్లునెడల మరణమే సంప్రాప్తమగును. ఇంద్రియములు, శరీరము మున్నగు సమస్తసంఘమునకు నాయకమగు మనస్సు శరీరమును విడిచిపోయిన శరీరమెందులకు పనికివచ్చును? కాబట్టి మనస్సు శరీరమునందే యుండునని యొప్పుకొనవచ్చును. అట్టియెడల నానాస్మృతు లొకేక్షణమున కలుగకుండుటకు పైజెప్పిన సమాధానము యుక్తము కాదు.

పూర్వపక్షము:—

"సాధ్యత్వాదహేతుః" ౩.౨.౨౭.

సాధ్యత్వాత్ = 'మనస్సు శరీరమునందు వర్తించుట వలన' నను హేతువు సాధింపదగిన దగుటచే సాధ్యసమ హేత్వాభాస మగును. కాబట్టి, అహేతుః = హేతువు కాదు.

'మనస్సు శరీరమునందే యుండును. శరీరమునకు వెలుపల నదిపోదు' అను విషయ మింతవరకును సిద్ధము కాలేదు. కాబట్టి సాధింపదగిన విషయము. అట్టి సాధ్యవిషయము హేతువుగా నుపయోగింపజనదు. ఉపయోగించిన నది సాధ్యసమ హేత్వాభాస మగును.

ఉత్తరపక్షము: —

"స్మరతః శరీర ధారణోపపత్తే రప్రతిషేధః" ౩.౨.౨౮.

స్మరతః = స్మరించునట్టి వానికి, శరీరధారణోపపత్తేః = శరీర ధారణము కలుగుటచే మనస్సు శరీరమునందుండునని సిద్ధించుట వలన, అప్రతిషేధః = అహేతువని చెప్పుటసరికాదు.

'మనస్సు శరీరము నందుండునది. బాహ్యమున వర్తింపదు' అను నీవిషయము సాధ్యము కాదు. సిద్ధమే. కొండొక విషయమును స్మరించునపుడు శరీరధారణము చూచుచున్నాము. ధారకప్రయత్నము లేక శరీరధారణ మేర్పడనేరదు. ఆ ప్రయత్నము ఆత్మ మనఃసన్నికర్షము వలనగాని కలుగదు. అట్టి సన్నికర్షమును మనస్సు శరీరము నందున్నపుడే కలుగగలదు. లేనిచో కలుగనేరదు. శరీరమునకు వెలుపలనెటనో ఆత్మమనస్సన్నికర్షము వలన కలుగుప్రయత్నము శరీరమును ధరింపజేయ జాలదు కాబట్టి మనస్సు శరీరమునందే యుండు ననుట సిద్ధమేకాని సాధ్యము కాదు. ఇట్లు మనస్సు శరీరము

నుండి వెలుపలకుపోక లోపలనేయుండి సర్వకార్యము నొన రించుచుండుట వలన సాధ్యసమమైన యహేతువనుట తగదని భావము.

"న తదాశుగతిత్వాన్మనసః." ౩. ౨. ౨౯.

మనసః = అంతరింద్రియమైనమనస్సు, ఆశుగతిత్వాత్ = శీఘ్ర గతి గలదగుట వలన, తత్ = శరీరధారణము, న = మనస్సునకు బాహ్యగతియున్నను అనుపపన్నము కాదు.

మనస్సునందు శీఘ్రగతి యంగీకరింపబడుచున్నది. కాబట్టి యది శరీరమునందలి యాత్మతో సన్నికృష్టమై యట శరీరధారణకు తగిన ప్రయత్నము నుద్భవింపజేసి యతిశీఘ్ర ముగా శరీరమునకు వెలుపల విషయము లుండు ప్రదేశము నకుబోయి యట సంస్కారయుతమగు నాత్మతో సన్ని కృష్టమై జ్ఞాన మొదవజేయును. లేక ముందు బాహ్యజ్ఞాన మును కలిగించి వచ్చి యనంతరమున నతిశీఘ్రమున నాత్మతో సన్నికృష్టమై శరీరధారక ప్రయత్నము నుద్భవింపజేయ వచ్చును. అందువలన నానాస్మృతు లొకేక్షణమునగానీ, శరీర పతనముగానీ కలుగవని మరల శంకించుచున్నాడు.

"న స్మరణకాలానియమాత్" ౩. ౨. ౩౦.

స్మరణకాలానియమాత్ = స్మరణకాలమున నియమము లేకుండుట వలన, న = పైజెప్పినవాదము సరికాదు.

స్మరణలో స్వల్పకాలమే పట్టునను నియమము లేదు. ఒక విషయము శీఘ్రముగా స్మరింపనగును. మఱియొక విష యమును స్మరించుటలో దీర్ఘకాలమును పట్టును. కాల నియ

మము లేనందువలన కొండొక విషయమును స్మరించుటలో దీర్ఘకాలము వ్యయించినపుడు శరీరధారణ కలుగుటెట్లు పొసగును? కాబట్టి మనస్సు శీఘ్రగతి కలదగుటచే బాహ్యవిషయమును స్మరింపజేయుటకై యటకేగినను వెంటనే శరీరమున ప్రవిష్టమై యాత్మతోకూడి శరీరధారక ప్రయత్నమును కలుగజేయుననుట యుక్తివిరుద్ధము.

యుక్తియుక్తము గానున్నను కొండొక విషయము నిమిత్తవశమున నట్లు జరుగునని యంగీకరించిన దోషమేమన, నిమిత్తమును దురూహ్యమే యనుచున్నాడు.

"ఆత్మప్రేరణయదృచ్ఛాజ్ఞతాభిశ్చ న సంయోగవిశేషః"
3.౨.3౧.

(ఆత్మప్రేరణమ్= జీవాత్మప్రేరణము. యదృచ్ఛా = ఆకస్మికత, జ్ఞతా=జ్ఞానము) ఆత్మప్రేరణ యదృచ్ఛాజ్ఞతాభిశ్చ = ఆత్మప్రేరణాదులచేతను, సంయోగవిశేషః=జ్ఞాన సమవేతమగు నాత్మతో మనస్సునకు సంయోగము, న=కలుగదు.

శరీరమునకు వెలుపల విషయములుండు తావులందున్న జ్ఞానసమవేతమగు నాత్మతో సంయుక్తమగుటకై మనస్సు శరీరమునుండి బయటికి పోవలయుననిన తగిన కారణములు మూడు కల్పింపనగును. ఒకటి యాత్మప్రేరణము. రెండవది యాకస్మికత. మూడవది (మనస్సునందు) జ్ఞానము. ఈ మూటిలో నెక్కటియు నిమిత్తముగా నంగీకరింపవలను పడదు. కొండొకవిషయమును స్మరింపగా స్మరణహేతువైన సంస్కారము ఆత్మయందేప్రదేశముననున్నదో తెలిసికొనిన

గదా యాత్మ మనస్సు నటకు వెళ్ళ ప్రేరించును? ప్రేరణ సమయమున విషయవిజ్ఞాన ముండుటచే మనస్సును ప్రేరించు టేల? అది శరీరమును విడిచి యటకేగనేల? వ్యర్థమేకదా? కాబట్టి యాత్మప్రేరణము నిమిత్తమననొప్పదు. ఆకస్మిక ప్రవృత్తి యసంభవమగుటచే నదియు పొసగదు. మనస్సు నందు జ్ఞానము లేకపోవుటచే తెలియకయే విషయదేశమునం దాత్మతో సన్నికృష్టమగుటకై మనస్సు శరీరమునుండి బయ టికి వెళ్ళ ప్రవర్తించుననుటయు నసంగతము. జ్ఞానములేని ప్రవృత్తి యెన్నడును కలుగనేరదు. కాబట్టి యాత్మప్రేరణాది నిమిత్తముల వశమున నైనను మనస్సు బహిఃప్రదేశమున కేగి యాత్మతో సన్నికృష్టమై క్రమస్మృతిని కలిగించునని యంగీ కరింప వలనుపడదని సూత్రాభిప్రాయము.

అన్యత్ర వ్యాసక్త మనస్కుడై యున్న వ్యక్తికి పాద తలమున కంటకము ప్రవేశింప బాధయెట్లు వెరుగుచున్నదన,

"వ్యాసక్తమనసః పాదవ్యథనేన సంయోగ విశేషేణ సమానమ్." ౩.౨.౩౨.

వ్యాసక్తమనసః = కొండొక దృశ్యమున మనస్సు లగ్నమైయు న్నపుడావ్యక్తి, పాదవ్యథనేన = కంటకాదులచే పాదతలము పీడింప బడినపు డా స్థలమున నాత్మతోగలుగు మనఃసన్నికర్ష విశేషము, సంయోగ విశేషేణ=శరీరమునకు వెలుపల విషయదేశముననున్న యాత్మతో నేర్పడు సంయోగ విశేషముతో, సమానమ్= తుల్యమే.

శరీరమునకు వెలుపల విషయప్రదేశమునందున్న యాత్మ ప్రదేశముతో మనస్సునకు సంసర్గము కలుగుటెట్లు పొసగదో

యట్లే శరీరమునను భిన్నభిన్న ప్రదేశములలో నాత్మతో సన్నికర్షము నుపపన్నము కాదని సూత్రాభిప్రాయము. కాబట్టి మనస్సు అణుపరిమాణము కలదియనియు, క్రమముగా నాయాప్రదేశములలో నాత్మతో సన్నికృష్టమై క్రమికజ్ఞానమును కలిగింప సాధనమగుననియు చెప్పుట ప్రమాణసిద్ధము కాదని తెలియు చున్నది. కాగా వైదికుల మతమున ఆత్మ యణువు. మనస్సు మధ్యమపరిమాణము కలది.

బుద్ధి యాత్మ గుణమైన నొకే క్షణమున నానాస్మృతి బుద్ధు లేల కలుగవో సిద్ధాంత పక్షమున సమాధాన మేమనః

"ప్రణిధాన లింగాది జ్ఞానానా మయుగపద్భావాద్
యుగప దస్మరణమ్" ౩.౨ ౩౩.

ప్రణిధాన లింగాదివిజ్ఞానానామ్= ప్రణిధానము, మున్నగు జ్ఞానములు, అయుగపద్భావాత్ = ఒకేక్షణమున కలుగనందువలన, యుగపదస్మరణమ్ = ఒకేక్షణమున ననేక స్మృతులు కలుగవు.

ప్రణిధాన లింగాదు లీయాహ్నికముననే నలువది రెండవ సూత్రమున వర్ణింపబడును. అందు వాని వివరణము చూడవచ్చును.

ఆత్మ మనఃసన్నికర్షము, సంస్కారము స్మృతికెట్లు కారణమో, యట్లే ప్రణిధానాదులును సంస్కారములనుద్బోధింపజేయుచు స్మృతికి కారణము లగుచున్నవి. ఆత్మ మనఃసన్నికర్షము, సంస్కారములు నుండినను సంస్కారముల నుద్బోధించునట్టి ప్రణిధానాదు లొకేక్షణమున కలుగక క్రమ

ముగా కలుగుటచే స్మృతులును క్రమముగానే కలుగును. ఒకేక్షణమున నన్నియు కలుగనేరవు.

ఇచ్ఛాది గుణములు బుద్ధిసమానాధికరణములుగా తోచుచుండుటచేత ఇచ్ఛాదులు ఆత్మగుణము లైననేకదా బుద్ధి యాత్మగుణము కాగలదన,

"జ్ఞస్యేచ్ఛా ద్వేష నిమిత్తత్వాదారంభ నివృత్త్యోః"
3.౨.3౪.

ఆరంభనివృత్త్యోః = ఆత్మప్రవృత్తి నివృత్తులు, ఇచ్ఛాద్వేష నిమిత్తత్వాత్ = ఇచ్ఛాద్వేష నిమిత్తకము లగుటవలన, జ్ఞస్య = ఇచ్ఛాదులు ఆత్మగుణములే.

ప్రాణి తనకు సుఖముకలిగించు వస్తువును కావలయుననికోరును. దుఃఖమును కలిగించు దానిని ద్వేషించును. తానుకోరిన దానిని సంపాదించుటకు ప్రవర్తించును. ద్వేషించుదాని నుండి నివృత్తిజెందును. ఇట్లు ప్రవృత్తి నివృత్తులకు కారణములు ఇచ్ఛాద్వేషములగుట లోకవిదితము. హితమును సంపాదించుటకు, అహితమును విడుచుటకు కలుగు ప్రవృత్తి నివృత్తి రూపమగు క్రియ అజ్ఞాతములు, నన్యజ్ఞాతములు నగువస్తువుల విషయమున కలుగనేరదు. కాబట్టి యెవనికి వస్తుజ్ఞానము కలుగుచున్నదో వానికే ప్రవృత్తి నివృత్తులును కలుగుచున్నవి. అందువలన జ్ఞానమును ఆత్మగుణమే యనుట సిద్ధము. ఇచ్ఛాద్వేషములు జ్ఞానసమానాధికరణములగుటంజేసి యవియు నాత్మ గుణములే.

పూర్వపక్షము:—

"తల్లిఙ్గత్వా దిచ్ఛాద్వేషయోః పార్థివాద్యేష్వ ప్రతిషేధః."
3.2.39.

తల్లిఙ్గత్వాత్ = ప్రవృత్తి నివృత్తులు లింగముగా గలవగుట వలన, ఇచ్ఛాద్వేషయోః = ఇచ్ఛాద్వేషములకు, పార్థివాద్యేషు = శరీరేంద్రియాదులందు, అప్రతిషేధః = ప్రతిషేధములేదు.

ఇచ్ఛ ప్రవృత్తి లింగకము. ద్వేషము నివృత్తి లింగకము. ప్రవృత్తిని చూచి కోరిక (ఇచ్ఛ)ను, నివృత్తిని జూచి ద్వేషమును ఊహింతుము. కాబట్టి ఇచ్ఛాద్వేషములకు ప్రవృత్తి నివృత్తులు లింగములు ధూమమున్నయెడ వహ్ని యున్నట్లు, ప్రవృత్తి నివృత్తు లెటనుండునో యిచ్ఛాద్వేషము లట నుండవలయును. ప్రవృత్తి నివృత్తులు శరీరేంద్రియములలో చూడబడుచున్నవి. కాబట్టి ఇచ్ఛాద్వేషములును పార్థివము లయిన శరీరేంద్రియము లందుండి వానివే యన నెప్పును. ఇట్లే జ్ఞానమును శరీరేంద్రియాదుల గుణమని యంగీకరించిన సామానాధికరణ్యమును కుదురగలదు. కాగా జ్ఞానేచ్ఛాద్వేషాదులు శరీరాదుల గుణములే కాని యాత్మ గుణములు కానేరవు.

ఉత్తరపక్షము:—

"పరశ్వాదిష్వారంభ నివృత్తి దర్శనాత్" 3.2.36.

పరశ్వాదిషు = గొడ్డలి మున్నగువానియందు, ఆరంభ నివృత్తి దర్శనాత్ = ప్రవృత్తి నివృత్తులు చూడబడుచుండుటవలన,

ప్రవృత్తి నివృత్తు లున్నచోట నిచ్ఛాద్వేషాదు లుండు ననిన, ఛేదనాదులకు సాధనములైన గొడ్డలి మున్నగు వాని

యందు ప్రవృత్తి నివృత్తులు కాననగుచున్నవి. కాబట్టి, వాని యం దిచ్ఛాద్వేషాదు లంగీకరింపవలసి వచ్చును. గొడ్డలి యందు కలుగు ప్రవృత్తి నివృత్తులకు కారణము లన్యము లందుమేని, శరీరాదులందు కలుగు ప్రవృత్తి నివృత్తులకు నిమిత్తము లితరములే యనవచ్చును. ప్రవృత్తి నివృత్తులు గొడ్డలి యందు కనబడినను ఇచ్ఛాద్వేషాదులు దాని గుణములు కానట్లు శరీరేంద్రియాదులందు కనబడు ప్రవృత్తి నివృత్తులకు నిమిత్తములైన ఇచ్ఛాద్వేషాదులు శరీరాదుల గుణములుకాక యాత్మగుణములే యగును.

"నియమానియమాతు తద్విశేషకౌ." ౩.౨.౩౮.

నియమానియమౌతు = ప్రవృత్తినివృత్తులు కలుగుటలోగల నియమానియమములు, తద్విశేషకౌ = గొడ్డలికి శరీరాదులకుగల భేదమును నిరూపించును.

ఆత్మ, శరీరాదుల కధిష్ఠాత. కాబట్టి, నియమముగా శరీరాదులందు ప్రవృత్తినివృత్తులు కలుగుచుండును. గొడ్డలి యందట్లు నియమముగా ప్రవృత్తినివృత్తులు కలుగవు. అందు వలన శరీరాదులకు, గొడ్డలికి భేదము లేకపోదు.

ఇచ్ఛాదులు మనోగుణము లేలకావన,

"యథోక్తహేతుత్వాత్ పారతంత్ర్యా దకృతాభ్యాగమాచ్చ న మనసః." ౩.౨.౩౯.

యథోక్తహేతుత్వాత్ = ఆత్మ ప్రవృత్తి నివృత్తు లిచ్ఛాద్వేష పూర్వకము లగుటవలన, పారతంత్ర్యాత్ = పరాధీన మగుటవలన,

అకృతాభ్యాగమాచ్చ = చేయని కర్మభోగ ప్రసక్తి కలుగును కావునను, ఇచ్ఛాదులు, న మనసః = మనోగుణములు కావు

ఇచ్ఛాద్వేషములు మనోగుణములగుచో జ్ఞానమును దానిగుణమే యగును. జ్ఞానమున్నగాని యిచ్ఛాద్వేషములు కలుగవు. ఇచ్ఛాద్వేషములు కలిగినగాని ప్రవృత్తి నివృత్తులు కలుగవు. జ్ఞానము మనోగుణమని పూర్వము చెప్పి యుండమైతిమి. కాబట్టి యిచ్ఛాద్వేషములును మనోగుణములు కావు. మనస్సు కరణమగుటచే నది పరతంత్రము. గొడ్డలి కరణమగుటచే నితరాధీనమై ప్రవర్తించుట మనము చూచుచున్నాము. మనస్సునందుజ్ఞానము లేకుండుటచే నిచ్ఛాద్వేష నిమిత్తకములగుప్రవృత్తినివృత్తి రూప కర్మల భోగము మనస్సునకు లభించుట యుక్తముకాదు. సుఖదుఃఖానుభవమే భోగ మనబడును ఇచ్ఛాద్వేషములు మనోగుణములని యంగీకరించిన, జ్ఞానముగల యాత్మలో నిచ్ఛాద్వేషములు లేకుండుటవలన తన్నిమిత్తక కర్మ చేయునది యాత్మ కానేరదు. అట్టియెడ కర్మచేయని యాత్మకు భోగము సంభవించును. అందువలన నకృతాభ్యాగమ ప్రసక్తి గలుగును. (అకృతస్య = చేయనికర్మకు, అభ్యాగమః = భోగము) ప్రసక్తి కలిగిన కలుగనిమ్మందువేని, శాస్త్రానుభవములకు విరుద్ధమగును. శాస్త్రమున కర్మచేయువాడు (కర్త) ఫలము ననుభవింపవలయునను నియమము జూచుచున్నాము. 'ఉపాసింపుము. ధ్యానింపుము.' అని శాస్త్రమాదేశించుచున్నది. ఒకడుచేసిన కర్మకు ఫలము మఱియొకనికి

లభించిన నీయాదేశము లెట్లుపొసగును? కాబట్టి జ్ఞానమాత్మ గుణమైనట్లు ఇచ్ఛాద్వేషములు నాత్మగుణములే.

"పరిశేషాద్ యథోక్తహేతూపపత్తేశ్చ" ౩.౨.౩౯.

పరిశేషాత్ = పరిశేషానుమానము వలన, యథోక్త హేతూప పత్తేశ్చ= పూర్వోక్త హేతువుల వలనను, బుద్ధి (జ్ఞానము) ఆత్మగుణమే యగుచున్నది.

శరీరేంద్రియ మనస్సులలో నొక్కదానికిని బుద్ధి గుణము కాజాలదు. ఆత్మ తక్క మిగిలిన ద్రవ్యములకు నది గుణముకాజాలదు. కాబట్టి జ్ఞానము (బుద్ధి) ఆత్మగుణమని సిద్ధమగుచున్నది. ('దర్శన స్పర్శనాభ్యామేకార్థ గ్రహణమ్' ౩.౧.౧.) మున్నగు సూత్రములలో చూపబడిన యుక్తులు నాత్మయందే వర్తించును. శరీరేంద్రియాదుల వర్తింపవు. కాబట్టి బుద్ధి యాత్మగుణమే కాగలదని తెలుచున్నది.

స్మృతి దేనిగుణము? అన.

"స్మరణం త్వాత్మనో జ్ఞస్వాభావ్యాత్" ౩.౨.౪౦.

జ్ఞస్వాభావ్యాత్ = (జ్ఞస్యస్వభావః = జ్ఞస్వభావః, జ్ఞానమ్, తస్యభావః = జ్ఞస్వాభావ్యం = జ్ఞానత్వమ్, తస్మాత్ జ్ఞానత్వాత్) జ్ఞానమగుటవలన, స్మరణంతు = స్మృతియును, ఆత్మనః= ఆత్మగుణమే

'ఎఱిగితిని, ఎఱుగుచున్నాను, ఎఱుగగలను' అను జ్ఞానము ఆత్మకే కలుగుచున్నదనుట మన మెఱుగుదుము. భూతకాలిక విషయజ్ఞానమే. అందువలన నదియు .నాత్మ గుణమే యగునని భావము.

యుగపత్స్మృతి కలుగకుండుటకు గల నిమిత్తాంతరములు ప్రణిధానాదులు కలవని పూర్వసూత్రములం దొకచో చెప్పియుంటిమికదా! అవి యేవియన,

"ప్రణిధాన నిబంధాభ్యాస లింగలక్షణ సాదృశ్య పరిగ్రహాశ్రయాశ్రిత సంబంధానంతర్య వియోగైక కార్యవిరోధాతిశయ ప్రాప్తి వ్యవధాన సుఖ దుఃఖేచ్ఛా ద్వేష భయార్థిత్వ క్రియా రాగ ధర్మాధర్మ నిమిత్తేభ్యః" ౩.౨.౪౧.

ప్రణిధాన.........నిమిత్తేభ్యః = ప్రణిధానాది నిమిత్తములవలన స్మృతి కలుగును.

ప్రణిధానము = స్మరించు నిచ్ఛతో చిత్తము నేకాగ్రము చేయుట.

నిబంధః = అర్థముల నొక గ్రంథమున నుపనిబంధించుట.

అభ్యాసః = ఒక విషయమునకు సంబంధించిన జ్ఞానము నావృత్తి చేయుట.

లింగమ్ = వ్యాప్యము. ధూమము వహ్నికివలె.

లక్షణమ్ = సాంకేతిక చిహ్నము.

సాదృశ్యమ్ = సమానత.

పరిగ్రహః = స్వీకారము.

ఆశ్రయః = అధిష్ఠానము.

ఆశ్రితమ్ = అధిష్ఠేయము.

సంబంధః = సంయోగాది సంబంధము.

ఆనంతర్యమ్ = అవ్యవధానము. నియతక్రమము.

వియోగః = విరహము. శోకము.

ఏకకార్యమ్ = ఒకపని. సమానకార్యము.

విరోధము = విరోధము. అసామానాధికరణ్యము.

అతిశయః = ఆధిక్యము.

ప్రాప్తిః = ప్రాప్తి - లాభము.

వ్యవధానమ్ = వ్యవధాయకము (ఖడ్గకోశమువలె.)
సుఖమ్ = అనుకూలవేదనీయము.
ఇచ్ఛా = ఇది నాకు కలుగుగాక యను నభిలాష.
ద్వేషః = ఇది నా కనిష్టమును కలిగించు నను జ్ఞానముచే జనించు రాగము నడ్డగించు గుణము.
భయమ్ = భీతి.
అర్థిత్వమ్ = యాచన.
క్రియా = కార్యము.
రాగః = రాగము - స్నేహము.
ధర్మః = చేయదగిన విహిత క్రియాజన్యగుణము.
అధర్మః = చేయగూడదని నిషేధింపబడిన క్రియాజన్యగుణము.

ఇవి యన్నియు నొకే క్షణమున కలుగవు. ఇట్టి నిమిత్తములచే నేర్పడు స్మృతులు నొక్కసారి కలుగక క్రమముగనే కలుగును.

ఈ సూత్రమున వర్ణింపబడిన నిమిత్తములే కాక మరి కొన్ని నిమిత్తములున్నను, ఈ ప్రణిధానాదులు తెలిసిన వీని వలె నితరములు నూహింపగలరని సూత్రకారుడు కొన్నిటినే యిట పొందుపరచెనని యెఱుంగవలయును.

బుద్ధి స్థిరమా అస్థిరమా యన,
"కర్మానవస్థాయి గ్రహణాత్" ౩.౨.౪౨.

గ్రహణాత్ = గ్రహణము వలన, కర్మానవస్థాయి = కర్మవలె ననవస్థాయి—యనిత్యము.

కర్మమెట్లు అనవస్థాయి (అనిత్యము) గా గ్రహింపబడుచున్నదో బుద్ధియు ననవస్థాయిగా గ్రహింపబడుచున్నది. కావున నది యనిత్యము. ఇంద్రియార్థ సన్నికర్షము వలన కలి

గిన ఘటబుద్ధి పటబుద్ధికలిగినపు డుండదు. అట్లే పటబుద్ధి ఘటబుద్ధి సమయమున నుండదు. కాబట్టి యది స్థిరము అవస్థాయి కాదని స్పష్టమే. అనవస్థాయిత్వమన క్షణికత్వము. రెండు క్షణములుండి మూడవక్షణమున నశించునని భావము.

పూర్వపక్షము:—

"అవ్యక్తగ్రహణ మనవస్థాయిత్వాత్ విద్యుత్సంపాతే రూపావ్యక్త గ్రహణవత్" ౩.౨.౪౩.

విద్యుత్సంపాతే = మెరుపు మెరసినపుడు, రూపావ్యక్తగ్రహణవత్ = (ఇట రూపమన రూపముగల వస్తువులు) వస్తువులు స్పష్టముగా తెలియబడనట్లు, అనవస్థాయిత్వాత్ = బుద్ధి యనవస్థాయి యగుట వలన, అవ్యక్తగ్రహణమ్ = అస్పష్టముగా వస్తువులు గ్రహింప బడవలయును.

విద్యుత్ప్రకాశ మనవస్థాయి. అందువలన నా ప్రకాశమున వస్తువు లస్పష్టముగా గ్రహింపబడును. అట్లే బుద్ధియు ననవస్థాయి యయినపక్షమున ఘటపటాది వస్తుగ్రహణము (బుద్ధియు) ను నస్పష్టము-అవ్యక్తము కావలయును. అట్లుగాక వ్యక్తముగా వస్తుగ్రహణము కలుగుచున్నందున బుద్ధి యనవస్థాయి కాదు.

ఉత్తరపక్షము:—

"హేతూపాదానాత్ ప్రతిషేద్ధవ్యాభ్యనుజ్ఞా." ౩.౨.౪౪.

హేతూపాదానాత్ = అనవస్థాయిత్వమును హేతువుగా ప్రయోగించుట వలన, ప్రతిషేద్ధవ్యాభ్యనుజ్ఞా = ప్రతిషేధింపదగిన అనవస్థాయిత్వము నంగీకరించినట్లు తెలియుచున్నది.

బుద్ధి యనవస్థాయి యగుటవలన విద్యుత్ప్రకాశమువలె నవ్యక్త గ్రహణము కలిగించుననని చెప్పుటలో బుద్ధి యనవస్థాయి యని యంగీకరించినట్లు తెలియుచున్నది. లేకున్న ననవస్థాయిత్వమును హేతువుగా ప్రయోగించుట పొసగదు. కాబట్టి బుద్ధి యనవస్థాయి యనుట నిర్వివాద విషయము.

"ప్రదీపార్చిః సంతత్యభివ్యక్త గ్రహణవత్ తద్గ్రహణమ్." ౩.౨.౪౫.

ప్రదీపార్చిః = దీపకాంతి, సంతత్యభివ్యక్త గ్రహణవత్ = అనవస్థాయి యైనను విషయము వ్యక్తముగా గ్రహింపబడినట్లు, బుద్ధి యనవస్థాయి యైనను, తద్గ్రహణమ్ = విషయము వ్యక్తముగా గ్రహింపబడినట్లు తెలియదగునని యర్థము.

మఱియు, ప్రకాశ మనవస్థాయి యైనంతమాత్రమున విషయ మస్పష్టముగా గ్రహింపబడవలయు నను నియమము లేదు. దీపకాంతి యనవస్థాయి యని యెల్లరు నంగీకరింతురు. అయినను విషయములు — ఘటపటాదులు — వ్యక్తముగానే గ్రహింపబడును. అట్లే బుద్ధియు ననవస్థాయి యైనప్పటికి వస్తువులు స్పష్టముగా గ్రహింప నగు ననుట కెట్టియాటంకమును లేదు. కాబట్టి బుద్ధి యనవస్థాయి యనియే భావము.

(బుద్ధిగత విశేషపరీక్ష)

"ద్రవ్యే స్వగుణ పరగుణోపలబ్ధేః సంశయః." ౩.౨.౪౬.

ద్రవ్యే = ఒకానొక ద్రవ్యమున, స్వగుణ పరగుణోపలబ్ధేః = స్వపరగుణములు గ్రహింపబడుట వలన, సంశయః = బుద్ధి స్వగుణమా? లేక పరగుణమా? యని సందేహము కలుగును.

ఒకద్రవ్యమున నా ద్రవ్యగుణములే కాక ఇతర ద్రవ్య గుణములును చూడబడుచున్నవి. జలమున అభాస్వర శుక్ల రూపము స్వగుణము. ఉష్ణము తేజోగుణము ఈ రెండు గుణములు జలముననప్పుడప్పుడు చూడబడును. అట్టియెడ ఉష్ణము జలగుణమా? లేక తేజోగుణమా? యని సందేహము వ్రుడమును అట్లే (గౌరోఽహంజానామి-స్థూలోఽహంజానామి.) తెల్లవాడను, నేనెఱుగుచున్నాను. స్థూలుఁడను, నేనెఱుగుచున్నాను, అని ప్రయోగింతుము. అట్టియెడ బుద్ధి (ఎఱుక) స్వగుణమా? పరగుణమా? యని సంశయము కలుగును. ఇట స్వశబ్దము శరీరపరము. ఎఱుపు, స్థౌల్యము ననునవి శరీర గుణములే కదా! పరశబ్దము ఆత్మపరము. కాబట్టి స్వగుణము పూర్వపక్షము. పరగుణము సిద్ధాంతమని వివేకము.

"యావద్ద్రవ్యభావిత్వాద్ రూపాదీనామ్" ౩.౨.౪౭.

రూపాదీనామ్=రూపాదిగుణములు, యావద్ద్రవ్యభావిత్వాత్= స్వాశ్రయ ద్రవ్యమున్నంతకాలముండునట్టి స్వభావము కలవగుటవలన, బుద్ధి యాత్మగుణమే.

ద్రవ్యములందలి స్వగుణములు ద్రవ్య మున్నంతకాలమందుండును. జలమున నభాస్వర శుక్లము జలమున్నంత కాలము నందు గోచరము. ఉష్ణత యట్లుగాక తేజఃసంయోగ మున్నంతకాలముండి యటుపై జలమున కనిపింపదు. అట్లే బుద్ధియు శరీరగుణ మగునెడల శరీరమున్నంతకాల ముండును. అట్లు లోకమున మనము చూచుటలేదు. కాబట్టి బుద్ధి శరీర గుణము కాదని తెలియనగును.

పూర్వపక్షముః—

"న పాకజగుణాంతరోత్పత్తేః" 3. ౨.౪౯.

పాకజగుణాంతరోత్పత్తేః = (పాక మన విలక్షణతేజః సంయోగము) తేజఃసంయోగముచే గుణాంతరము ఉత్పన్నము లగుచుండుట వలన, న = రూపాది గుణములు స్వాశ్రయ ద్రవ్య మున్నంత కాల ముండు ననుట తగదు.

ఒక ద్రవ్యమున నున్న రూపాదులను మార్చి మరియొక విధమగు రూపాదుల నుత్పన్నము చేయునట్టి విలక్షణ తేజః సంయోగము పాకమనబడును. దానివలన కలుగు గుణములు పాకజము లనబడును. పాకము వలన ద్రవ్యమునందున్న శ్యామాది రూపములు నశించి రక్తాది రూపములు కలుగు చుండును. ఆకుపచ్చని మామిడికాయను గడ్డిలో కొంతతడ వుంచిన నది పచ్చని రంగుగలది యగును. దీనినిబట్టి రూపాది గుణములు స్వాశ్రయ ద్రవ్యమున్నంత కాల ముండునవి (యావద్ద్రవ్యభావి) యని చెప్పజనదు. కాబట్టి బుద్ధి యనవస్థాయి యైనను శరీరగుణ మగుటలో దోషము లేదు. అందువలన నది శరీర గుణమే కాని యాత్మగుణము కాజాలదు.

ఉత్తరపక్షముః—

"ప్రతిద్వంద్విసిద్ధేః పాకజానా మప్రతిషేధః" 3.౨.౫౦.

పాకజానామ్ = పాకజగుణములు, ప్రతిద్వంద్విసిద్ధేః = పూర్వమున్న గుణములకు బదులుగా నుత్పన్నము లగుటవలన, అప్రతిషేధః = రూపాదులు యావద్ద్రవ్య భావులు కావనుట తగదు.

పాకమువలన జనించు గుణము పూర్వగుణములకు ప్రతిద్వంద్విగా నుత్పన్నమగుచు. రూపమునకు రూపము, రసమునకు రసము, గంధమునకు గంధము, స్పర్శకు స్పర్శము నుత్పన్నమగును. ఇట్లుత్పన్నములయి స్వాశ్రయ ద్రవ్యమున్నంతకాల మవి యుండును కాబట్టి రూపద్రవ్యభావులు కావనుట పొసగదు.

ద్రవ్యమున్నంతవరకు రూపము లుండునేకాని యవి పూర్తిగ నెన్నడు నశింపవు. బుద్ధి యట్లుగాక క్షణస్థాయియై యది నశించును. శరీర మున్నంతకాలము బుద్ధి యుండదు. కాబట్టి బుద్ధి శరీరగుణము కానేరదని భావము.

"శరీర వ్యాపిత్వాత్" ౩.౨.౫౧.

శరీర వ్యాపిత్వాత్ = రూపాదిగుణములు శరీరమంతటను వ్యాపించి యుండుటవలన, బుద్ధి శరీరగుణము కాదు.

రూపాదులు శరీరగుణములు. అందువలన శరీరమంతట నవి వ్యాపించి యుండును. బుద్ధియు నట్లు శరీరగుణమగుచో నదియు శరీరమంతట వ్యాపించి యుండవలసి యుండును. అట్లుండకపోవుటచే బుద్ధి శరీరగుణము కాదనుట స్పష్టమే.

పూర్వపక్షము:—

"న కేశనఖాదిష్వనుపలబ్ధేః" ౩.౨.౫౧.

కేశనఖాదిష్వనుపలబ్ధేః = రూపాదులు, వెండ్రుకలు, గోళ్లు మున్నగు వానియందు లభింపక పోవుటవలన, న = శరీరమునందంతటను వ్యాపించియుండవు.

రూపాదులు శరీర వ్యాపిత్వము కలవైనచో శరీరము నందంతటను నుండవలయును కదా! శరీరమున నగపడు రూప రసగంధాదు లాశరీరమునకు సంబంధించిన కేశనఖాదులందు కనపడ వేల? శరీరము నందొకయెడ లేనపు డవి శరీర వ్యాపకము లెట్లుకాగలవు? కాజాలవు. కాబట్టి రూపాదులు శరీర వ్యాపు లనుట తగదని తేలుచున్నది.

ఉత్తరపక్షము:—

"త్వక్పర్యంతత్వాచ్ఛరీరస్య, కేశనఖాదిష్వప్రసంగః"
3.౨.౭౨.

శరీరస్య = శరీరము, త్వక్పర్యంతత్వాత్ = త్వక్కువరకే యగుట వలన, కేశ నఖాదిషు = కేశ నఖాదులందు, అప్రసంగః = శరీరమునకు సంబంధించిన రూపాదులు కేశాదులందు లేవనుట తగదు.

త్వగింద్రియ సంబంధమున్నంతవరకే శరీర మనబడును. శరీరమన నింద్రియాశ్రయమేకదా! కేశనఖాదులతో త్వగింద్రియ సంబంధములేదు. అందువలననే హస్తపాదాదులు ఖండింపబడిన బాధ కలుగునట్లు కేశ నఖ ఖండనమున బాధ కలుగదు. కాబట్టి త్వగింద్రియముతో సంబంధములేని కేశ నఖములు శరీరము కావని భావము. శరీరము కాని తావున రూపాదులు వ్యాపకము కానందున నవి శరీర వ్యాపకములు కావనుట యుక్తముకాదు.

"శరీర గుణవైధర్మ్యాత్" 3.౨.౭3.

శరీర గుణవైధర్మ్యాత్ = శరీరగుణ ధర్మముకంటె విరుద్ధ ధర్మము కలదగుటవలన బుద్ధి శరీరగుణము కాదు.

మఱియు శరీర గుణములయిన రూపాదులు బాహ్యేంద్రియములచే గ్రహింపదగు ధర్మముకలవిగా చూచుచున్నాము. బుద్ధి శరీరగుణ మగునెడల నదియు బాహ్యేంద్రియముచే గ్రహింపబడవలయును. బుద్ధి రూపాదులవలె బాహ్యేంద్రియముచే గ్రహింపబడక మనస్సుచే గ్రహింపబడుటచే నది శరీరగుణము కాదని యభిప్రాయము.

పూర్వపక్షము:—

"న రూపాదీనామితరేతర వైధర్మ్యాత్" ౩.౨.౫౪.

రూపాదీనాం = రూపాదులు, ఇతరేతర వైధర్మ్యాత్ = పరస్పర విరుద్ధగుణము కలవగుటవలన, న = శరీరగుణములకంటె భిన్న ధర్మము కలిగియుండుట శరీరగుణము కాదనుటను సాధింపదు.

రూపాది గుణములన్నియు నొకే యింద్రియముచే గ్రహింపబడక భిన్న భిన్నేంద్రియములచే గ్రహింపబడును. రూపము చక్షువుచే, స్పర్శము త్వక్కుచే, గంధము నాసికచే. అందువలన నివి పరస్పర విరుద్ధధర్మము కలవే. అంత మాత్రమున నివి శరీరగుణములు కాకపోయినవా? పోవు. బుద్ధియు భిన్నేంద్రియ గ్రాహ్యమైనంతమాత్రమున శరీర గుణమెట్లు కాకుండును?

ఉత్తరపక్షము:—

"ఐంద్రియకత్వాద్రూపాదీనామప్రతిషేధః" ౩.౨.౫౫.

రూపాదీనాం = శరీరగుణములయిన రూపాదులు, ఐంద్రియకత్వాత్ = బాహ్యేంద్రియ గ్రాహ్యములగుటవలన, అప్రతిషేధః = విరుద్ధధర్మము సాధ్యసాధకము కాదనుట చెల్లదు.

రూపాదులు విభిన్నేంద్రియ గ్రాహ్యము లయినను బాహ్యేంద్రియ గ్రాహ్యత్వమను సామాన్యధర్మము గలవగుటలో సందియము లేదు. బుద్ధి బాహ్యేంద్రియములలో నొక్కదానిచేతను గ్రహింపబడక రూపాదులకంటె విరుద్ధమగుచున్నది. కాబట్టి యది శరీర గుణముకాదు. ఆత్మ గుణమే.

(మనః పరీక్ష)

"జ్ఞానా యాగపద్యాదేకం మనః" ౩.౨.౫౬.

జ్ఞానాయోగపద్యాత్ = ఇంద్రియార్థ సన్నికర్షము లున్నను యుగపద నేక జ్ఞానము లుదయింపమి, మనః = మనస్సనెడి యంతరింద్రియము, ఏకం = ఒక్కటే

ఆత్మచే నధిష్ఠితమయిన మనస్సు ఏయింద్రియముతో సంయుక్తమగునో యా యింద్రియార్థమునకు సంబంధించిన జ్ఞానము కలుగును. మఱియొక యింద్రియమునకు సంబంధించిన జ్ఞానము కలుగదు. అట్టి మనస్సులు శరీరమునం దనేకము లయినచో ఇంద్రియము లన్నింటితో నన్ని మనస్సులు సంయుక్తములై యనేకార్థ విషయక జ్ఞానమొకే క్షణమున కలుగును. అనేకేంద్రియములు స్వస్వవిషయములలో సన్నికృష్టములై యున్నను ఒక్క విషయజ్ఞానమే కలుగుటవలన నొక్కొక్క శరీరమున నొక్కొక్క మనస్సే యున్నదని తెలియుచున్నది.

పూర్వపక్షము:—

"న యుగప దనేకక్రియోపలబ్ధేః" ౩.౨.౫౭.

యుగపత్ = ఒకే క్షణమున, అనేక క్రియోపలబ్ధేః = అనేక క్రియల జ్ఞానములు కలుగుటచే,న,= కాదు.

ఒక డేదేని వస్తువు భక్షించునపుడు దానిని చేతితో పట్టుకొని నోటియందుంచుకొని భక్షించును. అట్టియెడ నతనికి చాక్షుష రాసన ఘ్రాణజ స్పార్శన ప్రత్యక్షము లొకే మాటు కలుగును. ఒక పదార్థమును భుజించునపు డతడు దానిని కంటితో చూడడనిగాని, నాసికతో దాని గంధము నాఘ్రాణించడని గానీ, చేతితో స్పృశింపడనిగానీ యనగలమా? కాబట్టి మనస్సు శరీరము నందొక్కటే యగునెడల నిన్ని జ్ఞానములు ఒక్కసారిగ నెట్లు గలుగును? కలుగవు. అందువలన నొక్కొక్క శరీరమున మనస్సు ఒక్కటి కాక యనేకము లున్నవని యంగీకరింపవలయును.

ఉత్తరపక్షము:—

“అలాత చక్రదర్శనవత్తదుపలబ్ధి రాశు సంచారాత్”
3.౨.౫౮.

అలాతచక్రదర్శనవత్ = కొఱవిని త్వరగా త్రిప్పిన నది చక్రము వలె కనబడును, దానివలె, ఆశు సంచారాత్ = జ్ఞానమును కలిగించు సంబంధముతో కూడు మనస్సు ఆ యా యింద్రియ ప్రదేశముల కతివేగముగ సంచరించుటవలన, తదుపలబ్ధిః = ఆ యా జ్ఞానము లుదయించును.

కొఱవి తిరుగునపుడు శీఘ్రగమనమువలన చక్రమువలె ప్రకాశమంతట నగుపడునట్లు ఒకపదార్థమును భక్షించునపుడు రాసన, చాక్షుష, ఘ్రాణజ, స్పార్శన జ్ఞానములు క్రమముగా కలిగినను నతివేగముగా మనః సంబంధ మన్ని యింద్రియము

లతో నేర్పడుటచే వేగదోషము వలన క్రమము గ్రహింప బడక యొకేక్షణమున జ్ఞానము లుదయించినట్లు గోచరించును. అయినను ఇది భ్రమము. వాస్తవమున నొకదానితరువాత మఱియొక జ్ఞానమే కలుగును. కాబట్టి శరీరమున మనస్సొక్కటియే యని భావము.

(మనః పరిమాణము)

"యథోక్తహేతుత్వాచ్చాణు" ౩. ౨. ౬౧.

యథోక్తహేతుత్వాత్ చ = పూర్వోక్త (జ్ఞానాఽయౌగపద్య) హేతువుచే మనస్సు, అణు = చిన్నది - మధ్యమ పరిమాణము కలది.

క్రమిక జ్ఞానమువలన మనస్సు ఒక్కటే యని యెట్లు తెలిసినదో అట్లే యది మధ్యమ పరిమాణముకలది యనియు తెలియును. సూత్రమునందలి యణు శబ్దము అల్ప పరిమాణమునే బోధించునుకాని పరమాణు పరిమాణమును గ్రహింప జేయదు. మన్సు పరమాణు పరిమాణము కలదగునెడల అతీంద్రియమగును. అందువలన తదాశ్రిత జ్ఞానములు నతీంద్రియములగును. అట్టియెడ జ్ఞానాయౌగపద్యమును హేతువుగా గ్రహింపవలనుపడదు. సామాన్యముగానూ, విశేషముగానూ ప్రత్యక్షముగాని విషయము హేతువుగా ప్రయోగింపబడదు. జ్ఞాన మాత్మాశ్రితమగుటచేమనస్సతీంద్రియమయిన నష్టమేమి అనరాదు. ఆత్మ నిర్వికారమగుటచే కేవలాత్మ జ్ఞానాది గుణముల కాశ్రయము కాదు. మనస్సు జడమగుటచే కేవల మనస్సును ఆశ్రయము కాదు. కాబట్టి మనో విశిష్టమగు నాత్మయే జ్ఞానాదుల కాశ్రయమనవలయును. విశిష్టమునందలి

ధర్మములు విశేషణమునందు సంగీకరింపబడుటవలన జ్ఞానాదులకు మన స్సాశ్రయము కాగలదు. కాబట్టి మనస్సు పరమాణు పరిమాణము కలదని యంగీకరించిన తదాశ్రిత జ్ఞానాదులు ప్రత్యక్షములు కావలసివచ్చును. అందువలన అణు పన మధ్యమ పరిమాణ మనియే చెప్పవలయును. మధ్యమ పరిమాణము గలదగుచో మనస్సు సర్వేంద్రియములతో యుగపత్సంబద్ధమై సర్వజ్ఞానములు నొకే క్షణమున నేర్పడవలసియుండు ననరాదు. సర్వేంద్రియ సన్నికర్షమున్నను జ్ఞాన ప్రయోజక సంబంధము కలుగనంతవరకు జ్ఞాన ముత్పన్నము కానేరదని పూర్వమే వర్ణించి యుంటిమి. అందువలన దోష మావంతయును లేదని భావము.

(మనస్సు జన్యము)

"పూర్వకృత ఫలానుబంధా త్తదుత్పత్తిః" 3.2.60.

పూర్వకృత ఫలానుబంధాత్ = పూర్వసర్గమునందు చేయబడిన మనోవాక్కాయకర్మల ఫలసంబంధమువలన, సూక్ష్మభూతముల నుండి, తదుత్పత్తిః = మనస్సుజనించును.

ప్రాకృతిక వస్తువులన్నియు ప్రళయవేళ ప్రకృతిలో లీనమగును. అప్రాకృతికములే వేరుగా నుండును. ప్రకృతి, పురుషుడు, ఈశ్వరుడు నను నీమూటికంటె నితర నిత్యము లంగీకరింపబడక పోవుటవలన మనస్సు ప్రాకృతికమగుట నిస్సంశయము. ప్రకృతియందు లీనమై ప్రకృతిసామ్యమును బొందిన మనస్సు కారణరహితముగా మరల సర్గారంభమున సూక్ష్మభూతముల నుండి జనింపనేరదు. ఒకవేళ జనించినను

నెకేవిధ మనస్సులు జనించును. కాని ప్రతిజీవికి భిన్నభిన్న ధర్మయుక్తమగు మనస్సు లభించుట జూచుచున్నాము. కాబట్టి కర్మవైచిత్ర్యము వలన మనోవైచిత్ర్య మేర్పడునని యంగీకరింపవలయును. అందువలన పూర్వసర్గమున జేసిన శుభాశుభకర్మజన్యమగు నదృష్ట సహాకారమున భూతసూక్ష్మములనుండి మనస్సు జనించుచున్నది.

"భూతేభ్యో మూర్త్యుపాదానవత్తదుపాదానమ్"
3. ౨.౬౧

భూతేభ్యః = అదృష్టసహాకృతములైన భూతములనుండి, మూర్త్యుపాదానవత్ = శరీరమేర్పడినట్లు, తదుపాదానమ్ = మనస్సుకలుగును.

పంచభూతములనుండి శరీర ముత్పన్నమైనట్లు సూక్ష్మభూతములనుండి మనస్సు జనించునని భావము.

పూర్వపక్షము:—

"న సాధ్యసమత్వాత్" 3.౨.౬౨.

సాధ్యసమత్వాత్ = సందిగ్ధ సాధ్యముతో సమానమగుటవలన, న = అదృష్ట సహాకృత భూతములనుండి శరీర ముత్పన్నమైన ట్లను నుదాహరణము యుక్తముకాదు.

అనిశ్చిత విషయమును ఉదాహరణముగా నీయరాదు. మాతా పితరుల శరీరములనుండి యేర్పడు శుక్ల శోణితముల వలన శరీరోత్పత్తి కలుగుచుండ, వానిని విడిచి అదృష్ట సహాకృత భూతములనుండి శరీర మేర్పడుచున్నదను విషయము సిద్ధపరుపవలసియున్నది. కాబట్టి సాధ్య సమమై యుదాహరింప నయోగ్యమగుచున్నదని భావము.

ఉత్తరపక్షము:—

"నోత్పత్తి నిమిత్తత్వాత్ మాతా పిత్రోః" ౩.౨.౬౩.

మాతాపిత్రోః = మాతాపితరులకు సంబంధించిన శుక్ల శోణిత ములును అదృష్ట సహకృతములై, నిమిత్తత్వాత్ = నిమిత్తమగుటవలన, న = సాధ్యసమముగుటచే నుదాహరణము కాదనుట తగదు.

కేవల శుక్లశోణితములు శరీరమున కుపాదానము కాక యదృష్ట సహకృత శుక్ల శోణితములు కారణములుగా నంగీక రింపుటవలన, అదృష్ట సహకృత భూతములు శరీరోత్పత్తికి ఉపాదానకారణ మనుట సిద్ధ విషయమే; సాధ్యము కాదు. కాబట్టి యుదాహరణమున దోషము లేదని భావము.

"తథాహారస్య" ౩.౨.౬౪.

తథా = శుక్ల శోణితములు శరీరమున కుపాదానమైనట్లు, ఆహా రస్య = తల్లితిను నాహారమును కారణమగును.

గర్భ ధారణానంతరము తల్లి తిను పదార్థములన్నియు క్రమముగా గర్భపోషకమగుట నందరెరిగిన విషయమే. కాబట్టి శుక్ల శోణితములే కాక మాతృభుక్తాహారమును శరీ రోత్పత్తికి కారణమగుచున్నదని భావము.

అదృష్ట సహకృత శుక్లశోణితములే కారణమననేల?

"ప్రాప్తౌచానియమాత్" ౩.౨.౬౫.

ప్రాప్తౌచ = శుక్లశోణితములు గర్భాశయమున చేరినను, అనియ మాత్ = శరీరోత్పత్తి కలుగు నియమము లేనందున.

కొందఱు దంపతులు ప్రయత్న పూర్వకముగా ప్రతి రాత్రి గర్భాశయమున శుక్లశోణితముల చేర్చుచుందురు. కాని

సంతానోత్పత్తి కలుగదు. కేవల శుక్లశోణితములు శరీరోత్పత్తికి కారణమగునేని యిట్టియెడ గర్భధారణ కలుగవలసియుండును. అట్లు కాకపోవుటచే అదృష్ట సహకార మపేక్షించుచున్నట్లు తెలియనగును. కాబట్టి యదృష్ట సహకృత శుక్ల శోణితముల ప్రాప్తి శరీరోత్పత్తికి కారణమని యెంచవలయును.

"శరీరోత్పత్తినిమిత్తవత్సంయోగోత్పత్తి నిమిత్తంకర్మ"
౩.౨.౬౬.

శరీరోత్పత్తినిమిత్తవత్ = శరీరోత్పత్తియం దదృష్టము నిమిత్తమైనట్లు, సంయోగోత్పత్తి నిమిత్తం = సంయోగమిట మనస్సు, దాని యుత్పత్తికి నిమిత్తము, కర్మ = అదృష్టమని యర్థము.

అదృష్ట సహకృత భూతములవలన శరీరోత్పత్తి కలుగుచున్నట్లు, అదృష్ట సహకృత సూక్ష్మ భూతములనుండి మనస్సుత్పన్న మగుచున్నదనిన నెట్టి వైలక్షణ్యము లేదని భావము.

"ఏతేన అనియమః ప్రత్యుక్తః" ౩.౨.౬౭.

ఏతేన = అదృష్టమును నిమిత్తముగా చెప్పుటవలన, అనియమః = కొన్నియెడల శుక్లశోణితము లొకచో గర్భాశయమున చేరినప్పటికి గర్భోత్పత్తి కలుగకుండుట యను అనియమము, ప్రత్యుక్తః = ప్రత్యాఖ్యానము చేయబడినది

అదృష్ట సహకార మున్నపుడే శుక్లశోణితములు శరీరోత్పత్తికి కారణమని నుడువుటచే అదృష్ట సహకారములేని శుక్లశోణితములు శరీరోత్పత్తికి కారణము కాకున్నను దోషములేదు. శరీరాది కార్యజాత ముత్పన్నమగుటకు అదృ

ష్టము నిమిత్తమని స్థాపింపబడినది. అదృష్ట ముత్పత్తివినాశ ములు కలదై మనోవిశిష్టమగు నాత్మకు గుణమగుచున్నది. మనోవాక్కాయములచే జీవాత్మ యదృష్టమును సంపాదించు చున్నదని రాద్ధాంతము.

అదృష్టము భూతములకు, మనస్సునకు స్వాభావిక ధర్మమనియు, అదృష్ట నిమిత్తముగా శరీరమేర్పడుననియు, శరీరమున మనస్సంయోగమును కలుగుననియు కొందఱందురు.

ఈ వాదమును శంకించి నివారించుచున్నాడు.

"తదదృష్టకారితమితిచేత్ పునస్తత్ప్రసంగోఽపవర్గే"
౩. ౨. ౬౮.

తదదృష్టకారితమితిచేత్ = భూతముల యదృష్టముచే శరీరమేర్పడినదని తలంచిన, అపవర్గేపునః = మోక్షమునందును, తత్ప్రసంగః = శరీర ప్రసక్తి కలుగును.

అదృష్టము భూతధర్మ మనువారు "ఆత్మలు చేతనములు; స్వకర్మవశమున బంధింపబడును. తపశ్చర్యాదుల ద్వారా ముక్తములగును. జీవుల యుపయోగము కొఱకు స్వాభావికమైన తమ యదృష్టమువలన భూతములు శరీరములను కలిగించును. మనస్సుకూడ తన స్వాభావికధర్మమైన యదృష్టవశమున శరీరము నందు ప్రవేశించును. శరీరారంభము నందు, భూతసమావేశమునందును మనస్సుయొక్క స్వాభావికమగు నదృష్టము తప్ప జీవాత్మల కర్మాపేక్ష యుండదు. జీవులు విముక్తులు కానంతవరకు శరీరపరంపర పరిసమాప్తము కాదు;" అని యెంచుదురు. కాని యిది యుక్తము కాదు.

బంధకాలమున స్వాదృష్టముచే ప్రేరింపబడి శరీరము నారంభించు భూతములు మోక్షకాలమున నవి శరీరమును కలిగింపవను టకు కారణ మూహింపజాలము. భూతముల స్వాభావిక ధర్మ మయిన యదృష్ట మప్పుడెక్కడికేగును? ఒకప్పు డుండి మరి యొకప్పుడు లేకున్న స్వాభావిక ధర్మ మెట్లగును? మోక్ష కాలమునందును శరీరసంబంధ మంగీకరించుట యనిష్టమగును. కాబట్టి యదృష్టము భూతస్వాభావిక ధర్మమనుట యుక్తి యుక్తము కాదు.

"మనః కర్మనిమిత్తత్వాచ్చ సంయోగావిచ్ఛేదః" 3.౨.౬౯.

మనః కర్మ నిమిత్తత్వాచ్చ = మనస్సులోనుండు అదృష్టము మనఃకర్మ యనబడును. అది నిమిత్తమగుటవలన, సంయోగావిచ్ఛేదః = మనః శరీర సంయోగ మెన్నడు విచ్ఛిన్నము కాదు.

మఱియు నిమిత్తము నశించిన నైమిత్తికము నశించును. మనస్సున నుండు నదృష్టవశమున శరీరమనఃసంయోగ మేర్పడు చున్నది. మనస్సు నిత్యమగుటచే తద్ధర్మమైన యదృష్టమును నిత్యము. అందువలన నది నశింపదు. కాబట్టి తన్నిమిత్తక మగు శరీరమనఃసంయోగమును నశింపదు. ఇదియు ననిష్టమే యగుచున్నదని భావము.

"నిత్యత్వప్రసంగశ్చ ప్రాయణానుపపత్తేః" 3.౨.౭౦.

ప్రాయణానుపపత్తేః = ప్రాయణము - మరణము సిద్ధింపనందున నిత్యత్వప్రసంగః = శరీరమనః సంయోగము నిత్యమగును.

విచ్ఛిన్నము కానిది నిత్యమగును. కాబట్టి శరీరమనః- సంయోగము నిత్యమగునెడల మోక్షమే సిద్ధింపదని భావము.

పూర్వపక్షము:—

"అణుశ్యామతానిత్యత్వవ దేత త్స్యాత్" ౩.౨.౭౧.

అణుశ్యామతానిత్యత్వవత్ = పరమాణువు నందలి శ్యామతా గుణము నిత్యమైనట్లు, ఏతత్స్యాత్ = సంయోగమును అగును.

పరమాణుశ్యామతాగుణము నిత్యమై నశించునట్లు, సంయోగము నిత్యమైనను నశించును. కాబట్టి దోషము లేదు.

ఉత్తరపక్షము:—

"నాకృతాభ్యాగమ ప్రసంగాత్" ౩.౨.౭౨.

అకృతాభ్యాగమ ప్రసంగాత్=చేయబడకయే - నిర్నిమిత్తముగా సంయోగనాశ ప్రసక్తి కలుగును. కావున, న = దోషము లేదనుటతగదు.

పరమాణువులలోని శ్యామతాది గుణములు నిర్నిమిత్తముగా నశింపవు. పాకమువలన శ్యామత నశించి దానికి ప్రతిద్వంద్విగా రక్తగుణ మేర్పడును. ఇట్లే సంయోగ నాశమును కొండొక నిమిత్తము వలన నేర్పడిన యుక్తమగును. నిమిత్తము లేకయే సంయోగము నశించుననుట తార్కికుల మనస్సును రంజింపజేయదు. కాబట్టి భూతముల యదృష్టము వలన శరీరమేర్పడు ననుట సాధువు కానట్లు మనోనిష్ఠమగు నదృష్టమువలన శరీర సంయోగము మనస్సున కేర్పడు ననుటయు సాధువు - ప్రమాణ సంగతము కానేరదని భావము.

తృతీయాధ్యాయమున ద్వితీయాహ్నికము.

న్యాయదర్శనము

చతుర్థాధ్యాయము

(ఆద్యాహ్నికము)

(ప్రవృత్తిపరీక్ష)

"ప్రవృత్తిర్యథోక్తా" ౪.౧.౧.

ప్రవృత్తిః=ప్రవృత్తి, యథోక్తా=లక్షణసూత్రమున వర్ణింపబడిన విధమున పరీక్షింపబడినట్లెంచవలయును.

లక్షణసూత్రమున (౧.౧.౧౭.) వాగాదులనుగురించి వివరముగా జెప్పియుండుటచేతను, వాని యారంభమననేమో ప్రసిద్ధ మగుటవలనను, సంశయము కలుగనందునను ప్రస్తుత మిట పరీక్షింపవలసిన విషయమేమియు లేదని భావము.

"తథాదోషాః" ౪.౧.౨.

తథాదోషాః=ప్రవృత్తివలె దోషములు నని యర్థము.

(దోషవిభాగము)

"తత్త్రైరాశ్యం రాగద్వేషమోహార్థాంతరభావాత్" ౪.౧.౩.

రాగద్వేష మోహార్థాంతరభావాత్ = రాగద్వేష మోహములు భిన్నము లగుటచే, తత్త్రైరాశ్యం = దోషములు మువ్విధములు.

కామక్రోధాది దోషము లనేకములైనను నన్నియు మువ్విధముల విభజింపనగును. (౧) రాగము. (౨) ద్వేషము

(3) మోహము. కామము, మత్సరత, స్పృహా, తృష్ణ, లోభము, మాయ, దంభము నను నివి రాగమున చేరును. క్రోధము, ఈర్ష్య, అసూయ, ద్రోహము, అమర్షము, అభిమానము, ద్వేషమున చేరును. విపర్యయము, సంశయము, మానము, ప్రమాదము నను నివి మోహమున నంతర్భావము లగును. కాబట్టి రాగ, ద్వేష, మోహములని దోషములు ముప్విధములు.

రతి నభిలషించుట కామము. తన ప్రయోజనమును చూడకయే యితరుల యభిమతమును చెడుపనెంచుట మత్సరత. పరుల ద్రవ్యమును గ్రహించు కోరిక స్పృహా. తనకు ప్రాప్తింపనిదానిని కోరుట తృష్ణ. ప్రమాణ విరుద్ధముగా పరధనము నపహరింపగోరుట లోభము. విశేషలాభేచ్ఛ మాయ. కపటముతో తన గొప్పతనమును ప్రకటింపగోరుట దంభము. శరీరేంద్రియాధిష్ఠానముల వికృతికి హేతువగు ద్వేషవిశేషము క్రోధము. (సాధారణ) ఉమ్మడి వస్తువునందు ఇతరుల యభినివేశమును వారించుటకు హేతువగు ద్వేష విశేషము ఈర్ష్య యనబడును. పరులగుణములను సహింపలేకుండుట అసూయ. చెడుగు చేయవలయునను కోరిక ద్రోహము. అపకారమును క్షమింపలేమి అమర్షము. అపకారము చేసినవాని నేమియు చేయలేక తన్నుదా ద్వేషించుట అభిమానము. భ్రాంతి జ్ఞానము విపర్యయము. ఒకధర్మియం దనేక విరుద్ధ ధర్మజ్ఞానము సంశయము. లేని గుణములను తనలో నారోపించుకొని

'తాను గొప్పవాడ'ననుకొను భావము మానము. కర్తవ్యము చేయకుండుట ప్రమాదము ననబడును.

పూర్వపక్షము:—

"నైక ప్రత్యనీక భావాత్" ४.౧.४.

ఏక ప్రత్యనీక భావాత్ = ఆత్మతత్వబోధమను నొక్కటే విరోధిగా గలవగుటవలన, న = దోషములు ముర్విధములు కావు.

ఆత్మ తత్వజ్ఞానము కలుగగానే మోహముగానీ, రాగ ద్వేషములుగానీ యుండనేరవు. రాగద్వేషాదులకు ఆత్మ తత్వజ్ఞానము విరోధి - నివర్తకము. రాగద్వేషాదులు పరస్పరము భిన్నములై మువ్విధములగునెడల నొక యాత్మతత్వ జ్ఞానముచే నివర్తింపబడుటెట్లు సంభవించును? ఒకట నివర్తకమయిన నివర్త్యము నొక్కటియే యగును. నివర్తకమొక్కటియై నివర్త్యము లనేకములయిన రాగద్వేషాదులేకాక తద్భిన్నతర ఘట పటాదులు నివృత్తి కావలసివచ్చును. కాబట్టి రాగద్వేషాది దోషములు మువ్విధములుకాక ఒకేవిధ మన వలయునని భావము.

ఉత్తరపక్షము:—

"వ్యభిచారా దహేతుః" ४.౧.౫.

వ్యభిచారాత్ = అనైకాంతికమగుటవలన, అహేతుః = పూర్వోక్త హేతువు సరిగాదు.

ఒకదానిచే నివర్తింపబడునవి పరస్పర భిన్నములు కాగూడదను నియమములేదు. ఒకే పాకసంయోగమువలన

రూపరసగంధస్పర్శలు మారుచుండుట జూచుచున్నాము. కాబట్టి 'ఏకప్రత్యనీకభావాత్' ఒక్కటే విరోధిగాగలుగుట వలన త్రైరాశ్యము కాదనుట యుక్తము కాదు.

“తేషాం మోహః పాపీయాన్ నామూఢస్యేతరోత్పత్తేః”
౪.౧.౬.

నామూఢస్య=మూఢునకు, ఇతరేతరోత్పత్తేః=రాగద్వేషము లుత్పన్నములగుటవలన, తేషాం=రాగద్వేషమోహములలో, మోహః=మోహమనెడిదోషము, పాపీయాన్=మిక్కిలి పాపము

మోహ మున్నచోటనే రాగద్వేషములు కలుగును. అది లేనియెడ నవియుకలుగవు. మోహ నిమిత్తకములు రాగద్వేషము లనుట దీనివలన బోధపడుచున్నది. రాగద్వేషములు సంసారమునకు హేతుభూతములైన శుభాశుభ ప్రవృత్తులకు మూలము లగుటచే మోహము మిక్కిలిపాపము. కార్యముకంటె కారణమున దోష మెక్కుడంగీకరించుట యుక్తము. కాబట్టి ఆత్మతత్వజ్ఞానముద్వారా ముందు మోహమును తొలగింపవలయును. మోహముతొలగిన రాగద్వేషములు స్వయముగానే తొలగును.

పూర్వపక్షము:—

“నిమిత్తనైమిత్తికభావా దర్థాంతర భావో
దోషేభ్యః” ౪ ౧.౭.

నిమిత్తనైమిత్తిక భావాత్ = కార్య కారణభావమువలన, మోహము, దోషేభ్యః = దోషములకంటె, అర్థాంతరభావః = భిన్నము.

రాగద్వేషములకు మోహము నిమిత్తమగునెడల, మోహము రాగద్వేషములకంటె భిన్నముకావలసియుండును. కాన దోషమనబడరాదని భావము. నిమిత్త నైమిత్తికములు పరస్పర భిన్నములగును. చాక్షుషజ్ఞానమునకు నిమిత్తమగు ప్రకాశము దానికంటె భిన్నమగుట నిశ్చిత సిద్ధాంతము. కాబట్టి మోహము దోషములలో పరిగణింపబడరాదు.

ఉత్తరపక్షము:—

"న దోషలక్షణావరోధాన్మోహస్య" ౪.౧.౮.

దోషలక్షణావరోధాత్ = దోషలక్షణముచే నవరుద్ధమగుటచే, మోహస్య=మోహమునకు, అర్థాంతరభావము, న = లేదు.

("ప్రవర్తనాలక్షణాదోషాః" ౧. ౧. ౧౮.) అనెడి సూత్రమున దోషలక్షణము వర్ణింపబడినది. ఆ లక్షణముచే మోహము లక్షింపబడుచున్నది. దోషలక్షణము దోషము కానిదానిని నిరోధింపజాలదు. కాబట్టి మోహమును దోషమే.

మోహము దోషమగునెడల రాగద్వేషములకు సమానజాతీయమగుటచే వానికి నిమిత్తమెట్లగు నన,

"నిమిత్తనైమిత్తికభావోపపత్తేశ్చతుల్యజాతీయానా మప్రతిషేధః" ౪ ౧.౯.

తుల్యజాతీయానామ్=సజాతీయములలో, నిమిత్తనైమిత్తికభావోపపత్తేశ్చ=కార్యకారణభావ ముపపన్నమగుటవలన, అప్రతిషేధః=నిమిత్తము కాదనుట యుక్తముకాదు.

దండము ఘటమునకు నిమిత్తము. దండ ఘటములు రెండును ద్రవ్యములగుట సమానజాతీయములే. అయినను

నిమిత్తనైమిత్తికభావమున కెట్టి లోపమునులేదు. అట్లే మోహము రాగద్వేష సజాతీయ మైనంతమాత్రమున నది వానికి నిమిత్తమగుటలో నెట్టిదోషమును లేదు. సజాతీయములు నిమిత్త నైమిత్తికభావము నందజాల వను నియమము లేదని సూత్రాభిప్రాయము. కాబట్టి మోహము దోషముల కంటె నర్థాంతరముకాదు.

(ప్రేత్యభావపరీక్షణము)

"ఆత్మనిత్యత్వే ప్రేత్యభావసిద్ధిః" ౪.౧.౧౦.

ఆత్మనిత్యత్వే=జీవుడు నిత్యమైన, ప్రేత్యభావసిద్ధిః=ప్రేత్యభావము (పునరుత్పత్తి) సిద్ధించును.

పునరుత్పత్తి ప్రేత్యభావ మనబడును. పునరుత్పత్తి యన చచ్చి మరల పుట్టుట-పూర్వశరీరమును విడిచి మరియొక శరీరమును గ్రహించుట. ప్రత్యగాత్మ (జీవుడు) అనిత్యమైన నిది సిద్ధింపదు. జీవుడు నిత్యముగాక శరీరముతో బాటు నశించునేని శరీరాంతర గ్రహణము పొసగదు. జీవుడు నిత్యుడే యని పూర్వగ్రంథమున ననేకవిధముల సిద్ధపరుపబడినది. కాబట్టి ప్రేత్యభావమును సిద్ధించినట్లే. విశేషించి పరీక్షింపదగిన యవసరము లేదని భావము.

(వస్తువుల యుత్పత్తి)

"వ్యక్తాద్ వ్యక్తానాం ప్రత్యక్షప్రామాణ్యాత్" ౪.౧.౧౧.

ప్రత్యక్షప్రామాణ్యాత్ = ప్రత్యక్షప్రమాణ సిద్ధమగుట వలన, వ్యక్తాత్=భావపదార్థమువలన, వ్యక్తానాం=భావపదార్థముల యుత్పత్తి జరుగును.

మృత్తికవలన ఘటము, తంతువులనుండి పటము, బీజమునుండి యంకురము కలుగుచుండుట ప్రత్యక్షగమ్యము. ప్రత్యక్ష సిద్ధము నిష్టము లేకున్నను నంగీకరింపక యేరికిని శక్యముకాదు. ఇట్లు భావపదార్థముల (ఉనికిగల వస్తువుల) నుండి భావపదార్థము లుత్పన్నములగుచుండుట ప్రత్యక్షాది ప్రమాణ సిద్ధము. కావున ప్రపంచమునగల సర్వ భావపదార్థములును కొంచెకాలము యదృష్ట భావపదార్థ మూలకముగా నుద్భవిల్లుచున్న ట్లంగీకరింపవలసివచ్చును. ఆ భావపదార్థమే జగత్తునకు మూలకారణము - ప్రకృతి యనబడును. సత్పదార్థమునుండియే సత్పదార్థ ముత్పన్నమగునని వైదికుల మతము. కావుననే ఛాందోగులు "సదేవసోమ్యేదమగ్రఆసీత్" అన్నారు. కాబట్టి ప్రత్యక్షాది ప్రమాణములద్వారా సత్పదార్థమునుండి సత్పదార్థ ముత్పన్నమగునని యంగీకరింపబడుచున్నది.

పూర్వపక్షము:—

"న ఘటాద్ ఘటానిష్పత్తేః" ౪.౧.౧౨.

ఘటాత్ = వ్యక్తమగు ఘటమునుండి, ఘటానిష్పత్తేః = మఱియొక ఘటముత్పన్నము కాకుండుటవలన, న = వ్యక్తమునుండి వ్యక్తముత్పన్నమగుననుట సరికాదు.

వ్యక్తమునుండి వ్యక్తముత్పన్నమైన నొక ఘటమునుండి మఱియొక ఘట ముత్పన్నము కావలయును. అట్లగుట లేదు. కాబట్టి వ్యక్తమునుండి వ్యక్త ముత్పన్నము కాదు.

ఉత్తరపక్షము:—

"వ్యక్తాత్ ఘటనిష్పత్తే రప్రతిషేధః" ౪.౧.౧౩.

వ్యక్తాత్ = వ్యక్తమగు కపాలముల వలన, ఘటనిష్పత్తేః = ఘటముత్పన్న మగుచుండుటవలన, అప్రతిషేధః = వ్యక్తమువలన వ్యక్తము కలుగదనుట సరికాదు.

వ్యక్తమువలన వ్యక్తము కలుగునన, వ్యక్తకారణ పదార్థమువలన వ్యక్తకార్య పదార్థము కలుగునని యభిప్రాయము. అందువలన వ్యక్తకార్యమువలన మఱియొక కార్యము కలుగకున్నను దోషము లేదు. ఘటోత్పత్తికి కారణభూతము లయిన కపాలాది వస్తువులు వ్యక్తము లేకదా?

పూర్వపక్షము:—(శూన్యవాది)

"అభావాద్ భావోత్పత్తి ర్నానుపమృద్య ప్రాదుర్భావాత్" ౪.౧.౧౪.

నానుపమృద్య = కారణమును నశింపజేసి, ప్రాదుర్భావాత్ = కార్య ముత్పన్నమగుటవలన, అభావాత్ = అభావమునుండి, భావోత్పత్తిః=భావము జనించును.

బీజము నశించినమీదట అంకుర మేర్పడుచున్నది. కాబట్టి కారణ నాశానంతరము కార్యము జనించుచున్నదని తెలియుచున్నది. కారణ నాశము భావము కాజాలదు. కాబట్టి యభావమునుండి భావము జనించుచున్నది.

ఉత్తరపక్షము:—

"వ్యాఘాతా దప్రయోగః" ౪.౧.౧౫.

వ్యాఘాతాత్ = విరుద్ధార్థక మగుటవలన, అప్రయోగః = నశింపజేసి పుట్టుచున్నందువలన అను ప్రయోగము సరికాదు.

కారణమును నశింపజేసి కార్యము పుట్టుచున్నదని కదా శంకాభిప్రాయము! అట్లయిన నశింపజేయునది యుండిన కదా! నశింపజేయగలుగును. కాబట్టి నశింపజేసి పుట్టుచున్న దన నర్థమేమి ? పుట్టునది పుట్టక ముం దుండదుకదా ? లేనిది నశింపజేయుటెట్లు ? ఉండిన పుట్టుచున్న దన నర్థమేమి ? కాబట్టి (ఉపమృద్య ప్రాదుర్భవతి) నశింపజేసి పుట్టుచున్న దనుట నిరర్థక ప్రయోగమగును.

పూర్వపక్షము :—

"నాతీతానాగతయోః కారకశబ్ద ప్రయోగాత్" ౪.౧.౧౬.

అతీతానాగతయోః = కారణ కార్యలక్షణములుగల భూత భవిష్యద్విషయములందు, కారక-శబ్దప్రయోగాత్ = కర్మ, కర్త అది కారక శబ్దములను గౌణముగా ప్రయోగించుటవలన, న = పూర్వోక్త ప్రయోగము అనర్థముకాదు.

కారణము నశించి కార్య ముత్పన్నమగును. కారణ నాశానంతరము కార్య ముత్పన్నమగు ననుటలో కర్మ కారకము, కర్తృ కారకము ప్రయోగింపబడినవి. ఈ కారకము లిట ఆనంతర్యమునే బోధించును. ఇంతియగాని, కారణ కార్యములకంటె భిన్నముగా నొక వస్తువిట కారణమును నశింపజేసి కార్యము నుద్భవింపజేయునని కానీ, అదే కార్యముగా నుద్భవించునని కానీ యుద్దేశింపబడ లేదు. కాబట్టి కారణము నశించి కార్యము ప్రాదుర్భవించునని ప్రయోగించుటలో దోషములేదు.

ఉత్తరపక్షము:—

"న వినష్టేభ్యోఽనిష్పత్తేః" ౪.౧.౧౭.

వినష్టేభ్యః=వినాశము పొందినవానినుండి, అనిష్పత్తేః=కార్యము జనింపనందువలన, న = పూర్వోక్తము సరికాదు.

నశించిన కారణములు కార్యమును కలుగజేయవు. విద్యమాన కారణముల వలననే కార్యము లుత్పన్నములగును. వినష్టకారణమువలన కార్యము జనించుపక్షమున కర్షకులు వినష్ట బీజములను క్షేత్రముల నేలవిత్తరు? కారణవినాశమున భేదముండదు కాబట్టి, వరివిత్తనము వలన గోధూమాంకురము, యవబీజమువలన శాల్యంకురము లేలకలుగవు? భిన్న బీజముల వలన భిన్నాంకురము లుద్భవించుటకు బీజమున విశిష్ట శక్తియొకటి యంగీకరింప వలసివచ్చును. అట్టిశక్తి విద్యమాన వస్తువున నుండును గాని నశించినదానియం దుండజాలదుకదా? కాబట్టి పూర్వోక్త ప్రయోగ మయుక్తము కాకున్నను వినష్ట కారణములవలన కార్యోత్పత్తి కలుగుననుట పొసగదు. కారణములు కార్యమున నన్వయింప వలసియుండును వినష్టతంతువులు పటమున నెట్లు సమన్వయము పొందగలవు? కాబట్టి యభావమువలన భావముద్భవించుననుట ప్రమాణవిరుద్ధము.

"క్రమనిర్దేశాదప్రతిషేధః" ౪.౧.౧౮.

క్రమనిర్దేశాత్ = (బీజముయొక్క పూర్వాపరావస్థ లిటక్రమమన బడును.) ఉపమర్ద పదముచే నిట్టిక్రమము నిర్దేశింప బడుటవలన, అప్రతిషేధః=భావమునుండి భావ ముత్పన్న మగుననుట ప్రతిషేధింప బడదు.

బీజోపమర్దము బీజనాశముగా నంగీకరింపము. బీజము నందు రెండు దలములుండును వాని సంయోగము పూర్వావస్థ యనబడును. భూసలిలాది సంబంధమువలన కలుగు వాని విభాగము అపరావస్థ యనబడును. ఈ పూర్వాపరభావమే యుపమర్ద మనబడును. ఇట్లు బీజ మొకయవస్థనుండి మరి యొక యవస్థనుబొంది క్రమముగా సంకుర మగును. అందు వలన భావమునుండి భావ ముద్భవించు ననుటకు దోషము లేదు. ఇట్లు సర్వభావ పదార్థముల కాది భావపదార్థము ప్రకృతి యనబడును.

(ఈశ్వరుడు జగత్కర్త)

"ఈశ్వరః కారణమ్ పురుష కర్మాఫల్య దర్శనాత్"
౪.౧.౧౯.

పురుష కర్మాఫల్య దర్శనాత్ = జీవులుచేయు శుభాశుభ కర్మముల నైష్ఫల్య జ్ఞానమువలన, ఈశ్వరః = క్లేశకర్మ విపాకాశయములచే నస్పృష్టుడు, నిరతిశయ జ్ఞానక్రియాశక్తి సంపన్నుడునగు నీశ్వరుడు, కారణమ్ = ముఖ్యకారణము

రాజుగాని, వ్యవస్థాపకుడుగాని లేని రాజ్యమున మనుజులు తాముచేయు శుభాశుభ కర్మములకు తగిన ఫలములను పొందజాలరు. లోకమున పురుషులు తాముచేయు కర్మములకు తగిన ఫలములను సుఖ దుఃఖ రూపమున పొందుచుండుట జూచుచున్నాము. జన్మము మొదలు కొందఱు సుఖము ననుభవించుట, మఱికొందఱు దుఃఖము ననుభవించుట, వేరొకకొందఱు సుఖ దుఃఖముల ననుభవించుటయు జూచుచున్నాము.

గదా ! ఈ యనుభవములు కర్మములు లేక కలుగనేరవు. ప్రకృతి జడమగుటచే దానిచేగాని, జీవులొనరించు కర్మములచేగాని యిట్టి వ్యవస్థ యేర్పడజాలదు. ఆకస్మికముగా నిట్టి ఫలారంభము కలుగుననుటయు యుక్తము కాదు. జీవాత్మలే స్వయముగా తమతమ కర్మములకు తగు ఫలముల వ్యవస్థ యొనరించుకొందు రందమన్నచో! వారల్పశక్తిమంతులు. కాబట్టి యీ విలక్షణమై, భోక్తృభోగ్యమైన జగత్తున కధిష్ఠాతయని యొప్పు సర్వశక్తిమంతుడగు సర్వేశ్వరుడొక డంగీకరింపబడు చున్నాడు జీవులుచేయు కర్మానుకూలముగా నీశ్వరుడు శాశ్వతకాలమునుండి యీ ప్రకృతి నధిష్ఠించియుండి దీనిని దృశ్యమాన జగత్తుగా నిర్మించుచున్నాడు. భోక్తలగు జీవులును నిర్మిత జగత్తునందు జన్మములనంది తమతమ కర్మములకు తగు ఫలములను యథాసమయ మనుభవించుచున్నారు.

ఆ యీశ్వరు డీ చరాచర జగత్తునకు జీవనహేతువగుటచే ప్రాణ శబ్దముచే వ్యవహరింపబడును. శాసించుటచే శాసకుడు - రాజు. సర్వ మతని వశమున నుండును. సర్వ విద్యల కాకరమగు వేదములం దిట్లే వర్ణింపబడి యున్నది.

("ప్రాణాయనమోయస్యసర్వమిదంవశే") అధర్వ. ౧౧.౨.౮౧.

ఇట్లే యుపనిషత్తులందును వర్ణింపబడియున్నది.

"సవాఅయమాత్మా సర్వేషాం భూతానా మధిపతిః
సర్వేషాం భూతానాంరాజా" బృహ. ౨.౫.౧౫.

పూర్వపక్షము.—

"న పురుషకర్మాభావే ఫలానిష్పత్తేః" ౪.౧.౨౦.

పురుష కర్మాభావే = జీవుడుచేయు కర్మము లేకున్న, ఫలానిష్పత్తేః = ఫలము కలుగనందున, న = ఈశ్వరుడు కారణముకాడు.

అన్వయ వ్యతిరేకములు కార్య కారణ భావమును నియమించును. జీవకర్మయున్న ఈశ్వరునివలన జగత్తు ఉత్పన్నమగును. లేకున్న కలుగదు. ఇట్లు పురుషకర్మ జగత్తునకన్వయ వ్యతిరేకముగా కారణమని తెలియుచున్నది. కాబట్టి పురుషకర్మయే జగత్కారణమగును కాని యీశ్వరుడు కాడు.

ఉత్తరపక్షము:—

"తత్కారితత్వా దహేతుః" ౪.౧.౨౧.

తత్కారితత్వాత్ = కర్మయున్నను నీశ్వరునిచే జగత్తు నిర్మింపబడుటవలన, అహేతుః = పూర్వోక్తహేతువు సరికాదు

జగదుత్పత్తికి కర్మ నిమిత్తమైనను నది స్వతంత్రకారణముకాదు. కర్మ జడము. అది చేతనముచే నధిష్ఠింపబడక స్వతంత్రముగా నొకింతయు నిర్మింప సమర్థము కానేరదు. జడమగుటచేత ప్రకృతియే జగత్తును నిర్మింప జాలనపుడు పురుషకర్మ మెట్లు నిర్మింపగలదు? నిరతిశయములయిన జ్ఞాన క్రియాశక్తులు కలవాడగుటచే లోకపతి పరమేశ్వరుడే యీ విచిత్ర జగత్తును భోగ్యముగా నిర్మింప గలుగుచున్నాడు.

పురుషకర్మ జగద్వైచిత్ర్యమునకు కారణమగును కాని జగత్కర్త కానేరదు. ఈశ్వరుడే కర్త కాగలడు.

(స్వభావ వాదము:)

"అనిమిత్తతో భావోత్పత్తిః కంటకతైక్ష్ణ్యాది దర్శనాత్"
౪.౧.౨౨.

కంటకతైక్ష్ణ్యాది దర్శనాత్ = నిమిత్తము లేకనే కంటకాదులందు తైక్ష్ణ్యాను మున్నగునవి చూడబడుటవలన, అనిమిత్తతః = కారణము లేకనే స్వభావముగా, భావోత్పత్తిః = కార్య పదార్థములన్నియు పుట్టుచున్నవి.

కంటకమున తీక్ష్ణత, మయూరమున చిత్రవర్ణములు స్వభావముగా నేర్పడుట చూచుచున్నాము. అట్లే లోకమున నుత్పన్నములగు వస్తువులు (భావములు)నని తలంపవలయును. ఒకటి నిమిత్తము లేకయే జనించిన తక్కినవి జనింపవనుట యుక్తము కాదు. కాబట్టి భావపదార్థములన్నియు నిమిత్తము లేకయే జనించుచున్నవి.

ఉత్తరపక్షము:— (ఛలముతో)

"అనిమిత్త నిమిత్తత్వాన్నానిమిత్తతః" ౪.౧.౨౩.

అనిమిత్త నిమిత్తత్వాత్ = అనిమిత్తమే నిమిత్తమగుటవలన, అనిమిత్తతః = నిమిత్తము లేక, న = భావోత్పత్తి కలుగదు.

అనిమిత్తమువలన భావోత్పత్తి కలుగునని చెప్పుచు ననిమిత్తమును కారణముగా నంగీకరించుచున్నావుకదా! అట్టియెడ భావోత్పత్తి నిర్నిమిత్తమనుటెట్లు పొసగును ?

ఉత్తరపక్షము:— (వాస్తవము)

"నిమిత్తానిమిత్తయో రర్థాంతర భావాదప్రతిషేధః"
౪.౧.౨౪.

నిమిత్తా నిమి త్తయోః = నిమి త్తము, అనిమి త్తము ననునివి, అర్థాం తరభావాత్ = భిన్నార్థము లగుటవలన, అప్రతిషేధః = భావోత్పత్తి నిర్నిమి త్తమనుట యుక్తముకాదు.

ప్రత్యక్ష ప్రమాణముచే సిద్ధించుదానిని స్వీకరింప కుండుట శక్యముకాదు. ప్రతి భావకార్యమునకును నిమిత్త ములేవ్వో, యనిమి త్తములేవ్వో రెండును తెలియనగును. ప్రత్యక్షముగా నివి తెలియకున్న ననుమానముచే నైనను తెలియనగును. ప్రతి కార్యమును కారణజన్యమగుటచే కొండొక కార్య మనిమిత్తక మనుటతగదు. స్వభావముచేతనే కార్యము సిద్ధమగుచుండ కారణము నంగీకరింపనేల? యనుట యుక్తముకాదు. స్వభావమననేమి? దాని కాశ్రయమేది? స్వభావమున కొక యాశ్రయముండవలయునుగదా! ఆ యాశ్ర యమే నిమిత్తమగును. కాబట్టి భావోత్పత్తి నిర్ని మిత్త మనుట యుక్తముకాదు. ప్రకృతి నామమున వర్తిల్లు ననాది భావపదార్థమునుండి పురుషకర్మ ననుసరించి యీశ్వ రుని ద్వారా భావోత్పత్తి కలుగుననియే యంగీకరింప వలయునని భావము.

(సర్వ మనిత్య మను వాదము)

"సర్వమనిత్య ముత్పత్తి వినాశధర్మకత్వాత్" ౪.౧.౨౫.

ఉత్పత్తి వినాశధర్మ కత్వాత్ = ఉత్పత్తి వినాశధర్మము కలద గుట వలన, సర్వమ్ = భావజాతమంతయు, అనిత్యం = అనిత్యము

ఉత్పత్తి వినాశములు కలది యనిత్యము. భావ పదా ర్థము లన్నియు నుత్పత్తి వినాశవంతములే. కాబట్టి సర్వభావ ములు ఘటాదులవలె ననిత్యములేయని సూత్రార్థము.

ఉత్తరపక్షము:—

"నానిత్యతా నిత్యత్వాత్" ౪.౧.౨౬.

అనిత్యతా నిత్యత్వాత్ = సర్వగతమగు ననిత్యత నిత్యమగుటవలన, న = సర్వమనిత్యము కాదు.

సర్వము ననిత్యమందువేని, సర్వమునందొక యనిత్యత్వ మను ధర్మ మంగీకరింప వలయును కదా! ఆ యనిత్యత్వము నిత్యమా? లేక యనిత్యమా? చెప్పవలసి యుండును. అనిత్యమందువేని, యానిత్యము కాని యనిత్యత కాశ్రయము నిత్య మనవలసివచ్చును. అందువలన సర్వ మనిత్యమనుట తగదు. నిత్యమందువేని సర్వమనిత్య మను ప్రతిజ్ఞకు భంగము వాటిల్లును. కాబట్టి సర్వ మనిత్యమనుట యుక్తివిరుద్ధము.

పూర్వపక్షము:—

"తదనిత్యత్వమ్ అగ్నేర్దాహ్యం వినాశ్యానువినాశివత్"
౪ ౧.౨౭.

అగ్నేః = అగ్ని, దాహ్యం = దహింపదగు కాష్ఠాదులను, వినాశ్య = నశింపజేసి, అను వినాశివత్ = వెంటనే నశించునట్లు, తదనిత్యత్వమ్ = అనిత్యత్వము నిత్యము కాదు.

అగ్ని తన కాశ్రయమగు దాహ్యమును నశింపజేసి యనంతరము తాను నెట్లు నశించునో యట్లే యనిత్యత్వమును తన కాశ్రయమగు సర్వమును నశింపజేసి తదుపరి తానును నశించును. కాబట్టి యనిత్యత యనిత్యమే యగును. అందువలన ననిత్యత కాశ్రయమగు సర్వము నిత్యమగుననజనదు. అది పూర్వమే నశించును. కాబట్టి సర్వము అనిత్యమే.

ఉత్తరపక్షము:—

"నిత్యస్యాప్రత్యాఖ్యానం యథోపలబ్ధి వ్యవస్థానాత్"
౪ ౧.౨౮.

యథోపలబ్ధి వ్యవస్థానాత్ = ప్రమాణము ననుసరించి వ్యవస్థిత మగుటవలన, నిత్యస్య = నిత్యమగు భావపదార్థము, అప్రత్యాఖ్యానం = నిరాకరింప సంభవము కాదు.

ప్రమాణము ద్వారా యేది యుత్పత్తి వినాశ ధర్మములుకలదిగా సిద్ధముకాదో యది నిత్యమగును ఏది యుత్పత్తి వినాశ ధర్మకమో యది యనిత్యము. ఇట్లు ప్రమాణముల ద్వారా వ్యవస్థితమై యుండుదానిని నిరాకరింప నేరికినిశక్యము కాదు. ప్రకృతి పురుషేశ్వరు లుత్పత్తివినాశ ధర్మకము లని ప్రమాణముల ద్వారా సిద్ధింపనందున నవి యనిత్యములన నెప్పదు. కాబట్టి సర్వమనిత్య మనుట ప్రమాణసిద్ధము కాదు.

(సర్వనిత్యత్వవాదము)

"సర్వంనిత్యం పంచభూత నిత్యత్వాత్" ౪.౧.౨౯.

పంచభూత నిత్యత్వాత్ = పంచభూతములు నిత్యము లగుటవలన, సర్వం = ఘటపటాది సర్వవస్తు జాతము, నిత్యం = నిత్యము

దృశ్యమాన వస్తుజాత మంతయు పాంచభౌతికము. భూతములు నిత్యములగుటవలన సర్వము నిత్యమనిభావము.

"నోత్పత్తి వినాశ కారణోపలబ్ధేః" ౪.౧.౩౦.

ఉత్పత్తి వినాశకారణోపలబ్ధేః = ఉత్పత్తి వినాశకారణము లుపలబ్ధము లగుటవలన, న= సర్వము నిత్యము కాదు.

వినాశోత్పత్తులకు కారణములు లభించు వస్తువు నిత్య మెన్నడును కానేరదు. నిత్యమన వినాశోత్పత్తులు లేనిదనికదా యర్థము! ఘటపటాదుల యుత్పత్తి వినాశకారణములు ప్రమాణగమ్యవను లగుటవలన సర్వనిత్యవాద మయుక్తము.

పూర్వపక్షము:—

"తల్లక్షణావరోధా దప్రతిషేధః" ౪.౧.౩౧.

తల్లక్షణావరోధాత్ = ఘటపటాది సర్వవస్తు వ్రాతము భూత లక్షణముచే నవరుద్ధ మగుటవలన, అప్రతిషేధః = సర్వము నిత్యమే.

ఘటపటాదులు భూతస్వభావము కలవగుటచే భూత లక్షణముచే నవియు నవరుద్ధము (లక్షితము) లగుచున్నవి. భూతములు నిత్యము లగుటవలన తత్స్వభావము కలిగి, తల్ల క్షణ లక్షితములయిన సర్వవస్తువులును నిత్యములు కాకుండు టెట్లు పొసగును? కాబట్టి నిత్యములే.

ఉత్తరపక్షము:—

"నోత్పత్తి తత్కారణోపలబ్ధేః" ౪.౧.౩౨.

ఉత్పత్తి తత్కారణోపలబ్ధేః = ఉత్పత్తి వినాశములకు కారణ ములు ప్రత్యక్షముగా నుపలబ్ధము లగుటవలన, న = నిత్యమనుట తగదు.

ఉత్పత్తి వినాశములు, వాని కారణములు దేనికి ప్రత్యక్షముగా లభించునో యా వస్తువు నిత్యమెన్నడును కాదు. ఘట పటాదుల కన్నిటికి నుత్పత్తి వినాశములును, తత్కారణములును ప్రత్యక్షములగుటచే నవి నిత్యము లనుట ప్రమాణ విరుద్ధము. కాబట్టి సర్వనిత్యవాద మసంగతము.

పూర్వ సూత్రమున నుత్పత్తి వినాశ కారణోపలబ్ధి హేతువుగా గ్రహింపబడినది. ఈ సూత్రమున నుత్పత్తి వినాశముల యుపలబ్ధియు, ఉత్పత్తి వినాశకారణోపలబ్ధియు, హేతువుగా గ్రహింపబడుటచే పునరుక్తి దోషములేదు.

ఉత్పత్తి వినాశములయు, తత్కారణములయు నుపలబ్ధి స్వప్నోపలబ్ధివలె భ్రమయేల కాదన,

"న వ్యవస్థానుపపత్తేః" ౪.౧.౩౩.

వ్యవస్థానుపపత్తేః = 'ఇది కారణము' 'ఇది కార్యము' నను లోకసిద్ధమగు వ్యవస్థ వ్యర్థమగును. కావున, న = భ్రమకాదు.

స్వప్నమున గోచరించు భావములలో కార్యకారణ వ్యవస్థయొండు కానరాదు. క్రమరహితముగా ననేకభావములందు యుగపద్గోచరము లగుచుండును. కాని లోకమున 'నిది కారణము. ఇది కార్యము' నను వ్యవస్థ ప్రత్యక్షగోచరము. ఇట్లు కార్యకారణముల వ్యవస్థ ప్రత్యక్షపూర్వకమై యుపపన్నమగుచుండ స్వప్నోపలబ్ధివలె భ్రమయనుట పొసగదు. కాబట్టి సర్వనిత్యవాదము ప్రమాణ సంగతముకాదు.

(అవయవ వాదము)

"సర్వంపృథగ్ భావలక్షణ పృథక్త్వాత్." ౪.౧.౩౪.

భావలక్షణ పృథక్త్వాత్ = (లక్ష్యంతే భావాః ఏభిః ఇతి భావలక్షణాని అవయవాః ఇతియావత్) భావలక్షణము లన నిట నవయవములు. వానినానాత్వము వలన, సర్వమ్ = ఘటపటాది వస్తుజాతమంతయు, పృథక్ = భిన్నము.

'రూపాదులకంటె వేరుగా ద్రవ్యమనునది యొకటి లేదు. అవయవములకు మించి యవయవియను భావమొండు లేదు' అని పృథగ్వాదుల మతము. అందువలన రూపాది లక్షణావయవము లొక్కటిగాక యనేకములు. వాని సము దాయములే ఘటపటాది భావములు. కాబట్టి యవియు ననేకములే యగునని భావము.

(తన్మత నిరాకరణము)

"నానేకలక్షణై రేకభావ నిష్పత్తేః" ౪.౧.౩౭.

అనేక లక్షణైః = అనేకావయవములచే, ఏక భావ నిష్పత్తేః = అవయవి యను నొక భావోత్పత్తి కలుగుటవలన, న = సర్వము (అనేకము) కాదు.

ఆవు దాని యవయవములకంటె భిన్నము కానిపక్షమున నావుచే చేయబడు కార్యములు తదవయవములచే సంపాదింపబడవలయును. ఇట్లే ఘటాదులచే నగు జలానయనాదికార్యములు తదవయవములచే సంపన్నములు కావలయును. అట్లెన్నడును కాజాలదు. కాబట్టి యవయవముల వలన నుత్పన్నమగు నవయవి యొకటి వేరుగానుండును. అది యొక్కటే కాని యనేకము కాదని భావము.

విలక్షణ కార్యమును సంపాదించినంత మాత్రమున నవయవములకంటె నవయవి భిన్నమన నక్కఱలేదు, అవయవములకంటె నవయవ సముదాయములు విలక్షణ కార్య సంపాదకములు కావచ్చునన,

"లక్షణ వ్యవస్థానాదేవాప్రతిషేధః" ౪.౧.౩౮.

లక్షణ వ్యవస్థానాత్ = ప్రతిభావమునకు నవయవములు వేరు వేరుగా వ్యవస్థితములయి యుండుటవలన, అప్రతిషేధః = అవయవి నిరాకరణము సంగతముకాదు.

'ఇవి ఘటమున కవయవములు' 'ఇవి గోవున కవయవములు' 'ఇవి వస్త్రమునకు' నని భిన్నభిన్నములుగా నవయవము లొక్కొక్క వస్తువునకు వ్యవస్థితములై గ్రహింపబడుట వలన, అవయవములకంటె భిన్నముగా నవయవియొకటి యున్నట్లంగీకరింపక తప్పదు. కాబట్టి ప్రతివస్తువు భిన్నమనుటతగదు.

(అభావవాదము)

"సర్వమభావో భావేష్వితరేతరాభావసిద్ధేః" ౪.౧.౩౭.

భావేషు = భావపదార్థములందు, ఇతరేతరాభావసిద్ధేః = అన్యోన్యాభావము సిద్ధించుటవలన, సర్వమ్ = సమస్తవస్తుజాతము, అభావః = అబావమే.

మట్టికుండ. బంగారు కుండలము. అనుతావులలో మట్టికి కుండకు, బంగారమునకు కుండలమునకు తాదాత్మ్యము కలదు. అందువలననే వానిలో సామానాధికరణ్యము నున్నది. కాబట్టి సామానాధికరణ్యమున్న, తాదాత్మ్యమున్నట్లంగీకరింపవలెను. ప్రతి భావపదార్థమునకు నభావముతో సామానాధికరణ్యము లోకమున చూడబడుచున్నది. ఉదాః— అఘటము పటము. ఘట మపటము. గో వనశ్వము. అశ్వ మగోవు. దీనింబట్టి ఘటాభావము (అఘటము), పటము సమానాధికరణములు. అశ్వాభావము (అనశ్వము), గోవు సమానాధికరణములు. కాబట్టి ఘటాభావమునకు

పటమునకు తాదాత్మ్య మున్న దనవలయును. ఇట్లే అశ్వా భావమునకు, గోవునకు తాదాత్మ్య మంగీకరింప వలయును. అందువలన గోఘటములు అభావములనుట సిద్ధము. ప్రతీతి ననుసరించి లోకమున భావ వ్యవస్థ యేర్పడును. కాబట్టి పై ప్రతీతుల ననుసరించి ప్రతిభావపదార్థమును అభావ తాదాత్మ్యమై యభావమన నొప్పునని భావము.

(తన్మతనిరాకరణము)

"న స్వభావ సిద్ధేర్భావానామ్." ౪.౧.౩౮.

భావానామ్ = గోఘటాది భావములు, స్వభావ సిద్ధేః = స్వభావముగానే సిద్ధించుట వలన, న =సర్వ మభావముకాదు.

గోఘటాదులు స్వభావముగానే సిద్ధించుచున్నవి. గోవు గోత్వముతో సిద్ధింపకున్న దాని యభావమెట్లు సిద్ధించును? గోవు అభావాత్మక మగునెడల నది స్వభావమైన గోత్వముతో నెన్నడును సిద్ధింపనేరదు. అభావము గోత్వాది ధర్మముల కాశ్రయము కాజాలదు. గోవుఅనశ్వః ఘటము అపటముః అనునిట్టి ప్రతీతివలన గోఘటము లభావాత్మకము లని సిద్ధింపవు. ఇట్టి ప్రయోగములందలి సామానాధికరణ్యము వలన గోవు అశ్వముకంటె భిన్నమనియు, ఘటము పటము కంటె వేరనియు బోధ కలుగునని యంగీకరింప వలయును. కాని యవి యభావాత్మకము లనవలసిన యవసరములేదు. పైప్రయోగముల వలన అశ్వమున గోత్వముకాని, పటమున ఘటత్వముగాని లేదని తెలియునుకాని, అభావమెట్లుబోధ

పడగలదు? గోవునందు గోత్వము, ఘటమున ఘటత్వము నుండు ననియే బోధయగును. కాబట్టి సర్వమభావముకాదు.

పూర్వపక్షము:—

"న స్వభావ సిద్ధిరాపేక్షికత్వాత్" ౪.౧.౩౯.

ఆపేక్షికత్వాత్ = పరాపేక్షసిద్ధిగలవగుటవలన, స్వభావసిద్ధిః = స్వభావముద్వారా సిద్ధికలవి, న = కావు.

గో ఘటాది భావపదార్థము లన్నియు భిన్నస్వభావము కలవి. లోకమున భిన్న స్వభావము కలవి పరము నపేక్షింపక సిద్ధింపవు. దీర్ఘము నపేక్షింపని హ్రస్వము కానీ, హ్రస్వము నపేక్షింపని దీర్ఘము కానీ, పుత్రుడు లేక తండ్రిగానీ సిద్ధింపనేరరు. కాబట్టి భావపదార్థములు స్వభావ సిద్ధములనుట లోక విరుద్ధము. ఇట్లు భావములన్నియు పరాపేక్ష లేక సిద్ధింపనందున గోఘటాదులు నశ్వాదుల నపేక్షింపక సిద్ధింపవు. నాపేక్షసిద్ధి వాస్తవముకాదు. అందువలన సర్వ మవాస్తవమే.

ఉత్తరపక్షము:—

"వ్యాహతత్వాదయుక్తమ్." ౪.౧.౪౦.

వ్యాహతత్వాత్ = అన్యోన్యాశ్రయముతో వ్యాహతమగుట వలన, అయుక్తమ్ = భావము లాపేక్షికము లనుట యుక్తము కాదు.

అశ్వాదిభావములు గోఘటాదుల నపేక్షించిన గోఘటాది భావము లశ్వాదిభావాపేక్షికములు కావు. స్ఫటికలోహితము (ఎఱుపు) కుసుమ లోహితము నపేక్షించునుకాని, కుసుమలోహితము స్ఫటికలోహితము నపే

క్షింపదు. అట్లుకాక అశ్వాదిభావములు గోఘటాది భావము లను, గోఘటాదు లశ్వాదిభావముల నపేక్షించు నందువేని అన్యోన్యాశ్రయదోష మేర్పడును. అన్యోన్యాశ్రయమున నొకభావమును సిద్ధింపనేరదు. హ్రస్వ దీర్ఘాదుల నుపమించి దోషములేదన వలనుపడదు. హ్రస్వదీర్ఘాదులును గ్రహణ సమయమున పరస్పర మపేక్షించినను స్వోత్పత్తి విషయమున నొండొంటి నపేక్షింపవు. ఇట్లే పితాపుత్రాదులు జన్య జనక భావమును బోధించుటలో పరస్పరాపేక్షయున్నను స్వోత్పత్తి కన్యోన్యాపేక్ష యుండదు. కాబట్టి భావములు స్వసిద్ధియందు పరాపేక్షికము లనుట యుక్తముకాదు. అందువలన సర్వ మభావ మనుట చెల్లదు.

'సర్వము నేక కారణకమగుటచే నేకము. అందువలన సర్వత్ర ఏకత్వ సంఖ్యా నియమముండవలయును' అనుట సంఖ్యైకాంతవాదము అనబడును. దాని నిరాకరణము.

"సంఖ్యైకాంతాసిద్ధిః కారణానుపపత్త్యుపపత్తిభ్యామ్"
౪.౧.౪౧.

కారణానుపపత్త్యుపపత్తిభ్యామ్=నిఃసహాయమగు నేకాకి కారణ ముపపన్నము కాకపోవుట వలనను, ససహాయ కారణ ముపపన్న మగుట వలనను, సంఖ్యైకాంతాసిద్ధిః=సంఖ్యైకాంత వాదము సిద్ధింపదు.

ఒకే తత్త్వము కారణమగుటవలన నీసర్వము నేకమే యనిన, నాకారణము నిఃసహాయమా? లేక ససహాయమా? యని ప్రశ్నింపవలయును నిఃసహాయమనిన, నానావిధ జగత్తున కది కారణమనుట యుక్తముకాదు. ససహాయ మనిన,

దానికి సహాయ మగునది పదార్థమా? అపదార్థమా? యని యడుగవలెను. అపదార్థమనుట తగదు. అపదార్థమయిన నది స్వయముగా లేనిదై యితరమునకు సహాయమెట్లు చేయగలదు? పదార్థమే యనిన, ద్వితీయ పదార్థ మంగీకరించినట్లగును. అందువలన సంఖ్యైకాంత వాదము సిద్ధింపనేరదు.

పూర్వపక్షము:—

"న కారణావయవ భావాత్." ౪.౧.౪౨.

కారణావయవ భావాత్ = ఒకే తత్త్వము కారణమైనను దానికవయవము లుండుటవలన, న = సంఖ్యైకాంత వాదము సిద్ధింపదనుట తగదు

నానావిధమగు నీజగత్తునకు కారణము ససహాయము కాదు. నిఃసహాయమే. నిఃసహాయమగు నేకకారణము నానావిధ కార్యజాతము నెట్లు పుట్టింపగలదని ప్రశ్నింతురేని, యా కారణమున ననేక కార్యోత్పాదక సామర్థ్యముగల యనేకావయవము లున్నవని యంగీకరింతుము. కాబట్టి దోషము లేదు.

ఉత్తరపక్షము:—

"నిరవయవత్వా దహేతుః." ౪.౧.౪౩.

నిరవయవత్వాత్ = సర్వమునకు కారణమైన యేకతత్త్వము యవ మగుట వలన, అహేతుః = కారణమున నవయవము లుండుట వలన, నను హేతువు అహేతువు.

అవయవములు కలది సావయవ మనబడును. సావయవము కార్యమగును. కారణము కాదు. సర్వమునకు కారణమగు నేకతత్త్వము సావయవమయిన నది కార్యమగును కాని కారణము కాదు. సర్వమునకు కారణము నిరవయవమే యని

యంగీకరింపబడినది. అట్టిది నిఃసహాయ మగుచో ననేకవిధ కార్యజాతము నుత్పన్నము చేయనేరదు. ససహాయ మనిన నేకకారణము కాకపోవుటచే సర్వమేక మను సంఖ్యైకాంత వాదము సిద్ధింపనేరదు.

ప్రేత్యభావమును పరీక్షించి తరువాత ఫలమును పరీక్షింప దలచి ముందు సంశయించుచున్నాడు.

"సద్యః కాలాంతరేచ ఫలనిష్పత్తేః సంశయః" ౪.౧.౪౪.

సద్యః = వెంటనే, కాలాంతరేచ = కాలాంతరమునను, ఫలనిష్పత్తేః = ఫలప్రాప్తి దర్శనము వలన, సంశయః = అగ్నిహోత్రాది కర్మలు సద్యః ఫలములా? లేక కాలాంతర ఫలములాయని సంశయము కలుగుచున్నది.

పాకమునకు ఫలము తండులపచనము. అది సద్యః ఫలము. కృష్యాది కర్మములకు ఫలము సస్యనిష్పత్తి కాలాంతరమున సిద్ధించును. అందువలన అగ్నిహోత్రాది విహిత కర్మలు, సురాపానాది నిషిద్ధకర్మలును సద్యఃఫలములా? లేక కాలాంతర ఫలములా? యని సంశయము వొడమును.

కర్మనిష్పత్త్యనంతరమున నవ్యవహిత కాలము సద్యః కాలము. కర్మనాశానంతర కాలము కాలాంతరము. కర్మనాశానంతరమున నెన్నడో ఫలనిష్పత్తి కలిగిన నదృష్టము ద్వార మగునని వివేకము.

సద్యఃఫలనిష్పత్తి పూర్వపక్షముకాగా సమాధానము.

"న సద్యః కాలాంతరోపభోగ్యత్వాత్" ౪.౧.౪౫.

కాలాంతరోపభోగ్యత్వాత్ = కాలాంతరమున నుపభోగ్యము లగుటవలన, విహిత ప్రతిషిద్ధ కర్మలను, నసద్యః=సద్యఃఫలనిష్పత్తి కలుగదు.

అగ్నిహోత్రాది కర్మలు విహితములు. సురాపానాదులు నిషిద్ధములు. విహితములకు ఫలము స్వర్గము. నిషిద్ధములకు ఫలము నరకము. స్వర్గనరకములు సుఖదుఃఖ విశేషములే. అవి వెంటనే కలుగనేరవు. కొంతొక ఫలవిశేషము సిద్ధింపవలయునన్న దేశకాల విశేషము లపేక్షింప బడును. కాబట్టి అగ్నిహోత్ర సురాపానాదుల వలన కలుగు ఫలములు కాలాంతరముననే కలుగునని భావము.

పూర్వపక్షము:—

"కాలాంతరేణానిష్పత్తిః హేతువినాశాత్." ౪.౧.౪౬.

హేతు వినాశాత్=హేతువు నశించుటవలన, కాలాంతరేణ= కాలాంతరమున, అనిష్పత్తిః=ఫలనిష్పత్తి కాదు.

కారణ ముండిన కార్యముత్పన్న మగును. కారణము నశించిన కార్యముజనింపదు. ఫలమునకు కారణము కర్మము. అది కాలాంతరమున నుండదు. నశించును. కారణాత్మక కర్మము నశించిన ఫల ముదయింప నేరదు. కాబట్టి కాలాంతరమున ఫలనిష్పత్తి యనుట యుక్తము కాదు.

ఉత్తరపక్షము:—

"ప్రాజ్ నిష్పత్తేర్వృక్షఫలవత్ తత్స్యాత్" ౪.౧.౪౭.

వృక్షఫలవత్=వృక్షఫలమువలె, ప్రాజ్ నిష్పత్తేః=ఫలోత్పత్తికి పూర్వమే కర్మనశించినను, తత్ స్యాత్=స్వర్గాదిపద వాచ్యఫల ముద్భవించును.

ఒకడు ఫలముల నపేక్షించి వృక్షమునకు సేచనాది కర్మల నాచరించును. ఆకర్మలు నశించిన తదుపరి కాలాంతరమున నతనికి వృక్షమునుండి ఫలములు లభించును. సేచనాదికర్మ నశించినను దానివలన రసద్రవ్య ముత్పన్నమై యది ఫలరూపమున కాలాంతరమున నుత్పన్న మగుచున్నది. అట్లే అగ్నిహోత్రాది కర్మలు నశించినను వానివలన ధర్మాధర్మ లక్షణముగల యదృష్ట ముత్పన్నమై కాలాంతరమున స్వర్గాత్మక ఫలము నిష్పన్న మొనర్చును. ఈయదృష్టమునే మీమాంసకులు 'అపూర్వము' అందురు. అట్లయిన నదృష్టముచే ఫలము నిష్పన్నమగును కాని కర్మవలన కాదని యనరాదు. కర్మకు ఫలమునకు మధ్య అదృష్టము వ్యాపారమనబడును. కర్మ వ్యాపారి యగును. వ్యాపార నిష్పన్నము వ్యాపారి నిష్పన్నము కాకపోదు. అట్లంగీకరింపమేని, అనుమాన ప్రమాణమునందు, లింగ దర్శనానంతరము వ్యాప్తిస్మరణకలిగినగాని యనుమితి కలుగదు. అట్టియెడ అనుమితి వ్యాప్తిస్మరణజన్య మగుటచే హేతుజన్యము కాదందుమేని యది లైంగికజ్ఞాన మననొప్పదు. కాబట్టి కర్మవలన నదృష్టము ద్వారా కాలాంతరమున ఫలనిష్పత్తి కలిగినను దోషములేదు.

కర్మవలన జనించు నీ ఫలము నిష్పత్తికి పూర్వమున్నదా? లేదా? యని జిజ్ఞాసకలుగగా పూర్వపక్షము:—

“నాసన్నస న్నసదసత్ సదసతోర్వైధర్మ్యాత్” ౪.౧.౪౮.

(ఈ సూత్రమున 'ఉపాదాన నియమాత్, ఉత్పత్త్యసంభవాత్' అను రెండు హేతువులు కల్పింపవలయును.)

ఉపాదాననియమాత్ = కొండొక కార్య ముద్భవింపవలయు ననిన కొండొకకారణ విశేషము నుపాదానముగా గ్రహింపవలసిన నియమ ముండుటవలన, నుత్పన్నమగుటకు పూర్వము ఫలము, అసత్ న = అసత్తు కాదు. ఉత్పత్త్యసంభవాత్ = ఉన్నది యుత్పన్నము కానేరదు కాబట్టి, సత్ = ఉత్పత్తికి పూర్వము సత్తు, న = కాదు. సదసత్ న = ఉత్పత్తికి పూర్వము సదసత్తును కాదు. సదసతోర్వైధర్మ్యాత్ = సత్తు అసత్తు నను రెండును విరుద్ధములగుటవలన.

ఘట ముత్పన్నమగుటకు పూర్వము మృత్తికలో నది లేకున్న దాని నుత్పన్న మొనర్చుటకు మృత్తికనే యేల గ్రహింపవలెను? ఘటము మృత్తికలో లేనట్లు తంతువులలో నుండదు. బంగారములో నుండదు. ఇట్లే యితరములందు నుండదు. అట్టియెడ ఘటోత్పత్తికి నుపాదాన కారణముగా మృత్తికనే యేల గ్రహింపవలసి యుండును? తంతువులనేల గ్రహింపరాదు? మృత్తిక తప్ప తదితరములు ఉపాదానముగా గ్రహింపకుండు నియమమెందులకు? నియమ ముండుటచే ఘటోత్పత్తికి పూర్వము ఘటము లేదు అన వీలుకాదు.

ఉత్పత్తికిపూర్వము కార్యము (సత్) ఉన్నదందుమా! అదియునొప్పదు. సత్తాసంబంధమునే యుత్పత్తి యందుము. కాబట్టి యుత్పత్తికి పూర్వమే సత్తనిన 'సత్తు' మరల సత్తు ఎట్లు కాగలదు? ఉత్పత్తికిపూర్వమేయుత్పన్నమైయున్న పునరుత్పత్తి యెట్లు సంభవమగును? కాదనిభావము. కాబట్టి యుత్పత్తికి పూర్వము కార్యము 'సత్తు' అనరాదు.

సదసత్తనియు ననవీలుపడదు. సదసత్తులు రెండును పరస్పర విరుద్ధము లగుటచే నవి యొక్కమారుగ సంభవిం

పవు. కాబట్టి యుత్పత్తికిపూర్వము కార్యము 'సదసత్' అనియు నన పిలుపడదని భావము.

ఉత్తరపక్షము:—

"ఉత్పాదవ్యయ దర్శనాత్" ४.౧.४८.

ఉత్పాదవ్యయ దర్శనాత్ = ఉత్పత్తికి పూర్వము కార్యోత్పత్తి వినాశములు చూడబడుట వలన, కార్యము 'సదసత్' అనియే యంగీకరింపవలయును.

ఉత్పత్తికి పూర్వము కార్యమసత్తయిన నది యెన్నడు నుత్పన్నము కానేరదు. కుందేటికొమ్ము ఎన్నడైన జనింపగలదా? కాబట్టి 'సత్' విద్యమాన మందుమేని యది నశింపనేరదు. కార్య ముత్పన్నమై నశించుట జూచుచున్నాము. అందు వలన కార్యముత్పత్తికి పూర్వ మసత్తుకాదు; సత్తుకాదు. కాని సదసత్తనియే యంగీకరింపవలయును.

సదసత్తులు ఒకే మారెట్లు సంభవింప గలవన,

"బుద్ధిసిద్ధంతు తదసత్." ४.౧.४౦.

తదసత్ = సదసత్తులలో నొకటగునసత్తు, బుద్ధిసిద్ధంతు = బుద్ధిసిద్ధమే - బుద్ధిసహామే.

కార్య ముత్పత్తికి పూర్వ మేరూపమున సత్తనుచున్నామో యదే రూపమున నసత్తనిన పరస్పర విరుద్ధము లగుటచే సదసత్తు లొకక్షణమున సంభవింప వనుట యుక్తమే. కాని మేమట్లు చెప్పము. కార్య ముత్పత్తికి పూర్వ మొకరూపమున సత్తు, మరియొక రూపమున నసత్తు నగుటలో నెట్టి దోషము నుండదు. బుద్ధిచే నంగీకరింప వచ్చును. ఉత్ప

త్తికి పూర్వము కార్యము కారణరూపమున సత్తనియు, కార్యరూపమున నసత్తనియు నంగీకరించిన బుద్ధివిరోధ ముండ నేరదుకదా! కాబట్టి యుత్పత్తికి పూర్వము కార్యము 'సదసత్' రూపమున నుండు ననిన సహాభానము సంభవమే.

పూర్వపక్షము:—

"ఆశ్రయవ్యతిరేకాద్ వృక్షఫలవ దిత్యహేతుః." ౪.౧.౫౧.

ఆశ్రయ వ్యతిరేకాత్ = కర్మాశ్రయమైన శరీరము ఫలపర్యంతము వృక్షమువలె నియమముగా నుండకపోవుటంజేసి, వృక్షఫలవదిత్యహేతుః= వృక్షఫలమువలెనను దృష్టాంతము సరికాదు.

జలసేచనాది కర్మల కాశ్రయమైన వృక్షము ఫలోద్గమ పర్యంత ముండునట్లు అగ్నిహోత్రాది కర్మల కాశ్రయమైన శరీరము స్వర్గాది సుఖవిశేష ప్రాప్తి పర్యంత ముండునను నియమము లేదు. శరీరము నశ్వరము. నేడున్న శరీరము రేపుండునని యెవరెఱుగుదురు? ఆశ్రయము నశించిన ఫల మెట్లు సంభవింప నగును? కాబట్టి వృక్షఫలములవలెనను దృష్టాంతము యుక్తముకాదు.

ఉత్తరపక్షము:—

"ప్రీతేరాత్మాశ్రయత్వా దప్రతిషేధః." ౪.౧.౫౨.

ప్రీతేః = సుఖదుఃఖాత్మకమగుఫలమునకు, ఆత్మాశ్రయత్వాత్ = ఆత్మ యాశ్రయ మగుట వలన, అప్రతిషేధః = దృష్టాంతము అయుక్తము కాదు.

విహిత కర్మలుగాని నిషిద్ధ కర్మలుగాని యనుష్ఠించుట వలన కలుగు నదృష్టము ఆత్మయందు జనించును. ఆ యదృష్ట

జన్యమగు ఫలమును ఆత్మనే యాశ్రయించును, ఆత్మ నిత్యమగుటవలన నది ఫలపర్యంత ముండును. కాగా, వృక్ష దృష్టాంతమవిరుద్ధమే.

పూర్వపక్షము:—

"న పుత్ర పశు స్త్రీ పరిచ్ఛద హిరణ్యాన్నాది
ఫలనిర్దేశాత్" ౪.౧ ౫౩.

పుత్ర ....ఫలనిర్దేశాత్ = పుత్ర - పశు - స్త్రీ - వస్త్ర- హిరణ్య - అన్నాదులు ఫలముగా నిర్దేశింపబడుటవలన, న = సుఖ దుఃఖములు ఫలముకాదు.

పుత్ర పశ్వాదులు కర్మ ఫలములుగా నిర్దేశింపబడు చుండుటవలన సుఖ దుఃఖాత్మకము ఫలముగా జెప్పి యది యాత్మాశ్రయ మగుటవలన దృష్టాంతమున దోషము లేద నిన పొసగదు.

ఉత్తరపక్షము:—

"తత్సంబంధాత్ ఫల నిష్పత్తే స్తేషు ఫలవదుపచారః"
౪.౧.౫౪.

తేషు = పుత్రాదులు, ఫలవదుపచారః = ఫలముగా నిర్దేశించుట యౌపచారికము - గౌణము. కారణమేమన? తత్సంబంధాత్ = పుత్రాదుల సంబంధమున, ఫలనిష్పత్తిః = ఫలోత్పత్తి కలుగుచున్నది.

అన్నము ప్రాణము. ఆయువు ఘృతము. నాగలి జీవనము. అను తావులందు అన్నాదులు ప్రాణాదులకు సాధనము లయినను ప్రాణాదులు గానే ప్రయోగించుటకు కారణము వానికిగల సాధ్యసాధన భావసంబంధమే. అట్లే సుఖ

దుఃఖాత్మకమగు ఫలము పుత్రాది సాధన సాధ్యము. సాధనములచే సాధ్యమగు ఫలరూపమున నటనట ప్రయోగించుట గౌణప్రయోగమని తెలియవలయును. కాబట్టి దోషములేదు.

(దుఃఖపరీక్షణము)

"వివిధబాధనాయోగాత్ దుఃఖమేవ జన్మోత్పత్తిః"
౪.౧.౫౫.

వివిధ బాధనా యోగాత్ = నానావిధ దుఃఖసాధన మగుట వలన, జన్మోత్పత్తిః = జన్మలక్షణమగు నుత్పత్తి, దుఃఖమేవ = దుఃఖమే.

జన్మ కలుగుట వలన ననేక దుఃఖములు వాటిల్లుచున్నవి. జన్మయే లేకున్న నిష్టవియోగము, ననిష్టసంప్రాప్తియునను దుఃఖవ్రాతము సంభవింప నేరదు. కాబట్టి నానా బాధలకు సాధనమైన యీ జన్మ దుఃఖమేయనుట యుక్తము.

పూర్వపక్షము:—

"న సుఖస్యాప్యంతరాలోత్పత్తేః" ౪ ౧.౫౬.

సుఖస్యాపి = దుఃఖమువలె సుఖము సైతము, అంతరాలోత్పత్తేః = దుఃఖమధ్యమున నుత్పన్నమగుటచే, న = జన్మము కేవల దుఃఖమనుట తగదు.

జన్మమువలన దుఃఖము లుద్భవించు చున్నట్లు మధ్య మధ్య ననేకసుఖములు నుత్పన్నము లగుచున్నవి. సుఖములనుభవించుచు జన్మము కేవలము దుఃఖమనుట అయుక్తము.

ఉత్తరపక్షము:—

"వివిధబాధనానువృత్తే ర్వేదయతః పర్యేషణ దోషాదప్రతిషేధః" ౪.౧.౫౭.

వేదయతః = దుఃఖమధ్యమున సుఖము ననుభవించువానికి, పర్యే షణ దోషాత్ = తృష్ణా దోషమువలన, వివిధ బాధనానువృత్తేః = నానా విధ దుఃఖములు పునః పునః సంభవించుటవలన, అప్రతిషేధః = జన్మము దుఃఖమే యనుటను ప్రతిషేధింప వలనుపడదు.

ప్రాణి కొండొకవేళ సుఖము ననుభవించుచున్నను, తృష్ణావశమున ననేక దుఃఖములకు మాటిమాటికి లోనగు చున్నాడు. ప్రతిక్షణము సుఖమనుభవింప వలయునని కోరియు సుఖమును పొందజాలడు. సుఖ మొకప్పుడు సంప్రాప్తించినను మిక్కిలి కష్టసాధ్యము, నతిస్వల్పము నగును. లభించియు విలయమగును. తృష్ణ ప్రతిక్షణము వర్ధిల్లును. అందుపై రాగ ద్వేష మోహాదుల ద్వారా అనేక దుఃఖము లుత్పత్తిల్లును. మధ్యలో నొకింతసుఖము కల్గినను విషాక్తదుగ్ధమువ్రాలి, దుఃఖ భూయిష్ఠముచే నావరింపబడి హేయమై తోచును. అందువలన నదియు దుఃఖముననే చేర్పబడును. కాబట్టి దుఃఖమే జన్మమనుట ప్రతిషేధార్హము కానేరదు.

"దుఃఖవికల్పే సుఖాభిమానాచ్చ." ౪.౧.౫౮.

దుఃఖవికల్పే = దుఃఖాభావమున, సుఖాభిమానాచ్చ = సుఖము నారోపించుటవలనను.

మఱియు దుఃఖముల మధ్య సుఖము కలుగుచున్న దనుట వాస్తవముకాదు. దుఃఖము కలుగకుండుటను సుఖ మని చెప్పుచున్నారు. దుఃఖ రూపాంతరమును గ్రహింపక యవివేకులు సుఖముగా నుడువుదురు. కాముకులు ప్రణయ కలహముచే కుపితలగు కురంగలోచనల శిరః పాదతాడన మును సుఖ విశేషసాధనముగా నెంచుట లోకవిదితము కాదా

వాస్తవమున పాద తాడనము సుఖ సంపాదకమెట్లు కాగ లదు? అయినను మూఢబుద్ధులు - కాముకులు సుఖము ననుభవింతురు. వివేకులు వివిధ బాధనలతో ననుషక్తమై యుండుటచే జన్మము దుఃఖమేయని భావింతురు. కాబట్టి జన్మము దుఃఖమే యనుట యుక్తమే.

పూర్వపక్షము:— (అపవర్గ పరీక్షణము)

("ఋణక్లేశ ప్రవృత్త్యనుబంధా దపవర్గాభావః" ౪.౧.౫౯.

ఋణక్లేశ ప్రవృత్త్యనుబంధాత్ = ఋణములతోను, క్లేశముల తోను, ప్రవృత్తితోను సంబంధముండుటవలన, అపవర్గాభావః = ఆత్మకు మోక్షములేదు.

(ఋణగ్ంహవై జాయతేయోఽస్తి ,సజాయమానఏవ దేవేభ్య ఋషిభ్యః పితృభ్యో మనుష్యేభ్యః శత. ౧.౭.౨.౧) అను నిట్టి వాక్యములద్వారా ఉత్పన్నవ్యక్తికి ఋణము లుండుట తెలియుచున్నది. ఇట్టి ఋణానుబంధ మున్నంత వరకు నాత్మకు అపవర్గ ముండజాలదు.

తైత్తిరీయసంహితలో (జాయమానోవై బ్రాహ్మణ స్త్రిభిర్ ఋణవాజాయతే బ్రహ్మచర్యేణార్షిభ్యో యజ్ఞేన దేవేభ్యః ప్రజయా పితృభ్యః ఏష వా అనృణో యఃపుత్రీయజ్వా బ్రహ్మచారీ" ౬.3.౧౦.) 'మనుష్యుడు పుట్టుచు మూటిచే ఋణి యగుచున్నాడు. బ్రహ్మచర్యముచే ఋషి ఋణమును అగ్నిహోత్రాది యజ్ఞముల నాచరించుటచే దేవఋణమును సంతతిద్వారా పితృణమును తీర్చుకొనుచున్నాడని యున్నది.

"ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్
అనపాకృత్య మోక్షంతు సేవమానో పతత్యధః"

మూడు ఋణములను తీర్చి మోక్షసాధనమున మనస్సు నుంపవలయును. ఆనృణ్యమును సంపాదింపక మోక్షమును సాధింప యత్నించి యధఃపతితు డగునని మనుస్మృతి. ఇట్లు జీవితమున్నంత వరకు నానృణ్య సంపాదనకై యత్నించిన మోక్షసాధన మెన్నడు చేయగలుగును? శాస్త్రమున నగ్ని హోత్రాదులు (ఏతద్వై జరామర్యం సత్రం యదగ్నిహోత్రం జరయా హ్యేవాస్మాద్ ముచ్యంతే మృత్యునావా) జరామరణ పర్యంత మాచరింప దగిన సత్రములుగా వర్ణింపబడియున్నవి ఇంతియగాక, అవిద్య, అస్మితము, రాగము ద్వేషము అభినివేశము అను క్లేశముల నుండియు విడివడ వలయును కాబట్టి క్లేశాదులచే సంబద్ధుడై మరణించిన మరల వానితో నేపుట్టుచుండును. అందువలన క్లేశము లుండగా నాత్మకు మోక్ష ముండదు.

మఱియు, పుట్టినదాది మరణపర్యంత మొక్క క్షణమైన నూరకుండక యేదేని చేయుచుండును. ఇట్టి ప్రవృత్తి సంసారమునకు మూలము. అందువలనను మోక్షప్రాప్తి లేదు.

ఉత్తరపక్షము:—

"ప్రధానశబ్దానుపపత్తే ర్గుణశబ్దే నానువాదో
నిందాప్రశంసోపపత్తేః" ౪.౧.౬౦.

నిందా ప్రశంసోపపత్తేః = వివక్షిత నిందా ప్రశంస లుపపన్నము లగుటవలన, ప్రధానశబ్దానుపపత్తేః = ఋణశబ్దమిట ప్రధానము కాకుండుట చేతను, గుణశబ్దేనానువాదః = గౌణార్థమున ప్రయోగింపబడినది.

ముఖ్యావృత్తితో స్వార్థమున ప్రయోగింపబడు శబ్దము ప్రధాన మనబడును. ఉదా:– అగ్ని దాహకము. గోవు గంగడోలుకలది. ఇట అగ్ని గో శబ్దములు స్వార్థమున ముఖ్య వృత్తితో ప్రయోగింపబడినవి. లక్షణావృత్తితో ప్రయోగింపబడు శబ్దము గుణశబ్ద మనబడును ఉదా:– 'ఈబాలుడు నిప్పు' 'ఈ మాణవకుడు సింహము.' ఇట 'నిప్పు' 'సింహము' అను రెండు శబ్దములు లక్షణావృత్తితో బాలునియందు ప్రయోగింపబడి గుణశబ్దము లనబడును. ఇట్లే "ఋణంహ జాయతేయోఽస్తి" అను వాక్యములందు ప్రయోగింపబడిన ఋణశబ్దము ప్రధాన శబ్దముకాదు. ఒకడు మరల తాను తీసికొనదగినదని యెంచి యొకవస్తువు నన్యున కిచ్చును. అన్యుడును దానినిమరల తనకిచ్చిన దాత కీయదగినదిగా దానిని గ్రహించును. ఇట్లు అప్పుగానిచ్చి పుచ్చుకొను తావులందు ఋణశబ్దము ప్రధానమగును. అన్యత్ర గౌణ మగును. అప్పుగా నిచ్చిపుచ్చుకొను తావులందు ప్రధానముగా వాడబడు ఋణశబ్ద మిట వాక్యములందు గౌణముగా ప్రయోగింప బడినది. (ఋణంహ జాయతే.....) ఇత్యాది వాక్యములందు అన్ణియై పుట్టియు, కర్మచేయకున్న ఋణము గ్రహించిన వానివలె ఋణియని నిందింప బడును; కర్మచేసిన అనృణియని ప్రశంసింపబడుననియే వాక్యార్థము. పై వాక్యములు ఋణానుబంధమును తెలుపక, యథాశక్తిని నియమపూర్వకముగా

కర్మము ననుష్ఠించుటయే బోధించును. ఈ యభిప్రాయమునే (ఏతద్వై యజ్ఞరామర్యం సత్రంయదగ్ని హోత్రం......') వాక్యమున జెప్పబడిన జరామర్యవాదము పోషించును. శక్తి కలవానిచే యావజ్జీవము అగ్నిహోత్రాది వైదికకర్మము లనుష్ఠింప దగిన వనియే యింపలి తాత్పర్యము. నియమ పూర్వకముగా వైదికకర్మల ననుష్ఠించుట యపవర్గ సాధన మునకు విరుద్ధముగు కానేరదు. కాబట్టి ఋణానుబంధము వలన నపవర్గాభావము సిద్ధించుననుట యుక్తము కాదు.

సన్న్యాసులకు అగ్నిహోత్రాది కర్మానుష్ఠానము లేనందువలన వారికి మోక్షము లేదనవలయు ననిన,

"సమారోపణాదాత్మ న్యప్రతిషేధః" ౪.౧.౬౧.

ఆత్మని=తనశరీరమున, సమారోపణాత్=అగ్నులను సమారోపణ చేయుటవలన, అప్రతిషేధః=సన్న్యాసుల కపవర్గము ప్రతిషేధింపజనదు.

చతుర్థాశ్రములయిన పరివ్రాజకులు బాహ్యముగా నగ్నిహోత్రాది వైదిక కర్మల నాచరింపరు. వా రుపకరణ ముల నన్నిటిని సన్న్యసింతురు కావున కర్మానుష్ఠానము శక్యముకాదు. అయినను, వారి కాంతరిక కర్మానుష్ఠాన ముండును కర్మ సంపాద్య ఫలాదుల నా మహానుభావులు చక్కగా నాలోచించి నిర్వేదముగు బొందినవారై, నిఃశ్రేయ సమును పొందగోరి సన్న్యాసము నంగీకరింతురు. అట్టియెడ కర్మలోపము కాకుండుటకై కర్మ సాధనమగు నగ్నిని తమ యం దారోపించుకొందురు. బాహ్యమునగాక శరీరమునందే కర్మల నాచరింతురని భావము. జీవన నిర్వాహార్థము

యదృచ్ఛాలాభ సంతుష్టులై భిక్షాచర్యము నొనరించుచు, ప్రాణము నపానము నందును, అపానమును ప్రాణమునందును హోమము చేయుచుందురు. ఇదియే సన్యాసులుచేయు నగ్నిహోత్రము. దీనినే కర్మఠులు దేవయజ్ఞమందురు. సన్యాసులు నిత్యముచేయు వేదధర్మోపదేశము వారికి బ్రహ్మయజ్ఞము. దీనిని స్వాధ్యాయమందురు. (స్వాధ్యాయోవై బ్రహ్మయజ్ఞః" శత. ౧౧.౫.౬.3). వైదిక మర్యాదల నుల్లంఘింపకుండుట సన్యాసులకు పితృయజ్ఞము. ఆత్మభావనతోనే ప్రాణిని పీడింపకుండుట వారికి భూతయజ్ఞము. ప్రాణుల యుపకారార్థము దేశమున నెల్లయెడల భ్రమించుచు, చెంతజేరిన జిజ్ఞాసువులకు సంశయములను బోనాడి తత్త్వజ్ఞానమును కలిగించుట వారి కతిథియజ్ఞమగును. ఇట్లు చతుర్థాశ్రమవాసులు, పరివ్రాజకులును నగ్నిహోత్రాది కర్మలను స్వాత్మయందు అనుష్ఠించుచుందురు కావున వారి కపవర్గము ప్రతిషేధించుట యుక్తము కాదు.

సన్యాసులును కర్మానుష్ఠాన పరులయిన కర్మఫలము ననుభవింపవలసిన వారగుటచే మోక్షము సిద్ధింపదన,

"పాత్రచయాంతానుపపత్తేశ్చ ఫలాభావః" ౪.౧.౬౨.

పాత్రచయాంతానుపపత్తేశ్చ = పాత్రచయ మంతమునగల కర్మ యనుపపన్న మగుటవలన, ఫలాభావః = ఫలముండదు.

మరణించినకర్మఠుని హస్తాద్యవయవములలో 'జుహూ' ప్రభృత్యగ్నిహోత్ర పాత్రల నుంచవలయునను నియమము

గల కర్మలను నియమపూర్వకముగా నాచరించు వారికే స్వర్గాది లక్షణముగల ఫలాదులు లభించును. ఫలముల నర్థించు వారిట్టి పాత్ర చయాంతకర్మల నామరణ మనుష్ఠింతురు. చతుర్థాశ్రము లట్టి కామ్యకర్మల నాచరింపరు. వారు పాత్రాద్యుపకరణములను త్యజించి బ్రహ్మనిష్ఠు లగుదురు. లోకోపకారార్థము వారాచరించు ధర్మోపదేశాది కర్మలు మోక్షమున కభ్యంతర కరమగు ఫలమును కల్పింపజాలవు, వారు "తేహస్మపుత్రైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి" అను వాక్యమూలం దుపదేశించినట్లు ఈషణ (కోరిక)లను విడిచి కర్మపరు లగుదురు కాబట్టి ఫలదాయకములు కావు. కావున నగ్నిహోత్రాది కర్మలను సన్న్యాసు లాచరించినను వారి కవి ఫలదాయకములు కాక పోవుట వలన మోక్షసిద్ధికెట్టి యాటంకము నుండబోదు.

"సుషుప్తస్య స్వప్నాదర్శనే క్లేశాభావవ దపవర్గః"

౪.౧.౬౩

సుషుప్తస్య = సుషుప్తిని బొందిన వ్యక్తికి, స్వప్నాదర్శనే= స్వప్నము వలన కలుగు దుఃఖము లేకుండుట వలన, క్లేశాభావవత్ = క్లేశము కలుగనట్లు, అపవర్గః=మోక్షము సిద్ధించును.

సుషుప్తియందు క్లేశానుబంధమున్న జాగ్రత్స్వప్నావస్థలందువలె జీవికి కష్టము కలుగ వలయును. క్లేశమున్న దుఃఖముండకపోదు. దుఃఖము లేదనిన క్లేశసంబంధము లేదని భావము. సుషుప్తియందు క్లేశము లేదనుట లోకసిద్ధము. కాగా సుషుప్తి క్లేశానుబంధము లేనిదైనట్లు అపవర్గమును

క్లేశరహితమని యెఱుంగ వలయును. తత్వజ్ఞానము వలన క్లేశములు విచ్ఛిన్నములయి యపవర్గము సిద్ధించును. కాబట్టి క్లేశానుబంధము వలన నపవర్గము లేదనుట యుక్తముకాదు.

"నప్రవృత్తిః ప్రతిసంధానాయ హీనక్లేశస్య" ౪.౧.౬౪.

హీనక్లేశస్య = తత్వజ్ఞానము వలన క్లేశములు నశించినవానికి, ప్రవృత్తిః = ప్రవృత్తి, ప్రతిసంధానాయ = పూర్వజన్మము పోగా ఉత్తరజన్మము నారంభించుట ప్రతిసంధాన మనబడును. అందులకు, న = సమర్థముకాదు

బ్రహ్మవిదులగు తత్వజ్ఞులు తత్వజ్ఞాన వశమున క్లేశములను విచ్ఛిన్నమొనర్తురు. అట్టివారి కంతిమదేహమున నేర్పడు ప్రవృత్తి పునర్జన్మ నారంభింపనేరదు. క్లేశములనెడి పొట్టుతో కప్పబడి యున్నపుడే కర్మయనెడి వరిబీజము జన్మరూపమగు మొలక నారంభింప గలుగును. పొట్టుతీయబడిన బియ్యపు గింజ యంకురింపజాలనట్లు క్లేశవిచ్ఛిన్నానంతర ప్రవృత్తి జన్మారంభకము కానేరదు. కాబట్టి ప్రవృత్త్యనుబంధము వలన నపవర్గము సిద్ధింప దనుట యుక్తిసహము కాదు.

పూర్వపక్షము:—

"న క్లేశ సంతతేః స్వాభావికత్వాత్" ౪.౧.౬౫.

స్వాభావికత్వాత్ = అనాది యగుటవలన, క్లేశసంతతేః = క్లేశ సంతానమునకు, న = తత్వ జ్ఞానమువలన విచ్ఛేదము లేదు.

ఆకాశాదు లనాదు లగుటవలన విచ్ఛిన్నములు కావు. అట్లే క్లేశములు ననాదులగుటవలన తత్వజ్ఞానము చేత నవి విచ్ఛిన్నములగు ననుట పొసగదు.

ఉత్తరపక్షము:—

"ప్రాగుత్పత్తే రభావానిత్యత్వవత్ స్వాభావికే ప్యనిత్యత్వమ్ ౪.౧.౬౬"

ప్రాగుత్పత్తే రభావానిత్యత్వవత్ = ఉత్పత్తికి పూర్వము క్షీరాదులందు గల దధ్యాదుల యభావము అనిత్యమైనట్లు, స్వాభావికేఽపి = క్లేశము లనాదులైనను, అనిత్యత్వమ్ = తత్త్వజ్ఞానమువలన నవి నశించును.

ఉత్పత్తికి పూర్వము కారణమున నుండు కార్యాయోగము (ప్రాగభావము) అనాదియైనను కార్య ముత్పన్నమగుటయే తడవుగా నశించును. అట్లే క్లేశసంతతియు స్వాభావికము (అనాది) అయినను తత్త్వజ్ఞానమువలన నశించును. కాబట్టి దోషము లేదని భావము.

(క్లేశనాశ విధానము)

"అణుశ్యామతాఽనిత్యత్వవద్వా" ౪.౧.౬౭.

వా = లేక, అణుశ్యామతానిత్యత్వవత్ = పార్థివ పరమాణువునందలి శ్యామత్వము అనాదియైనను నశించుచున్నట్లు క్లేశ సంతతియు నశించును.

పార్థివ పరమాణువులలోని శ్యామత యనాదియయ్యు పాక వశమున నశించునట్లు క్లేశసంతతి స్వాభావికము(అనాది) అయినను తత్త్వజ్ఞానమువలన నశించును. అందువలన మోక్షోపలబ్ధి కెట్టి యాటంకము నుండదు.

"న సంకల్పనిమిత్తత్వాచ్చరాగాదీనామ్" ౪.౧.౬౮.

రాగాదీనామ్ = రాగాదిక్లేశములు, సంకల్ప నిమిత్తత్వాచ్చ = సంకల్ప హేతుకము లగుటవలన, న = నివృత్తి లేదనతగదు.

రాగాదులు మిథ్యాజ్ఞానము వలననే కలుగును. తత్వ జ్ఞానము వలన మిథ్యాజ్ఞానము నశించిన, దానివలన కలుగు రాగాదులును నశించును. నిమిత్తమే లేకున్న నైమిత్తికము లెట్లుండగలవు? కాబట్టి మిథ్యాజ్ఞానముతో బాటు తన్నిమిత్త కములయిన రాగాదిక్లేశములు నివర్తింపగా మోక్షముసిద్ధించు ననుటలో నావంతయు దోషములేదని సూత్రాభిప్రాయము.

చతుర్థాధ్యాయమున ఆద్యాహ్నికము.

న్యాయదర్శనము

చతుర్థాధ్యాయము

(ద్వితీయాహ్నికము)

పూర్వాహ్నికమున నపవర్గము పరీక్షింపబడినది. ఇట దానికి హేతువయిన తత్వజ్ఞానము పరీక్షింపవలసి యున్నది. తత్వజ్ఞానము మిథ్యాజ్ఞానమును నశింపజేసి యపవర్గమునకు కారణమగును. నిమిత్తము, నైమిత్తకము నని మిథ్యాజ్ఞానము రెండు విధములు. అనాత్మయయిన శరీరమునందు ఆత్మజ్ఞానము నిమిత్తమిథ్యాజ్ఞానము అన్నపానాదులందును, స్త్రీ పుత్ర మిత్రాదులందును సుఖసాధన జ్ఞానము నైమిత్తికము. శరీర మాత్మయనుట నిమిత్త మిథ్యాజ్ఞాన మనియు, స్త్రీ పుత్రాదులు సుఖమును కలిగించు వారనుకొనుట నైమిత్తిక మిథ్యాజ్ఞాన మనియు భావము. ఈనిమిత్త నైమిత్తిక మిథ్యాజ్ఞానములలో మొదటిది ప్రధానము; రెండవది గౌణము. ముందుతత్వజ్ఞానమువలన గౌణ మిథ్యాజ్ఞాన నివృత్తి కలుగును.

"దోషనిమిత్తానాం తత్వజ్ఞానా దహంకారనివృత్తిః" ౪.౨.౧.

దోషనిమిత్తానాం = రాగాది దోషములకు నిమిత్తములయిన జడ చేతనాత్మకములగు విషయములయొక్క, తత్త్వజ్ఞానాత్ = యథార్థ జ్ఞానమువలన, అహంకార నివృత్తిః = అహంకారము తొలగును.

మిథ్యాజ్ఞాన వశమున లోకమునగల స్త్రీ అన్నపానాది చేతనాచేతనాత్మక విషయములు సుఖకరములని యెంచి

ప్రాణి వాని ననుభవింపగోరును. వానిప్రాప్తి కొఱకు మనోవాక్కాయములతో ప్రవర్తించును. తనకోరిక ననుసరించి యవి లభింపకున్న సంతప్తుడగును. లభించిన వానియందాసక్తుడై యనురక్తుడగును. ఇట్లు విషయములు రాగాదులకు హేతువులగును. వానిస్వరూపమును తత్త్వరూపమున నెఱిగిన నవి సుఖహేతువులు కావని తెలిసికొనును. అప్పుడు మిథ్యాజ్ఞానము నివర్తించును. అట్టియెడ విషయప్రాప్తికై యత్నింపడు. ప్రాప్తించిన వానిలో కొన్నిటిని కామించి రమింపడు. కొన్నిటిని ద్వేషించి దుఃఖింపడు. రాగద్వేషములు లేకున్న శుభాశుభ ప్రవృత్తియు నుండదు. అందువలన జన్మయు నేర్పడదు. దుఃఖముండదు. అదియే యపవర్గము.

(దోషకారణములు)

"దోషనిమిత్తం రూపాదయోవిషయాః సంకల్పకృతాః"

౪.౨.౨.

సంకల్పకృతాః = సంకల్పము (మిథ్యాజ్ఞానము) వలన విషయములుగా చేయబడిన, రూపాదయః = రూపము మున్నగు, విషయాః = విషయపద వాచ్యములు, దోషనిమిత్తం = రాగాదిదోషములకు కారణము.

ప్రాణివర్గము మిథ్యాజ్ఞానము వలన మతిచెడి, రూపమును జూచి స్త్రీ యందును, రసము నాస్వాదించి యన్నపానాదులందును, గంధము నాఘ్రాణించి చందన లేపాదులందును, ఇట్లే యితర విషయములందును రంజించును. వానికి విఘాతము కల్పించువానిని ద్వేషించును. మిథ్యాజ్ఞానమే లేకున్న నిట్టి రాగద్వేషాదులు ప్రాణికి నాయా విషయములయెడ కలుగనేరవు.

వివేకు లొకయెడ రంజించుటయు, నొండొకయెడ కుపితు లగుటయు, వేరొక విషయమున ముగ్ధులగుటయు జూడ నేరము. కాబట్టి మిథ్యాజ్ఞానముచే రూపాది విషయములు దోషనిత్తము లగుచున్నవని తెలియుచున్నది.

(మిథ్యాజ్ఞానము కలుగుటకు కారణము)

"తన్నిమిత్తం త్వవయవ్యభిమానః" ౪.౨.౩.

అవయవ్యభిమానః = శరీరేంద్రియాద్యనాత్మపదార్థములందు ఆత్మాభిమానము—(శరీరాదులే తానని కలుగుజ్ఞానము), తన్నిమిత్తం దోష కారణములైన విషయములందు కలిగెడి మిథ్యాజ్ఞానమునకు కారణము.

శరీరమే యాత్మయను మిథ్యాజ్ఞానియే కొన్నివిషయములు సుఖసాధనము లనియు, వేరొకకొన్ని దుఃఖసాధనము లనియు తలంచును. శరీరాత్మలు పరస్పరము భిన్నములను వివేకి విషయములు సుఖసాధనములని యెంచడు. తత్త్వవిదులు పరమాత్మ యందుండి యంతకు మించిన సుఖసాధనము నన్యము జూడక యట రంజింతురు. కాబట్టి శరీరాదులలో నాత్మజ్ఞానము కలవారికే విషయములందు మిథ్యాజ్ఞానము కలుగును. అందువలన శరీరమున నాత్మాభిమానము వైషయిక మిథ్యాజ్ఞానమునకు కారణమని యెఱిగి ముముక్షువులు ఆత్మతత్త్వజ్ఞానమును సంపాదింప వలయును.

(అవయవపరీక్షణ)

"విద్యాఽవిద్యాద్వైవిధ్యాత్ సంశయః" ౪.౨.౪.

విద్యాఽవిద్యాద్వైవిధ్యాత్ = ఉపలబ్ధి, యనుపలబ్ధి యను సదసద్విషయములు రెండువిధము లగుటచే, సంశయః=పరమాణు పుంజముకంటె వేరుగా నొక యవయవి యున్నదా? లేదా? యని సంశయము.

ఉపలబ్ధమగు వస్తువు ఒకచో నదియుండి యుపలబ్ధమగును. మఱియొకచో నదిలేకుండియు నుపలబ్ధ మగును. ఉదా:— సరస్సున నుదకముండి యుపలబ్ధమగును. ఎండమావులలో జలము లేకున్నను నది యున్నట్లుపలబ్ధమగును. ఈ విధముగానే యొకచో వస్తువుండియు నుపలబ్ధముకాదు. అందువలన నుపలబ్ధమగు నవయవియు నున్నదా? లేదా? యని సందియము కలుగును.

పరమాణు పుంజమునకు మించి యొండు అవయవి లేదని పూర్వపక్షము. కలదనిసిద్ధాంతము.

"తదసంశయః పూర్వహేతుప్రసిద్ధత్వాత్" ౪.౨.౫.

పూర్వహేతు ప్రసిద్ధత్వాత్ =పూర్వోక్తహేతువులచే నవయవి సిద్ధించుటవలన, తదసంశయః = సంశయముతగదు.

కొండొకవస్తువును గురించి సామాన్యముగా తెలిసి విశేషముగా తెలియకున్న నందు సంశయము కలుగును. సంశయ లక్షణము నిట్లే పూర్వము వర్ణించియుంటిమి. ద్వితీయాధ్యాయమున నవయవిని గురించి యనేక హేతువులను ప్రదర్శించి యదియున్నదని విశేషరూపమున సిద్ధపరుపబడినది. కాబట్టి విశేషరూపమున తెలిసిన విషయమున సంశయము కలుగనేరదని సిద్ధాంతి యభిప్రాయము.

పూర్వపక్షము:—

"వృత్త్యనుపపత్తేరపి తర్హినసంశయః" ౪.౨.౬.

తర్హి = అట్లయిన, వృత్త్యనుపపత్తేరపి=అవయవి యవయవములలో నుండుట పొసగనందుననే, నసంశయః = సంశయమేర్పడదు.

అవయవము లందుండు ననయవి యా యవయవము లలో ప్రత్యవయవము నందును సంపూర్ణముగా నుండునా? లేక కొంతభాగమే యుండునా? అవయవి సంపూర్ణముగ ప్రత్యవయవమున నుండు ననవలనుపడదు. కారణమేమన, అవయవము లణుపరిమాణము కలవి అవయవి మహత్పరి మాణముకలది. అణుపరిమాణమున మహత్పరిమాణమెట్లుండ గలదు? సంపూర్ణముగ నుండక యేకదేశముగ (కొంత) ఉండు నందుమా! యదియును పొసగదు. ఏకదేశమన్నను అవయవ మన్నను ఒక్కటియే. ఇట్లు ఒక యవయవమున మఱియొకటి, అందింకొకటి యని అనవస్థ యేర్పడును. కాబట్టి యవయవము లందు తద్భిన్నముగా నవయవి యొకటి లేదనియే తెలుచున్నది. అందువలననే సంశయము తగదని యనవలసివచ్చును.

అవయవములలో నుండకున్నను అవయవి వేరుగా నుండుటచే సంశయ మేర్పడవచ్చు నందురేని,

"పృథక్ చావయవేభ్యోఽవృత్తేః" ౪.౨.౭.

అవయవేభ్యః పృథక్ = అవయవములను విడిచి యన్యస్థలమునను, అవృత్తేః = అవయవి యుండనందున సంశయ మేర్పడదు.

అవయవములందు అవయవి యుండనట్లు అవయవము లను విడిచి యన్యస్థలమున నున్న నది అవయవియే యన నొప్పదు. కాబట్టి అవయవియే లేనందున సంశయము కూడ దనుట సిద్ధము.

అవయవి అవయములకంటె భిన్నమై వాని యందు గానీ, తదితర స్థలమునగానీ సిద్ధింపకున్న సిద్ధింపకుండనిందు

కాని, యభిన్నమై తాదాత్మ్యమున నవయవి యవయవము లం దేలయుండరాదు? ఉండవచ్చును. కాబట్టి సంశయము సిద్ధించు నందు రేని,

"నచావయవ్యవయవాః" ౪.౨.౮.

అవయవీ= అవయవి, అవయవాఃనచ=అవయవములకు భిన్నము కాదు.

అవయవముల ధర్మమే అవయవి యని వ్యవహరింప బడును. ఈధర్మధర్మి భావము నైతము భేదము లేనిచోట వర్తింపదు. తాదాత్మ్యమునందు ధర్మధర్మి భావము కలుగదు. తనకుతాను ధర్మమెట్లగును? అవయవి అవయవాభిన్న మన నేమి? తంతువులు వస్త్రమా? కపాలములు ఘటమా? యెన్నడును కాదు. కాబట్టి అభిన్నమనుటయు సంభవింపదు. ఏవిధముగను నవయవి సిద్ధింపనందున సంశయము పొసగదనవలెను.

ఉత్తరపక్షము:—

"ఏకస్మిన్ భేదాభావాత్ భేదశబ్ద ప్రయోగానుపపత్తే రప్రశ్నః" ౪.౨.౯.

ఏకస్మిన్=ఒకటియైన అవయవియందు, భేదాభావాత్=భేదము లేనందున, భేదశబ్దప్రయోగానుపపత్తేః=భేదశబ్దమును ప్రయోగింప వలను పడదు. కాబట్టి, అప్రశ్నః=అవయవి అవయవములందు సంపూర్ణముగా నుండునా? లేక యేకదేశమున నుండునా? యను ప్రశ్నము సరికాదు

అనేకమును సంపూర్ణముగ గ్రహింపవలసి వచ్చునపుడు కృత్స్నశబ్దమును ప్రయోగింతురు. అనేకములో నొకదానిని చెప్పవలసిన సమయమున ఏకదేశము అందురు. కాబట్టి

కృత్స్న-ఏకదేశ శబ్దములు అవయవి విషయమున ప్రయోగింప వలనుపడదు. అవయవి యొక్కటియె; అనేకముకాదు. అనేకముగా భిన్నముకాని వస్తువునందు, భేదమున్న తావులలో ప్రయోగింపదగు కృత్స్న, ఏకదేశశబ్దములు ప్రయోగించుట యుక్తముకాదు. అందువలన అవయవి ప్రత్యవయవమునందు కృత్స్నముగా (సంపూర్ణముగా) నుండునా? లేక ఏకదేశముగా నుండునా? యని ప్రశ్నించుటయే యొప్పదు.

"అవయవాంతర భావేఽప్యవృత్తే రహేతుః" ౪.౨.౧౦.

అవయవాంతరభావేఽపి = మరియొక యవయవ మున్నప్పటికి, అవృత్తేః = అవయవి అవయవము లందుండ కంగున, అహేతుః = అవయవాంతర సద్భావము హేతువుకాదు.

మఱియు, అవయవికి అవయవాంతరము ఉన్నదని యొకవేళ కల్పించినను, అవయవికి అవయవములందు వృత్తి నంగీకరింప వలనుపడదు. వృత్తి నియామక సంబంధమట కానరాదు. సాక్షాత్సంబంధము వృత్తి నియామక సంబంధమగును. అవయవికి అవయవములతో సాక్షాత్సంబంధమొందు కానరాదు. ఒకదానికి అనేకమునందు ఆశ్రయాశ్రిత సంబంధలక్షణముగల ప్రాప్తి వృత్తి యనబడును. ఏది దేనియందు స్వస్వరూపమును బొందగలుగునో యది దానికాశ్రయము. కార్యము కారణ ద్రవ్యమునందు స్వస్వరూపమును బొందును. కాబట్టి కారణద్రవ్యము కార్యమునకు ఆశ్రయము. కార్యము ఆశ్రితము. కాబట్టి అవయవియొక్కడ ఎట్లుపలబ్ధమయున నట్లంగీకరింప వలయును. సమస్తావయవము

లందును ఆశ్రయాశ్రిత భావసంబంధము (సమవాయము)తో అవయవి యుపలబ్ధ మగుచున్నట్లు ద్వితీయాధ్యాయమున ('సర్వాగ్రహణ మవయవ్యసిద్ధేః' ౨.౧.౩౪.) చక్కగా వివరింపబడినది. కాబట్టి దోషము లేదని భావము.

పూర్వపక్షము:—

"కేశసమూహే తైమిరికోపలబ్ధివత్ తదుపలబ్ధిః" ౪.౨.౧౧.

కేశసమూహే = కేశసముదాయమునందు, తైమిరికోపలబ్ధివత్ = తిమిరమను నేత్రరోగముగల వ్యక్తికి చాక్షుషజ్ఞానము కలుగునట్లు, తదుపలబ్ధిః = పరమాణు పుంజాత్మకమగు నవయవియు చక్షువుచే తెలియబడును.

నేత్రములందు తిమిర (చీకటి) రోగము కలవానికొక్కొక్క కేశము కనిపింపకున్నను కేశములు చేర్చి గుంపుగా జేసిన నతనికి కనిపించును. అట్లే ప్రత్యేక పరమాణువు చక్షుర్గోచరము కాకున్నను పరమాణు పుంజము మాత్ర మెల్లరి నేత్రములకు గోచరింపగలదనిన హాని యుండదు. కాబట్టి ఘట పటాదుల యుపలబ్ధి అవయవి విషయము కాక పరమాణు పుంజ విషయకమని యెంచవలయును.

ఉత్తరపక్షము:—

"స్వవిషయానతిక్రమేణేంద్రియస్య పటుమందభావాత్ విషయ గ్రహణస్య తథాభావో నావిషయే ప్రవృత్తిః" ౪.౨.౧౨.

ఇంద్రియస్య = ఇంద్రియమునకు, స్వవిషయానతిక్రమేణ = స్వవిషయము నతిక్రమింప వీలుకానందున, పటుమందభావాత్ = ప్రకృష్ట నికృష్ట భావమువలన, విషయగ్రహణస్య = విషయగ్రహణమునకు, తథా

భావః = ప్రకృష్ట నికృష్ట భావము కలుగును. అవిషయే = ఉపలబ్ధి యోగ్యము కాని విషయమునందు, న ప్రవృత్తిః = ప్రవృత్తి కలుగదు.

ఇంద్రియములు పటుత్వము కలవియై యుండును. లేదా పటుత్వము లేక మందస్వభావము కలవియై యుండును. ఇట్లు ఇంద్రియములందు బలమున్నను, లేకున్నను నవి స్వవిషయములనే గ్రహించును. అన్య విషయములను గ్రహింపవు. ఎంతబలము గలదైనను చక్షువు తనకు విషయము కాని గంధమును గ్రహింపనేరదు కదా! ఇంద్రియమున శక్తి (పటుత) బాగుగా నున్నపుడు సూక్ష్మ విషయమును గ్రహింపగలుగును. శక్తి తరిగి మందమైయున్న స్థూల వస్తువునే గ్రహింపగలుగును. నేత్రమునందు దోషము లేకున్న కేశము సూక్ష్మమయ్యు గోచరము కాకపోదు. వస్తువింద్రియముచే గ్రహింపబడవలయునన్న దానియందు మహత్త్వ ముండవలెను. కేశమునందది యున్నది. అందువలననే యది చక్షుర్గోచరమగుచున్నది. అట్టి మహత్త్వము పరమాణువునందు లేదు. కాబట్టి యది గ్రహింపబడదు. పరమాణు పుంజముకంటె భిన్నముగా ఘటము - పటము నని యుపలబ్ధి కలుగుచున్నది. ఆ యుపలబ్ధివలన అవయవి పుంజాతిరిక్తముగా నున్నదని తెలియును.

పూర్వపక్షము:—

"అవయవావయవి ప్రసంగశ్చైవమాప్రలయాత్" ౪.౨.౧౩

ఏవమ్ = ఇట్లవయవి నంగీకరించిన, ఆప్రలయాత్ = ప్రలయ పర్యంతము, అవయవావయవి ప్రసంగః = అవయవావయవి ప్రసక్తి కలుగును.

అవయవి నంగీకరించు పక్షమున, ఘటము దాని యవయవములకు అవయవియగును. దాని యవయవములును వాని యవయవములకు అవయవులు. ఇట్లే యా యవయవములు వాని యవయవములకు అవయవులగును. ఇట్లు పోగాపోగా ప్రలయమున విశ్రాంతి కలుగును. సర్వభావ వస్తువుల వినాశము ప్రలయ మనబడును. ఇట్లు సర్వనాశము కాగా భావ పదార్థములుండనందున పునఃసృష్టి కలుగనేరదని చెప్పవలెను.

ఉత్తరపక్షము:—

"న ప్రలయోఽణు సద్భావాత్" ౪.౨.౧౪.

అణుసద్భావాత్ = మూలకారణ మయిన పరమాణు వుండుట వలన, ప్రలయః న = ప్రళయముండదు

అవయవ రహితములైన పదార్థములు నశింప వీలు లేనందున, సమస్త భావపదార్థముల నాశము ప్రళయ మన జనదు. సమస్త సావయవ భావపదార్థముల నాశము ప్రళయ మనబడును. మృణ్మయములగు ఘటము, శరావము (మూకుడు) మున్నగు వస్తువులు నాశమును బొందిన మృత్తికలో విలయమగును. అట్లే కుండలాదిభూషణములు నాశమై కనకమున నంతర్భూతము లగును. వీని కన్నిటికి మూల కారణము ప్రకృతి యను పేరుగల పరమాణువులు. అవి నిరవయవములు. వానిలో నవయవావయవి భావముండదు. ఈమూల కారణమయిన ప్రకృతియందు సమస్త కార్యపదార్థములు లయించును (అప్యయమందును). ఆ మూలకారణమైనప్రకృతి

కారణము లేనిదగుటచే నశింపదు. అదియే భావపదార్థముల అవయవావయవిభావప్రసంగమునకు విశ్రామస్థానము. అది ప్రలయమునందు నుండును. కాబట్టి పునః సృష్టి కలుగుట కెట్టి యాటంకము నుండదు.

"పరం వా త్రుటేః" ४.२.१७.

త్రుటేః = త్రసరేణువుకంటె, పరం = సూక్ష్మము.

గవాక్షాది ఛిద్రములనుండి ప్రసరించు సూర్య కిరణములలో నెగురుచుండు దుమ్మురేణువు త్రసరేణువు (త్రుటి) అనబడును. తైత్తిరీయ, ఛాందోగ్య ఉపనిషత్తులలో చెప్పిన క్రమము ననుసరించి వైదికు లీ త్రుటినుండియే పంచమహాభూతోత్పత్తి నంగీకరింతురు. ఈ త్రసరేణువునకు కారణమగునది ద్వ్యణుక మనబడును. ఈద్వ్యణుకమునే సాంఖ్య, యోగ వేదాంతములలో తన్మాత్రమనియు, భూతసూక్ష్మమనియు నందురు. ఈద్వ్యణుకమునకు కారణభూతమైన నిరవయవ సూక్ష్మద్రవ్యము పరమాణు వనబడును. విభజింప వీలుపడని యత్యంత సూక్ష్మమగు నిరవయవ పదార్థము పరమాణు వన్నమాట.

పూర్వపక్షము:— (సర్వశూన్యవాది)

"ఆకాశవ్యతిభేదాత్ తదనుపపత్తిః" ४.२.१८.

ఆకాశ వ్యతిభేదాత్ = ఆకాశ మంతః సమావిష్టమై యుండుట వలన, తదనుపపత్తిః = ప్రలయమున పరమాణువు లుండుననుట యుపపన్నము కాదు.

ఆకాశముయొక్క- అంతఃసమావేశము వ్యతిభేదమన బడును. ఘట పటాదులవలె నాకాశముచే వ్యతిభిన్నమగు నదంతయు సావయవము కావలసి యుండును. పరమాణువు లును ఆకాశ వ్యతిభిన్నములగుటవలన నవియు సావయవము లగును. సావయవము ప్రలయమున నశించుననుట ధ్రువము. కాబట్టి పరమాణువులు ప్రలయమున నుండుననుటపొసగదు.

"ఆకాశా సర్వగతత్వంవా" ౪.౨.౧౭

వా = అట్లుకాని పక్షమున, ఆకాశాసర్వగతత్వం = ఆకాశము సర్వగతము కాదని యంగీకరింపవలసి వచ్చును.

ఆకాశము పరమాణువునందు లేదంచు రేని యదిసర్వ గతము కానేరదు. ఆకాశము సర్వగతమనుట నిర్వివాదము. కాబట్టి పరమాణువు సావయవ మనియే యంగీకరింపవలెను.

ఉత్తరపక్షము:—

"అంతర్బహిశ్చ కార్యద్రవ్యస్య కారణాంతర వచనాత్ అకార్యేతదభావః" ౪.౨.౧౮.

కారణాంతర వచనాత్ =బహిరంతః శబ్దములచేత కార్యముకంటె భిన్నమైన యవయవ లక్షణముగల కారణవిశేషము చెప్పబడుట వలన, కార్యద్రవ్యస్య=కార్యద్రవ్యమునకే, అంతర్బహిశ్చ=లోపల, వెలుపల లుండును. అకార్యే=కార్యద్రవ్యము కానిదానియందు, తదభావః= అంతరబాహ్యము లుండవు.

అవయవాంతరములచే పిహితమగు (కప్పబడు) అవ యవము అంతః శబ్దముచే వ్యవహరింపబడును. అట్లుకప్పబడ కుండు నవయవము బహిఃశబ్దముచే చెప్పబడును. సంస్కృత మున వ్యవహితావయవములు, వ్యవధాయ కావయవములు

(అంతర్బహిః) అనబడును. తెలుగున లోపల, వెలుపల అన బడును. ఈ యంతర్బహిర్వ్యవహారము సావయవములగు కార్యద్రవ్యములకే వర్తించును. కాబట్టి ఆకాశము కార్య ద్రవ్యమునం దంతః సమావిష్టమై తద్వ్యతిభిన్న మనబడును. నిరవయవము లయిన పరమాణువులం దీయంతర్బహిర్వ్యవ హారమే యనుపపన్నము కాబట్టి 'ఆకాశవ్యతిభేదాత్' అని చెప్పినది యుక్తముకాదు.

"శబ్దసంయోగ విభవాచ్చ సర్వగతమ్" ౪.౨.౧౯.

శబ్దసంయోగ విభవాత్ = శబ్దమువలె మూర్తద్రవ్య సంయోగముల విభుభావము (సర్వత్ర ఉండుట) వలన, సర్వగతమ్ = ఆకాశము సర్వగతము.

శబ్దము లాకాశమున సర్వత్ర ఉండును. శబ్ద సంయో గములేని తావొండునులేదు. అట్లే శబ్దాశ్రయ మగు నాకా శము యొక్క సంయోగమును సర్వమూర్తద్రవ్యములకు నుండుననుట నిర్వివాదము. సర్వ మూర్తద్రవ్య సంయోగ ముండుటవలననే ఆకాశము సర్వగత మనబడుచున్నది. సర్వాంతః సమావేశమువలన కాదు.

ఆకాశము సర్వగత మగునెడల ప్రతిఘాతియు, గతి మంతమునగు ద్రవ్యముచే నదియేల మరలింపబడదు? దానిచే గతిమంతమగు ద్రవ్యమేల నిరోధింపబడదన,

"అవ్యూహావిష్టంభ విభుత్వాని చాకాశధర్మాః" ౪.౨.౨౦.

అవ్యూహావిష్టంభవిభుత్వాని = అవ్యూహము, అవిష్టంభము, విభు త్వము నను నీ మూడును, ఆకాశధర్మాః = ఆకాశమునందలి యసాధా రణ ధర్మములు.

ఎదురుతాకిడిచే వెనుకకు మరలుట వ్యూహమన బడును. దానికి భిన్నమైనది అవ్యూహము. ముందునకు పోకుండ నడ్డగించుట విష్టంభము. అదికానిది అవిష్టంభము. సర్వమూర్త ద్రవ్యములతో సంయోగము విభుత్వము.

స్పర్శగలిగిన ద్రవ్యము గతిమంతమగు ప్రతిఘాతిద్రవ్యముచే నెదుర్కొనబడివ్యూహాంతరమును బొందును. గతిమంతమగు ద్రవ్యము నడ్డగించును. ఉదాః— ఉదకము స్పర్శగలదగుటచే గతిమంతమగు ప్రతిఘాతి ద్రవ్యమైన నావచే నెదుర్కొనబడి వెనుకకు మరలును. నావను ముందునకు పోనీకయాపును. ఆకాశ మట్లుకాక నిఃస్పర్శ మగుటచే స్పర్శవంతమగు ద్రవ్యమున నుండుగుణము లందేల యుండవని శంకింపరాదు. కాబట్టి ఆకాశము సర్వగతమైనను అవ్యూహాది విశేష గుణములు కలదగుట వలన నెట్టి దోషమును లేదు.

పూర్వపక్షముః—

"మూర్తిమతాంచ సంస్థానోపపత్తే రవయవసద్భావః
౪.౨.౨౧.

మూర్తిమతాం = పరిచ్ఛిన్నపరిమాణముగల ద్రవ్యములకు, సంస్థానోపపత్తేః = అవయవ సన్నివేశ విశేష ముపపన్న మగుటవలన, అవయవసద్భావః = పరమాణువున నవయవము లుండవలయును.

సర్వగతముకాని ద్రవ్యముల పరిమాణము మూర్తి యనబడును. అట్టిమూర్తి పరిచ్ఛిన్న పరిమాణముగల పదార్థములు సంస్థానము గలవైయున్నవి. ఘటపటాదులన్నియు నిందులకు దృష్టాంతములు. సంస్థానము అన నవయవసన్ని

వేశ విశేషము. అది సావయవ వస్తువులందే యుండగలదు. పరమాణువు సర్వగతము కాకపోవుటచే నదియు మూర్తి-పరిచ్ఛిన్నపరిమాణము కలదేయగును కాబట్టి యదియు సావయవి కావలయును.

"సంయోగోపపత్తేశ్చ" ౪.౨.౨౨.

సంయోగోపపత్తేః = ద్వ్యణుకోత్పత్తికి కారణమైనఅణుద్వయ సంయోగ ముపపన్న మగుటవలనను.

మఱియు, ద్వ్యణుక ముత్పన్నము కావలయుననిన రెండుపరమాణువుల సంయోగ మంగీకరింపవలయును. ఆ సంయోగము పరమాణువు సావయవమయిన కలుగగలదు. లేకున్న కలుగనేరదు. సంయోగము వ్యాప్యవృత్తి కాకపోవుట వలన పరమాణువు లొండొంటితో నేదోయొక యంశమున (ఏకదేశమున)సంయోగమునందగలవు.ఏయంశమున నవి సంయుక్తములగునో ఆయంశము అవయవమే యగునుకాని మరియొండు కాదు. కాబట్టి పరమాణువు సావయవమే.

ద్వ్యణుకోత్పత్తికి కారణమయిన పరమాణువుల పరస్పర సంయోగము వ్యాప్యవృత్తియా? లేక అవ్యాప్యవృత్తియా? వ్యాప్యవృత్తి యందుమేని యొక పరమాణువు మఱియొక పరమాణువుతో సంపూర్ణముగ సంయుక్తమై రెండు పరమాణువులును సమాన దేశ వర్తులగును. ద్వ్యణుకమున ప్రథిమానము = పృథుత (వృద్ధి) యుండనేరదు. కాబట్టి ద్వ్యణుకము సైతము అణువేయగును. అట్లుకాక సంయోగము అవ్యాప్య వృత్తి యందుమా! పరమాణువుసావయవము(అవ

యవములుకలది) అగును. సంయోగి యగుటవలన పరమాణువు అవయవములు కలదే యగును. ఘటమువలె, అని యూహింపనగును:

ఉత్తరపక్షము:—

"అనవస్థాకారిత్వాదనవస్థానుపపత్తేశ్చాప్రతిషేధః"
4.2.23.

అనవస్థాకారిత్వాత్=అనవస్థకు హేతువగుటచేతను, అనవస్థానుపపత్తేశ్చ=అనవస్థ యుపపన్నము కాకపోవుటచేతను, అప్రతిషేధః=పరమాణువు నిరవయవమనుట ప్రతిషేధింప వలను పడదు.

పరమాణువు సావయవమని యంగీకరించిన అవయవ ధారకు విశ్రాంతి యుండనేరదు. అందువలన అనవస్థ యేర్పడగలదు. అది యుక్తముకాదు. యుక్తమంచుమేని మేరువు సర్షపము (ఆవగింజ)నను రెండును అనంతావయవములు కలవగుటచే సమానములగును ఈదోషమును వారించుటకు అవయవధార యొకచో విశ్రాంతి నొందునని యంగీకరింపక తప్పదు. ఇక నవయవవిభాగము కానేరదని యెటనాగుదుమో యదియే పరమాణువు. అందు అవయవములు లేవు. కాబట్టి పరమాణువు నిరవయవమనుట సిద్ధము.

పరమాణువు నిరవయవమైన ద్వ్యణుకోత్పత్తికి హేతువయిన సంయోగముపపన్నముకాదు కావున నది సావయవమే యనుట యుచితముకాదు. సంయోగము వ్యాప్యవృత్తియైనను, లేక అవ్యాప్యవృత్తియైనను ఉభయవిధము లందును

దోషములేదు. వాస్తవమున ప్రదేశము నాక్రమించుద్రవ్యము మఱియొకప్రదేశవంతమగుద్రవ్యముతో సంయుక్తమైనపుడా సంయోగము అవ్యాప్యవృత్తియగును. నిష్ప్రదేశ వంతమగు ద్రవ్యముల సంయోగమట్టిదికాదు. పరమాణువు నిష్ప్రదేశము. కాబట్టి పరమాణువుల సంయోగము అవ్యాప్యవృత్తి కానేరదు. పరమాణుద్వయ సంయోగము వ్యాప్యవృత్తియైన రెండు పరమాణువులును సమానదేశ వర్తులగుటచే పృథుత యడ్డగింపబడు ననుటయు సరికాదు. సంయోగము వలన కలుగుపదార్థముల సమానదేశత ప్రథిమావిరోధి కాదు. సమవాయము వలనకలుగు పదార్థ సమానదేశత ప్రథిమా విరోధి. కుండలో రేగుపండ్లు నుంచిన వాని సంయోగము వలన కుండకు, బదరీఫలములకు సమానదేశత కలిగినను బదరీఫలముల స్థౌల్యము నది వారింపదుకదా! కాని, సమవాయ సంబంధమువలన ద్రవ్యమునగల రూప రస గంధముల సమానదేశత వానిలో ప్రథిమానము నడ్డగించును. ద్వ్యణుకములోని పరమాణువులు సమవేతములుకావు. కాబట్టి వాని ప్రథిమానమేల యడ్డగింపబడును? అందువలన పరమాణువుల సంయోగము వ్యాప్యవృత్తియైనను, లేక అవ్యాప్య వృత్తియైనను ఉక్తదోషములు కలుగనేరవని భావము. సంయోగము అవ్యాప్యవృత్తి యనియే యెంచుము అయినను పరమాణువు సావయవము కావలసిన యవసరముండదు. తమః ప్రకాశములు సావయవములుకావు. కాని వాని సంయోగము అవ్యాప్యవృత్తియే. దిశనువలె పరమాణువునందు ఔపాధి

కావయవములను కల్పించి తత్సంయోగము నంగీకరించినను దోషముండనేరదు. కాబట్టి పరమాణువులు నిరవయవము లనియే వివేకము.

పూర్వపక్షము:—

(విజ్ఞానవాది)

"బుద్ధ్యావివేచనాత్తు భావానాం యాథాత్మ్యానుపలబ్ధి స్తంత్వపకర్షణే పటసద్భావానుపలబ్ధివత్ తదనుపలబ్ధిః"
౪.౨.౨౮.

తంత్వపకర్షణే=తంతువులను వేరుచేసిన, పటసద్భావానుపలబ్ధివత్=వస్త్రముస్థితి లభింపనట్లు, బుద్ధ్యా=బుద్ధితో, వివేచనాత్=వివేచించి నందువలన, భావానాం=ఘటాది వస్తువుల, యాథాత్మ్యానుపలబ్ధిః=సద్భావము ఉపలబ్ధముకాదు. కాబట్టి, తదనుపలబ్ధిః=ఘటపటాది వస్తువులే లేవు.

వస్త్రము నందలి తంతువులను వేరుచేసిన తంతువులు తక్క వేరువస్త్రమనునది స్వరూపమున గోచరింపదు. వాస్తవమున వస్త్రమను నొక భావములేదని తెలియుచున్నది. వస్త్రమని కలుగు ప్రతీతి మిధ్యాప్రతీతి యనిభావము. వస్త్రమనునది ప్రతీతిమాత్రమే కాని వస్తువ్రెండు లేదని వివేకము. ఇట్లే యితర ఘటాది సమస్త భావపదార్థములును తత్వబుద్ధితో విచారించిన వాని యాథాత్మ్యము కనిపింపదు. వాస్తవమున నీ భావపదార్థము లన్నియు నుండు పక్షమున గోవుకంటె భిన్నముగా నశ్వ ముపలబ్ధమైనట్లు కపాల తంత్వాదులకంటె వేరుగా ఘటపటాదు లుపలబ్ధములు కావలసి యుం

డును. అట్లు ఉపలబ్ధము లగుటలేదు కావున నవి యాథాత్మ్య ములన లేవని యెఱుగవలయును. ఇట్లు పరమాణువుల వరకు బుద్ధితో ప్రతిభావమును వేరుచేసి చూచిన స్థూలపదార్థము కాని, సూక్ష్మ పదార్థముగాని యొక్కటియు స్వస్వరూప మున నుపలబ్ధములు కావు. అట్టియెడ వానిజ్ఞానమును యథా ర్థము కానేరదు. అందువలన విజ్ఞానము తక్క బాహ్యవస్తువు లేదనిభావము.

ఉత్తరపక్షము:—

"వ్యాహతత్వా దహేతుః" ౪.౨.౨౬.

వ్యాహతత్వాత్ = వ్యాఘాత దోషదూషిత మగుటవలన, అహేతుః='బుద్ధితో వివేచించుట వలన' ననుహేతువు అహేతువు.

ఏ బుద్ధితో వివేచించినందువలన పదార్థముల యాథాత్మ్య ముపలబ్ధముకాదో ఆబుద్ధి యథార్థమా లేక అయథార్థమా? యథార్థ మగునెడల బుద్ధియాథాత్మ్య ముపలబ్ధమైన ట్లగుచున్నది. అట్టియెడ సర్వభావముల యాథాత్మ్య మనుపలబ్ధ మనుట విరుద్ధము-వ్యాహతమగును. అయథార్థమగునెడల, స్వయ మయథార్థమై యన్యభావముల యాథాత్మ్యము నెట్లు సిద్ధపరుప గలుగును? కాబట్టి రెండవ పక్షము సుతరాం విరుద్ధమగును. ఇంతయేల? బుద్ధితో చేయ బడు వివేచనము సావధికమా? నిరవధికమా? వివేచనము నిరవధిక మెన్నడును కాదు. కాబట్టి సావధికమే కావలయును. పట వివేచనమునకు తంతువులు అవధికాకున్న నదియెట్లు వివే చింపనగును. సావధిక పక్షమున నేది అవధియగునో అది

యాధాత్మ్యమున(స్వస్వరూపమున) నుపలబ్ధ మగుటచే సర్వ భావముల యనుపలబ్ధి యనుట వ్యాహత మగును. కాబట్టి బుద్ధితో వివేచించిన స్వభావముల యాథాత్మ్య మనుపలబ్ధము కాదనుట యుక్తము కాదని తెలియుచున్నది.

బుద్ధితో వివేచించినచో తంతువులకంటె వస్త్రము వేరుగా సిద్ధము కాదనుటయు తగదు. ప్రతీతి, అర్థక్రియ యను నిరెంటిద్వారా అది సిద్ధించును. తంతువులవలన పటము కలుగునను ప్రతీతి లోకసిద్ధమే. తంతువులకంటె పటము వ్యతిరిక్తముకాకున్నచో నిట్టిప్రతీతి కలుగదు. 'తంతువులు పటము' అని కలుగవలసి యుండును. అర్థక్రియ యన ప్రయోజనసిద్ధి వస్త్రము వలన సిద్ధించు ప్రయోజనము తంతువుల వలన సిద్ధింపదు. వస్త్రముచే నొకవస్తువు కప్పబడినట్లు తంతువులచే కప్పబడునా? ఘటముచే జలానయనాదులు సిద్ధించునట్లు కపాలముల వలన నగునా? కాబట్టి తంతువులకంటె వస్త్రము, కపాలములకంటె ఘటము వ్యతిరిక్తమగుట తేటతెల్లము. ఇట్లే సర్వభావపదార్థములును స్వకారణములకంటె భిన్నములనియే తెలియనగును. కారణముకంటె భిన్నముగా వస్తువుల యాథాత్మ్యములు గోచరము లగుటచె నానియుపలబ్ధులును, యథార్థము లగును. కాబట్టి బాహ్యకార్యము లేకున్నను ఉన్నట్లు గోచరించి వస్తువులు మిథ్యాభూతము లైనందున విజ్ఞానమొక్కటి సత్యమనుట ప్రమాణ విరుద్ధమని భావము.

"తదాశ్రయత్వాదపృథగ్ గ్రహణమ్" ౪.౨.౨౬.

తదాశ్రయత్వాత్=తంత్వాదు లాశ్రయను లగుటవలన, అపృథక్ గ్రహణమ్=పటాది వస్తువులు వేరుకా నేరవు

పరస్పర మాశ్రయాశ్రిత భావ సంబంధములేని వస్తువులు ఒకదానికంటె నొకటి భిన్నముగా గ్రహింప బడును. ఘటము పటముకంటె వేరుగా సిద్ధింపగలదు. పై సంబంధమున్న యెడల నట్లువేరుగా గ్రహింపబడవు. కార్యకారణములు ఆశ్రయాశ్రిత భావ సంబద్ధములు. అందాశ్రితములు ఆశ్రయమును విడిచి యన్యత్ర వేరుగా నాత్మసిద్ధిని బొందనేరవు. కాబట్టి తంత్వాదులకంటె పటాదులు భిన్నములయ్యు వేరుగా గ్రహింపబడవని భావము.

"ప్రమాణ తశ్చార్థ ప్రతిపత్తేః" ౪.౨.౨౭

ప్రమాణతః=ప్రత్యక్షాది ప్రమాణముల వలన, అర్థప్రతిపత్తేః= వస్తుజ్ఞానము కలుగుట వలన.

ప్రమాణమువలన తెలియబడు దానిని కాదన వశము కాదు. ఘటపటాది పదార్థములు విజ్ఞాన వ్యతిరిక్తములుగా ప్రమాణముల వలన తెలియబడుచున్నవి. వ్యతిరిక్తములు కాకున్న నట్లేల తెలియనగును? శశవిషాణాదులు (కుందేటి కొమ్ము) ఎటనైన నుపలబ్ధము లగుచున్నవా? కాబట్టి, ప్రమాణముల వలన పదార్థము లు విజ్ఞాన వ్యతిరిక్తములుగా తెలియుచుండగా కాదనుట తగదు.

"ప్రమాణానుపపత్త్యుపపత్తిభ్యామ్" ౪.౨.౨౮

సాధించు ప్రమాణముల యుపపత్త్యనుపపత్తులద్వారా పదార్థములు విజ్ఞాన వ్యతిరిక్తములనుట యనుపపన్నము కాదు.

'సర్వభావ పదార్థములు విజ్ఞాన వ్యతిరిక్తములుకావు,' అని చెప్పు వ్యక్తి తాజెప్పు వాదమును సాధించుట కేదైన ప్రమాణ మంగీకరించునా? లేదా? చెప్పవలసియుండును. ప్రమాణ మంగీకరింపనిపక్షమున తాజెప్పునది సిద్ధింపనేరదు. అట్టిదాని నెవరంగీకరింతురు? ప్రమాణమొండు కలదనిన విజ్ఞానవ్యతిరిక్తముగా నెక్కవస్తువును లేదనుట విరుద్ధమగును. విజ్ఞాన వ్యతిరిక్తముగా తానంగీకరించిన ప్రమాణమే సిద్ధించుచున్నదిగదా? కాబట్టి సర్వభావ పదార్థములు విజ్ఞానమే యనుట అయుక్తము.

పూర్వపక్షము:—

"స్వప్నవిషయాభిమానవ దయంప్రమాణప్రమేయాభిమానః" ౪.౨.౨౯.

స్వప్న విషయాభిమానవత్ =స్వప్నమున విషయములు లేకున్నను వానిజ్ఞానము కలుగునట్లు, అయంప్రమాణ ప్రమేయాభిమానః = ఈ ప్రమాణ ప్రమేయజ్ఞానము కలుగును

కలలో వస్తువులుండవు; కాని సంస్కారబలమున ఉన్నట్లు భాసించును. అట్లే జాగ్రదవస్థయందును ప్రమాణ ప్రమేయములు వాస్తవమున లేకున్నను అనాది వాసనాబలమున నున్నట్లు గోచరించును. కల్పనా మాత్రమున తోచు ప్రమాణ ప్రమేయ భావము వాస్తవముకాదు. కాబట్టి విజ్ఞాన వ్యతిరిక్తముగా నెక వస్తువును సిద్ధింపదు.

"మాయాగంధర్వ నగర మృగతృష్ణికావద్వా" ౪.౨.౩౦.

వా= లేక, మాయా......వత్ =ఇంద్రజాలికునిచే నిర్మింపబడిన నగరమువలెగానీ, ఎండమావులవలెగానీ, ప్రమాణప్రమేయ భావమని యెరుంగునది.

జాగ్రదవస్థ యందు గారడి వానిచే నిర్మింపబడు మాయా నగరాదులు వాస్తవములు కాకున్నను ఉన్నట్లు తోచును. ఎండమావులలో జలము లేకున్నను ఉన్నట్లు జ్ఞానముదయించును. అట్లే ఈఘటపటాది వస్తుజాతమును వాస్తవమున నయధార్థము లయ్యు అనాదివాసనా బలమున నున్నట్లు భాసించు చున్నవి. కాబట్టి విజ్ఞానమే సత్యము. దానికి భిన్నముగా భావపదార్థ మొండును లేదు.

ఉత్తరపక్షము:—

"హేత్వభావాదసిద్ధిః" ౪.౨.3౧.

హేత్వభావాత్ =కారణము లేనందున, అసిద్ధిః=ప్రమాణ ప్రమేయాభిమానము సిద్ధింపదు.

ప్రమాణ ప్రమేయ జ్ఞానము కార్యము. కాబట్టి దానికొక కారణము—హేతువుండవలయును కారణము లేని కార్యమొండు కానరాదు. విజ్ఞానవాది మతమున ప్రమాణ ప్రమేయాభిమానమునకు కారణము కనిపింపదు. విజ్ఞానముతక్క మఱియొక భావమే వారి మతమున నంగీకరింపబడదు. విజ్ఞానమొక్కటే ప్రమాణ ప్రమేయ జ్ఞానమునకు కారణము కాజాలదు. విచిత్రమైన అనాది వాసన దానికి కారణమందురేని, ఆ వాసన విజ్ఞాన వ్యతిరిక్తమా ? లేక అభిన్నమా? వ్యతిరిక్తమనిన విజ్ఞాన వ్యతిరిక్తముగా నొక భావపదార్థము సిద్ధించును.

అప్పుడు విజ్ఞాన వ్యతిరిక్తము లేదనుట వ్యాహతమగును. వాసన వ్యతిరిక్తముకాని పక్షమున విజ్ఞానమువలన నానా విచిత్ర వస్తుజాతమెట్లుత్పన్నమగునో చెప్పవలసియుండును. స్వరూపమున విచిత్రముకాని విజ్ఞానము విచిత్రము కావలసి వచ్చును. మఱియు నీ వాసన దేనిది? అదియొకదానికి సంబంధించినది కాని పక్షమున వాసనయే కాజాలదు. వాసన నిరపేక్షమనుట తగదు. భావజాతమునకు సంబంధించిన దందుమా? అప్పుడు విజ్ఞాన వ్యతిరిక్తముగా భావజాతము సిద్ధించును. కాబట్టి విజ్ఞానమెట్లు పరమార్థమో యట్లే విజ్ఞాన వ్యతిరేకముగా భావజాతమును పరమార్థ సత్యమనియే భావింపవలయును.

"స్మృతిసంకల్పవచ్చ స్వప్నవిషయాభిమానః" ౪.౨.౩౨.

స్మృతి సంకల్పవత్ = స్మృతి సంకల్పవిషయములవలె, స్వప్న విషయాభిమానశ్చ = స్వప్నవిషయజ్ఞానమును అసద్విషయముకాగు.

పూర్వమొకమాటు ఎరిగిన విషయమును మరువకుండుట స్మృతి యనబడును. పూర్వానుభూత విషయమును మరల చింతించుట సంకల్ప మనబడును. కాబట్టి స్మృతి సంకల్పములు అసద్విషయములు కావు. అట్లే స్వప్నజ్ఞానమును అసద్విషయముకాదు. జాగ్రదవస్థయందు వేనిజ్ఞానము కలుగునో ఆవస్తువులే స్వప్నమున తికమకలుగా తెలియును. స్వప్నమున తనతల నరుకబడినట్లు చూతుమే! యది జాగ్రదవస్థయందెన్నడు జరిగినదని యనవలదు. తల, నరకబడుట మున్నగు విషయములు వేరువేరుగా తెలిసికొనియుందుము.

ఆవిషయములే భిన్నక్రమమున స్వప్నమునతోఁచును. కాబట్టి స్వప్నజ్ఞానము అసద్విషయమని యెంచి యట్లే ప్రమాణ ప్రమేయ జ్ఞాన మసద్విషయమనుట సముచితము కాదు. భావ పదార్థము లన్నియు వాస్తవములే ప్రమాణ ప్రమేయ జ్ఞానమును వాస్తవమేయని భావము. అందువలన, పరమాణుపుంజ వ్యతిరిక్తముగా నొక యవయవి యున్నది. తన్మిథ్యాజ్ఞానము కారణముగా, చేతనాచేతనాత్మక బాహ్యవిషయము లందును మిథ్యాజ్ఞానము కలుగుచున్నదని తెలియుంగవలయును.

"మిథ్యోపలబ్ధే ర్వినాశస్తత్త్వ జ్ఞానాత్, స్వప్నవిషయాభిమాన వినాశవత్ ప్రబోధే" ౪.౨.౩౩.

(ప్రబోధే=జాగ్రత్ప్రత్యయము కలిగిన, స్వప్నవిషయాభిమాన వినాశవత్=స్వప్నవిషయజ్ఞానమెట్లు నశించునో అట్లు, తత్త్వజ్ఞానాత్=తత్త్వజ్ఞానము వలన, మిథ్యోపలబ్ధేర్వినాశః=మిథ్యాజ్ఞాన నాశముకలుగును.

నిద్రనుండి మేల్కాంచిన తదుపరి కలుగు జ్ఞానము ప్రబోధ మనబడును. ప్రబోధము కలుగగానే స్వప్నజ్ఞానము నశించును. అట్లే ఆత్మ (తత్త్వ) జ్ఞానము కలుగగానే శరీరేంద్రియాదులందు కలుగు మిథ్యాజ్ఞానము నశించును. తమఃప్రకాశములవలె తత్త్వజ్ఞాన మిథ్యాజ్ఞానములు రెండును పరస్పర విరుద్ధములు. కాబట్టి యొకటి యుండిన రెండవది నశించును.

తత్త్వజ్ఞానము కూడ జ్ఞానమేయగుట వలన మిథ్యాజ్ఞానము నశించినట్లు అదియు నేలనశింపదు? నశించినచో తత్త్వసంపాదనము నిరర్థకమేల కాదు? అన,

"బుద్ధేశ్చైవం నిమిత్త సద్భావోపలంభాత్" ౪.౨.౩౪.

నిమిత్త సద్భావోపలంభాత్ = యథార్థజ్ఞాన మగుటవలన, బుద్ధేః = తత్వజ్ఞానమునకు, ఏవం = మిథ్యాజ్ఞానమువలె వినాశము లేదు

విషయము స్వరూపమునకు విపరీతమైన రూపము విషయముగా నుండును కాబట్టి మిథ్యాజ్ఞానము యథార్థ జ్ఞానముచే నివర్తింపబడును. విషయ మున్నదున్నట్లు తెలిసిన నది సత్యజ్ఞానము. అది నశింపదు. ఆత్మజ్ఞానము యథార్థము కాబట్టి అది నశింపనేరదని భావము.

"తత్వ ప్రధాన భేదాచ్చ మిథ్యాబుద్ధేర్ద్వైవిధ్యోపపత్తిః"

౪.౨.౩౫

తత్వప్రధానభేదాచ్చ = గౌణ ముఖ్య - నిమిత్త నైమిత్తిక భేదము వలన, మిథ్యాబుద్ధేః = మిథ్యాబుద్ధి, ద్వైవిధ్యోపపత్తేః = రెండువిధములగుచున్నది. కాబట్టి, ఆత్మ తత్వజ్ఞానమువలన మిథ్యాజ్ఞాన నివృత్తి దోషము కాదు.

రాగద్వేషాది దోషములకు నిమిత్తములైన జడచేతనాత్మక బాహ్య పదార్థములు సుఖసాధనములని కలుగు మిథ్యాజ్ఞానము గౌణము = నైమిత్తికము. జడములైన శరీరేంద్రియ మనస్సులే ఆత్మ యని తెలిసికొనుట ప్రధాన మిథ్యాజ్ఞానము (నిమిత్త మిథ్యాజ్ఞానము). ఇట్లు మిథ్యాజ్ఞానము రెండువిధములు. ఇందు నైమిత్తిక మిథ్యాజ్ఞానము విషయ తత్వజ్ఞానమువలన తొలగిపోవునని పూర్వసూత్రమున (౪.౨.౧) చెప్పబడినది. ప్రస్తుతము ఆత్మ తత్వజ్ఞానమువలన ప్రధాన మిథ్యాజ్ఞానము నివర్తించునని చెప్పబడినది.

"సమాధి విశేషాభ్యాసాత్" ౪.౨.౩౬.

సమాధి విశేషాభ్యాసాత్ = సంప్రజ్ఞాత (నిర్విచార) సమాధి నభ్యసించుట వలన, తత్వజ్ఞానము కలుగును.

విషయములందు విరక్తుడై యమనియమాదుల నభ్యసించుటవలన చిత్తవృత్తులు నశించును. చిత్తము క్రమముగా నిర్మలమగును. దీర్ఘకాలాభ్యాసమువలన చిత్తమున విశారదత యేర్పడును. అటుపై అధ్యాత్మ ప్రసాదము కలుగును. ఈ స్థితినే యోగులు 'ఋతంభరాప్రజ్ఞ'యందురు. అప్పుడు. పర్వతమున నెక్కిన పురుషుడు భూమిమీద నున్నవారిని సులభముగా చూడగలిగినట్లు యోగి సర్వపదార్థముల యాథాత్మ్యమును తెలిసికొనును. హస్తామలకమునలె స్వాత్మను సాక్షాత్కారము జేసికొన గలడు. ఇట్లు ఆత్మతత్వజ్ఞానము కలుగునని భావము.

పూర్వపక్షము:—

"నార్థవిశేష ప్రాబల్యాత్" ४.२.३८.

అర్థవిశేష ప్రాబల్యాత్ = విషయములకు చెందిన సంస్కార ప్రాబల్యమువలన, న = సమాధివిశేషాభ్యాసము సిద్ధింపదు.

సమాధి విశేషము కలిగినగదా దాని యభ్యాసము సిద్ధించును? విషయసంస్కార వ్యుత్థానము ప్రబల ప్రతిబంధకమగుటవలన సంప్రజ్ఞాత సమాధియే కలుగనేరదు. కాబట్టి ఆత్మజ్ఞానము కలుగనేరదు.

"క్షుదాదిభిః ప్రవర్తనాచ్చ" ४.२.३౯.

క్షుదాదిభిః = క్షుత్పిపాసాదులచే, ప్రవర్తనాత్ చ = ఆకలి దప్పులను తీర్చు సాధనములందు ప్రవృత్తి కలుగుట వలనను.

సమాధి నభ్యసించుటకు యత్నింపదలచినచో మనస్సు క్షుత్పిపాసాదులచే పీడింపబడి వాని నివృత్తికి సాధనములయిన వస్తువుల సంపాదనకు పూనుకొనును. కాబట్టి సమాధి సిద్ధింప నేరదు. సమాధి సిద్ధింపకున్న ఆత్మతత్త్వజ్ఞానము కలుగుట సున్నయగును.

ఉత్తరపక్షము:—

"పూర్వకృత ఫలానుబంధాత్ తదుత్పత్తిః" ౪.౨.౩౯.

పూర్వ కృతఫలానుబంధాత్ = పూర్వజన్మ యందభ్యసించిన సమాధి సాధనానుష్ఠానమువలన కలిగిన అదృష్ట సంబంధమువలన, తదుత్పత్తిః = సమాధి విశేషము (సంప్రజ్ఞాతము) ఉత్పన్నమగును.

కేవలమొక్క జన్మయందు చేయబడు అభ్యాసము వలన సంప్రజ్ఞాత సమాధి సిద్ధింపకున్నను పూర్వజన్మలందు చేయబడిన యత్నములద్వారా సంపాదించిన అదృష్ట సహాయమున నది సిద్ధింపగలదు. అభ్యాస వశమున సంస్కారములను అణచి సమాధిని పొందు నవకాశము లేకపోదు.

పూర్వపక్షము:—

"అపవర్గేఽప్యేవం ప్రసంగః" ౪.౨.౪౦.

అపవర్గేఽపి = మోక్షము నందును, ఏవంప్రసంగః = పూర్వకృత కర్మఫలానుబంధమువలన నీ జన్మయందు సమాధి జనించునట్లు దుఃఖాదులును జన్మించును.

పూర్వకృత కర్మ ఫలానుబంధమున నీజన్మయందు సమాధి జనించు నందువేని అపవర్గమున దుఃఖ ముత్పన్నము కావలసి వచ్చును.

ఉత్తరపక్షము:—

"న నిష్పన్నావశ్యంభావిత్వాత్" ౪.౨.౪౧.

నిష్పన్నావశ్యం భావిత్వాత్ = కార్యోత్పత్తి సమయమున కారణము తప్పక ఉండవలసి యుండుటవలన, న = అపవర్గమున దుఃఖోత్పత్తి యుండదు.

కార్యోత్పత్తి సమయమున కారణము తప్పక యుండవలయు ననుట నియమము. అపవర్గమున దుఃఖరూప కార్యముదయింప వలయు ననిన నట తత్కారణమైన యదృష్టముండవలయును. అపవర్గమున నదృష్ట సంబంధ ముండదు. ఆత్మతత్వజ్ఞానమువలన బ్రహ్మసాక్షాత్కారమునకు పూర్వమే యది క్షీణించిపోవును. సమాధి జనించునప్పుడట్టి యదృష్టముండును కాబట్టి యేదోషమును లేదని భావము

"తదభావశ్చాపవర్గే" ౪.౨.౪౨

అపవర్గే = మోక్షమునందు, తదభావః = పూర్వకృత ఫలానుబంధముండదు.

మోక్షమున పూర్వకృత ఫలానుబంధ ముండదను విషయము వేదాదిశాస్త్ర వాక్యములవలన తెలియనగును. సమాధి విశేషము నభ్యసించి ఆత్మతత్వమును హస్తామలకమువలె నెఱిగినవాడు బ్రహ్మ సాక్షాత్కారము కలుగును. అట్టివానికి హృదయగ్రంధి భిన్నమగును. సంశయవ్రాతము విచ్ఛిన్నమగును. కర్మపుంజము క్షీణించును. అందువలన సర్వదుఃఖములనుండి విముక్తుడై స్వాత్మతో బ్రహ్మసంవిష్టుడై బ్రహ్మానందము ననుభవించును. ఉపనిషత్తులలోనిట్లే వర్ణింపబడినది.

“భిద్యతేహృదయగ్రంథిః ఛిద్యంతే సర్వ సంశయాః,
క్షీయంతే చాస్యకర్మాణి, తస్మిన్దృష్టేపరావరే”
ముం. ౨.౨.౮.

“తదర్థంయమనియమాభ్యామాత్మసంస్కారో
యోగాచ్చాధ్యాత్మవిధ్యుపాయైః” ౪.౨.౪౩.

తదర్థం=సమాధ్యుత్పత్తికొఱకు, యమనియమాభ్యాం = యమనియమములతోను, యోగాత్ = యోగమువలనను, అధ్యాత్మవిధ్యుపాయైశ్చ=ఆత్మతత్వజ్ఞానమునుగూర్చి విధింపబడిన ప్రాణాయామాదివిధుల ద్వారాను, ఆత్మసంస్కారః=మనఃశుద్ధి సంపాదింపవలయును.

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము ననునవి యమములు. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము నను నీయైదును నియమములు. ఉచ్ఛ్వాస నిఃశ్వాసల గతిని నిరోధించుట ప్రాణాయామము. స్థిరమై సుఖము కలిగించునది ఆసనము. ఇంద్రియములు స్వవిషయములందు వర్తింపక చిత్తస్వరూపము ననుకరించుచున్నట్లుండుట ప్రత్యాహారము. దేహమున హృదయాది దేశములందొకచో చిత్తమునునిలుపుట ధారణ యనబడును. అట్టియెడ నొకే జ్ఞానము తైలధారవలె తెంపు లేక యుండుట ధ్యానము. ఆధ్యానమే అర్థమాత్ర భానము కలదగుచో సమాధి యనబడును. ఈ సాధనములన్నియు యోగవ్యాఖ్యానమున ప్రపంచింతును. అట విశేషముగా చూడనగును.

"జ్ఞానగ్రహణాభ్యాస స్తద్విద్యైశ్చ సంవాదః" ౪.౨.౪౪.

జ్ఞాన గ్రహణాభ్యాసః = (ఆత్మతత్వజ్ఞానము దృఢముగా నే శాస్త్రమువలన గ్రహింపబడునో ఆదే న్యాయశాస్త్రము) ఆ శాస్త్రమును మాటిమాటికి నభ్యసించుట, తద్విద్యైశ్చ=ఆశాస్త్రజ్ఞులతో, సంవాదః= సంవాదమును, ఆవశ్యకము.

సమాధి నిమిత్తము యమనియమాదుల యభ్యాస మెట్లావశ్యకమో అట్లే ఆత్మజ్ఞానము దృఢపరుచుకొనుటకై పదార్థములను వివేచించు న్యాయశాస్త్రపఠన మావశ్యకము. అట్టి శాస్త్రము నెఱిగిన విద్వాంసులతో సంవాదము నత్యంతావశ్యకము. ఇట్టి యభ్యాస సంవాదములు శాస్త్రమే లేకున్న సంభవింపనేరవు. కాబట్టి న్యాయశాస్త్రము సఫలమే కాని విఫలముకాదు.

"తం గురు శిష్య సబ్రహ్మచారి శిష్ట శ్రేయోఽర్థిభి
రనసూయుభి రభ్యుపేయాత్" ౪.౨.౪౫.

అనసూయుభిః = అసూయారహితులై జయేచ్ఛలేని, గురు ..... శ్రేయోఽర్థిభిః= గురు, శిష్య, సబ్రహ్మచారి, శిష్ట, శ్రేయస్కాములునైనవారితో, తం = ఆసంవాదమును, అభ్యుపేయాత్ = సమ్ముఖమునకేగి చేయవలయును.

శాస్త్రోపదేష్ట గురువు. శాస్త్రోపదేశమును పొందదగిన వాడు శిష్యుడు. తనతోపాటు చదువుకొనువాడు సబ్రహ్మచారి. గురుశిష్య సబ్రహ్మచారులకంటె నన్యుడై శాస్త్రము నేర్వదగినవాడు, శిష్టుడు. శాస్త్ర ప్రతిపాద్యమైన మోక్షము నందు శ్రద్ధాలువులయిన ముముక్షువులు శ్రేయోఽర్థులు.

ఇట్టివారితో తానేర్చిన విషయమును ధ్రువపరుచు కొనుటకై సంవాద మొనరింప దగును.

"ప్రతిపక్ష హీనమపివా ప్రయోజనార్థత్వమర్థిత్వే" ౪.౨.౪౯.

వా = లేక, అర్థిత్వే = తత్వజ్ఞానేచ్ఛ కలిగినపుడు, ప్రయోజనార్థం = తత్వజ్ఞానము బలపరుచు కొనుటకై, ప్రతిపక్షహీనమపి = ప్రతిపక్షము లేకున్నను పై వ్యక్తులతో వాదింప దగును.

తత్వజ్ఞానమును దృఢపరుచుకొన నిచ్ఛ జనించినపుడు గురు శిష్యాదులకు ప్రతిపక్ష గ్రహణము రుచింపదేని ప్రతిపక్ష హీన సంవాదము నైనను వారితో జరుపవచ్చునని భావము.

(జల్పవితండల ప్రయోజనము)

"తత్వాధ్యవసాయ సంరక్షణార్థం జల్పవితండే బీజ ప్రరోహ సంరక్షణార్థం కంటక శాఖావరణవత్" ౪.౨.౫౦.

బీజప్రరోహ సంరక్షణార్థం = మొక్కలను రక్షించుటకు, కంటక శాఖావరణవత్ = ముండ్లకంచెవలె, జల్పవితండే = జల్పవితండలు, తత్వాధ్యవసాయ రక్షణార్థం = అభ్యాస సంవాదజనిత తత్వనిశ్చయమును రక్షించుటకు.

పైరును రక్షించుటకు కంచె యుపయోగించునట్లు, శాస్త్రాభ్యాస సంవాదములచే నేర్పడిన తత్వజ్ఞాననిశ్చయమును, పరులచే నుట్టంకింపబడు నప్రామాణ్యాది శంకలను దోషముల నుండి రక్షించుటకు జల్ప వితండ లవసరములు.

"తాభ్యాం విగృహ్య కథనమ్" ౪.౨.౫౧.

తాభ్యాం = జల్ప వితండల ద్వారా, విగృహ్య = విగ్రహ మొనర్చి, కథనమ్ = తత్వమును చెప్పవలయును.

మఱియు జ్ఞానలవ దుర్విదగ్ధుడైన యనార్యుడు కానీ, లాభ పూజాదుల నపేక్షించిన యార్యుడుకానీ, "జగత్పతి యీశ్వరుడెక్కడ? వేదములు వానివచనము లెట్లగును? వానికిగల ప్రామాణ్యమెంతటిది? ఆత్మతత్త్వ జ్ఞానమననేమి? అపవర్గమెట్టిది?" అను నిట్టి ప్రశ్నలతో వైదిక సిద్ధాంతముల నపలాపింప యత్నించినపుడు, వైదికులు తమపక్షమును సిద్ధమొనర్ప సమర్థులయ్యు, సమయమునకు పరపక్షము నుద్ధరింప దగు హేతువులు స్ఫురింపని పక్షమున, నిశ్శంకతో జల్పవితండలను ప్రయోగించి శత్రువుల నోడించి తన్నుదా రక్షించుకొనుటలో వెనుకంజ వేయరాదు. అట్టియెడ నుపయోగించుటకే శాస్త్రమున నివి బోధింపబడినవని భావము.

చతుర్థాధ్యాయమున ద్వితీయాహ్నికము.

న్యాయ దర్శనము

పంచమాధ్యాయము

(ఆద్యాహ్నికము)

పూర్వాధ్యాయములందు ప్రమాణ ప్రమేయములు పరీక్షింపబడినవి. ఈ యధ్యాయమున జాతి నిగ్రహములను పరీక్షింపదలచి ముందు జాతిని విభాగించుచున్నాడు.

సాధర్మ్య వైధర్మ్యోత్కర్షాపకర్ష వర్ణ్యావర్ణ్య వికల్ప సాధ్య ప్రాప్త్యప్రాప్తి ప్రసంగ ప్రతిదృష్టాంతానుత్పత్తి సంశయ ప్రకరణ హేత్వర్థాపత్త్యవిశేషోపపత్త్యుపలబ్ధ్యనుపలబ్ధి నిత్యానిత్య కార్యసమాః" ౫.౧ ౧.

సాధర్మ్యసమము, వైధర్మ్యసమము, ఉత్కర్షసమము, అపకర్షసమము, వర్ణ్యసమము, అవర్ణ్యసమము, వికల్పసమము, సాధ్యసమము, ప్రాప్తిసమము, అప్రాప్తిసమము, ప్రసంగ సమము, ప్రతిదృష్టాంతసమము, అనుత్పత్తిసమము, సంశయ సమము, ప్రకరణసమము, హేతుసమము, అర్థాపత్తిసమము, అవిశేషసమము, ఉపపత్తిసమము, ఉపలబ్ధిసమము, అనుప లబ్ధి సమము, నిత్యసమము, అనిత్యసమము, కార్యసమము, అను నీ యిరువది నాలుగును జాతిలోగల భేదములు.

వాది సాధ్యధర్మమును స్థాపించుటకు హేతువు ప్రయోగించినచో ప్రతివాది దానిని నిషేధింపగోరి ప్రయోగించు అసమర్థహేతువు జాతి యనబడును. అది యిరువదినాలుగు విధములు.

అందుసాధర్మ్య వైధర్మ్య సమములు:—

"సాధర్మ్య వైధర్మ్యాభ్యాముపసంహారే తద్ధర్మ విపర్యయోపపత్తేః సాధర్మ్య వైధర్మ్య సమా" ౫.౧.౨.

సాధర్మ్యవైధర్మ్యాభ్యామ్ = సమాన విశేషధర్మముల ద్వారా, ఉపసంహారే = పక్షమున సాధ్యధర్మము నుపసంహరింపగా, తద్ధర్మ విపర్యయోపపత్తేః = సాధ్యధర్మ ప్రతిషేధము సిద్ధించినందువలన, సాధర్మ్యవైధర్మ్యసమా = సాధర్మ్య వైధర్మ్య సమములు అనబడును.

వాది అన్వయవ్యాప్తిగల సాధర్మ్యముతో పక్షము నందు సాధ్యధర్మము నుపసంహరింపగా, ప్రతివాది సాధర్మ్యము తోనే సాధ్యమును ఖండింప నుంకించిన సాధర్మ్య సమజాతి యనబడును.

వాది వ్యతిరేక వ్యాప్తిగల వైధర్మ్యముతో పక్షము నందు సాధ్యమును సాధింప, ప్రతివాది వైధర్మ్యముతోనే దానిని ప్రతిషేధింప గోరిన నది వైధర్మ్య సమజాతి యనబడును.

సాధర్మ్య సమమున కుదాహరణములు:—

శబ్దము అనిత్యము. ప్రయత్న జన్యమగుట వలన. ఏది ప్రయత్న జన్యమో యది అనిత్యము. ఘటమువలె శబ్దము ప్రయత్న జన్యమే. అందువలన నది అనిత్యము. శబ్దము, ఘటము నను నీ రెంటిలోను ప్రయత్న జన్యత్వమను సామాన్య ధర్మ మున్నది. దాని నాధారముగా గొని శబ్ద మనిత్యమని సాధింప, జాతివాది మరియొక సమాన ధర్మముతో శబ్దము నిత్యమనును.

శబ్దము నిత్యము, అస్పర్శమగుటవలన. ఏది యస్పర్శమో యది నిత్యము. ఆత్మవలె శబ్దము అస్పర్శమే. అందువలన నది నిత్యము. ఇట శబ్దము, ఆత్మ అను నీరెంటియందును గల అస్పర్శత్వమను సమాన ధర్మమును తీసికొని యవి నిత్యములని సాధించెను.

ప్రయత్న జన్య సామ్యముచేత ఘటాదులవలె శబ్దము అనిత్యమేకాని, అస్పర్శత్వ సామ్యముచేత ఆత్మవలె శబ్దము నిత్యముకాదని సాధింపగల విశేషహేతువు ఇట చూపబడలేదు. అట్టి విశేషహేతువు లేనంతవరకు కొండొక ధర్మసామ్యముచే నొకవస్తువు అనిత్యమైన మరియొక ధర్మసామ్యముచే నిత్యమేలకాదని జాతివాది మతము

వైధర్మ్య సమమున కుదాహరణములు:—

శబ్దము అనిత్యము. ప్రయత్న జన్యమగుటవలన. ఏది ప్రయత్న జన్యముకాదో యది నిత్యము. ఆత్మవలె. శబ్దమట్లు ప్రయత్నజన్యము కాకపోదు - కాబట్టి శబ్దము అనిత్యము.

జాతివాది:— శబ్దము నిత్యము. అస్పర్శమగుటవలన. ఏది అస్పర్శము కాదో అది యనిత్యము. ఘటాదులవలె. శబ్దము అస్పర్శము గాకపోదు. కాబట్టి శబ్దము నిత్యము.

"గోత్వాద్గోసిద్ధివత్ తత్సిద్ధిః" ५.१.३.

గోత్వాత్ = గోత్వము (సాస్నాదిమత్వము) వలన, గోసిద్ధివత్ = గోవుసిద్ధించినట్లు, తత్సిద్ధిః = శబ్దమున అనిత్యత్వమును సిద్ధించును.

సామాన్య విశేషధర్మములు మాత్రమే సాధ్యమును సాధించునని చెప్పినచో జాతివాది వాదము యుక్తమే యగును. సాధ్యముతో స్వభావముగా సంబద్ధమయిన ధర్మమునే సాధనముగా చెప్పియున్నందున జాతివాది ఖండనము యుక్తముకాదు. సాధ్యవ్యాప్తి విశిష్ట సాధనము సాధ్యసాధకమగును. జాతివాది ప్రయోగించిన హేతు వట్టిదికాదు.

శబ్దమున అనిత్యత్వము సాధ్యము. దానికి హేతువు ప్రయత్నజన్యత్వము. ఇది సాధ్యవ్యాప్తి విశిష్టహేతువు. ఎటనెట ప్రయత్నజన్యత్వముండునో అట అనిత్యత్వము తప్పక యుండును. ఇందు వ్యభిచార ముండనేరదు. కాబట్టి సాధ్యసాధనము.

జాతివాదిహేతు వట్టిదికాక వ్యభిచరిత మగును. శబ్దమున నిత్యత్వము సాధ్యము. అస్పర్శత్వము హేతువు. ఎటనెట అస్పర్శత్వ ముండునో అట నిత్యత్వ ముండవలయును కదా! ఆత్మయందున్నను, బుద్ధియందు లేదు. బుద్ధియం దస్పర్శత్వ మున్నదికాని నిత్యత్వములేదు. కాబట్టి అస్పర్శత్వహేతువు వ్యభిచరిత మగుచున్నది. సాధ్యసాధనము కాజాలదు.

ఉత్కర్షసమ ఆది జాతిషట్కము:—

"సాధ్యదృష్టాంతయోర్ధర్మవికల్పాదుభయసాధ్యత్వాచ్చోత్కర్షాపకర్ష వర్ణ్యావర్ణ్య వికల్పసాధ్యసమాః" ౫ ౧.౪.

సాధ్య దృష్టాంతయోః = (సాధ్యము - పక్షము.) పక్షమునందు, దృష్టాంతమునందును, ధర్మవికల్పాత్ = నానావిధ ధర్మకల్పనవలన,

ఉభయసాధ్యత్వాచ్చ = పక్ష దృష్టాంతములు రెండును సాధ్యములగుట వలన, ఉత్కర్షాపకర్ష వర్ణ్యావర్ణ్య వికల్ప సాధ్యసమాః=ఉత్కర్షసమము, అపకర్ష సమము, వర్ణ్యసమము, అవర్ణ్య సమము, వికల్పసమము, సాధ్య సమము అను నారు జాతిభేదము లేర్పడుచున్నవి.

(౧) పక్షమున సాధ్యమును సిద్ధముచేయగా, దృష్టాంత సామ్యముతో గట ననిష్టధర్మమును నుపపాదించుట ఉత్కర్ష సమ మనబడును. ఉదా:— శబ్దము అనిత్యము. ప్రయత్న జన్యమగుటవలన. ఘటమువలె. ఇటశబ్దము పక్షము అనిత్యత్వము సాధ్యము. ఘటము దృష్టాంతము. ప్రతివాది:— ప్రయత్న జన్యమగుటచే ఘటమువలె శబ్దము అనిత్యమగు నెడల, ఘటమువలె శబ్దము రూపవంతము కావలయును. ఘట సామ్యమున ఘటమువలె రూపవంతము కాకున్న అనిత్య మును కానేరదని భావము.

(౨) పక్షమునందు సామ్యబలముచేత విద్యమాన ధర్మ మున కభావము నాపాదించుట అపకర్ష సమము. ఉదా:- శబ్దము అనిత్యము. ప్రయత్నజన్య మగుటవలన ఘటమువలె. జాతివాది:- శబ్దము అశ్రావణము; ప్రయత్నజన్యమగుట వలన; ఘటమువలె. ఇట ప్రయత్నజన్యసామ్యము చేత ఘటము వలె శబ్దమునిత్యమైన, అట్టి సామ్యముచేతనే ఘటము అశ్రా వణము కాబట్టి శబ్దమును అశ్రావణము కావలయును. అశ్రా వణము కాని యెడల అనిత్యమును కాదని యభిప్రాయము.

(3) దృష్టాంతమున పక్షధర్మమును నాపాదించుట వర్ణ్యసమము. వాది:- శబ్దము, అనిత్యము ప్రయత్న జన్యమగుటవలన,

ఘటమువలె. జాతివాది:– ప్రయత్నజన్యతాసామ్యము వలన ఘటమువలె శబ్దము అనిత్యమైన, (ఇట శబ్దము పక్షము, అనిత్యత్వము సాధ్యము.) పక్షమైన శబ్దమునందలి ప్రయత్నజన్యత్వ సామ్యము ఘటమునం దుండుటవలన, 'ఘటము అనిత్యము' అని వర్ణింపుము. అట్లు వర్ణింపవేని శబ్ద మనిత్యమనియు వర్ణింపవలదు; అని ప్రతిషేధము.

ఘట మనిత్యమని వర్ణించిన ఘటము దృష్టాంతము కాక పక్షమగును. పక్షమున సాధ్యము సందిగ్ధమై - అసిద్ధమై యుండును; అని యంగీకరించి నట్లగును. అట్లంగీకరించిన దృష్టాంతముగా దానిని ప్రయోగింప వీలుండదు. కారణ మేమన: దృష్టాంతమున సాధ్యము సందిగ్ధముగా నుండక నిశ్చితముగా సిద్ధమై యుండును. కాబట్టి ఘటము దృష్టాంతము కాని పక్షమున, వాది తనసాధ్యమును సిద్ధింప జేయుటకు దృష్టాంతము నంగీకరింపకపోవుటచే నసమర్థుడగునని భావము.

(4) పక్షమున దృష్టాంతధర్మాపాదనము అవర్ణ్యసమము.

వాది: — శబ్దముఅనిత్యము; ప్రయత్నజన్య మగుట వలన, ఘటమువలె. జాతివాది:—ప్రయత్నజన్య సాధర్మ్యము వలన ఘటమువలె శబ్ద మనిత్య మందువేని, ఆ సాధర్మ్యము వలననే ఘటమునందువలె శబ్దమునందు అనిత్యత్వము అసందిగ్ధమే—నిశ్చితమే యగును. నిశ్చితమే యనిన శబ్ద మనిత్యమని శబ్దమున ననిత్యత్వము సాధింపనేల? అని యెదురొ్డ్డును.

(5) సాధనధర్మముతో కూడిన దృష్టాంతమునందు,ధర్మాంతర దర్శనమువలన, పక్షమునందు సాధ్యధర్మ వికల్పము

నాపాదించుట - వికల్పసమము. వాది:— శబ్దము అనిత్యము. ప్రయత్న జన్యమగుటవలన ఘటమువలె. జాతివాది:-ప్రయత్న జన్యమయిన ద్రవ్యములలో ఘటకర్పరములు పరుషములు గాను, దుకూలాదులు మృదులములుగాను చూడబడుచున్నవి. ఘటాదులలో మృదుపరుష విరుద్ధ ధర్మములున్నట్లు ప్రయత్న జన్యమగుట చేత శబ్దమునందును నిత్యత్వము, అనిత్యత్వము నను విరుద్ధధర్మము లుండవలయును. కాబట్టి శబ్దము నిత్యము నగును.

(౬) పక్ష దృష్టాంతముల సామ్యముచేత సాధ్యత్వము నాపాదించుట సాధ్యసమము. వాది:— శబ్దము అనిత్యము. ప్రయత్న జన్యమగుటవలన, ఘటమువలె. జాతివాది:- శబ్దము ఘటమువంటిదియైన ఘటము శబ్దమువంటి దనుటలో సందేహము లేదు. అట్లయిన శబ్దము అనిత్యమనుటెట్లు సాధ్యవిషయమో ఘటము సైతమట్లే సాధ్యవిషయమగును. ఘట మనిత్యమనుట సాధ్యము కాదందువేని శబ్దము అనిత్యము, ఘటమువలె ననుట ఎట్లు పొసగును ? పొసగదు.

ఇట్లీసూత్రమున సాధ్య దృష్టాంతముల ధర్మవికల్పము వలన నైను జాతిభేధములు, పక్షము దృష్టాంతము రెండును సాధ్యమనుటవలన సాధ్యసమమను నొకజాతిభేదమును వర్ణింప బడినవని వివేకము.

"కించిత్ సాధర్మ్యా దుపసంహారసిద్ధేః వైధర్మ్యా దప్రతిషేధః" ౫.౧.౫.

కించిత్సాధర్మ్యాత్ = వ్యాప్తితోకూడిన సాధర్మ్యము వలన, ఉపసంహారసిద్ధేః = పక్షమున సాధ్యసాధనము సిద్ధించుటవలన, వైధర్మ్యాత్ = వ్యాప్తిరహితమైన సాధర్మ్యమువలన, అప్రతిషేధః పక్షమున సాధ్యవిపర్యయము సిద్ధింపనేరదు.

ప్రయత్నజన్యత్వము అనిత్యత్వముతో వ్యాప్తమై యున్నది. జాతి వాదిచే చెప్పబడిన రూపాదులు అట్లు వ్యాప్తములు కావు. కాబట్టి యతని వాదము నిస్సారము.

(౧) ప్రయత్నజన్య మనిత్యమైనట్లు, ప్రయత్న జన్యమైన దంతయు రూపవంతముకాదు. ఉదా:— కర్మ ప్రయత్న జన్యమే కాని రూపవంతము కాదు.

(౨) ప్రయత్నజన్యమయిన అశ్రావణము కావలయునను నియమము లేదు. శబ్దధ్వంసము ప్రయత్నజన్యమే కాని అశ్రావణము కాదు. శ్రావణమే.

(3) ప్రయత్నజన్యమైనది యనిత్యమనుటలో సందిగ్ధమని కాని, అసందిగ్ధమని కాని నియమింపవలనుపడదు. ఘటము ప్రయత్నజన్యమే; కాని దాని యనిత్యత్వము సందిగ్ధమెన్నడు కాదు. నిశ్చితమే. కాని శబ్దము ప్రయత్న జన్యమైనను, అది నిత్యమా ? యనిత్యమా ? యని సందేహింపబడుచున్నది. వాది ప్రతివాదులకు విరోధములేని తావులందు సందేహము కలుగదు. విరోధబుద్ధి యున్నయెడల సందేహము కలుగును. ఘట మనిత్య మనుట ఇరువురకు సమ్మతమే. అందువలన ఘటమున ననిత్యత్వము సందిగ్ధముకాదు. శబ్దమున నట్లుకాక సందిగ్ధమగుచున్నది.

(౪) ప్రయత్నజన్యము నిత్యమనుటయు తగదు. ఘటాదులు ప్రయత్నజన్యములే; కాని నిత్యములు కావు.

(౫) సాధర్మ్య మున్నంతమాత్రమున నిది యిట్లే యుండవలయునని కానీ, నిది యిట్లుండరాదని ప్రతిషేధించుట కానీ వలనుపడదు.

"సాధ్యాతిదేశాచ్చ దృష్టాంతోపపత్తేః" ౫.౧.౬.

సాధ్యాతిదేశాత్ = సాధ్యాతి దేశమువలన, దృష్టాంతోపపత్తేః = దృష్టాంత ముపపన్నమగుటచే ప్రతిషేధము తగదు.

(ఒకవస్తు ధర్మమునకు మఱియొక వస్తువునందు గల సంబంధము అతిదేశ మనబడును.) ఘటము ప్రయత్నజన్యమై యనిత్యమైనట్లు శబ్దము నైతమనియన్న శబ్దమున ఘటము యొక్క అభేదమును అతిదేశించినట్లగును. అట్టియెడ శబ్దమువలె ఘటము నైతము అనిత్యమని సాధింపవలసి యుండును. దృష్టాంతదార్ష్టాంతములలో భేదముండుట తప్పనిసరి కాబట్టి యభిన్నము లనుట తగదు. కాబట్టి అభేదము నతిదేశింపజనదు. ఘటమునగల అనిత్యత్వధర్మము మాత్రమే శబ్దమున నతిదేశించుచున్నాము. ధర్మము నతిదేశించి నంత మాత్రమున ధర్మ లభిన్నములని సాధింప బడవు. కాబట్టి పక్షమున సాధనీయ ధర్మ విపర్యయము పొసగదని భావము.

ప్రాప్త్యప్రాప్తి సమములు:—

"ప్రాప్యసాధ్య మప్రాప్య వా హేతోః ప్రాప్త్యాఽవిశిష్టత్వాత్ అప్రాప్త్యాఽసాధకత్వాచ్చ ప్రాప్త్య ప్రాప్తి సమౌ" ౫.౧.౭.

సాధ్యం = సాధ్యధర్మ విశిష్టమును (పక్షమును) ప్రాప్య = చేరికాని, అప్రాప్యవా = చేరకకానీ, హేతోః = హేతువు సాధ్య సాధకమైన, ప్రాప్త్యప్రాప్తి సమా = ప్రాప్తి అప్రాప్తి సమ జాతిభేదము లగును. కారణమేమన, ప్రాప్త్యా = హేతువు సాధ్యప్రాప్తిచే, అవిశిష్టత్వాత్ = విశేషభేదము లేనిదగుటవలన, అప్రాప్త్యాచ = సాధ్యమును చేరక పోవుటచేతను, అసాధకత్వాత్ = సాధింపనందువలన.

శబ్దము అనిత్యము. ప్రయత్నజన్యమగుటవలన. అను స్థలమున ప్రయోగింపబడిన హేతువు సాధ్యమునుచేరి సాధించునా? లేక చేరకయే సాధించునా? సాధ్యమునుచేరి యందుమేని హేతువు సాధ్యములో కలిసి సాధ్యమేయగును. సాధ్య సాధనములకు భేదమే లేకుండును. అట్టియెడ దేనికేది సాధ్యమగును? భేదములేకున్న సాధ్యసాధనభావ ముపపన్నము కాదు. కాబట్టి హేతువు సాధ్యముతో చేరి దానిని సాధించు ననుట తగదు. చేరకయే సాధించునందుమా? అన్నియు నన్నిటిని సాధింపనగును. ఈసాధ్యమున కిదియే సాధకమను నియమ ముండనేరదు. కాబట్టి హేతువు సాధ్యమున చేరక దానిని సాధించుననుటయు నొప్పదని భావము. ఇట్లు ప్రాప్తిలక్షణ అప్రాప్తిలక్షణ హేతు సాధర్మ్యములతో నెదుర్కొనుటను ప్రాప్తిసమము అప్రాప్తిసమము అందురు.

"ఘటాది నిష్పత్తి దర్శనాత్" ౫.౧.౮.

ఘటాది నిష్పత్తిదర్శనాత్ = సాధ్యమునుచేరి దండాది సాధనములు ఘటాదుల నుత్పన్నముచేయుట చూచుచున్నాము కావున ప్రతిషేధము తగదు.

హేతువు పక్షము నందుండకున్న నది యసిద్ధమగును. కాబట్టి పక్షమునుచేరి హేతువు సాధకమగును. దండ చక్రాదులు హేతువులు. అవి పక్షభూతమైన మృత్తికను చేరి ఘటాదుల నుత్పన్నము చేయును. దండాదులు మృత్తికను చేరినంత మాత్రమున మృత్తికకు అభిన్నములు కావు. కాబట్టి అభిన్నములై సాధ్యసాధకభావము సంభవము కాదనరాదు.

ప్రసంగసమ-ప్రతిదృష్టాంత సమ జాతిభేదములు:—

"దృష్టాంతస్య కారణానపదేశాత్ ప్రత్యవస్థానాచ్చ
ప్రతిదృష్టాంతేన ప్రసంగప్రతిదృష్టాంతసమౌ" ౫.౧.౯.

దృష్టాంతస్య = దృష్టాంతము, కారణానపదేశాత్ = సాధ్యవంతమనుటకు ప్రమాణము చెప్పకపోవుట వలన, ప్రతిదృష్టాంతేన = ప్రతికూల దృష్టాంతముతో, ప్రత్యవస్థానాత్ చ = సాధ్యవిపర్యయము నాపాదించుట వలనను, ప్రసంగ ప్రతిదృష్టాంతసమౌ = ప్రసంగసమ - ప్రతిదృష్టాంతసమజాతి భేదములు.

పక్షమునందు సాధ్యమున్నదని ఋజువు చేయుటకుగాను ఘటము నుదాహరింతురు గదా! అట్టి ఘటమునందు సాధ్యమున్నదని చెప్పుటకు ప్రమాణము చెప్పవలసి యుండును. అట్లు చెప్పబడదు. పక్షమునందు సాధ్యమున్నదా? లేదా? యని ప్రశ్నించుట కవకాశమున్నట్లు దృష్టాంతము నందును సాధ్యధర్మ మున్నదా? లేదా? యని యడుగుట కవకాశము లేకపోలేదు. కాబట్టి దానికి ప్రమాణ మొసంగ వలయును. ఇత్తురేని నట మరల ప్రమాణప్రసక్తి గలుగును. ఇట్లనవస్థ

యేర్పడగలదని యెదుర్కొనుట—పక్షమున సాధ్యాభావము నుపపన్న మొనర్చుటకు చేయుప్రసంగము-ప్రసంగ సమము.

శబ్దము అనిత్యము; ప్రయత్నజన్యమగుటవలన, ఘట మువలె. అనుస్థలమున ఘటము దృష్టాంతము. ఆకాశము ప్రతిదృష్టాంతము. ఘటమువలె శబ్దమనిత్యమైన ఆకాశము వలె శబ్దము నిత్యమేల కాదని కేవలము ప్రతికూల దృష్టాం తముతోనే సాధ్యాభావము సాధింపనెంచుచు హేతువు నుపేక్షించుట ప్రతిదృష్టాంత సమము.

"ప్రదీపోపాదాన ప్రసంగనివృత్తివత్ తద్వినివృత్తిః" ౫.౧.౧౦

ప్రదీపోపాదాన ప్రసంగ నివృత్తివత్ = ప్రదీపమును దర్శించు టకు మరియొకదీపమును గ్రహింపవలయునను ప్రసక్తి నివృత్తి చెందినట్లు, తద్వినివృత్తిః = దృష్టాంతము సాధ్యవంతమని ఋజువుచేయుటకు ప్రమాణగ్రహణ ప్రసంగమును నివర్తించును.

ఘటపటాది ద్రవ్యములను చూచుటకు దీపమును గ్రహింతుము. ఆ దీపమును చూచుటకై మరియొక దీపము గ్రహింప నవసరముండదు. అది స్వయముగానే తెలియ బడును. అట్లే పక్షమున సాధ్యమును సిద్ధింపజేయుటకు దృష్టాం తమును గ్రహింతుము. కాని దృష్టాంతమున సాధ్యమున్నదని రూపింప వేరొక దృష్టాంతము గ్రహింప నవసరముండదు. దృష్టాంతమున సాధ్యమున్నట్లంతకుపూర్వమే నిశ్చయింప బడును. అట్లు నిశ్చిత సాధ్యము కలదియే దృష్టాంత మన బడును. సందిగ్ధ సాధ్యమెన్నడు దృష్టాంత మనబడదు. అది పక్షమే యనబడును. కాబట్టి దృష్టాంతమున సాధ్య సాధనము

నకై ప్రమాణము చూపవలయునని యెదురొ్కనుట యుక్తము కాదు.

"ప్రతిదృష్టాంతహేతుత్వేచ నాహేతుర్దృష్టాంతః" ౫.౧.౧౧.

ప్రతిదృష్టాంత హేతుత్వేచ = ప్రతిదృష్టాంతము సాధకమగు నెడల, దృష్టాంతః = వాదిచేనీయబడిన దృష్టాంతము, నాహేతుః = అసాధకముకాదు.

ప్రతి దృష్టాంతమెట్లో దృష్టాంతమునట్లే యగుటవలన, ప్రతిదృష్టాంతము సాధకమగునెడల దృష్టాంతమును సాధ్య సాధకమగును. దృష్టాంతము సాధకముకాక ప్రతిదృష్టాంతమే సాధకమగుననుటకు విశేష హేతువు చెప్పవలసి యుండును. అట్లు చెప్పలేదు. దృష్టాంతము సాధ్యసాధకమనుటకు విశేష హేతువున్నది. అదే సాధ్యవ్యాప్తి. సాధ్యవ్యాప్తి ప్రతిదృష్టాంతమున నుండదు. కాబట్టి ప్రతిదృష్టాంతము సాధకముకాదు.

అనుత్పత్తి సమలక్షణము:—

"ప్రాగుత్పత్తేః కారణాభావాదనుత్పత్తిసమః" ౫.౧.౧౨.

ఉత్పత్తేఃప్రాక్ = ఉత్పత్తికి పూర్వము, కారణాభావాత్ = సాధకమైనహేతువు లేకుండుటవలన, అనుత్పత్తిసమః = అనుత్పత్తి సమజాతి భేదమగును.

శబ్ద మనిత్యము; ప్రయత్నానంతరీయక మగుటవలన. ఇట, శబ్ద మనిత్యమైన నది యుత్పత్తి ధర్మము కలదనవల యును. అగుచో, నుత్పత్తికి పూర్వమనుత్పన్న మగును. శబ్ద ముత్పన్నము కానపుడు దానియందనిత్యత్వమును, సాధించు ప్రయత్నానంతరీయకత్వమను హేతువును లేదని యొప్ప

కానక తప్పదు. ఇట్లు ప్రయత్నానంతరీయకత్వాభావము వలన శబ్దము నిత్యమని సిద్ధించును కాని యనిత్యముకాదు. అనుత్పన్న తంతువులు పటమునకు కారణము కాజాలనట్లు, శబ్దోత్పత్తికి పూర్వము అనుత్పన్న ప్రయత్నానంతరీయకత్వము అనిత్యత్వమునకు కారణము కాదని అనుత్పన్నమైన హేతు సాధర్మ్యములో సాధ్యవిపర్యయమును సాధింప నెంచుట అనుత్పత్తిసమ జాతిభేద మనబడునని భావము.

"తథాభావాదుత్పన్నస్య కారణోపపత్తేర్న కారణ
ప్రతిషేధః" ౫.౧.౧౩.

ఉత్పన్నస్య = ఉత్పన్నమైన తదుపరి, తథాభావాత్ = సాధ్యధర్మాశ్రయముగా సంగ్రహింప బడుటవలన, కారణోపపత్తేః = హేతువుపపన్న మగుటవలన, కారణప్రతిషేధః న= కారణనిషేధము యుక్తము కాదు.

శబ్దము త్పన్నమైన తరువాతనే యందనిత్యత్వము సాధ్యముగా సాధింపబడును. ఉత్పత్తికి పూర్వము శబ్ద మనిత్యమని యెవరును సాధింపబోరు. ఉత్పన్న శబ్దమునందు ప్రయత్నానంతరీయకత్వమను హేతు వుపపన్న మగుటలో నెట్టి యాటంకమును లేదు. కాబట్టి పైప్రతిషేధము నిర్హేతుకము.

సంశయసమము:—

"సామాన్య దృష్టాంతయోరైంద్రియకత్వే సమానే
నిత్యానిత్య సాధర్మ్యాత్సంశయః" ౫.౧.౧౪.

సామాన్య దృష్టాంతయోః = పక్షమునందు సామాన్యము, దృష్టాంతము నను నీరెండును, ఐంద్రియకత్వే = ఇంద్రియగ్రాహ్యము లగుటలో, సమానే = సమానములుకాగా, నిత్యానిత్యసాధర్మ్యాత్ =

నిత్యమైన సామాన్యము యొక్కయు, అనిత్యమైన దృష్టాంతము యొక్కయు సాధర్మ్యమువలన, సంశయః = సంశయసమజాతిభేదము.

నిత్యానిత్యముల సామ్యముచేత పక్షమున సాధ్యసంశయము నుద్భావించుట సంశయసమ మగును.

శబ్ద మనిత్యము. ప్రయత్నానంతరీయకమగుటవలన, ఘటమువలె. ఇట శబ్దము పక్షము. అందలి సామాన్యము శబ్దత్వము. శబ్దమైంద్రియక మగుటచే తద్గత సామాన్యము (శబ్దత్వము)ను ఐంద్రియకమే (ఇంద్రియగ్రాహ్యమే). కాని యది నిత్యము. దృష్టాంతముగా నెసగబడిన ఘటమును ఐంద్రియకమే. కాని యది యనిత్యము. ఇట్లు అనిత్యమైన శబ్దము, నిత్యమైన శబ్దత్వమనెడి సామాన్యము, రెండును ఇంద్రియ గ్రాహ్యములే. అందు ఘటసామ్యముగల ప్రయత్నానంతరీయకత్వ హేతువుచే శబ్దమున అనిత్యత్వము నిర్ణయింతురేని, నిత్యమైన శబ్దత్వము, అనిత్యమైన ఘటము నను నీరెండిటి సామ్యముగల ఐంద్రియకత్వ హేతువుచే శబ్దమున అనిత్యత్వమేల సందేహింపరు? సందేహము కలుగదేని నిర్ణయమును కలుగదని యెదుర్కొనుట సంశయసమ మనబడును.

"సాధర్మ్యాత్ సంశయే నసంశయో వైధర్మ్యాదుభయథాచ సంశయేఽత్యంత సంశయ ప్రసంగో నిత్యత్వా నభ్యుగమాచ్చసామాన్యస్యాప్రతిషేధః." ౫.౧.౧౫.

సాధర్మ్యాత్ = సమానధర్మ జ్ఞానము వలన, సంశయే = సంశయము కలిగినప్పటికి, నసంశయః=సంశయము కలుగుట సంభవింపదు. వైధర్మ్యాత్ = విశేషధర్మ జ్ఞానమువలన, ఉభయథాచ = సాధర్మ్య

వైధర్మ్య జ్ఞానముల వలనను, సంశయే=సంశయము కలుగుననిన, అత్యంత సంశయః = అత్యంత సంశయ ప్రసక్తికలుగును. సామాన్యస్యచ = విశేష ధర్మజ్ఞాన సహితమైన సాధర్మ్యజ్ఞానము, నిత్యత్వానభ్యుపగమాత్ = నిత్యసంశయ హేతువని యంగీకరింపనందున, అప్రతిషేధః= సాధ్యప్రతిషేధము తగదు.

సమానధర్మజ్ఞానముమాత్రమే సంశయమునకు కారణమయిన, నిత్యానిత్యములైన శబ్దత్వ ఘటోభయ సాధారణ ధర్మమైన ఐంద్రియకత్వ జ్ఞానమువలన సంశయము కలుగును. కాని సమానధర్మజ్ఞానము సంశయకారణము కాదు. విశేష ధర్మజ్ఞానము లేని సామాన్యధర్మజ్ఞానము సంశయమునకు కారణము. శబ్దమున నైంద్రియకత్వసాధర్మ్యజ్ఞానమున్నపుడు అనిత్యత్వ సాధక మయిన కృతకత్వమనెడి విశేష ధర్మజ్ఞానము లేకపోలేదు. అది యున్న సంశయము కలుగనేరదు. శిరః పాణ్యాది విశేష ధర్మజ్ఞాన మున్నపుడు ఉన్నతత్వాది సామాన్య ధర్మజ్ఞానము స్థాణువా? పురుషుడా? యను సందేహము కలిగింపలేదుకదా! విశేష ధర్మజ్ఞాన మున్నపుడును సామాన్య ధర్మజ్ఞానము సంశయము కలిగించునెడల సంశయము విచ్ఛిన్నము కానేరదు. కారణమైన సాధర్మ్య జ్ఞానముండ కార్యమైన సంశయము నశింపనేరదని భావము. విశేష ధర్మజ్ఞాన సహితమయిన సామాన్య ధర్మజ్ఞానము సంశయమునకు కారణముగా నంగీకరింపబడదు. కాబట్టి సంశయము నుద్భావించి పక్షమున సాధ్యమును ప్రతిషేధించుట యుక్తముకాదని భావము.

ప్రకరణసమలక్షణము:—

"ఉభయ సాధర్మ్యాత్ ప్రక్రియాసిద్ధేః ప్రకరణ సమః".
౫.౧.౧౬.

ఉభయ సాధర్మ్యాత్ = నిత్యానిత్యోభయముతో సాధర్మ్య ముండుట వలన, ప్రక్రియాసిద్ధేః = ప్రకరణము సిద్ధించుటవలన, ప్రకరణ సమః = ప్రకరణ సమమగును.

వాది అనిత్యసాధర్మ్యముతో పక్షమున సాధ్యమును సాధింప ప్రతివాది నిత్యసాధర్మ్యముతోను, వాది నిత్యసాధర్మ్యముతో సాధ్యమును పక్షమున సాధింప ప్రతివాది యనిత్య సాధర్మ్యముతోను సాధ్యాభావమును సాధింప యత్నించుట ప్రకరణసమ మనబడును.

వాది:—శబ్దమనిత్యము. ప్రయత్నానంతరీయకమగుట వలన ఘటమువలెనని శబ్దమున ననిత్యత్వము సాధింపగా, జాతివాది:—శబ్దము నిత్యము శ్రవణగ్రాహ్యమగుట వలన శబ్దత్వము వలెనని శబ్దమున నిత్యత్వమును సాధించును. వాది:— శబ్దము నిత్యము. శ్రావణ మగుటవలన. శబ్దత్వము వలెననిన, జాతివాది:— శబ్ద మనిత్యము. ప్రయత్నానంత రీయకమగుటవలన. ఘటమువలె ననును.

"ప్రతిపక్షాత్ప్రకరణ సిద్ధేః ప్రతిషేధా నుపపత్తిః ప్రతిపక్షోపపత్తేః" ౫.౧.౧౭.

ప్రతిపక్షోపపత్తేః = ప్రతిపక్ష ముపపన్నమగుటవలన, ప్రతి పక్షాత్ = ప్రతిపక్ష సాధనమువలన, ప్రకరణసిద్ధేః = ప్రతిపక్షము సిద్ధించుటవలన, ప్రతిషేధానుపపత్తిః = వాదిపక్షము ప్రతిఘటింపబడదు.

నిత్యానిత్యములగు ఉభయసాధర్మ్యములద్వారా తన పక్షము సిద్ధించునని చెప్పు ప్రతివాది వాదిపక్షసిద్ధిని సైత మంగీకరించిన వాడగును. ప్రతివాదిచే నుపపాదింపబడు రెండు పక్షములలో నొకపక్షము వాదిదిగా యుండును. కావున నట్లంగీకరింపక తప్పదు. కాబట్టి యీ ప్రతిషేధము నిరుపయోగమని భావము.

అహేతుసమ లక్షణము:—

"త్రైకాల్యాసిద్ధేర్హేతో రహేతు సమః" ౫.౧.౧౮.

హేతోః = సాధనము, త్రైకాల్యాసిద్ధేః = సాధ్యమునకు పూర్వోత్తర సమకాలములందు సాధకముగా సిద్ధింపనందున, అహేతు సమః = అహేతు సమమగును.

శబ్దమనిత్యము. ప్రయత్నానంతరీయకమగుటవలన. ఘటమువలె నని వాది ప్రయోగించును. ఇట ప్రయత్నానంతరీయకమను నీహేతువు సాధ్యమునకు పూర్వమేర్పడునా? లేక తరువాతనా? పూర్వమందు వేని హేతుత్వమే సిద్ధింపదు. సాధ్యము లేనిది హేతువు దేనికి? సాధ్యమన హేతుమంతము. హేతుమంతము లేనిది హేతువెట్లు సిద్ధించును? తరువాత సిద్ధించు నందువా? అదియును పొసగదు. సాధ్యము ముందే సిద్ధించిన హేతువు (సాధకము) తరువాత సిద్ధించి చేయున దేమి? సాధ్యమును సిద్ధింపజేయుటకే కదా సాధన ముపయోగించుచు? సాధ్యముతో హేతువునకు సహభావ మందువా? అదియు నిరర్థకమే. హేతువు హేతుమంతము నను రెండును ఒకే సమయమున నెట్లేర్పడగలవు? సహభావము కలవానిలో నేది దేనికి కారణమో, దేనికెయ్యది కార్యమో నిశ్చయించు

పెట్టు? సవ్యదక్షిణ శృంగములలో సాధ్య సాధనభావ మంగీకరింపనగునా? యని యిట్లు హేతువును అహేతువుగా నిరూపించి ప్రతిఘటించుట అహేతుసమ మనబడును.

"న హేతుతః సాధ్యసిద్ధేస్త్రైకాల్యాసిద్ధిః" ౫.౧.౧౯.

హేతుతః = సాధనమువలన, సాధ్యసిద్ధేః = సాధ్యము సిద్ధించుట వలన, త్రైకాల్యాసిద్ధిః = హేతువు త్రికాలములందు సిద్ధింపదనుట, న = తగదు.

దేనివలన నేది సిద్ధించునో యది దానికంటె ముందుండవలయు ననునది నియమము. హేతువువలన సాధ్యము సిద్ధించుట ప్రత్యక్షవిషయము. ప్రత్యక్షమున ప్రశ్నలు తగవు. సాధ్యము లేనపుడు దేనికి హేతునని ప్రశ్నించుటయు తగదు. ఏది సాధింపబడునో దానికిది హేతువని చెప్పనగును గదా ? కాబట్టి హేతువు త్రికాలములందు సిద్ధింపదనుట అయుక్తము.

"ప్రతిషేధానుపపత్తేశ్చ ప్రతిషేద్ధవ్యాప్రతిషేధః" ౫.౧.౨౦.

ప్రతిషేధానుపపత్తేశ్చ = ప్రతిషేధ ముపపన్నము కాకుండుట వలనను, ప్రతిషేద్ధవ్యాప్రతిషేధః = హేతు ప్రతిషేధము అయుక్తము.

హేతువు సాధ్యమునకు పూర్వముకానీ, పరమునకానీ, తోడ్తోకానీ, సిద్ధింపదనిన, ప్రతివాదిచే చేయబడు హేతుప్రతిషేధము సైతము, తాను ప్రతిషేధింపదలచిన హేతువుకంటె పూర్వ - పర - సమ కాలములలో నెట్లు సిద్ధించునో చెప్పవలసి యుండును. హేతువుకంటె పూర్వమే ప్రతిషేధమనిన దేనికది ప్రతిషేధము ? తరువాత ననిన ప్రతిషేద్ధవ్యమగు హేతువు పూర్వమే ప్రతిషేధింపబడిన తరువాత ప్రతి

షేధమెందులకు ? సహభావమనిన నేది దేనికి ప్రతిషేధము ? కాబట్టి ప్రతిషేధము నిర్యుక్తికము.

అర్థాపత్తిసమలక్షణము:—

“అర్థాపత్తితః ప్రతిపక్షసిద్ధే రర్థాపత్తిసమః” ౫.౧.౨౧.

అర్థాపత్తితః = అర్థాపత్తిచే, ప్రతిపక్షసిద్ధేః=ప్రతిపక్షము సిద్ధించుటవలన, అర్థాపత్తిసమః = అర్థాపత్తిసమ మనబడును.

పక్షమున సాధ్యాభావము సిద్ధమొనర్చుటకు అర్థాపత్తి సాధర్మ్యముతో ప్రతిఘటించుట అర్థాపత్తి సమమగును.

శబ్ద మనిత్యము ఘటమువలె ప్రయత్నానంతరీయక మగుటవలన నని ప్రయోగింప, ఘటసామ్యమువలన శబ్ద మనిత్య మయిన నాకాశముతో నస్పర్శత్వ సామ్యముండుట వలన శబ్దము నిత్యమని తేలుచున్నదని యర్థాపత్తితో చేయు ప్రతివాదిప్రతిషేధము అర్థాపత్తిసమ మనబడును.

“అనుక్తస్యార్థాపత్తేః పక్షహానేరుపపత్తిరనుక్తత్వా
దనైకాంతికత్వాచ్చార్థాపత్తేః” ౫.౧.౨౨.

అనుక్తత్వాత్ = ప్రతివాదిచే చెప్పబడక పోవుటవలన, అర్థాపత్తేశ్చ = అర్థాపత్తివలన ప్రాప్తించుట వలనను, అనైకాంతికత్వాత్ = ఒకేపక్షము నియతము కాకపోవుటవలన, అనుక్తస్య = ఉక్తము కాని దంతయు, అర్థాపత్తేః = అర్థాపత్తి వలన, పక్షహానేః = ప్రతి పక్ష హానికి, ఉపపత్తిః = ఉపపత్తి కలుగును.

వాక్యార్థము నుపపాదించు సామర్థ్యము కలిగిన చోటుననే వాక్యార్థము అనుక్తమయినను అర్థమువలన సిద్ధించును. ‘దేవదత్తుడు బలము కలిగియున్నాడు; పగట భుజింపడు’ అనిన రాత్రియందు భుజించు చున్నాడని అర్థాపత్తి

వలన తెలియును. ఇట్టియెడ సామర్థ్యము గోచరించును. కాని ప్రకృతమున వ్యభిచరింపని సాధర్మ్యములో సాధ్యము (శబ్దమున ప్రయత్నానంతరీయకత్వ సాధర్మ్యముతో అనిత్యత్వము) సాధింపగా నిత్యత్వమును వ్యభిచరించు అస్పర్శత్వ సాధర్మ్యముతో శబ్దమున నిత్యత్వము అర్థాపత్తివలన సిద్ధించుననుట యుక్తముకాదు. దేవదత్తుని బలము రాత్రి భోజనమెట్లు సమర్థించునో 'శబ్దము అనిత్యమ'న, 'శబ్దము నిత్యము' అను నర్థ మట్లు సమర్థింపబడదు. సామర్థ్యము లేనియెడల సయితము అర్థాపత్తివలన కొండొక యర్థము కల్పింప నిష్టమగుచో, ప్రతివాది పక్షమునకే హాని కలుగును. అతడు శబ్దము నిత్యమనిన, శబ్ద మనిత్యమని అర్థాపత్తివలన నుపపన్న మగునుకదా! కాబట్టి యీప్రతిషేధము నిరుపపన్నమని భావము.

అవిశేష సమలక్షణము:—

"ఏకధర్మోపపత్తే రవిశేషే సర్వావిశేష ప్రసంగాత్
సద్భావోపపత్తే రవిశేష సమః." ౫.౧.౨౩.

ఏకధర్మోపపత్తేః = దృష్టాంత సాధర్మ్యము పక్షమున సిద్ధించుట వలన, అవిశేషే = పక్షదృష్టాంతములు సమానములుకాగా, సద్భావోపపత్తేః = సత్తాఖ్య ధర్మమంతట సిద్ధమగుటవలన, సర్వావిశేష ప్రసంగాత్ = సర్వము సమానమనెడి ప్రసక్తి కలుగుటవలన, అవిశేష సమః = అవిశేష సమమగును.

ప్రయత్నానంతరీయకత్వ సామ్యమున ఘట సమానమై శబ్ద మనిత్యమగునెడల, సత్తా సామ్యమువలన నన్నియు నన్నిటితో సమానము లగును. అట్లు కాదందువేని శబ్దము ఘట

సమానమై యనిత్యము కానేరదు. ప్రయత్నానంతరీయకత్వ సామ్యమున శబ్దము ఘటసామ్యమై యనిత్యమగును కాని సత్తాసామ్యమున సర్వ భావపదార్థములు పరస్పర సామ్యములై సర్వము సమానమగు ననుట సరి కాదందు వేని యందు లకు ప్రమాణము చెప్పవలసియుండునని ప్రతిఘటించుట అవి శేషసమ మనబడును.

"క్వచిత్ తద్ధర్మోపపత్తేః క్వచిచ్చానుపపత్తేః ప్రతి షేధాభావః" ౫.౧.౨౪.

క్వచిత్ = ఒకానొకతావున, తద్ధర్మోపపత్తేః = అవిశేష హేతు ధర్మ ముపపన్నమగుటవలన, క్వచిచ్చ = మఱియొకతావున, అనుప పత్తేః = అవిశేష హేతుధర్మమనుపపన్న మగుటవలన, ప్రతిషేధా భావః = ప్రతిషేధము సిద్ధింపదు.

శబ్దము పక్షము. ఘటము దృష్టాంతము. ఈ రెంటి యందును ప్రయత్నానంతరీయకత్వమను ధర్మము అవిశేష హేతువగును. ప్రయత్నానంతరీయకత్వమునకు అనిత్యత్వము వ్యాపకము. ఎట ప్రయత్నానంతరీయకత్వముండునో యట అనిత్యత్వ ముండును. అను నిట్టివ్యాప్తి కాశ్రయమై ప్రయత్నానంతరీయకత్వమనెడి హేతువు శబ్దఘటములలో సామ్యము (అవిశేషత) సంపాదించుచున్నది. అట్లే సత్తా ధర్మము వ్యాప్తికాశ్రయమై సామ్యమును సంపాదింప గలుగు ధర్మము మఱియొకటి యేదిగలదు? అట్టి ధర్మము సిద్ధింపదు. కారణ మేమనః నిత్యత్వము సత్తావ్యాపక ధర్మమందుమేని యది దృష్టాంతముతో నుపపన్నము కావలసియుండును. కాని అట్లు కాజాలదు. 'సర్వము నిత్యము. సత్తావంత మగుటవలన

అనిన దృష్టాంతముగా నీయగల వస్తు వుండేమిగలదు?సర్వము పక్షములో చేరును. పక్షములో చేరినదానిని దృష్టాంతముగా గ్రహింప వీలుపడదు. పక్షము సందిగ్ధసాధ్యము. దృష్టాంతము నిశ్చితసాధ్యము కలది. సర్వము సందిగ్ధ సాధ్యాశ్రయ మైన నిశ్చితసాధ్యమున కాశ్రయ మెయ్యది? దృష్టాంతము లేక హేతువు సాధ్యసాధక మెట్లగును? కాబట్టి సత్తాసామ్యముతో సర్వము అవిశేష మగుటచే శబ్దము నిత్యమగునని ప్రతిఘటించుట యుక్తివిరుద్ధ మగునని భావము.

ఉపపత్తిసమలక్షణము:—

"ఉభయ కారణోపపత్తే రుపపత్తిసమః" ౫.౧.౨౫.

ఉభయ కారణోపపత్తేః = పక్షప్రతిపక్ష హేతూపపత్తివలన, ఉపపత్తిసమః = ఉపపత్తిసమమగును.

శబ్ద మనిత్యమని సాధించుటకు ప్రయత్నానంతరీయకత్వ హేతువు సిద్ధించిన, 'శబ్దము నిత్యము అస్పర్శమగుట వలన ఆకాశమువలె'నని ప్రతిపక్ష సాధక హేతువు సిద్ధించును. విశేషహేతువు లేనందున శబ్ద మనిత్యమే కాని నిత్యము కాదనరాదని ప్రతిఘటించుట ఉపపత్తిసమ మనబడును.

"ఉపపత్తికారణాభ్యనుజ్ఞానా దప్రతిషేధః" ౫.౧.౨౬.

ఉపపత్తి కారణాభ్యనుజ్ఞానాత్ = వాదిపక్ష సిద్ధికి కారణము నంగీకరించినందున, అప్రతిషేధః = ప్రతిషేధము అయుక్తము.

ఉభయ పక్షపు హేతువుల నంగీకరించువాడు వాది పక్షమును నంగీకరించును కాని ప్రతిషేధింపడు. అంగీకరింపని పక్షమున 'ఉభయకారణోపపత్తివలన' అని ప్రయోగించుటయే

తగదు. హేతువు సంగీకరించి సాధ్యము నంగీకరింపకుండు టలో నర్థమేమి? హేతువు = వ్యాప్యము నంగీకరించిన సాధ్యము (వ్యాపకము) నంగీకరించినట్లే యగును. రెండు హేతువు లుపపన్నములైనను శబ్దము నిత్యము. అనిత్యము ననుట పొసగదు. అట్లనుట పరస్పర వ్యాఘాతమగును. ఉభయ కారణోపపత్తి వలన అనిత్యత్వము వ్యాహతమగునెడల నిత్యత్వమును వ్యాహతమగును. కాబట్టి ఉపపత్తిసమముతో ప్రతిఘటన అసంగతమని భావము.

ఉపలబ్ధి సమలక్షణము:—

"నిర్దిష్ట కారణాభావేఽప్యుపలంభాదుపలబ్ధిసమః" ౫.౧.౨౭.

నిర్దిష్టకారణాభావేఽపి = వాదిచే చెప్పబడిన హేతువు లేకున్నను, ఉపలంభాత్ = సాధ్య ముపలబ్ధమగుట వలన, ఉపలబ్ధిసమః = ఉపలబ్ధిసమమగును.

పక్షమున నెకచో హేత్వసిద్ధిని చూపుట యుపలబ్ధి సమమనబడును. వాయు వశమున చెట్టుకొమ్మ విరిగినపుడు శబ్దముత్పన్నమై నశించును. దానింబట్టి శబ్దమనిత్యమని తెలియు చున్నది. అందువలన, శబ్ద మనిత్యమని ప్రయత్నానంతరీయ కత్వ హేతువుచే సాధించుట యుక్తముకాదు. ప్రయత్నానం తరీయకత్వ హేతువే శబ్దానిత్యత్వమును సాధించునెడల శాఖాభంగమువలన శబ్ద మనిత్యమని తెలియబడకుండవల యును. తెలియబడుచుండుటచేత శబ్ద మనిత్యము ప్రయ త్నానంతరీయకమగుటవలన నని సాధించుట అయుక్తమని ప్రతిఘటించుట ఉపలబ్ధి సమము.

"కారణాంతరాదపి తద్ధర్మోపపత్తే రప్రతిషేధః" ౫.౧. ౨౯.

కారణాంతరాదపి = మఱియొక హేతువువలనను, తద్ధర్మోపపత్తేః = సాధ్యధర్మము సిద్ధించుట అయుక్తము కాదు కాబట్టి, అప్రతిషేధః = దోషము లేదు.

ఏ శబ్దమున ప్రయత్నానంతరీయకత్వము వలన అనిత్యత్వము సిద్ధింపదో అట మఱియొక కృతకత్వము మున్నగు హేత్వంతరమున నది సిద్ధింపగలదు. కృతకముకాని శబ్దమెందును లేదు. కాబట్టి దోషము లేదు. ఒక కారణముచే సిద్ధించు సాధ్యము మఱియొక కారణమునగల కారణత్వమును వారింపజాలదు. కాబట్టి యుపలబ్ధి సమ మయుక్తమని భావము.

అనుపలబ్ధి సమముః—

"తదనుపలబ్ధే రనుపలంభాదభావసిద్ధౌ తద్విపరీతోపపత్తే రనుపలబ్ధిసమః" ౫. ౧. ౨౯.

తదనుపలబ్ధేః = ప్రతిబంధకానుపలబ్ధి, అనుపలంభాత్ = ఉపలంభము కానందున, అభావసిద్ధౌ = అభావము సిద్ధింపగా, తద్విపరీతోపపత్తేః = ప్రతిబంధకోపలబ్ధి యుపపన్నమగుటవలన, అనుపలబ్ధిసమః = అనుపలబ్ధి సమమగును.

నేలను త్రవ్వుటకుముందు భూమియందు జలమున్డియు మృత్తికాదులు ప్రతిబంధకము లగుటవలన నుపలబ్ధము కాదు. అట్లే ఉచ్చారణకు ముందు శబ్దముండియు ప్రతిబంధకము వలన నుపలబ్ధ మగుటలేదు. అంతియేకాని 'యనిత్యమగుట వలనకాదు' అనినుడువ వీలులేదు. కారణమేమన జలమునకు మృత్తిక ప్రతిబంధకమున్నట్లు శబ్దమునకు ప్రతిబంధకమేదియు కానరాదు. కాబట్టి శబ్దము నుచ్చరించుటకు పూర్వమది

లేదనియే యెంచవలయునని వాది సిద్ధపరుప, ప్రతివాది ప్రతిబంధకానుపలబ్ధివలన శబ్దాభావము సిద్ధించిన, ప్రతిబంధకానుపలబ్ధియు నుపలబ్ధము కానందున ప్రతిబంధకానుపలబ్ధ్యభావమును సిద్ధించును అనగా ప్రతిబంధకోపలబ్ధి సిద్ధించును. కాబట్టి శబ్దమునంయు నుపలబ్ధము కాకున్నదని ప్రతిఘటించుట అనుపలబ్ధి సమమగును.

"అనుపలంభాత్మకత్వాదనుపలబ్ధే రహేతుః" ౫.౧.౩౦.

అనుపలబ్ధేః = ఆవరణాది ప్రతిబంధకానుపలబ్ధి, అనుపలంభాత్మకత్వాత్ = (ప్రతిబంధకోపలబ్ధ్యభావమగుట అనుపలంభము) అనుపలంభ స్వరూపక మగుటవలన-అభావ స్వరూపమగుటవలన నని భావము. అహేతుః = ప్రతిబంధకానుపలబ్ధి అనుపలంభ మగుటవలన నసుహేతువు ప్రతిబంధకోపలబ్ధికి సాధకము కాదు

దేనికేది విషయమో యది దాని యస్తిత్వమును తెలుపును. నాస్తిత్వమును తెలుపదు. ఉపలబ్ధికి విషయము భావము. అనుపలబ్ధికి విషయము అభావము. ఆవరణాది ప్రతిబంధకానుపలబ్ధి అభావాత్మకము. అందుప్రవర్తించు అనుపలంభము దాని యభావత్వము నెట్లు తీసివేయ గలుగును? కాబట్టి, ఆవరణాది ప్రతిబంధకానుపలబ్ధి అనుపలంభము వలన ప్రతిషేధింప బడనిదై ప్రతిబంధకోపలబ్ధికి సాధనమెట్లు కాగలదు? కాజాలదు. అందువలన ప్రతిబంధకము లేనందున ఉచ్చారణకు పూర్వము శబ్దము లేదనియే సిద్ధమగుననిభావము.

"జ్ఞాన వికల్పానాంచ భావాభావసంవేదనా దధ్యాత్మమ్" ౫.౧.౩౧.

అధ్యాత్మమ్ = మనస్సుతో, జ్ఞాన వికల్పానాం = జ్ఞాన విశేష ముల, భావాభావ సంవేదనాత్ = సత్త్వాసత్త్వములు తెలియుటవలన, అహేతుః = అనుపలబ్ధ్యనుపలంభమువలన నను హేతువు సరికాదు.

మనస్సుద్వారా జ్ఞానముల భావము తెలియబడినట్లు వాని యభావమును తెలియబడును. (ఏ యింద్రియముచే నే విషయము గ్రహింపబడునో యందలి జాతియు, దాని యభావమును నా యింద్రియము చేతనే గ్రహింపబడునను నియమ మిందు ప్రయోజకము.) ఆవరణాది ప్రతిబంధకా నుపలబ్ధియు జ్ఞానాభావమే; కావున నుపలబ్ధి (జ్ఞానము)వలె నదియు మనస్సుచే గ్రహింపబడుచున్నది. ఆవరణాద్యుపలబ్ధి లేదని తెలియుచున్నది. కాబట్టి, ఆవరణానుపలబ్ధి సిద్ధించి, తదనుప లంభము సిద్ధింపనందున, ఉచ్చారణకు పూర్వము శబ్దము లేకయే యుపలబ్ధము కాకున్నదని తెలియుచున్నది. అందు వలన ననిత్యమనియు ధ్రువమగుచున్నదని భావము.

అనిత్యసమముః —

"సాధర్మ్యాత్తుల్యధర్మోపపత్తేః సర్వానిత్యత్వప్రసంగా దనిత్యసమః" ౫.౧.౩౨.

సాధర్మ్యాత్ = దృష్టాంత సాధర్మ్యమువలన, తుల్యధర్మోప పత్తేః=పక్షమునందు దృష్టాంతమునకు సమానమైన ధర్మముపపన్నమగుట వలన, సర్వానిత్యత్వ ప్రసంగాత్ = సర్వము అనిత్యము కావలసిన ప్రసక్తి కలుగును. కాబట్టి, అనిత్యసమః = అనిత్యసమమగును.

పక్షమునందు సాధ్యధర్మ విపర్యయమును సాధించు నిమిత్తము దృష్టాంతసాధర్మ్యముతో సమస్తభావ పదార్థము లనిత్యములని యుద్భావించుట అనిత్య సమమగును.

ప్రయత్నానంతరీయకత్వ సామ్యముచే ఘటమువలె శబ్ద మనిత్యమగునెడల, ఘటము నందలి సత్వగుణ (ఉనికి) సాధర్మ్యముతో సర్వభావ పదార్థములేల అనిత్యములు కావు? కావను పక్షమున శబ్దమును అనిత్యము కానేరదు. ఘటమునందలి కొండొక (ప్రయత్నానంతరీయకత్వ) గుణ సామ్యముచే శబ్దము అనిత్యమగును కాని, వేరొక (ఉనికి-సత్వ)గుణ సామ్యముచే నితర భావపదార్థములు అనిత్యములు కావనుటకు విశేషహేతువేమి? యని ప్రతిఘటించుట అనిత్యసమమగును.

"సాధర్మ్యాదసిద్ధేః, ప్రతిషేధాసిద్ధిః, ప్రతిషేధ్య సాధర్మ్యాత్" ౫.౧.33.

సాధర్మ్యాత్=దృష్టాంత సాధర్మ్యము వలన, అసిద్ధేః= పక్షమున సాధ్యము సిద్ధింపని పక్షమున, ప్రతిషేధ్య సాధర్మ్యాత్=వాదిపక్ష సాధర్మ్యము వలన, ప్రతిషేధాసిద్ధిః=ప్రతివాది పక్షమును సిద్ధింపదు.

శబ్ద మనిత్యమని వాదిపక్షము. సర్వమనిత్యమని ప్రతివాది పక్షము. శబ్ద మనిత్య మనుటకు వాది ఘటమును దృష్టాంతముగా గ్రహించుచున్నాడు. ఘటమునందలి ప్రయత్నానంతరీయకత్వ ధర్మసామ్యమున శబ్దమున ననిత్యము సిద్ధింపని పక్షమున, వాదివలె ప్రతివాది తాను ను ప్రతిజ్ఞాద్యవయవములను ప్రయోగించి (సర్వమనిత్యము. సత్వముగలదగుటవలన. ఘటమువలె) దృష్టాంతమునందలి సత్తాసాధర్మ్యముతో సర్వ మనిత్యమనుటయు సిద్ధింపదు. కాబట్టి ప్రతివాది ప్రతిషేధము నిరర్థకమని భావము.

"దృష్టాంతేచ సాధ్యసాధనభావేన ప్రజ్ఞాతస్యధర్మస్య హేతుత్వాత్తస్య చోభయధాభావాన్నావిశేషః" ౫.౧.౩౪.

దృష్టాంతే = దృష్టాంత స్థలమున, సాధ్యసాధనభావేన=సాధ్యవ్యాప్యమని, ప్రజ్ఞాతస్య = నిశ్చయముగా తెలియబడిన, ధర్మస్య = ధర్మము, హేతుత్వాత్ = హేతువగుటవలన, తస్యచ = ఆధర్మము, ఉభయధాభావాత్ = కొండొక దానితో సమానముగను, మరియొక దానితో విశిష్టముగను ఉండుటవలన, అవిశేషః = సాధ్యవ్యాప్యము కాని ధర్మము, న = హేతువు కాదు.

ఒకధర్మము సమానమైనను లేక విశిష్టమైనను, దృష్టాంతమునందు సాధ్యమును విడిచియుండదు. సాధ్యవ్యాప్యము అని తెలియబడని పక్షమున ఆ హేతువు సాధ్యసాధకము కానేరదు. ప్రయత్నానంతరీయకత్వ మనెడి సమాన ధర్మము ఘటమునందు, అనిత్యత్వ మనెడి సాధ్యధర్మమున కవినాభావి (సాధ్యవ్యాప్యము) అని తెలియబడుచున్నది. కాబట్టి యది పక్షమున—శబ్దమున అనిత్యత్వమును సాధించుచున్నది. సత్వధర్మము సాధ్యావినాభావి—సాధ్యవ్యాప్యముకాదు. కారణమేమన, ఆత్మాకాశాదులలో సత్వమున్నది కాని అనిత్యత్వము లేదు. కాబట్టి అది వ్యభిచారిధర్మము. అందుచే నది యనిత్యత్వ సాధకము కానేరదు. కాబట్టి ప్రతివాది ప్రతిఘటన యుక్తి సంగతము కాదని భావము.

నిత్యసమము:—

"నిత్యమనిత్య భావాదనిత్యే నిత్యత్వోపపత్తేర్నిత్యసమః" ౫.౧.౩౫.

అనిత్యే = అనిత్యత్వము సాధ్యముగా గల వస్తువునందు, నిత్యమ్ = ఎల్లపుడు, అనిత్యభావాత్ = అనిత్యత్వ ముండుటవలన, నిత్యత్వోపపత్తేః = నిత్యత్వము సిద్ధించుటవలన, నిత్యసమః = నిత్యసమమగును.

ప్రయత్నానంతరీయకత్వహేతువుచే శబ్దమునందు సాధింపబడెడి అనిత్యత్వము నిత్యమా ? లేక యనిత్యమా ? అనిత్యమగునెడల శబ్దము నిత్యమగును కాని యనిత్యము కాదు. అనిత్యత్వమునందలి యనిత్యత పోయిన నిత్యత్వము సిద్ధించు నని భావము. లేక అనిత్యత్వము నిత్యమందు రేని ధర్మనిత్యత వలన ధర్మియైన శబ్దము నిత్యమగుట సుంతైన సందేహ ముండదు. కాబట్టి యుభయ విధములను శబ్దము నిత్యమే యగునని ప్రతిఘటించుట నిత్యసమ మగునని భావము.

ధర్మముయొక్క నిత్యానిత్యభావ వికల్పముద్వారా ధర్మియందు నిత్యత్వమును సాధించుట నిత్యసమము.

"ప్రతిషేధ్యే నిత్యమనిత్యభావా దనిత్యే అనిత్యత్వోప పత్తేః ప్రతిషేధాభావః" ౫.౧.౩౬.

ప్రతిషేధ్యే=ప్రతిషేధింపదగిన శబ్దమునందు, నిత్యం =ఎల్లప్పుడు, అనిత్యభావాత్ = అనిత్యత్వముండుటవలన, అనిత్యే = అనిత్యమయిన శబ్దమునందు, అనిత్యత్వోపపత్తేః = అనిత్యత్వము సిద్ధించుటవలన, ప్రతిషేధాభావః = ప్రతిషేధము సరికాదు

ప్రతివాదిచే ప్రతిషేధింపదగు శబ్దమున నెల్లపుడు యనిత్యత్వ ముండుననుటచేనది యనిత్య మగుచున్నది. ఎల్లపుడు ననిత్య భావముతో దేనికి సంబంధ ముండునో యది యనిత్యము అనిత్యభావ సంబంధము దేనికుండునో అది నిత్యము అనుట వ్యాహత మగును. అనిత్యత్వ మనుధర్మము

నిత్యమగుటచే దానికాశ్రయమైన ధర్మియు నిత్యము అనుట యుక్తము కాదు. అనిత్యత్వ మన ధ్వంసము. కాబట్టి శబ్దము ధ్వంస ప్రతియోగి యగుచు. ప్రతియోగి దేనికది ప్రతియోగియో దానికి ఆశ్రయము కాదు. ఘటాభావమునకు ఘటము ప్రతియోగికాదు. భూతలము ప్రతియోగి. అట్లే ధ్వంసమును అభావాంతర్గత మగుటచే నది ప్రతియోగియగు శబ్దాశ్రితము కాజాలదు. కాబట్టి శబ్దము అనిత్యము.

కార్యసమము:—

"ప్రయత్నకార్యానేకత్వాత్ కార్యసమః" ౫.౧.౩౭.

ప్రయత్నకార్యానేకత్వాత్=ప్రయత్నముచే సంపాదింప దగిన కార్యము లనేకములగుటవలన, కార్యసమః=కార్యసమ మగును.

హేతువునకు రెండు అర్థములుకల్పించి తద్వారా పక్షము నందు సాధ్యసంశయము నాపాదించుట కార్యసమమనబడును. శబ్దమనిత్యము. ఘటమునలె. ప్రయత్నానంతరీయక మగుట వలన. ఇట ప్రయత్నానంతరీయక మన ప్రయత్నకార్యమని గదా యర్థము! ప్రయత్నము వలన కలుగు కార్యము రెండు విధములుగ నుండును. ఒకచో ప్రయత్నకార్యము కపాలములనుండి ఘట ముత్పన్నమగుట. మఱియొకచో, మృత్తికాదులను తొలగించి జలమును అభివ్యక్త పరుచుట (ఉన్నదానిని బయటపెట్టుట). కాబట్టి ప్రయత్నానంతరీయకత్వము శబ్దము నుత్పన్నము చేయుచున్న దనుటకంటె నభివ్యక్తము చేయుచున్నదని యేల యనరాదు? ఉత్పాద్య మగుటచే అనిత్యమందుమేని అభివ్యజ్యమగుటచే నిత్యమని చెప్పుట

కభ్యంతరమేమి? అని సందేహము కలిగించుట కార్యసమ మనబడును.

"కార్యాన్యత్వే ప్రయత్నా హేతుత్వ మనుపలబ్ధికారణోపపత్తేః" ౫.౧.౩౭.

అనుపలబ్ధి కారణోపపత్తేః = అనుపలబ్ధికి కారణ ముపపన్నమగుట వలన, కార్యాన్యత్వే = ప్రయత్నకార్యము లనేకము లయినను, ప్రయత్నా హేతుత్వం = శబ్దాభివ్యక్తియందు ప్రయత్న హేతుత్వము ఉపపన్నము కాదు

ఒక వస్తువుండియు తెలియబడకుండుటకు ఆవరణాది వ్యవధాన ముండవలయును భూమిలో జలమున్నది. కాని యది యున్నట్లు తెలియకుండుటకు వ్యవధానము కల్పించు ఆవరణము మృత్తికామలుండును. ఆ యావరణము తొలగిన జలము అభివ్యక్తమగును. అట్లే శబ్ద మభివ్యక్తమయిన దాని కావరణమున్నట్లు తెలియవలయును. అనుపలబ్ధికి హేతువైన ఆవరణాదులను పోగొట్టి ప్రయత్న మభివ్యక్తికి కారణమగును కాని సాక్షాత్తుగా కాదు. శబ్దమునకు వ్యవధానమున్నట్లే తెలియదు. కాబట్టి ప్రయత్నము దానిని అభివ్యక్తపరుచు టెట్లు ? ప్రయత్నకార్యము లనేకములయినను శబ్ద మభివ్యక్త మనుట యుక్తము కాదని భావము.

ప్రతివాది జాతిని ప్రయోగించి సిద్ధాంతమును ప్రతి ఘటించినపుడు వాది శాస్త్రమునందుపదేశించినట్లు సత్యమైన సమాధానము నిచ్చుటకే యత్నింపవలయును. తాను కూడ జాతిని ప్రయోగించి అసదుత్తరము నొసంగుట తగదు. అట్లుకాక యిరువురును జాతి ప్రయోగముల నాశ్రయించిన

నట్టి ప్రసంగము తత్వ నిర్ణయమును జేయజాలదు. తత్వ నిర్ణయమునకు విఘాతకమైనచర్చ యెట్లుండునో తెలిపి శిష్యులకు హితవు చేకూర్పదలచి పరమ కారుణికుడైన మహర్షి సూత్రము నారంభించుచున్నాడు.

"ప్రతిషేధేఽపి సమానోదోషః" ౫.౧.౩౯.

ప్రతిషేధేఽపి=ప్రతిషేధ హేతువునందును, సమానః=స్థాపనా హేతువునకు సమానమైన, దోషః=అనైకాంతిక దోషముండును.

తత్వనిర్ణయార్థ మారంభింపబడిన చర్చ (కథ)యందు ప్రవృత్తుడై ప్రథమపక్షము నవలంబించిన యొకవ్యక్తి, 'శబ్దము అనిత్యము ఘటమువలె, ప్రయత్నానంతరీయక మగుటవలన' అని ప్రయోగించును. ద్వితీయపక్షావలంబియైన మరియొకవ్యక్తి జాతిని ప్రయోగింపదలచి, పూర్వహేతువును ప్రతిఘటించుచు, 'ప్రయత్నకార్యము లనేకము లగుటవలన, అని ప్రతిషేధ హేతువును ప్రయోగించును. తృతీయ పక్షమున ప్రథమ స్థాపనాహేతువాది 'శబ్ద ముపలబ్ధము కాకుండుటకు గల ఆవరణాదు లుపలబ్ధము కాకుండుటవలన నాహేతువు వ్యభిచరింప'దని సదుత్తర మీయక, నా హేతువు (శబ్దమభివ్యక్తమగుటవలన) వ్యభిచారి యందువేని 'ప్రయత్న కార్యానేకత్వ'మను నీహేతువును శబ్దము నందలి యనిత్యత్వము మాత్రము ప్రతిషేధించుచున్నది. సర్వమును ప్రతిషేధింపదు. కాబట్టియనైకాంతికమగునని ప్రతిఘటించును.

"సర్వత్రైవమ్" ౫.౧.౪౦.

ఏవమ్ = పైజెప్పిన కార్యసమమను జాతి స్థానమునందువలె, సర్వత్ర= ఇతరజాతి ప్రయోగ స్థలములందును అసదుత్తరమీయవచ్చును.

తత్వనిర్ణయము నభిలషించు స్థాపనాహేతువాది ప్రతివాది యెట్టిజాతిని ప్రయోగించినను తానుమాత్రము జాతిని ప్రయోగింపడు. తత్వము నభిలషింపని వాని కట్టి నియమముండదు. ప్రతివాది యెట్టిజాతిని ప్రయోగించినను తానును జాతి నవలంబించి యసదుత్తర మీయదగును. స్థాపనాహేతువాది తృతీయపక్షమున సమాధానాభాసము చెప్పగా జాతివాది చతుర్థపక్షమున ప్రతిఘటించును.

"ప్రతిషేధవిప్రతిషేధే ప్రతిషేధదోషవద్దోషః" ౫.౧.౪౧.

ప్రతిషేధ దోషవత్ = నాచే చేయబడిన ప్రతిషేధమున వ్యభిచార దోషమున్నట్లు, ప్రతిషేధ విప్రతిషేధే = నీచే చేయబడిన విప్రతిషేధమునందును, దోషః = అనైకాంతిక దోషముకలదు.

నా ప్రతిషేధమున ననైకాంత దోషమున్న నీ విప్రతిషేధమునందు నట్టి దోషమే యుండునని ప్రతిఘటించును. పంచమ పక్షమున స్థాపనాహేతువాది:

"ప్రతిషేధం సదోష మభ్యుపేత్య, ప్రతిషేధ విప్రతిషేధే సమాన దోషప్రసంగో మతానుజ్ఞా" ౫.౧.౪౨.

ప్రతిషేధం = తనచే చేయబడిన ద్వితీయ పక్షమును, సదోషం = దోషయుక్తమని, అభ్యుపేత్య = అంగీకరించి, ప్రతిషేధ విప్రతిషేధే = తృతీయ పక్షమున, సమానదోష ప్రసంగః = చెప్పబడిన సమాన దోష ప్రసక్తి, మతానుజ్ఞా = మతానుజ్ఞయగును. మతమును అంగీకరించుట.

ప్రతివాది వగు నీవు నా చెప్పబడిన హేతువున గల దోషము నుద్ధరించి యటుపై నా చెప్పిన ప్రతిషేధమున దోషము నాపాదింపవలయును. అట్లు చేయక "నా ప్రతిషేధము దోషయుక్తమైన నీ పక్షమును సదోషమే" యని

"ప్రతిదృష్టాంత ధర్మాభ్యనుజ్ఞా స్వదృష్టాంతే ప్రతిజ్ఞాహానిః" ౫.౨.౨.

స్వదృష్టాంతే = వాది తన పక్షమున, ప్రతిదృష్టాంత ధర్మాభ్యనుజ్ఞా = ప్రతివాది పక్షధర్మము నంగీకరించుట, ప్రతిజ్ఞాహానిః = ప్రతిజ్ఞాహాని యనబడును.

శబ్ద మనిత్యము. ఇంద్రియగ్రాహ్య మగుటవలన, అని వాది ప్రయోగింప, నిత్యమైన సామాన్యము ఇంద్రియ గ్రాహ్యమే కదా! కాబట్టి నిత్యమేల కాదని ప్రతివాది యెదు ర్కొనిన, ప్రతివాది యాపాదించిన అనైకాంతిక దోషమును పోనాడలేక, అట్లయిన 'శబ్దము నిత్యమే కానిమ్ము' అని వాది యంగీకరించిన ప్రతిజ్ఞాహాని నిగ్రహస్థాన మగును. ఇదియొూట మికి స్థానము.

"ప్రతిజ్ఞాతార్థప్రతిషేధే ధర్మవికల్పా త్తదర్థనిర్దేశః ప్రతిజ్ఞాంతరమ్" ౫.౨.౩.

ప్రతిజ్ఞాతార్థప్రతిషేధే = వాదిచేప్రతిజ్ఞ చేయబడిన అర్థము ప్రతివాది ప్రతిషేధింప, ధర్మవికల్పాత్ = దృష్టాంత ప్రతిదృష్టాంతముల ధర్మభేదము వలన, తదర్థనిర్దేశః = ప్రతిజ్ఞాతార్థమును దృష్టాంత ధర్మ విశిష్టముగా నిర్దేశించుట, ప్రతిజ్ఞాంతరమ్ = ప్రతిజ్ఞాంతరము

'ఘటమువలె ఐంద్రియక మగుటవలన శబ్దమనిత్యము'ని వాది ప్రయోగింప, 'సామాన్య మైంద్రియకమైనను నిత్యము కదా! యని ప్రతివాది వ్యభిచారమును చూపును. అప్పుడు వాది, 'సామాన్య మైంద్రియకమయ్యు సర్వగత మగుటచే నిత్యమగును. కాని, ఘటము ఐంద్రియకమే కాని సర్వగతము కాదు. కాబట్టి యనిత్యమగును. అందువలన 'ఘటము సర్వ గతముకాక యనిత్యమైనట్లు శబ్దమును అసర్వగతము అనిత్య

మగును' అని ప్రతిజ్ఞను మార్చును. ముందు 'శబ్ద మనిత్య మ'నియు, తదుపరి 'అసర్వగతమగు శబ్ద మనిత్య మ'నియు ప్రతిజ్ఞ చేయును. కాబట్టి పరోక్తదోషమును బోగొట్ట దలచి పూర్వప్రతిజ్ఞాతార్థమున విశేషణము జేర్చి మరలప్రతిజ్ఞజేయుట ప్రతిజ్ఞాంతర మనబడును.

"ప్రతిజ్ఞాహేత్వోర్విరోధః ప్రతిజ్ఞావిరోధః" ౫.౨.౪.

ప్రతిజ్ఞ, హేతువు నను నీరెంటియందునుగల పరస్పర విరోధము ప్రతిజ్ఞావిరోధ మనబడును.

ప్రతిజ్ఞకు హేతువుతోను, హేతువునకు ప్రతిజ్ఞతోను విరోధము ప్రతిజ్ఞావిరోధ మనబడును. 'ద్రవ్యము గుణవ్యతిరిక్తము అని ప్రతిజ్ఞచేసి 'రూపాదులకంటె వేరుగా నుపలబ్ధము కానందున' అని హేతువుగా చెప్పిన, నిట ప్రతిజ్ఞాహేతువులు పరస్పర విరుద్ధము లగును.

"పక్షప్రతిషేధే ప్రతిజ్ఞాతార్థాపనయనం ప్రతిజ్ఞా సంన్యాసః" ౫.౨.౫.

పక్షప్రతిషేధే=హేతువునందు వ్యభిచార దోషము నుద్భావించుట ద్వారా, పక్షము నాక్షేపింపగా, ప్రతిజ్ఞాతార్థాపనయనం =ప్రతిజ్ఞాతార్థమును విడుచుట, ప్రతిజ్ఞాసంన్యాసః= ప్రతిజ్ఞాసంన్యాసమనబడును.

శబ్దమనిత్యము. ఐంద్రియక మగుటవలన, అని వాది ప్రయోగింప, ప్రతివాది ఐంద్రియకమైన సామాన్యము నిత్యమగుచున్నదని వ్యభిచార దోషము నుద్భావింపగా నా దోషమును పోగొట్టదలచి 'శబ్దమనిత్యమని యనువారెవరు?' అని తన ప్రతిజ్ఞను మరుగుపరచ యత్నించును. అట్టియెడ ప్రతిజ్ఞాసంన్యాస నిగ్రహస్థాన మగును.

"అవిశేషోక్తేహేతౌ ప్రతిషిద్ధే విశేషమిచ్ఛతో
హేత్వంతరమ్" ౫.౨.౬.

అవిశేషోక్తే = విశేషరహితముగా చెప్పబడిన, హేతౌ = హేతువు, ప్రతిషిద్ధే = ప్రతిషేధింపబడగా, విశేష మిచ్ఛతః = హేతు దోషమును పోగొట్టుటకై దానికి విశేషణము చేర్చుకోరిక గలిగిన, హేత్వంతరమ్ = హేత్వంతర నిగ్రహస్థాన మగును.

శబ్ద మనిత్యము. ఐంద్రియక మగుటవలన. అని హేతువును ప్రయోగించి హేతువున వ్యభిచార దోషమును జూపి ప్రతిఘటింప 'సామాన్యవంతమై ఐంద్రియక మగుటవలన'నని హేతువున విశేషణమును జేర్చి దోషమును దిద్దుకొనుట హేత్వంతర నిగ్రహస్థానము.

"ప్రకృతాదర్థాద ప్రతిసంబద్ధార్థ మర్థాంతరమ్" ౫.౨.౭.

ప్రకృతాత్ అర్థాత్ = వివాదగ్రస్తమైన ప్రస్తుతవిషయముకంటె, అప్రతిసంబద్ధార్థమ్ = అన్యమైన అసంబద్ధార్థ విషయమును చెప్పగోరిన, అర్థాంతరమ్ = అర్థాంతర నిగ్రహస్థాన మగును.

వాదిగానీ, ప్రతివాదిగానీ ప్రయోగించిన హేతువునందు వ్యభిచారాది దోషము గ్రహింపబడినపుడు దానిని దాచుటకుగాను ప్రస్తుత విషయమును విడచి యసంబద్ధ విషయమును ప్రస్తావించుట అర్థాంతర నిగ్రహస్థాన మనబడును.

'శబ్దము నిత్యము. అస్పర్శమగుటవలన' అని ప్రయోగింప సుఖ మస్పర్శమేకాని నిత్యము కాదని హేతువున వ్యభిచార ముద్భావింపగా, 'హేతువు హినోతి ధాతువునకు 'తున్' ప్రత్యయము చేర్చిన సిద్ధమగును. ఇది కృదంతము. నామము, ఆఖ్యాతము, ఉపసర్గము, నిపాతము నని పదములు

నాలుగువిధములు. సుబంతము నామము. కృదంతము ఆఖ్యాతము.' అని యేమోమో యసంబద్ధ ప్రసంగము లాడుటకు ప్రారంభించిన అర్థాంతర నిగ్రహస్థాన మగును.

"వర్ణక్రమ నిర్దేశవన్నిరర్థకమ్" ౫. ౨. ౮.

వర్ణక్రమ నిర్దేశవత్ = వర్ణక్రమమున నున్నట్లక్షరములను ప్రయోగించుట, నిరర్థకమ్ నిరర్థకము.

'శబ్దము నిత్యము జబగడద వలన' నని యర్థములేని యక్షరములను క్రమముగా ప్రయోగించుట నిరర్థక నిగ్రహస్థాన మనబడును.

"పరిషత్ప్రతివాదిభ్యాం త్రిరభిహిత మప్యవిజ్ఞాత
మవిజ్ఞాతార్థమ్" ౫. ౨. ౯.

త్రిరభిహితమపి = ముమ్మారు వాదిచెప్పినను, పరిషత్ప్రతివాదిభ్యాం = మధ్యస్థుల ద్వారాగాని, ప్రతివాదిచే గాని, అవిజ్ఞాతమ్ = తెలియబడకున్న, అవిజ్ఞాతార్థమ్ = అవిజ్ఞాతార్థమగును.

పరుల కజ్ఞానము నాపాదించిన తనకు జయము కలుగు నని భ్రమపడి మధ్యస్థులకుగానీ, ప్రతివాదికిగానీ ముమ్మారు చెప్పినను తెలియని విధమున క్లిష్టపదములను ప్రయోగించుట గానీ, వేగముగా నుచ్చరించుటగానీ అవిజ్ఞాతార్థ నిగ్రహస్థాన మగును.

"పౌర్వాపర్యాయోగా దప్రతిసంబద్ధార్థ
మపార్థకమ్" ౫.౨.౧౦.

పౌర్వాపర్యాయోగాత్ పూర్వాపర సంబంధములేని, అప్రతిసంబద్ధార్థమ్ = పరస్పర మన్వితముకాని పదములను ప్రయోగించుట, అపార్థకమ్ = అపార్థక మనబడును.

పదములు క్లిష్టములు కాకున్నను, అతి వేగముగా నుచ్చ రింప బడకున్నను, అన్వితములు కాని పూర్వాపర సంబంధము లేని పదములను ప్రయోగించుట అపార్థక నిగ్రహస్థానమనబడును.

వాచ్యార్థము లేని పద ప్రయోగము నిరర్థక మనియు సముదాయార్థము లేని ప్రయోగము అపార్థక మనియు వివేకము.

"అవయవ విపర్యాస వచన మప్రాప్త కాలమ్" ౫.౨.౧౧.

అవయవ విపర్యాసవచనమ్ = ప్రతిజ్ఞాది అవయవ వాక్యములను క్రమము విడిచి ప్రయోగించుట, అప్రాప్త కాలమ్ = అప్రాప్త కాల మనబడును.

అనుమాన వాక్యమున, ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనము నను క్రమమున నవయవములను ప్రయోగింప వలయును. అట్టి క్రమమును విడిచి ప్రయోగించుట అప్రాప్త కాల మనబడునని భావము.

"హీన మన్యతమే నాప్యవయవేన న్యూనమ్" ౫.౨.౧౨.

అన్యతమేనాపి = అవయవములలో నొక్క, అవయవేన హీనమ్ = అవయవము తక్కువైనను, న్యూనమ్ = న్యూనమనబడును.

అనుమాన వాక్యమున ప్రయోగింప వలసిన ప్రతిజ్ఞాది అవయవముల నెక్కటినైనను ప్రయోగింప కుండుట న్యూన నిగ్రహస్థాన మనబడును.

"హేతూదాహరణాధిక మధికమ్" ౫.౨.౧౩.

హేతూదాహరణాధికమ్ = హేతువుగానీ ఉదాహరణముగానీ యధికముగా ప్రయోగించిన, అధికమ్ = అధికమనబడును.

శబ్దమునిత్యము. శబ్దత్వము కలిగియుండుట వలన, శ్రావణత్వము కలిగియుండుట వలనను, అని రెండు హేతువులను

ప్రయోగించుట, అధికనిగ్రహస్థాన మనబడును. ఒకే హేతువు వలన నర్థము సిద్ధింప జేయుదునని యధిక హేతువును ప్రయోగించిన నిగృహీతు డగును. అట్టి నియమమును ముందుగా నంగీకరింపక అర్థసిద్ధిని బలపరచుట కనేక హేతువులను ప్రదర్శించుట నిగ్రహస్థానము కానేరదని భావము.

"శబ్దార్థయోః పునర్వచనం పునరుక్త మన్యత్రానువాదాత్" ౫.౨.౧౪.

అన్యత్రానువాదాత్ = అనువాద స్థలమున తప్ప, శబ్దార్థయోః = శబ్దార్థములను, పునర్వచనం = మరలచెప్పుట, పునరుక్తమ్= పునరుక్తమనబడును.

అనువాద స్థలమున తక్క తదితరమున, పూర్వోచ్చారిత శబ్దమును మరల నుచ్చరించుట, పునరుక్త మనబడును. శబ్దపునరుక్తము, అర్థపునరుక్తము నని యది రెండువిధములు. 'శబ్దము అనిత్యము, శబ్దమనిత్యము, అనిన శబ్దపునరుక్తము. 'శబ్ద మనిత్యము; 'నాదము వినాశి' అనిన అర్థపునరుక్తము.

"అర్థాదాపన్నస్య స్వశబ్దేన పునర్వచనమ్" ౫.౨.౧౫.

అర్థాత్ = అర్థమువలన, ఆపన్నస్య = ప్రాప్తమైన దానిని, స్వశబ్దేన ఆయర్థమును చెప్పు శబ్దముచేత, పునర్వచనమ్ = మరలచెప్పుట, అర్థపునరుక్తము.

మేఘములు లేక వర్షింపదు; అని "మేఘములున్న వర్షించు"నని చెప్పుట అర్థపునరుక్తమనబడును. ఇట్లే, స్థూలుడగు దేవదత్తుడు దినమున భుజింపడని 'రాత్రి భోజనము చేయును' అనుటయు, అర్థ పునరుక్తము.

"విజ్ఞాతస్య పరిషదా త్రిరభిహితస్యా ప్యప్రత్యుచ్చారణ మననుభాషణమ్" ౫.౨.౧౬.

పరిషదా=మధ్యవర్తులుగానున్న పరిషత్తుద్వారా, విజ్ఞాతస్య = తెలియబడి, త్రిరభిహితస్యాపి=వాదిచే ముమ్మారు చెప్పబడినట్టి దానిని సైతము, అప్రత్యుచ్చారణమ్ = అనువదింప లేకుండుట, అననుభాషణమ్ = అననుభాషణము.

మధ్యవర్తులకు తెలిసినట్టిదియు, వాదిచే ముమ్మారు చెప్పబడినట్టిదియు వాక్యము ననువదింప లేకుండుట అననుభాషణ నిగ్రహస్థానమనబడును.

"అవిజ్ఞానంచా విజ్ఞానమ్" ౫.౨.౧౭.

అవిజ్ఞానం = పరిషత్తుచే తెలియబడి, వాదిచే ముమ్మారు ప్రయోగింపబడినను తెలిసికొన జాలకపోవుట అవిజ్ఞాన నిగ్రహస్థాన మనబడును.

"ఉత్తరస్యాప్రతిపత్తి రప్రతిభా" ౫.౨.౧౮.

ఉత్తరస్య = ఉత్తరము, అప్రతిపత్తిః = స్ఫురింపకుండుట, అప్రతిభా = అప్రతిభ యనబడును.

పరపక్షమును ఖండించుటకు తగిన ప్రత్యుత్తరము స్ఫురింపక పోవుట అప్రతిభ యనబడును.

"కార్యవ్యాసంగాత్ కథావిచ్ఛేదో విక్షేపః" ౫.౨.౧౯.

కార్యవ్యాసంగాత్ = కొండొకకార్యవశమున, కథావిచ్ఛేదః = స్వీకరించిన చర్చను విడుచుట, విక్షేపః = విక్షేప మనబడును.

కొండొకవిషయమును తాత్త్వికముగ నిర్ణయింప నుద్దేశించి, వార్తాలాపము ప్రారంభించి, మధ్యలో కార్యనెపమున రేపో మాపో మరల చెప్పుదునని ప్రసంగమును విడుచుట విక్షేప నిగ్రహస్థానమనబడును.

"స్వపక్షే దోషాభ్యుపగమాత్పరపక్షే దోషప్రసంగో
మతానుజ్ఞా" ౫.౨.౨౦.

స్వపక్షే = తనపక్షమున, దోషాభ్యుపగమాత్ =దోషమును పర పక్షీచూపగా నంగీకరించి, పరపక్షే = ప్రతివాది పక్షమున, దోషప్రసంగః=దోషము నుద్భావించుట, మతానుజ్ఞా=మతానుజ్ఞ నిగ్రహస్థానము.

ప్రతివాదిచే తన పక్షమున నొక దోషమును చూప దాని నంగీకరించుచు, నాదోషమునే ప్రతివాది పక్షమునందును జూపుట మతానుజ్ఞ యనబడును.

"నిగ్రహస్థాన ప్రాప్తస్యానిగ్రహః పర్యనుయోజ్యోపేక్షణమ్"
౫.౨.౨౧.

నిగ్రహస్థాన ప్రాప్తస్య = నిగ్రహస్థానము పొందినపుడు, అనిగ్రహః = నిగ్రహస్థానమును ప్రకటింపకుండుట, పర్యనుయోజ్యో పేక్షణమ్ = పర్యనుయోజ్యోపేక్షణ మనబడును

వాది ప్రతివాదులలో నొకరు నిగృహీతులయినపుడు 'నీవు నిగ్రహింపబడితివి.' అని తెలుపకుండుట పర్యనుయో జ్యోపేక్షణ మనబడును. ఇదియు నొక నిగ్రహస్థానమే.

"అనిగ్రహస్థానే నిగ్రహస్థానాభియోగో నిరనుయో
జ్యానుయోగః" ౫.౨.౨౨.

అనిగ్రహస్థానే = నిగ్రహింపబడని తావున, నిగ్రహస్థానాభి యోగః = నిగ్రహింపబడితివని యాపాదించుట, నిరనుయోజ్యాను యోగః = నిరనుయోజ్యానుయోగము.

నిగ్రహస్థానమును గ్రహింపలేక, తదభావ స్థలమున 'నీవు నిగ్రహింపబడితివి' అని పలుకుట నిరనుయోజ్యాను యోగమనబడును.

"సిద్ధాంత మభ్యుపేత్యానియమాత్ కథాప్రసంగోఽప
సిద్ధాంతః" ౫.౨.౨౩.

సిద్ధాంతం = ఒకానొక సిద్ధాంతమును, అభ్యుపేత్య = అంగీకరించి, అనియమాత్ = అంగీకరించిన దానికి విరుద్ధముగా, కథా ప్రసంగః = చర్చ జరుపుట, అపసిద్ధాంతః = అపసిద్ధాంత మనబడును.

ఒక సిద్ధాంతము నంగీకరించి, చర్చ జరుగునపుడు మధ్యలో ప్రతిపక్షి చూపిన దోషమును తొలగింప జాలకనో మరియే కారణముననో పూర్వసిద్ధాంతమునకు విరుద్ధసిద్ధాంతము నవలంబించుట అపసిద్ధాంత నిగ్రహస్థాన మనబడును.

"హేత్వాభాసాశ్చయథోక్తాః" ౫.౨.౨౪.

హేత్వాభాసాః = సవ్యభిచారాది హేత్వాభాసములు, యథోక్తాః = ఎట్లు చెప్పబడినవో యట్లే నిగ్రహస్థాన పదవాచ్యములని యర్థము.

హేత్వాభాసములకు పూర్వమేలక్షణము చెప్పబడినదో యట్టి లక్షణముతోనే యవి నిగ్రహస్థానము లనబడుచున్నవని భావము. హేత్వాభాసములే నిగ్రహస్థానములు. వానికి వేరుగా లక్షణము చెప్పనవసరము లేదని తాత్పర్యము.

నిఖిలశాస్త్ర నిష్ణాత శ్రీమత్పండిత ముక్తిరామ
ఉపాధ్యాయశిష్య పండిత గోపదేవ విరచిత
'అంబా' వ్యాఖ్యానము
న్యాయదర్శనము సమాప్తము.

భారతీ ప్రెస్, తెనాలి. 1950

అనుబంధము

పదసూచి

ఫ

బ

భ

మ

య

ర

ల

వ

స